ఈనాడు హైదరాబాద్

HMDA

శుక్రవారం 5 జనవరి 2018 | 24 పేజీలు





రెడీమేడ్
5 లెగ్గింగ్స్ ₹499
2 లేడీస్ టాప్స్ ₹500
1+1 సల్వార్ సూట్స్ ₹1900
1+1 లంగావోణి ₹2600
ఫ్యాన్సీ శారీస్
3 ఫ్యాన్సీ శారీస్ ₹555
3 ఫ్యాన్సీ శారీస్ ₹777
3 డిజైనర్ శారీస్ ₹999
పట్టు శారీస్
అరుంధతి పట్టు శారీ
₹1095
₹695 మాత్రమే
పరంపర పట్టు శారీ
₹2495
₹1295 మాత్రమే
KEEP LOVING MORE
Lowest Prices Guaranteed
మెన్స్‌వేర్
2 డిజైనర్ టి-షర్ట్స్ ₹499
2 డిజైనర్ షర్ట్స్ ₹799
2 కాటన్ ట్రౌజర్స్ ₹799
2 జీన్స్ ₹799
బాయ్స్
2 షర్ట్స్ ₹999
2 జీన్స్ ₹999
2 ప్యాంటు షర్ట్స్ ₹1499
గర్ల్స్
2 టాప్స్ ₹299
2 జగ్గింగ్స్ ₹499
2 పార్టీవేర్ ఫ్రాక్స్ ₹999
అబ్బురపరిచే అంతర్జాతీయ ఫ్యాషన్స్,
2 లక్షలకు పైగా వెరైటీలు
ఇప్పుడు కేవలం రూ. 250 నుండే.
KLM FASHION MALL™
AMEERPET | KUKATPALLY

ఈనాడు హైదరాబాద్

HMDA

శుక్రవారం 5 జనవరి 2018 | 24 పేజీలు



ప్రత్యామ్నాయమే పరిష్కారం!

- 'హెచ్‌కేసీ' అందుబాటులోకి వస్తే హైటెక్‌సిటీ ప్రాంతంలో పద్మవ్యూహమే
- ట్రాఫిక్ ఇక్కట్లు లేకుండా వేర్వేరు మార్గాలను సిద్ధం చేస్తున్న జీహెచ్‌ఎంసీ

ఈనాడు, హైదరాబాద్

రెండు లక్షల మంది ఉద్యోగులకు ఒకే చోట కార్యాలయాలుంటే... వారంతా ఏకకాలంలో రహదారులపైకొస్తే.. ఆ దృశ్యాన్ని ఊహించడమే కష్టంగా ఉంటుంది. అక్కడి నుంచి బయటపడలేక వాహనదారులు పడే అవస్థలు అనూహ్యమే.. ఇలాంటి పరిస్థితికి హైటెక్‌సిటీలోని ఇనార్బిట్‌మాల్ పరిసరాలు వేదిక కానున్నాయి. హెచ్‌కేసీ (హైదరాబాద్ నాలెడ్జ్ సెంటర్) పేరుతో రెండు వందల ఎకరాల్లో వేసడుతున్న భారీ వాణిజ్య, నివాస సముదాయాల నిర్మాణం పూర్తయ్యాక ఆ వాతావరణం కనిపించే అవకాశం ఉంది. సాధ్యమైనంత త్వరగా ఆ సమస్యకు పరిష్కారం చూపేందుకు జీహెచ్‌ఎంసీ రంగంలోకి దిగింది. ప్రత్యామ్నాయ దారులను సిద్ధం చేయడంపై దృష్టి సారించింది.

భవిష్యత్తులో మహా నగరంలో హెచ్‌కేసీ కీలకం కానుంది. పదుల సంఖ్యలో ఐటీ, వైద్య, ఇతర సంస్థలు, నివాస సముదాయాలుంటాయి. ఇనార్బిట్ మాల్ నుంచి బయోడైవర్సిటీ కూడలి మధ్యలో ఉన్న రెండు వందల ఎకరాల్లో నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే అనేక నిర్మాణాలు సగం పూర్తయ్యాయి. మరో ఏడాదిలో ఇవి కొలిక్కి వస్తాయని, అనంతరం వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని జీహెచ్‌ఎంసీ చెబుతోంది. వాణిజ్య సేవలు మొదలైతే హెచ్‌కేసీ రెండు లక్షల మందితో నిండుతుందని అంటున్నారు. అక్కడ పనిచేసే సిబ్బందికి పక్కనే నివాస సముదాయాలు ఉన్నా, తక్కువ సంఖ్యలో ఉన్నందున ఎక్కువమంది ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిందే. ఫలితంగా కీలక పని గంటల్లో రోడ్లపై ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుందని ఇంజినీరింగ్ విభాగం ఆందోళన వ్యక్తం చేస్తోంది. సమస్య నివారణకు ప్రత్యామ్నాయ దారులే మార్గమంటోంది. ఇప్పటికే పలు మార్గాలను గుర్తించామని, ఈ ప్రక్రియ కొనసాగుతోందని బల్దియా అధికారులు చెబుతున్నారు.

మరిన్ని అవసరం..

- ప్రస్తుతం కొలిక్కి వచ్చిన ప్రత్యామ్నాయాలతోపాటు మరిన్ని మార్గాలను గుర్తించాల్సిన అవసరం ఉందని సీనియర్ అధికారులు చెబుతున్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా హెచ్‌కేసీ అభివృద్ధి కానుందని, అక్కడ జనసాంద్రత విపరీతంగా ఉండనుందని అంటున్నారు.

వీటిపై బల్దియా దృష్టి...

- దుర్గం చెరువుపై బంజారాహిల్స్ రోడ్డు నంబరు-45 నుంచి ఇనార్బిట్ మాల్ వరకు రూ.184 కోట్లతో తీగల వంతెన రానుంది. దీనివల్ల బంజారాహిల్స్-హైటెక్‌సిటీ మధ్య దూరం తగ్గుతుంది. ఇప్పుడున్న మార్గాలతో పోలిస్తే దీనిపై రెండింతల వాహనాలు అదనంగా రాకపోకలు సాగించవచ్చు.
- హెచ్‌కేసీ నుంచి మెహిదీపట్నం, ఓఆర్ఆర్ వెళ్లే వాహనాల కోసం జీహెచ్‌ఎంసీ రూ.333 కోట్లతో సొరంగ మార్గాన్ని ప్రతిపాదించింది. రాష్ట్ర ప్రభుత్వం అనుమతించాక పనులు మొదలు

...మిగతా 2లో

నుమాయిష్‌లో నేడు

మహిళలకు మాత్రమే ప్రవేశం



అబిడ్స్, న్యూస్‌టుడే: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో కొనసాగుతున్న నుమాయిష్‌లో శుక్రవారం మహిళలకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి రాత్రి 10.30 వరకు అనుమతిస్తారు.

మొదట్లో మూడు రోజులు..

1938లో తొలిసారి మూడు రోజుల పాటు మహిళల సందర్శనకు ప్రత్యేకంగా కేటాయించారు. అనంతరం కొంతకాలం ఏటా రెండు రోజులు ఈ అవకాశం కల్పించారు. తర్వాత ఒక్కరోజే కేటాయిస్తున్నారు. ఈసారి 5వ తేదీ మహిళలకు ప్రత్యేకం అని ఎగ్జిబిషన్ సొసైటీ ప్రకటించింది. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సొసైటీ ఉపాధ్యక్షుడు నరోత్తంరెడ్డి తెలిపారు. శుక్రవారం శాసనసభ ఉప సభాపతి పద్మా దేవేందర్ రెడ్డి, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ సతీమణి జమునా రాజేందర్ తదితరులు హాజరవుతున్నట్లు ఆయన చెప్పారు.

సృష్టి అద్భుతం



మిస్ ఇండియా ఆంధ్రప్రదేశ్-2017 సృష్టి వ్యాకరణం గురువారం బంజారాహిల్స్‌లో సందడి చేశారు. ఇక్కడి ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఫొటోలకు పోజులిస్తూ ఆకట్టుకొన్నారు.

జూబ్లీహిల్స్‌లో పట్టపగలే

దారి దోపిడీ

- ప్రేక్షకుల్లా చూసిన వాహనదారులు
- బాధితుడు ప్రతిఘటించినా అందని సహకారం



సీసీ ఫుటేజీలో కనిపిస్తున్న ఆగంతుకులు (తొలుత ఇలా నడుచుకుంటూ వచ్చారు)



కత్తితో బాధితుడిని బెదిరిస్తున్న దుండగుడు, పక్కన వాహనంపై మరో ఇద్దరు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: జూబ్లీహిల్స్.. ఈ పేరు చెప్పగానే నగరంలో ఉండే వారు, తెలుగు రాష్ట్రాల్లోని చాలామంది ఇట్టే గుర్తుపడతారు. ప్రముఖులు, సినీ పరిశ్రమకు చెందిన వారు ఉంటారని ఠక్కున చెప్పేస్తారు. ఇక్కడి రోడ్డు నం: 10 ప్రధాన రహదారి నిత్యం వాహనాల రద్దీ.., ప్రముఖుల రాకపోకలతో కనిపిస్తుంది. అలాంటి ఈ రోడ్డుపై పట్టపగలే దొంగలు దోపిడీకి తెగబడ్డారు.

పోలీసుల వివరాల మేరకు.. బేగంపేటలోని శ్యాంలాల్ బిల్డింగ్స్ సమీపంలో నివసించే రాజబోయిన యాదగిరి(22) బంజారాహిల్స్ రోడ్డు నం: 12లోని బాలాజీ డిస్ట్రిబ్యూటర్స్‌లో ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్నారు. అతని సహోద్యోగి రాజేందర్ మిశ్రాతో కలిసి బుధవారం ఉదయం 11.30 గంటల సమయంలో జూబ్లీహిల్స్ రోడ్డునం: 10లోని సాగర్స్ సిమెంట్స్ కార్యాలయం వద్దకు వచ్చారు. కొన్ని చెక్కులను ఇచ్చేందుకు రాజేందర్ మిశ్రా లోపలికి వెళ్లగా యాదగిరి ద్విచక్రవాహనం (టీఎస్ 09 ఈడబ్ల్యు 8970)పై బయటే వేచి ఉన్నారు. ఆ సమయంలో వెనుక నుంచి వచ్చిన ముగ్గురు దుండగులు ఒక్కసారిగా దాడికి దిగారు. అతన్ని నెట్టేసి వాహనాన్ని లాక్కొన్నారు. జేబులో ఉన్న పర్సు, రెండు చరవాణులను గుంజుకొన్నారు. యాదగిరి తీవ్రంగా ప్రతిఘటించగా... ఒకడు కత్తితో బెదిరించి, గట్టిగా కిందకు తోసేశాడు. మిగతా ఇద్దరు వాహనం సిద్ధం చేయడంతో బెదిరించిన వ్యక్తి అదే వాహనంపై పరారయ్యాడు. యాదగిరి తన చేతిలోని శిరస్త్రాణాన్ని వారి మీదకు విసిరాడు.

అందరూ చూస్తున్నారే గానీ...

దొంగలను బాధితుడు ప్రతిఘటిస్తున్న సమయంలో అక్కడున్న వాహనదారులు ఎవరూ ముందుకు రాలేదు. ఏటీఎంలకు డబ్బు తరలించే వ్యాన్ ఆపి ఉన్నా.. అందులోని సెక్యూరిటీ సిబ్బందీ దుండగులను అడ్డుకొనేందుకు ప్రయత్నించలేదు.

ఇతర రాష్ట్రాల వారేనా? నిందితులు ముసుగులు ధరించలేదు... అందరూ 30ఏళ్ల లోపు వారుగానే పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా విశ్లేషిస్తున్నారు. వాహనాన్ని లాక్కొని పరారైన వీరు జూబ్లీహిల్స్ రహదారుల మీదనే తచ్చాడారు. చుట్టూ

...మిగతా 2లో

ప్రత్యామ్నాయమే పరిష్కారం!

(మొదటి పేజీ తరువాయి) పెడతామంటోంది. హెచ్‌కేసీ - ఖాజాగూడ కూడలి మార్గంలో మధ్యలో కొండ అడ్డు వస్తుందని, దాన్ని తొలగించకుండా సొరంగం తవ్వాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. సొరంగం అనంతరం ఖాజాగూడ కూడలి వరకు పైవంతెన వస్తుందంటున్నారు. ఆ వంతెనను బాహ్యవలయ రహదారికి అనుసంధానించాలనే ప్రతిపాదన ఉందని చెబుతున్నారు. కూడలి దగ్గర వంతెన ఎక్కేందుకు, దిగేందుకు ర్యాంపులు నిర్మిస్తారు.

● మైండ్‌స్పేస్ కూడలి దగ్గర వస్తున్న అండర్‌పాస్, పైవంతెన పనులు త్వరలోనే పూర్తవనున్నాయి. సేవలు మొదలైతే బయోడైవర్సిటీ కూడలి, శిల్పారామం, ఇనార్బిట్‌మాల్, గచ్చిబౌలి కూడళ్ల మధ్య రాకపోకలు సాగించే వాహనాలు మైండ్‌స్పేస్ కూడలి దగ్గర ఆగాల్సిన పని ఉండదు.

● బయోడైవర్సిటీ కూడలి దగ్గర రెండు పైవంతెనలు వస్తున్నాయి. హెచ్‌కేసీ నుంచి వచ్చే వాహనాలు కూడలి వద్ద ఆగకుండా అటు గచ్చిబౌలి, ఇటు మెహిదీపట్నం వైపు వెళ్లేందుకు ఈ వంతెన ఉపయోగ పడుతుంది. ఇక్కడ రెండో స్థాయి పైవంతెన రానుంది. ఇది గచ్చిబౌలి నుంచి వచ్చే వాహనాలు బయోడైవర్సిటీ కూడలి దగ్గర ఆగకుండా నేరుగా మెహిదీపట్నం వెళ్లేందుకు ఉపయోగపడుతుంది.

● శిల్పాలేఅవుట్-గచ్చిబౌలి కారిడార్‌ను జీహెచ్ఎంసీ ఇటీవల తెరపైకి తెచ్చింది. ప్రస్తుతమున్న 30 అడుగులు, 60 అడుగుల రోడ్లను బృహత్తర ప్రణాళిక చెబుతున్నట్లు 120 అడుగులకు విస్తరించాలని నిర్ణయించింది. దీని వల్ల మైండ్‌స్పేస్ కూడలి నుంచి బయోడైవర్సిటీ కూడలితో సంబంధం లేకుండా నేరుగా గచ్చిబౌలి కూడలికి చేరుకునేందుకు ఇదో ప్రత్యామ్నాయ మార్గం అంటున్నారు.

జూబ్లీహిల్స్‌లో పట్టపగలే దారి దోపిడీ

(మొదటి పేజీ తరువాయి) తిరిగి సంఘటన జరిగిన ప్రాంతం వైపే వచ్చినట్లు గుర్తించారు. ఆ సమయంలో పోలీసు వాహనాలు అక్కడ ఉండటంతో కంగారుపడి తిరిగి జూబ్లీహిల్స్ రోడ్డు నం.1 మీదుగా దోపిడీ చేసిన వాహనంపైనే బేగంపేట వైపు వెళ్లినట్లు నిఘా కెమెరాల ఫుటేజీల దృశ్యాల ద్వారా తెలుస్తోంది. ఇంత ధైర్యంగా, కనీసం పరిసరాలపై అవగాహన లేకుండా.. నిందితులు వచ్చారంటే .. వారు ఇక్కడి వారు కాదని పోలీసులు అనుమానిస్తున్నారు. రాజస్థాన్ నుంచి వచ్చి ఉంటారని భావిస్తున్నారు. వ్యక్తిగత గొడవలుంటే ఇలా చేయరని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

చిక్కితేనే తేలేది.. బుధవారం జరిగితే బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకొన్నారు. గురువారం విషయం బయటకు రావడంతో దర్యాప్తులో వేగం పెంచారు. ఇప్పటికే జూబ్లీహిల్స్ పోలీసులతోపాటు టాస్క్‌ఫోర్స్ బృందాలు నిందితుల కోసం గాలిస్తున్నాయి. విచారణలో బాధితుడు, ఫిర్యాదుదారుడైన యాదగిరి వచ్చిన వారు ఎవరో తనకు తెలియదని చెప్పారు. ఒక వేళ నిందితులు వాహనం కోసమే వస్తే.. రద్దీ దారిలో ఇలా చేయాల్సిన అవసరం ఏంటన్నది ప్రశ్న. బాధితుడికి తెలిసిన వారే చేయించి ఉంటారా.. అనే కోణంలోనూ శోధిస్తున్నారు. యాదగిరి, అతని సహోద్యోగి మిశ్రా బైక్‌పై వచ్చినా.. మిశ్రా కార్యాలయంలోకి వెళ్లిన వెంటనే యాదగిరిపై దాడి జరిగింది. క్షణాల్లో దుండగులు పని చేసుకుని వెళ్లారు. దీంతో బాధితుడి మిత్రుడినీ విచారిస్తున్నారు.

నగరంలో ఈనాడు

● మాదాపూర్ శిల్పకళా వేదికలో ఉదయం 8.45 గంటలకు సీఏ విద్యార్థుల సమావేశం ప్రారంభం ● బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10 గంటలకు తెలంగాణ గిరిజన విద్యార్థి సంఘం వార్షికోత్సవ మహా సభ ● గచ్చిబౌలి ఐఐఐటీ క్యాంపస్ టీహబ్‌లో ఉదయం 11 గంటలకు కృష్ణాకృతి ఆర్ట్ ఫెస్టివల్‌లో భాగంగా 'కల్చరల్ ఫైనాన్సింగ్' అంశంపై చర్చ. ● సాయంత్రం 4గంటలకు వంశీ ఇంటర్నేషనల్, రాగ సప్తస్వరం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో 'రాజువయ్యా.. మహరాజువయ్యా' అనే సినీ సంగీత విభావరి.

● చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగానసభలో సాయంత్రం 5గంటలకు లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ప్రతిభా పురస్కారాల ప్రదానం. మరో వేదికపై సాయంత్రం 5.30 గంటలకు ఆరాధన సంస్థ ఆధ్వర్యంలో 'టీవీ న్యూస్ రీడర్స్ 2017' పురస్కారాల ప్రదానం. మరో వేదికపై సాయంత్రం 5.30 గంటలకు చిమ్మపూడి శ్రీరామమూర్తి రచించిన 'నవ్వే బంగారం' పుస్తకావిష్కరణ.

వ్యాఖ్యాత ప్రదీప్ కౌన్సెలింగ్‌కు గడువు తేదీ నేడు

అమీర్‌పేట: మద్యం తాగి కారు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ వ్యాఖ్యాత ప్రదీప్ గురువారం కూడా కౌన్సెలింగ్‌కు రాలేదు. బేగంపేటలోని ట్రాఫిక్ శిక్షణా కేంద్రానికి ప్రదీప్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సి ఉంది. గడువు శుక్రవారంతో ముగుస్తుంది. తప్పనిసరిగా నేడు వచ్చే అవకాశం ఉందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. గురువారం సుమారు వంద మంది కుటుంబ సభ్యులతో కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ట్రాఫిక్ అదనపు డీసీపీ అమరకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు.



అనుభవ పాఠాలు... చెబుతారు!

ఈనాడు, హైదరాబాద్

- అధ్యాపకులకు సాంకేతిక నైపుణ్యాలు నేర్పడమే లక్ష్యం
- సీనియర్ల సేవలు సద్వినియోగానికి కృషి
- మూక్ కార్యక్రమానికి జేఎన్‌టీయూహెచ్ శ్రీకారం

సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో బోధన విధానంలో ఎన్నో వినూత్న మార్పులు వస్తున్నాయి. ఇప్పటివరకు తరగతి గదిలోకి వెళితేనే పాఠాలు నేర్చుకొనే అవకాశం ఉంది. సాధారణంగా విద్యార్థులకు నేరుగా అధ్యాపకులు బోధన చేస్తుంటారు. బోర్డుపై పాఠ్యాంశంలోని ముఖ్యాంశాలు రాస్తూ.. అవసరమైన బొమ్మలు, గణాంకాలను అందిస్తూ బోధన సాగేది. ఈ తరహా బోధనకు సమూల మార్పులు చేసేందుకు జేఎన్‌టీయూ విశేష కృషి చేస్తోంది. అనుభవం ఉన్న ఆచార్యులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి బోధించేలా శిక్షణ ఇస్తారు. కొత్తతరం అధ్యాపకులు.. సీనియర్ ఆచార్యుల అనుభవాలను అందిపుచ్చుకొనేలా ఆన్‌లైన్ పాఠ్యాంశాలను తయారు చేయనున్నారు. ఈ పాఠ్యాంశాలన్నింటినీ కంప్యూటరీకరిస్తారు. మూక్(మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సు)గా దీన్ని తయారు చేస్తారు. వీటిని ఎప్పుడైనా విద్యార్థులు ఇంటిలో ఉండి నేర్చుకోవచ్చు. తరగతి గదిలో అర్థం కానివారికి ఈ ఆన్‌లైన్ పాఠాలు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. పాఠ్యాంశాలు, వివిధ పోటీ పరీక్షలు, ముఖాముఖీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అధ్యాపక కొలువు సాధించిన చాలామంది అభ్యర్థులు.. తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు చెప్పడంలో తరచూ విఫలమవుతున్నారు. పదో తరగతి, ఇంటర్, ఎంసెట్‌లలో అత్యుత్తమ మార్కులు సాధించిన పలువురు అభ్యర్థులు ఇంజినీరింగ్‌లో పరీక్షలు తప్పుతున్నారు. ఈ లోపానికి గల కారణాలపై జేఎన్‌టీయూహెచ్ ఆరా తీసింది. వేలాది మంది విద్యార్థుల అభిప్రాయాలను సేకరించింది. లోపం ఎక్కడ ఉంది.. దీనిని ఎలా సవరించాలనే అంశంపై దృష్టి పెట్టింది. ప్రయోగాత్మక కార్యక్రమాన్ని రూపొందించి అమలులోకి తీసుకొస్తోంది. జేఎన్‌టీయూతోపాటు దీని అనుబంధ గుర్తింపుతో నడుస్తున్న కళాశాలల్లో కొత్తగా అధ్యాపకులుగా చేరిన వారిని గుర్తిస్తారు. ఇప్పటికే బోధనలో అనుభవం ఉన్న సీనియర్లకు సాంకేతికత అంశాలపై పరిజ్ఞానం లేకపోయినా వారిని ఎంపిక చేస్తారు. వీరందరినీ పలు బృందాలుగా విభజిస్తారు. విడతల వారీగా వారికి సీనియర్ ఆచార్యులతో అనుభవ పాఠాలు నేర్పిస్తారు. తరగతి గదిలో బోధన ఎలా ఉండాలి? విద్యార్థులకు ఎలా చెబితే అర్థమవుతుంది? ఏ అంశంపై ఎలాంటి ఉదాహరణలు ఇవ్వాలి? విద్యార్థుల స్పందన ఎలా తెలుసుకోవాలి? బోధనకు ముందు అధ్యాపకులు ఎలాంటి కసరత్తు చేసుకోవాలి? తరగతి గదిలో ఎలా వ్యవహరించాలి? పాఠ్యాంశాలు అందరికీ అర్థం కావాలంటే ఏం చేయాలి? తదితర అన్ని అంశాలకు సంబంధించి నిపుణులైన ఆచార్యులు తమ అనుభవాలను కొత్త అధ్యాపకులకు వివరించే శిక్షణకు జేఎన్‌టీయూ శ్రీకారం చుట్టింది. ఈ నెల 5 నుంచి వర్సిటీలోనే సాంకేతిక నైపుణ్యం ఉన్న సీనియర్ ఆచార్యులతో అధ్యాపకులకు ఉచితంగా శిక్షణ ఇప్పించనుంది. తొలి విడతలో సుమారు 60 మంది అధ్యాపకులకు మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. వీరికి మళ్లీ ఏప్రిల్‌లో మరో విడత శిక్షణ ఇస్తారు. వీరి అభిప్రాయాలు సేకరించి భవిష్యత్తు కార్యక్రమానికి మార్పులు చేర్పులు చేయనున్నారు.

అందరికీ అందుబాటులోకి...

– ఆచార్య ఎ.వేణుగోపాల్‌రెడ్డి, ఉప కులపతి, జేఎన్‌టీయూహెచ్



నైపుణ్యాలున్న సీనియర్ ఆచార్యులే అందరికీ ఎల్లపుడూ పాఠాలు చెప్పడం సాధ్యం కాదు. వారు పదవీ విరమణ చేస్తే ఆ లోటు పూడ్చలేం. సీనియర్ ఆచార్యుల అనుభవాలను కొత్త అధ్యాపకులకు అందించే కార్యక్రమాన్ని రూపొందించాం. పాఠ్యాంశాలను కంప్యూటరీకరించి ఆన్‌లైన్‌లో పెట్టి అందరికీ అందుబాటులోకి తీసుకొస్తాం.

బోధనతో కట్టి పడేయాలి

పది, ఇంటర్ విద్యార్థులైతే శ్రద్ధగా నిత్యం తరగతులకు హాజరవుతారు. అదే యూజీ, పీజీ కోర్సులకు వచ్చేటప్పటికి విద్యార్థులు ఇష్టమైనప్పుడే తరగతులకు వెళుతుంటారు. ఎట్టకేలకు ఇంజినీరింగ్ పూర్తి చేస్తున్నారు. ఇలా పట్టా చేతిలోకి వచ్చిన చాలామంది విద్యార్థుల్లో నైపుణ్యాలు ఉండట్లేదని ఇటీవల చాలా కంపెనీల నిపుణులు వివరిస్తున్నారు. ఈ లోపాన్ని సరిచేసేందుకు జేఎన్‌టీయూహెచ్ కృషి చేస్తోంది. తరగతి గదిలోకి విద్యార్థులు రోజూ వచ్చేలా బయోమెట్రిక్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. తరగతి గదిలోకి వచ్చిన విద్యార్థులు పాఠ్యాంశాలపై దృష్టి సారించేలా బోధన విధానంలో సమూల మార్పులు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోంది. విద్యార్థులను పాఠ్యాంశాలతో ఆకట్టుకునేలా, అర్థమయ్యే రీతిలో బోధన ఎలా చేయాలనే అంశాలపై అధ్యాపకులకు శిక్షణ ఇప్పించే కార్యక్రమాన్ని పట్టాలపైకి జేఎన్‌టీయూ తెచ్చింది. మూక్ విధానాన్ని రూపొందిస్తోంది. దీని ద్వారా ఇంజినీరింగ్ పాఠాలు అందుబాటులోకి వస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం. తరగతి గదిలో అర్థంకాని పాఠ్యాంశాలను ఇళ్లలో ఉండే నేర్చుకోవచ్చు. తరగతి గదికి వెళ్లకుండానే పాఠ్యాంశాల్లో ఆరితేరవచ్చు.

భవిష్యత్తు ఆన్‌లైన్‌దే

తరగతి రూపురేఖలు మారిపోతున్నాయి. విద్యార్థులు, అధ్యాపకుల మధ్య వారధిగా కంప్యూటర్ రానుంది. మూక్ విధానం అందుబాటులోకి వస్తే ఏ కోర్సు అయినా ప్రపంచంలో ఎక్కడ ఉన్నవారైనా నేర్చుకోవచ్చు. ఆన్‌లైన్‌లో పాఠాలు కంప్యూటరీకరించే ప్రక్రియను జేఎన్‌టీయూ చేపట్టింది. భవిష్యత్తులో ఆన్‌లైన్ కోర్సుల ద్వారానే విద్యార్థులు పాఠాలు నేర్చుకొనే విధానం అందుబాటులోకి రానుంది. దీనిని జేఎన్‌టీయూ అందిపుచ్చుకొని పాఠ్యాంశాలను రూపొందించే పనిలో నిమగ్నమైంది.



పులిహోరతో స్వామివారి దివ్యరూపం

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని ఆనంద్ బాగ్ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం తెల్లవారుజామున తిరుప్పావై సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి విగ్రహం ఎదుట 30 కిలోల పులిహోరతో స్వామివారి దివ్యమంగళ రూపాన్ని రూపొందించి పూజలు చేశారు. అనంతరం అదే పులిహోరను ప్రసాదంగా భక్తులకు అందచేశారు. వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారని ప్రధాన అర్చకులు వేంకట రమణాచార్యులు, మేనేజర్ చంద్రమోహన్ తెలిపారు.

రెండు నిమిషాల్లో షూ లేస్ కట్టుకున్న 300 మంది విద్యార్థులు

హైరేంజ్ వరల్డ్ రికార్డ్సలో చోటు



ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ప్రతినిధి సుమన్, దైవజ్ఞశర్మ

గోల్నాక: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రెండు నిమిషాల వ్యవధిలో 300 మంది విద్యార్థులు షూ లేస్ కట్టుకుని హైరేంజ్ వరల్డ్ రికార్డ్సలో చోటు సంపాదించారు. శామీర్‌పేటలోని మల్లిక్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ ఘనత సాధించారు. గురువారం పాఠశాల ప్రిన్సిపల్ సయ్యద్ వలీ వహీద్‌కు అంబర్‌పేటకు చెందిన హైరేంజ్ రికార్డ్స ప్రతినిధి సుమన్ పల్లె, దైవజ్ఞశర్మ, లిమ్కా బిందు రికార్డ్స ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. నిరంతర సాధన ద్వారానే విద్యార్థులకు రికార్డ్సలో చోటు దక్కిందని పేర్కొన్నారు.

ఎంజీబీఎస్‌లో పోలీసు శునకాలకు ప్రత్యక్ష శిక్షణ



ప్రయాణికురాలి బ్యాగును తనిఖీ చేస్తున్న శునకం

జాంబాగ్, న్యూస్‌టుడే: పోలీసు శునకాలకు గురువారం ఉదయం మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో అధికారుల సమక్షంలో సిబ్బంది ప్రత్యక్ష శిక్షణ (లైవ్ ట్రైనింగ్) ఇచ్చారు. అనుమానాస్పద వస్తువులు, పేలుడు, మత్తు పదార్థాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యాయి. ఆర్టీసీ బస్సుల రాక కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికుల వద్దకు వెళ్లి వారి లగేజీ, సూట్‌కేసులు, బ్యాగులను వాసన చూశాయి. అనంతరం ఆర్టీసీ బస్సుల్లోకి వెళ్లి డ్రైవరు సీటుతో పాటు ప్రయాణికుల సీట్ల కింద, పరిసర ప్రాంతాల్లో ఏవైనా అనుమానాస్పద వస్తువులున్నాయా? పరిశీలించాయి. సిటీ సెక్యూరిటీ వింగ్ డీఎస్పీ సదానందరెడ్డి మాట్లాడుతూ 8 నెలల వయసున్న చురుకైన శునకాలను గుర్తించి 8 నెలల పాటు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. 8 నెలల శిక్షణ అనంతరం శునకాలను విధుల్లోకి తీసుకుంటామన్నారు. వాటికి తొమ్మిదేళ్ల వయసు వచ్చే వరకూ సేవలు ఉపయోగించుకుంటామని, ఆ తర్వాత పదవీ విరమణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ బ్యాచ్‌లో 71 శునకాలకు 7 నెలలుగా వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు ఆయన వివరించారు. మరో మూడు రోజుల పాటు వరుసగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, శంషాబాద్‌లోని విమానాశ్రయంలోనూ శునకాలకు ప్రత్యక్ష శిక్షణ ఇస్తామని వెల్లడించారు.

'టీఆర్‌టీ హిందీ అభ్యర్థులకు అన్యాయం తగదు'

బషీర్‌బాగ్: ఎన్‌సీటీఈ నిబంధనల పేరిట విద్యాశాఖాధికారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తూ టీఆర్‌టీ హిందీ అభ్యర్థులకు అన్యాయం చేయడం తగదని హిందీ సేవాసదన్ సంస్థ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లి విమర్శించారు. ఎన్‌సీటీఈ సెక్షన్ 14, 15 సవరణల ప్రకారం ఇప్పటివరకు దేశవ్యాప్తంగా వివిధ సంస్థల్లో టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసిన అభ్యర్థులందరికీ అర్హులుగా అవకాశమివ్వాలని కేంద్ర మానవ వనరుల శాఖ స్పష్టం చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని తెలియచేశారు. గురువారం బషీర్‌బాగ్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 35 వేల మంది హిందీ పండిట్ శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులు అనర్హులవుతున్నారని తెలిపారు. రాష్ట్ర హైకోర్టు సైతం అభ్యర్థులకు న్యాయం చేయాలని ఆదేశిస్తే విద్యాశాఖాధికారులు కక్షసాధింపు చర్యలకు దిగడం సమంజసం కాదన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు టీఆర్‌టీ దరఖాస్తుల గడువు పొడిగించిన దృష్ట్యా ముఖ్యమంత్రి కేసీఆర్, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి జోక్యం చేసుకుని అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.

గుట్కా రవాణాకు సహకరిస్తే కఠిన చర్యలు

ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులకు టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ ఎస్.చైతన్యకుమార్ హెచ్చరిక





హాజరైన ప్రైవేటు రవాణా సంస్థల నిర్వాహకులు, మాట్లాడుతున్న చైతన్యకుమార్

కేశవగిరి, న్యూస్‌టుడే: నిషేధిత, గుట్కా, ఇతర మత్తు పదార్థాల రవాణాకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ ఎస్.చైతన్యకుమార్ ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులను హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల నుంచి కార్గో సర్వీసుల్లో సరకుల రవాణా మాటున గుట్కా, గంజాయి తదితర నిషేధిత వస్తువులు తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు సరఫరా అవుతున్న విషయం ఇటీవల బట్టబయలైందన్నారు. గత నెల 29న రెండు ట్రాన్స్‌పోర్ట్ కంపెనీల గోదాములపై దాడులు చేసి రూ.45 లక్షల విలువైన గుట్కా నిల్వలను పట్టుకున్నామన్నారు. గురువారం పాతబస్తీ పురానిహవేలిలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయ ఆవరణలో నగరంలోని ప్రైవేటు కార్గో సర్వీసుల నిర్వాహకులు, ఆర్టీసీ, రైల్వే అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. నిషేధిత గుట్కా, గంజాయి తదితర మత్తు పదార్థాలను నగరంతో పాటు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలకు తరలించేందుకు కార్గోలు, పార్సిల్ సర్వీసులు, రైల్వే, ఆర్టీసీ రవాణా వ్యవస్థలను వినియోగిస్తున్నారన్నారు. అన్ని పార్సిళ్లను క్షుణ్నంగా పరిశీలించిన తరువాత నిషేధిత వస్తువులు లేవని తేలితేనే రవాణాకు అనుమతించాలన్నారు. ఇటీవల పట్టుబడ్డ జుమ్మేరాత్‌బజార్‌కు చెందిన కొండారెడ్డి పార్సిల్ సర్వీసు, సికింద్రాబాద్ న్యూబోయిగూడకు చెందిన సూపర్ ఎక్స్‌ప్రెస్ కార్గోల లైసెన్సులను రద్దు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్టీసీ ఫలక్‌నుమా డిపో మేనేజర్ సమీరా ఆఫ్రీన్, తదితరులు పాల్గొన్నారు.

యాఖుత్‌పురా

టీ మాస్ ఫోరం సదస్సు నేడు

కంచన్‌బాగ్, న్యూస్‌టుడే: కంచన్‌బాగ్ డీఆర్‌డీఓ టౌన్‌షిప్‌లోని ఆడిటోరియంలో తెలంగాణ ప్రజా సామాజిక సంఘాల ఐక్య వేదిక (టీ మాస్ ఫోరం) సదస్సు జరగనుంది. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే సదస్సుకు కంచ అయిలయ్య, తమ్మినేని వీరభద్రం, జాన్ వెస్లీతోపాటు భారత ప్రభుత్వం, రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన పరిశోధన, ఉత్పత్తి రంగ సంస్థలకు చెందిన పలు కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు హాజరు కానున్నారని ఈ మేరకు టీ-మాస్ కంచన్‌బాగ్ డివిజన్ కమిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి లక్ష్యంతో టీ-మాస్ ప్రజలను మేల్కొలుపుతుందని తెలిపింది. సదస్సును విజయవంతం చేయాల్సిందిగా టీ-మాస్ విజ్ఞప్తి చేసింది.

యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో
లూయిస్ బ్రెయిలీ జయంతి



విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేస్తున్న క్రాంతికుమార్

చాంద్రాయణగుట్ట: యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని గురువారం దారుషిఫా ప్రభుత్వ బాలుర అంధుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎస్.పి. క్రాంతికుమార్ పాల్గొని లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ.. లూయిస్ బ్రెయిలీ తాను రూపొందించిన లిపితో అంధుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బిస్కెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక యువజన కాంగ్రెస్ నాయకులు, పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

బండ్లగూడ ప్రభుత్వ అసుపత్రిలో ప్రసూతి సేవలు



శస్త్రచికిత్స గదిలో వైద్యులు, బిడ్డను ఎత్తుకున్న నర్సు


బార్కాస్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతోందని చాంద్రాయణగుట్ట సెగ్మెంట్ బార్కాస్ క్లస్టర్ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షణ అధికారిణి డాక్టర్ జ్యోతి అన్నారు. గురువారం ఆమె బార్కాస్ డివిజన్ బండ్లగూడ గౌస్‌నగర్ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రసూతి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బార్కాస్ క్లస్టర్‌లోని ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ కాన్పులు చేయడం ప్రారంభించామన్నారు. గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యనిపుణులు జైపాల్ రెడ్డి, స్త్రీవైద్య నిపుణురాలు డాక్టర్ ప్రియాంకతోపాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. తల్లి షకీలాబేగం, బిడ్డా క్షేమంగా ఉన్నారు.

'నేర రహిత సమాజానికి కృషి చేయాలి'

అక్బర్‌బాగ్: శాంతి భద్రతలు పరిరక్షించడంలో శాంతి కమిటీ సభ్యుల పాత్ర మరవలేనిదని తూర్పు మండలం డీసీపీ శశిధర్‌రాజు అన్నారు. అక్బర్‌బాగ్‌లోని దిల్‌ఖుషా ఫంక్షన్‌హాల్‌లో సెంట్రల్ పీస్ కమిటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల బదిలీపై వచ్చిన పోలీసు అధికారులు, పదోన్నతులు సాధించిన సిబ్బందికి సత్కారం జరిగింది. అదే విధంగా ఇటీవల జరిగిన ప్రపంచ మహిళా పారిశ్రామికవేత్తల సదస్సు, తెలుగు మహాసభలను విజయవంతం చేసినందుకుగాను పోలీసులను సన్మానించి వారి సేవలను పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ నేర రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు.

బాలిక అదృశ్యం

జహనుమా: ఓ బాలిక తప్పిపోయిన సంఘటన భవానినగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై ఉయ్యాల రమేష్ కథనం ప్రకారం యాకుత్‌పురా సెగ్మెంట్ తలాబ్ కట్టా బస్తీలో నివసించే కోల్‌కతాకి చెందిన ఓ బాలిక తన అమ్మమ్మగారింట్లో ఉంటూ స్థానికంగా ఉన్న ఓ శిక్షణ కేంద్రంలో మెహిందీ డిజైనింగ్ కోర్సు చేస్తోంది. మంగళవారం ఇంటి నుంచి వెళ్లిన ఆ బాలిక ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబసభ్యులు భవానినగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



లాల్‌దర్వాజా క్రాస్ రోడ్డులో చీకట్లు



శాలిబండ అలియాబాద్‌లో..



బాలగంజ్‌లో రాత్రి వెలగకుండా..



పగలు వెలుగుతూ.. లాల్‌దర్వాజాలో!

రాత్రి వెలగవు..
పగలు వద్దన్నా వెలుగుతాయి!

పాతనగరంలోని రహదారుల పక్కన ఉండే విద్యుత్ దీపాలు ఇష్టానుసారం వెలుగుతున్నాయి. పగలు వెలుగులు పంచుతున్నాయి. రాత్రిళ్లు చీకట్లను అలాగే ఉంచుతున్నాయి. విద్యుత్ వృథా అవుతున్నా పట్టించుకోవల్సిన సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత విభాగం అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఫోకస్



అలియాబాద్ వెళ్లే రోడ్డులో 'పగలే వెన్నెల'

కార్మికుల హక్కుల కోసం రాజీ లేని పోరాటం

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: కార్మికుల హక్కుల సాధన కోసం సీఐటీయూ రాజీ లేని పోరాటం సాగిస్తుందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ పేర్కొన్నారు. సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజన్నబావి సమీపంలో గురువారం ఏర్పాటు చేసిన మున్సిపల్ ఒప్పంద కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు నెలకు రూ.18 వేల కనీస వేతనం చెల్లించాలని వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఒప్పంద కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ నెల 6, 7 తేదీల్లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రెండో మహాసభలో మున్సిపల్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై చర్చించడంతోపాటు డిమాండ్ల సాధనకు ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు సీఐటీయూకు మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, డీవైఎఫ్ఐ నాయకుడు కృష్ణానాయక్, మున్సిపల్ కార్మికులు భారతి, లక్ష్మీ, బుజ్జి, జంగయ్య, స్థానిక సీఐటీయూ నాయకులు కిషన్, బలరాం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ ఆజం షరీఫ్

చాంద్రాయణగుట్ట: ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని లలితబాగ్ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ అలీ ఆజం షరీఫ్ పేర్కొన్నారు. ఉప్పుగూడ జెండా సమీపంలోని వార్డు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కళ్యాణలక్ష్మీ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆజం షరీఫ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూస్తామన్నారు. బస్తీల్లో సమస్యలను తన దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో 23 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బండ్లగూడ మండల స్పెషల్ ఆర్ఐ సాయికిరణ్, వార్డు కమిటీ సభ్యుడు అక్రం, ఏరియా కమిటీ సభ్యుడు కలీం, స్థానిక నాయకులు అడాల అశోక్‌కుమార్, తల్వార్ జంగయ్య, విక్రమ్, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదన్నపేట మండిలో పర్యటన

మాదన్నపేట: మాదన్నపేట కూరగాయల మండిలో హైదరాబాద్ మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు రవికుమార్ గురువారం పర్యటించారు. మండి అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు, పరిశుభ్రత, రైతులకు వసతులు, వినియోగదారులకు వసతుల కల్పన గురించి మార్కెట్‌లో పర్యటించినట్లు ఆయన తెలిపారు. మాదన్నపేట మండిని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తులు అందుతున్నాయని, ప్రభుత్వం కోరితే తగిన సూచనలు ఇవ్వడానికి తాను స్థానిక మార్కెటింగ్ అధికారులతో కలిసి మండిలో పర్యటించినట్లు ఆయన తెలిపారు. వీలైతే మండి స్థలాన్ని ప్రభుత్వం తీసుకుని ఈ ప్రాంతంలో మార్కెట్‌ను అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చే అవకాశాలను ఆయన పరిశీలించినట్లు తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం



మంద బుడ్డమ్మ (65)

కంచన్‌బాగ్, న్యూస్‌టుడే: ఆసరా పింఛన్ తీసుకునేందుకు వచ్చిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన కంచన్‌బాగ్ పోలీస్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం పరిధి మీర్‌పేటలోని ఎస్సీ-బీ కాలనీకి చెందిన మంద బుడ్డమ్మ (65) ఆసరా పింఛన్ తీసుకునేందుకు డీఎంఆర్ఎల్ కూడలి సమీపంలోని ఆంధ్రా బ్యాంక్ వద్దకు ఈనెల 2న వచ్చింది. పింఛన్ డబ్బులు తీసుకున్న ఆమె బ్యాంక్ లోపలి నుంచి బయటికి వచ్చింది. తిరిగి ఇంటికి చేరలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో ఆమె ఆచూకీ కోసం గాలించారు. సమాచారం అందకపోవడంతో గురువారం ఈ మేరకు ఠాణాలో ఆమె కుమారుడు మంద కృష్ణ ఫిర్యాదు చేశారు. ఎస్సై పి.ప్రమోద్‌కుమార్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సైదాబాద్‌లో కొవ్వొత్తులతో టీ మాస్ ప్రదర్శన

సైదాబాద్: సావిత్రిబాయి పూలే జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలని, జనవరి 3ను మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా ప్రకటించి సెలవు దినంగా పాటించాలని టీ-మాస్ హైదరాబాద్ సౌత్ కమిటీ డిమాండ్ చేసింది. న్యూసైదాబాద్ కాలనీ రహదారిపై ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి ఆస్మాన్‌గఢ్ వరకు బుధవారం రాత్రి టీ-మాస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన జరిగింది.

యాఖుత్‌పురా



ఆ మార్గంలో ప్రయాణం బిక్కుబిక్కు!



బుధవారం చాదర్‌ఘాట్ వంతెన వద్ద సంఘటనా స్థలంలో వాహనదారులు

- **చాదర్‌ఘాట్, మలక్‌పేట రోడ్లపై దృష్టి సారించాలి**
- **ఏడాదిలో సగటున 50 రోడ్డు ప్రమాదాలు**

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: చాదర్‌ఘాట్, మలక్‌పేట రహదారులపై ప్రయాణించాలంటేనే ప్రాణాలు అరచేత పట్టుకొని వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ఏటా సగటున 50 కంటే అధికంగానే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు చాదర్‌ఘాట్ ఠాణా రికార్డులు చెబుతున్నాయి. మెట్రోప్రాజెక్టు పనులు మొదలైనప్పటి నుంచి రోడ్డు ప్రమాదాలకు గురై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నవారు, లేదా మృత్యువాత పడిన వారి సంఖ్య రాను రాను పెరుగుతోంది. 2016లో ప్రయివేటు కళాశాలలో విధులు నిర్వహిస్తున్న మూసారాంబాగ్ నివాసి నల్లకుంట నుంచి మలక్‌పేటకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా నీళ్ల ట్యాంకర్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈనెల 3న చాదర్‌ఘాట్ వంతెన వద్ద రషీద్ అనే ఆటో డ్రైవర్‌ను బస్సు ఢీకొనడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. ఇలాంటి సంఘటనలు ప్రతి నెలా జరుగుతూనే ఉన్నాయి. కోఠి, ఎంజీబీఎస్ వైపు రాకపోకలు సాగించే వాహనాలకు మలక్‌పేట రహదారులే కీలకం. అలానే శంషాబాద్ విమానాశ్రయం, నల్గొండ, విజయవాడ నుంచి వచ్చే వాహనాలు నగరంలోకి మలక్‌పేట రహదారి పై నుంచే ప్రవేశిస్తుంటాయి. 9వ జాతీయ రహదారిగా పేరున్న ఈ మార్గం రక్తమోడుతోంది. మలక్‌పేటలో మెట్రో పనులు ప్రారంభమైన తరువాత ఈ రహదారిపై ప్రయాణించాలంటేనే ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంగా ఉందంటున్నారు వాహనదారులు. తరచూ ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యతో ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తోంది.

సర్వీసు రహదారులపై భారీ వాహనాలు

మెట్రోపనుల వల్ల ప్రధాన రహదారిపై ప్రయణాలు ఇబ్బందులుగా ఉండడంతో భారీ వాహనాలు నడిపేవారు అత్యధికంగా సర్వీసు రోడ్లను వినియోగించుకొంటున్నారు. నివాసాల ముందు, కాలనీల్లో ఉన్న సర్వీసు రోడ్లపై తిరిగే వాహనాల సంఖ్య రోజురోజుకు అధికం కావడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. వాహనాల వేగాన్ని నియంత్రించే చర్యలు కొరవడ్డాయి. ట్రాఫిక్, ఎంసిహెచ్, రవాణా శాఖల మధ్య సమన్వయం కొరవడింది. మరమ్మతులు సరిగా లేని రోడ్లు, అడ్డుగా ఉంటున్న మెట్రో పరికరాలు, రహదారులపైనే ఏర్పాటు చేసిన భారీ అడ్డంకులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మెట్రో పనుల వల్ల మలక్‌పేట రైల్వే వంతెన వద్ద భారీవాహనాలపై ఆంక్షలు ఉన్నాయి. అయినా అవి రాకపోకలు సాగిస్తున్నాయి. భారీ వాహనాలు వంతెన భద్రతకోసం నిర్మించిన కమాన్‌ను ఢీ కొడుతున్నాయి.

ఎన్నెన్నో సంఘటనలు

● 2015 మే 2న ఓల్డ్ మలక్‌పేట ప్రాంతంలో రోడ్డు దాటడానికి ప్రయత్నించిన చిన్నారిని ఓ వాహనం చిదిమేసింది. అదే రోజు మలక్‌పేట రైల్వే స్టేషన్ చాదర్‌ఘాట్ కాజ్‌వే వద్ద ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఒక కుటుంబం మెట్రో వారు ఏర్పాటు చేసిన సూచికను ఢీకొని ప్రమాదానికి గురయ్యారు. ● 2016 ఫిబ్రవరిలో నీటి ట్యాంకర్ ఢీకొని ద్విచక్రవాహనం నడుపుతున్న నల్లకుంట వాసి దుర్మరణం చెందాడు. ● చాదర్‌ఘాట్ పోలీసుల వివరాల ప్రకారం 2012లో 59.. 2013లో 68.. 2014లో 55, 2015లో 50, 2016లో 35, 2017లో 20 రోడ్డు ప్రమాదాలు జరిగాయి.

ఏం చేయాలంటే

9వ నంబరు జాతీయ రహదారిపై సుమారు 5శాఖలు సమన్వయంతో పని చేయాల్సి ఉంది.. మెట్రో ప్రాజెక్టు నిర్వహిస్తున్న అధికారులు, బల్దియా, ట్రాఫిక్, శాంతిభద్రతల పోలీసులు, జాతీయ రహదారి అధికారులు, ఆర్‌టీసీ అధికారులు కీలకం. మెట్రో పనులు జరుగుతున్న రీత్యా రహదారి భద్రతపై కీలకంగా వ్యవహరించాల్సి ఉంది. అలానే రోడ్ల మరమ్మతులు చేపట్టడంతోపాటు చిన్న చిన్న గుంతలను పూడ్చాలి. మలక్‌పేట రైల్వేస్టేషన్ వద్ద ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న వాహనాల రాకపోకలను నియంత్రించాలి. మలక్‌పేట ట్రాఫిక్ సీఐ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎప్పటికపుడు ట్రాఫిక్ నియంత్రణ కోసం ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్నామన్నారు. భారీ వాహనాలు ఇటు వైపు రాకుండా ప్రయత్నిస్తున్నామని, వచ్చిన ఆర్‌టీసీ వాహనాలపైనా జరిమానా విధిస్తున్నామన్నారు.



ప్రమాదకరంగా రహదారి



DRIVING SCHOOLS

2 రోజుల్లో టూవీలర్ (సైకిల్ రాకున్నా) 5 రోజుల్లో కారు డ్రైవింగ్ నేర్పబడును Rs.1900/- లకే 100 రూ॥లతో నడిపి చూసి నమ్మండి ✆ 8142189096/ 8374310921

PACKERS & MOVERS

Jai Hanuman Packers & Movers Local & All Over India DSNR: 9391072529, KP: 9394428929, Sec: 9032028929, Vij, Vzg, Chennai, Bng, Puna.

Peacock Pac & Move Loc & All D2D. 24/7 DSNR: 24048555 TARNAKA 9959789555 ECIL: 9000456555 SEC. 64539555 'B' VJA, VSP, GNT, NEL, BNG, CHE, DEL

WEBSITES

Website @ 499/- Mobile App, SEO@Low Price Call V&V (Training & Development) DSNR. Call ✆ 040 - 66639001/ 9052389001.

Explore Your Business/ Services through Online in New Year with your Website/ Web App Developed at Lowest Cost @ www.sgrservices.in ✆ 9573811540



WATER PROOFING

శ్రీసాయిభవాణి వాటర్‌ప్రూఫింగ్, సీలింగ్, వాటర్‌ట్యాంక్స్ సైడ్‌వాల్స్, సంపు, బాత్‌రూమ్స్ కెమికల్స్‌తో అనుభవం గల టెక్నిషియన్స్‌తో 10 సం॥ల గ్యారెంట్‌తో చేయబడును✆ 9948270898

EDUCATION

Free..డెమో CBSE/ ICSE/ స్టేట్‌సిలబస్ ప్లే..స్కూలైనా.. ఏస్కూలైనా మీఇంటి వద్దనే నెలకు రూ. 100. మీఇంట్లోనే డిజిటల్ క్లాస్‌రూం సౌకర్యం కలదు. ✆ 7075270123/ 9848569337

SPOKEN ENGLISH

Maharshi Spoken English with Guarantee Results Business, All working people, Housewives, Students T/M, E/M. On sundays. 2-3hrs classes. ✆ 7993131239.

JCNM Spoken English, New year Special Offer All Working People, Housewives, Students @ Konark Theatre Road, DSNR ✆ 9676441539

వివేకానంద స్పోకెన్ ఇంగ్లీష్ ఎవరికైనా కేవలం 45 రోజుల్లో నేర్పించబడును. లేనిచో మొత్తం ఫీజు వాపసు. 35 Yrs Exp. ఫ్యాకల్టీ DSNR ✆ 9030905737

HOME TUTIONS

B.S.Home Tutions VI-XII. All C.B.S.E/ I.C.S.E. All Boards. Inter, IIT, J.E.E, NEET, Chemistry, Phy, Maths, ✆ 9912639222/ 9848591739

HAND WRITING COURSE

పరీక్షల్లో మంచిమార్కులు రావడానికి, హ్యాండ్‌రైటింగ్ ముత్యాల్లా& వేగంగా వ్రాయాలి దానికి ఇంగ్లీష్, తెలుగు, లుసిడా, క్యాలిగ్రఫీలో 100%ట్రైనింగ్ గ్యారంటీ. ప్రతి ఆదివారం హోంట్యూషన్.✆ 7993131239.

JOB TRAINING

మహిళలకు డాటాఎంట్రీ, ఫొటోషాప్ మరియు ఆల్బమ్ డిజైనింగ్‌లలో ఉచితశిక్షణ. మీయొక్క ఆధార్‌కార్డుతో సంప్రదించండి. @RTC 'X' రోడ్. ✆ 9440003272.

TAX CONSULTANCY

Pancard Passport Firm Reg Labour Licence GST REG, SSI REG, ESI REG, PF REG IT Returns ✆ 8328442364

Income Tax & GST Returns (Reguler, Compositation) Digital Signater, Reg. GST, Firm, Company Kothapet 9014939322/ 040-40036258

YOGA & MEDITATION

వ్యాధి వచ్చాకకాదు, రాకముందే వ్యాధి మూలాన్ని నిర్మూలించండి. అందుకు తగిన రోగనిరోధకశక్తిని యోగా ద్వారా పొందండి మీఇంటి వద్దనే పతంజలియోగా నేర్పించబడును. ✆ 9394028619.

MOSQUITO SCREENS

Mosquito Mesh: MESH Windows & Doors, UPVC Windows, Welltech Cloth Hangers. ✆ 7569610019, www.welltechsystems.com

PEST CONTROL

OMKSR Pest Control white ants woodborers Treatment Guarantee Only Kitchen Cockroaches, Spray Gel: 499/-. ✆ 9550446581/ 9666566081.

Reddorkins Pest Control : కాక్రోచ్‌జెల్ రూ. 499/- చెదలు, ఫర్నీచర్ పౌడర్ రాలుట, నల్లులు, బల్లులు, చీమలు, ఎలుకలు, తేనేటీగలు, దోమలు ✆ 9989956152

Biochem Pest కంట్రోల్ చెదలు, బొద్దింకలు, శాశ్వత నివారణ. వాసనరాని కెమికల్స్, ఫ్రీ ఇన్స్‌ఫెక్షన్ & ఎస్టిమేషన్ కొరకు సంప్ర॥ ✆ 9866773345

GEYSER

HOTWATER Instant Gas Geyser Sales & Home Service Gas Pipeline Instalation Service Vinayaka Ent. DSNR ✆ 9346736141

ASTROLOGY

త్రిముఖ దుర్గాజ్యోతిష్యం - సమ్మక్కపూజారి: ప్రేమ, పెళ్లి, సంతానం, విద్య, ఉద్యోగం, వ్యాపారం, కుటుంబం, కోర్టు సమస్యలు పరిష్కారం చేయును. సికింద్రాబాద్ స్వాతి హోటల్ ప్రక్క వీధిలో. Ph: 9542025298

శ్రీ దత్తాత్రేయ జ్యోతిష్యాలయం హస్తరేఖ, జాతకం, ముఖ కవళికలను చూసి జీవిత భవిష్యత్తును చెప్పగలము. విద్య, విదేశీ ప్ర॥, పెళ్ళి, సంతానం, స్త్రీ ప్రేమ, ఆరోగ్యం ఇంకా మీ గుప్త విషయాలకు పరిష్కారం కలదు. 9849593592 హిమాయత్‌నగర్.

శ్రీ గాయత్రిదేవి జ్యోతిష్యాలయం కలిసొచ్చేవారే నన్ను కలుసుకుంటారు. పరిష్కారంలేని సమస్యలుండవు. పండిట్ శ్రీసాయిరాం శాస్త్రిగారు 30 సం॥లుగా దిల్‌సుఖ్‌నగర్‌లో స్థిరంగా ఉంటున్నారు. మీ బొటన వ్రేముద్ర, హస్తరేఖలు భవిష్యము ఫోటో చూసి చెప్పబడును. వివాహం, ఉద్యోగం, విద్యా ప్రేమపెళ్లి స్త్రీ/ పురుషులకు ఎటువంటి సమస్యలకైనా పరిష్కారం ✆ 9440537044/ 9949373448

Only One Appointment Daily శ్రీప్రత్యంగిరావావాహీ జప పూజ హోమాదుల ద్వారా పరిష్కారం చూపబడును. సంప్ర॥ ✆ 7680945267

TAILORING

Setwin Govt of TG టైలరింగ్ బ్యూటిషియన్ ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్ కంప్యూటర్ కోర్స్ శిక్షణ Miracle Institute, Alwal w. venkatapuram ✆ 9394870091

MUSIC & DANCE CLASSES

డ్రాయింగ్, పెయింటింగ్, డాన్స్, మ్యూజిక్, అబాకస్ క్లాసులు నిర్వహించబడును. J.R. ఆర్ట్ అకాడమి, సాయినగర్, బాలాపూర్. ✆ 9440911124, 9290519596

LADIES HOSTEL

P Cube డీలక్స్ లేడీస్‌హాస్టల్: హోమ్‌లీ ఫుడ్ &అకామిడేషన్, స్టూడెంట్స్ &వర్కింగ్ ఉమెన్స్, HDFC బ్యాంక్‌పైన ఈస్ట్ మారేడ్‌పల్లి. ✆ 9949500463/ 040-40074169.

GUEST HOUSE

సుహాలేఖ గెస్ట్‌హౌజ్ :అతిథుల కొరకు, ఫంక్షన్స్ కొరకు ఇవ్వబడును. టీచర్స్ కాలనీ, ఈస్ట్ మారేడ్‌పల్లి - సికింద్రాబాద్. సంప్ర: 8008206482/ 040-48520182.

OLD AGE HOME

సుబ్బయ్య ఓల్డేజ్‌హోం & హోంకేర్ సర్వీస్: వృద్ధులకు, మంచానున్న వారికి 24 గం॥ సేవలు చేయుటకు అనుభవం గల ఆయా/అటెండర్లను మీ ఇంటికి పంపగలం ✆ 9603159955/ 9603369955/ 9603429955/ 9603829955

నాగబాబు ఓల్డేజ్‌హోం & హోంకేర్ సర్వీస్: వృద్ధులకు, మంచానున్న వారికి 24 గం॥ సేవలు చేయుటకు అనుభవం గల ఆయా/అటెండర్లను మీ ఇంటికి పంపగలం ✆ 9010368855/ 9010418855/ 9010478855/ 9133138855

శ్రీదేవి ఓల్డేజ్‌హోం & హోంకేర్ సర్వీస్: వృద్ధులకు, మంచానున్న వారికి 24 గం॥ సేవలు చేయుటకు అనుభవం గల ఆయా/అటెండర్లను మీ ఇంటికి పంపగలం ✆ 9640297766/ 9640017766/ 9603857766/ 9640327766

శ్రీధర్ ఓల్డేజ్ హోం & హోంకేర్ సర్వీస్: వృద్ధులకు, మంచానున్నవారికి 24 గం॥ సేవలు చేయుటకు అనుభవం గల ఆయా/ అటెండర్లను మీ ఇంటికి పంపగలం. ✆ 9505197788/ 9505317788/ 9553407788/ 9553287788.

అంజన్న హోమ్‌కేర్/నర్సింగ్ / బేబికేర్ సర్వీసెస్. వృద్ధులు, మంచానున్నవారికి 24సం॥ మీఇంటివద్ద ఉండి సేవలు చేయుటకు నర్సులు / ఆయామ్మలు, వార్డ్‌బాయ్స్‌ను పంపగలము. కూకట్‌పల్లి. ✆ 9133833544 / 9000967963 / 9959933359 / 9704161063 / 9963489661 / 9966568882 www.anjannahomecare.in

మధర్ & ఫాదర్ ఓల్డేజ్ హోం & హోంకేర్ సర్వీసెస్. మా హోంనందు వృద్ధులకు, బెడ్‌పేషంట్స్‌కు, కోమాలో ఉన్నవారికి, అంతిమ స్థితిలో ఉన్నవారికి మంచి వాతావరణంలో రుచికరమైన భోజనం, 24 గం॥ డా॥, నర్సింగ్, ఆయా, ఫిజియోథెరపి సేవలు అందించబడును. బెడ్ పేషంట్స్‌కు ప్రత్యేక శ్రద్ధ. సరూర్‌నగర్. ✆ 9248580427/ 9676335813

భగవాన్ ఓల్డేజ్‌హోం & హోంకేర్ సర్వీస్: వృద్ధులకు, మంచానున్న వారికి 24 గం॥ సేవలు చేయుటకు అనుభవం గల ఆయా/అటెండర్లను మీ ఇంటికి పంపగలం ✆ 9133702211/ 9133652211/ 9133762211/ 9133742211

రమ్య హోంకేర్: మంచాన ఉన్న పేషెంట్లకు, వృద్ధులకు సేవచేయడానికి, వంటచేయడానికి, పిల్లలను చూసుకోవడానికి పనివారిని పంపగలం. ✆ 7093431444/ 7032747888

డాక్టర్లతో With మెడిసిన్స్"శ్రీసాయి అమృత ఓల్డేజ్ హోం & Rehabilitation Centre" ఆర్థో, ఫిజియో, సైకో, బ్రైన్ స్ట్రోక్స్ వారికి 24 గం॥ కేర్ హబ్సిగూడ, తార్నాక సంప్ర: 9949362765

శివసాయిసంజీవని ఓల్డేజ్‌హోం & హోంకేర్ సర్వీస్ వృద్ధాప్యం, పక్షవాతం, దీర్ఘకాలిక వ్యాధులతో మంచానున్నవారికి 24గం॥ సేవలు తుర్కయాంజాల్ ✆ 9603705539/ 9490536298.

బ్రాహ్మణ వృద్ధాశ్రమం మనవృద్ధులు ఏదోఒకచోట చేరడంవల్ల సంస్కృతి ఆచారాలకు నష్టం బ్రాహ్మణత్వానికి ప్రమాదం. బ్రాహ్మణాశ్రమంలో చేర్పించి జాతిగౌరవం కాపాడండి ✆ 9348393485

REPAIRS

LG, Samsung, BPL, Sony, Toshiba. All Company LCD, LED Tv Repairs @ UR Door Step. 20 Yrs Exp. ✆ 9700300422/ 9700300530

All A/c's, A/c Refrigirator, Washing Machine & Micron, Geezer at Home Service. Contact: 8686261610/ 9000241522.

TV REPAIR

SAMSUNG, LG, SONY, PANASONIC అన్ని కంపెనీల కలర్ టీవిలు, LCD, LED మీ ఇంటి వద్దనే రిపేర్ చేయబడును. 25సం॥ Exp. 9849694705.

GAS STOVE REPAIR

గ్యాస్‌స్టవ్‌లు రిపేరు చేయబడును. మీ ఇంటివద్దనే Anand Opp: PAI Electronics, Main Road, Dilsukhnagar. ✆: 9246201373.

SOFA REPAIR

Sofa Lining Works, Repairing All Cushions Door Service Taken Up One Branch in DSNR Area. 9032587371, 9642573668


SECONDS SALE

A/c, బ్యాటరీలు, UPS, కంప్యూటర్ ఎలక్ట్రానిక్స్ ఉడెన్ హాస్టల్, హౌస్, హోటల్, గ్లాస్, ప్లైఉడ్, ఐరన్ స్క్రాప్, ఐరన్ అలమార, డోర్స్, 8686271616

కేసవుతుంది... సాక్ష్యముండదు

- 72 కేసుల్లో రెండింటిలోనే శిక్ష ఖరారు
- రౌడీషీటర్ అయూబ్‌ఖాన్ నేపథ్యమిది

ఈనాడు, హైదరాబాద్


అయూబ్‌ఖాన్ (పాతచిత్రం)

6 హత్యలు.. 8 హత్యాయత్నాలు.. 5 టాడా చట్టం కేసులు.. 2 దోపిడీలు.. 2 బందిపోటు దొంగతనాలు.. 2 మాదకద్రవ్యాల కేసులు.. 38 ఇతర కేసులు.. ఇదీ స్థూలంగా పాతబస్తీలో కరడుగట్టిన నేరగాడు అయూబ్‌ఖాన్ సృష్టించిన అరాచక సామ్రాజ్యం. పదహారేళ్లకే దోపిడీతో ఆరంభించి నేరమయ జీవితంలోకి అడుగుపెట్టిన అయూబ్‌ఖాన్ 27 ఏళ్లపాటు 72 నేర ఘటనలకు పాల్పడ్డాడు. రెండంటే రెండు కేసుల్లోనే శిక్ష పడిన నేపథ్యమతడిది. హైదరాబాద్‌లో నిఘా పెరగడంతో దుబాయ్ పారిపోయి ఏడాది క్రితం అనూహ్యంగా ముంబయి విమానాశ్రయంలో చిక్కిన ఇతడు గురువారం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యాడు. పోలీసులు ఇతడిపై ప్రయోగించిన పీడీ చట్టం కేసును న్యాయస్థానం కొట్టివేయడంతో బెయిల్‌పై విడుదలవడం చర్చనీయాంశంగా మారింది.

16 ఏళ్లలోనే దోపిడీ

అయూబ్‌ఖాన్ తండ్రి జహంగీర్‌ఖాన్ భారత మాజీ సైనికుడు. అయూబ్‌ఖాన్ మాత్రం నేరసామ్రాజ్యానికి చిరునామాగా మారాడు. 1989లో అతడు తన 16 ఏళ్ల ప్రాయంలోనే తొలిసారిగా దోపిడీతో నేర సామ్రాజ్యానికి పునాదులు వేసుకున్నాడు. మరుసటి ఏడాది హత్యతో ముఠాను ఏర్పాటు చేసుకున్నాడు. అదే ఏడాది కామటిపురా, హుస్సేనీ ఆలం ఠాణాల పరిధిలో మత ఘర్షణలకు పాల్పడ్డాడు. పోలీసులకు సమస్యగా మారడంతో కాలాపత్తర్ పోలీసులు ఇతడిపై రౌడీషీట్ తెరిచారు. ఆ తర్వాత ముఠాను ఏర్పరచుకున్నాడు. 2004లో స్థిరాస్తి వ్యాపారం ఊపందుకోవడంతో ఇతడి ఆగడాలు మితిమీరి పోయాయి. పాతబస్తీలో నేర సామ్రాజ్యాన్ని విస్తరించడానికి ప్రాధాన్యమిచ్చిన అయూబ్‌ఖాన్ తనకెదురొచ్చిన వారిని అంతమొందించేందుకూ వెనకాడలేదు. ఈ క్రమంలో మరో రౌడీషీటర్ మహ్మద్ కైసర్(39) అలియాస్ మల్లేపెల్లి కైసర్ అలియాస్ ఘోరా కైసర్‌తో శత్రుత్వం ఏర్పడింది. భూవివాదాల నేపథ్యంలో ఇరువర్గాలు కత్తులు దూసుకోవడం ఆరంభించడంతో కొంతకాలంపాటు గ్యాంగ్‌వార్ నడిచింది. 2012లో కైసర్‌పై నగర పోలీసులు ఆరు నెలలపాటు తడీపార్ (నగర బహిష్కరణ) విధించారు. అనంతరం 2014లో పీడీ చట్టం ప్రయోగించి ఏడాది పాటు జైలుకు పంపారు.

న్యాయవాది హత్యతో సంచలనం

నేరాలు చేయడానికి అలవాటు పడ్డ అయూబ్‌ఖాన్ ఓ రకంగా పాతబస్తీలో భయానక వాతావరణానికి కేంద్ర బిందువుగా మారాడు. 2002లో పట్టపగలే నడిరోడ్డుపై న్యాయవాది మన్నన్‌ఘోరీని వెంటాడి అంతమొందించడం ద్వారా సంచలనం సృష్టించాడు. హుస్సేని ఆలం ఠాణా పరిధిలో ఓ సివిల్ కేసులో తనకు వ్యతిరేక వర్గం తరఫున వాదిస్తున్నాడనే కారణంతో ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. పోలీసులపైనా దాడులకు పాల్పడేవాడు. 1992లో, 2005లో, 2007లో పోలీసులపై దాడులకు తెగబడ్డాడు. ఇలా పదకొండేళ్ల కాలంలో ఏకంగా 72 నేరాల్లో అయూబ్‌ఖాన్ ప్రమేయంపై పోలీసులు కేసు నమోదు చేసినా న్యాయస్థానంలో వాంగ్మూలం ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రారు. ఒకవేళ సాక్ష్యం చెబితే అయూబ్‌ఖాన్ తమను బతకనివ్వడనే వాతావరణం ఉండటమే ఇందుకు కారణం. న్యాయవాది మన్నన్ ఘోరీ హత్య కేసులో సాక్ష్యాలు బలంగా ఉండటంతో అయూబ్‌ఖాన్‌కు జీవితఖైదు పడింది. కామాటిపురా ఠాణా పరిధిలోని మరో కేసులో ఆరునెలల సాధారణ జైలు శిక్షకు గురయ్యాడు. ఇవి రెండూ మినహా మిగిలిన 70 కేసులు న్యాయస్థానాల్లో వీగిపోవడం గమనార్హం. ఘోరీ హత్య కేసులో సాంకేతిక కారణాల దృష్ట్యా హైకోర్టులో అయూబ్‌ఖాన్‌కు ఊరట లభించడంతో 2014లో జైలు నుంచి విడుదలయ్యాడు. తెలంగాణ ప్రభుత్వం దీనిపై అప్పీలుకు వెళ్లడం.. కరడుగట్టిన రౌడీషీటర్లపై హైదరాబాద్ పోలీసులు పీడీ చట్టం ప్రయోగిస్తుండటం... శత్రువుల నుంచి ప్రాణహాని ఉండటంతో అదే ఏడాది ఆగస్టులో అయూబ్‌ఖాన్ దుబాయ్ పారిపోయాడు. అక్కడి నుంచే బంగారం అక్రమ రవాణా దందా నడిపించాడు. నకిలీ పాస్‌పోర్టులు పొంది తరచూ హైదరాబాద్‌కు వచ్చి వెళ్తున్న క్రమంలో 2016 డిసెంబరులో ముంబయి విమానాశ్రయంలో అక్కడి పోలీసులకు చిక్కాడు. అనంతరం అతడిని తీసుకొచ్చిన హైదరాబాద్ పోలీసులు పీడీ చట్టం ప్రయోగించి జైలుకు పంపగా.. ప్రస్తుతం విడుదలయ్యాడు. ప్రస్తుతం నకిలీ పాస్‌పోర్టుల వ్యవహారంపై అతడు విచారణ ఎదుర్కొంటున్నాడు.

అయూబ్‌ఖాన్ జైలు నుంచి విడుదల

చంచల్‌గూడ: రౌడీషీటర్ అయూబ్‌ఖాన్‌పై హైకోర్టు పీడీ చట్టం కొట్టి వేయడంతో జైలు నుంచి విడుదల చేశామని చంచల్‌గూడ జైలు పర్యవేక్షణాధికారి ఎర్రంశెట్టి రాజేష్ తెలిపారు. చాలాకాలం తరువాత రౌడీషీటర్ అయూబ్‌ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేసి 2016 జులై 20న చంచల్‌గూడ జైలుకు తరలించారు. అతనిపై ఉన్న పలు కేసుల వల్ల నగర పోలీసు కమిషనర్ 2017 జనవరి 24న పీడీ యాక్టు విధించారు. తనపై పీడీ చట్టం రద్దు చేయాలని అయూబ్‌ఖాన్ హైకోర్టును ఆశ్రయించాడు. చట్టం గడువు ముగియడానికి 20 రోజుల ముందు జైలు నుంచి విడుదలయ్యాడు.

బస్సుల్లో చోరీలు: ముఠా సభ్యుడి అరెస్టు

11.5 తులాల బంగారు ఆభరణాలు... 25 వేల నగదు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ శశిధర్‌రాజు

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: రద్దీబస్సుల్లో ప్రయాణిస్తూ అదను చూసి చోరీలకు పాల్పడుతున్న పేరొందిన ఓ ముఠాకు చెందిన కీలక సభ్యుడిని సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్ట్ చేసి సుమారు రూ.3.5 లక్షల విలువ చేసే చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గురువారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తూర్పుమండలం డీసీపీ శశిధర్‌రాజు, అదనపు డీసీపీ గోవింద్‌రెడ్డి, సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్‌రావు, డీఐ వంశీకృష్ణరావు, డీఎస్సై నర్సింగ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లా ఆత్మకూరు మండలం సిద్దాపురం గ్రామానికి చెందిన బత్తుల భాస్కర్ రైతు. తేలికగా డబ్బులు సంపాదించేందుకు మరో ఎనిమిది మందితో కలిసి ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నాడు. హైదరాబాద్, కర్నూలు, నెల్లూరుతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. బృందాలుగా ఏర్పడి రద్దీ బస్సులు లక్ష్యంగా చేసుకుని ప్రయాణికుల్లా నటిస్తూ అదను చూసి చేతివాటాన్ని ప్రదర్శించి ప్రయాణికుల జేబులు కత్తిరించడం, మహిళల మెడలోని బంగారు ఆభరణాలు, బ్యాగులు, పర్సులను దొంగిలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ముఠాకు చెందిన కీలకసూత్రధారి గిడ్డన్నతోపాటు కోటయ్యను గత నెల కోఠిలో అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న ముఠా సభ్యుల కోసం సుల్తాన్‌బజార్ క్రైం పార్టీ నిఘా మరింత పెంచింది. గురువారం ఉదయం 7 గంటల ప్రాంతంలో బత్తుల భాస్కర్ (25) కాచిగూడ రైల్వేస్టేషన్ వద్ద సంచరిస్తున్నట్లు విశస్వనీయ సమాచారం మేరకు క్రైం పార్టీ సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారించి ముఠా సభ్యుడిగా గుర్తించి అతడి వద్ద నుంచి 11.5 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.25 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ముఠా సభ్యులపై కర్నూలు, నెల్లూరు జిల్లాల్లోనూ కేసులు నమోదైనట్లు వివరించారు. పరారీలో ఉన్న ముఠా సభ్యులు అగిరమ్మ, రాణమ్మ, రమణమ్మ, లక్ష్మీదేవి, నాగలక్ష్మి, మల్లి కోసం గాలిస్తున్నట్లు డీసీపీ తెలిపారు.

ప్రయాణికుడి జేబులో నుంచి రూ.2 లక్షలు చోరీ

ఇద్దరు నిందితుల అరెస్ట్ ● రూ.1.77లక్షలు స్వాధీనం

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికుడి జేబులో నుంచి నగదును చోరీచేసిన ఇద్దరు పాత నేరస్థులను మహంకాళి పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.1.77 లక్షల నగదును స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించారు. గురువారం ఉత్తరమండలం డీసీపీ సుమతి, మహంకాళి ఏసీపీ వినోద్‌కుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రవి మీడియాకు వివరాలు వెల్లడించారు. మోండా సాంబమూర్తినగర్, గ్యాస్‌మండి ప్రాంతానికి చెందిన అబ్దుల్ ఖదీర్(30) ప్రస్తుతం బేగంపేట్ మెట్రో రైల్వేస్టేషన్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. రద్దీగా ఉండే బస్సుల్లోని ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతుంటాడు. ఇతడిపై మహంకాళి పోలీసుస్టేషన్‌లో మూడు కేసులు ఉన్నాయి. ఇదిలా ఉండగా పూల వ్యాపారం చేసే మౌలాలి తిరుమలనగర్‌కు చెందిన మొహమ్మద్ సాధిక్(29)తో కలిసి ఆర్పీరోడ్డు బాటా వద్ద గత నెల 28న ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న కృష్ణారెడ్డి అనే వ్యక్తి జేబులో నుంచి రూ.2లక్షలను చోరీ చేశారు. బాధితుడు వెంటనే మహంకాళి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని బాధితుడి చెప్పిన అనుమానిత వ్యక్తుల ముఖచిత్రాలను గీయించారు. పాత నేరస్థుడు ఖదీర్‌పై అనుమానం రాగా అతడి చిత్రాన్ని సీసీ కెమెరాల్లో రికార్డు తీసుకుని వచ్చి బాధితుడికి చూపించారు. అతడే తాను బస్సు ఎక్కే సమయంలో తోసుకుంటూ వచ్చి డబ్బు కాజేసినట్లుగా అనుమానం వ్యక్తం చేశాడు. పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా మహమ్మద్‌తో కలిసి చోరీ చేసినట్లు తెలియజేశాడు.

క్లినిక్ నుంచి మధ్యలోనే బయటికొచ్చి..

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్యకు ముందు ఇలా..

రాయదుర్గం: చింతల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వరుణ్‌కుమార్ బుధవారం గచ్చిబౌలిలోని ఓ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. తమ కుమారుడు కొన్నాళ్లుగా తీవ్రమైన మానసిక ఒత్తిడితో బాధపడుతున్నాడని అతడి కుటుంబసభ్యులు పోలీసులకు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు చింతల్‌లో ఓ వైద్యుడి వద్దకు వరుణ్‌కుమార్‌ను తీసుకెళ్లారు. అక్కడ చూపించుకోకుండానే మధ్యలోనే బయటికి వెళ్లాడని అతడి తండ్రి నాగభూషణం తెలిపారు. ఈ విషయాన్ని రాయదుర్గం ఎస్‌ఐ మురళికి వెల్లడించారు. బెంగళూరులో ఆరునెలలుగా ఉద్యోగం చేస్తున్న వరుణ్ నెల నుంచి మానసికంగా తీవ్రంగా కుంగిపోయి ఉన్నాడు. సంస్థ గార్డియన్ లీవ్(వేతనం చెల్లిస్తూ సెలవు) ఇవ్వగా ఆయన ఇంటికి వచ్చారు. తనను ఎవరో వెంబడిస్తున్నారంటూ తరచూ భయాందోళనకు గురవుతున్నాడని తండ్రి నాగభూషణం తెలిపారు. కుంగుబాటుతో బాధపడుతున్న తమ కుమారుడిని చింతల్‌లో ఓ డాక్టర్ వద్దకు తీసుకెళ్లగా సీటీ స్కాన్, ఇతర పరీక్షలు చేయించాలని సూచించారన్నారు. ఆ పరీక్షలు చేయించి బుధవారం రిపోర్టులను చూపించేందుకని క్లినిక్‌కు వెళ్లామని, అక్కడ రోగులు ఉండటంతో వేచిఉండాల్సి వచ్చిందని తెలిపారు. అదే సమయంలో వరుణ్ తనకు తలతిప్పుతోందని, ఇంటికి వెళతానని చెప్పి బయటికి వెళ్లాడన్నారు. అలా వెళ్లిన వరుణ్ ఇంటికి కాకుండా గచ్చిబౌలికి చేరుకుని విగతజీవిగా మారాడని ఆయన వాపోయారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు.



అడ్డుగా పెట్టినా... అడ్డుకోరెవ్వరూ!

జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు దగ్గర కనిపించిన పరిస్థితి ఇది. ఇక్కడి ఫ్రీ లెఫ్ట్ వే దగ్గర అడ్డంగా ఆటోలను నిలుపుతున్నారు. ఇతర వాహనాలు వెళ్లేందుకు ఎంతో ఇబ్బందిగా ఉన్నా... ట్రాఫిక్ సిబ్బంది పట్టించుకున్న దాఖలాలు లేవు.

బిర్యానీ లేదన్నందుకు హోటల్ యజమానిపై దాడి

నలుగురు యువకుల అరెస్టు

నాగోలు: బిర్యానీ లేదన్న హోటల్ యజమానిపై దాడి చేసిన నలుగురిని ఎల్బీనగర్ ఠాణా పోలీసులు అరెస్టుచేశారు. ఎస్సై ప్రకాష్ కథనం ప్రకారం... బుధవారం రాత్రి నాగోలు సాయినగర్‌లోని లక్కీ రెస్టారెంట్‌లో భోజనం చేసేందుకు ఆర్కేపురానికి చెందిన వెంకటేష్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, జి.సంతోష్, ఎం.రాములుతోపాటు మరో ముగ్గురు వచ్చారు. బిర్యానీ తేవాలని కోరారు. హోటల్ మూసేందుకు యోచిస్తున్న యజమాని సయ్యద్ అలీ రజా.. బిర్యానీ లేదని సమాధానం ఇచ్చాడు. మద్యం మత్తులో ఉన్న వారు ఆయనతో వాగ్వాదానికి దిగారు. టేబుళ్లు, అద్దాలను ధ్వంసం చేశారు. జగ్గుతో సయ్యద్ అలీ రజా తలపై మోదడంతో తీవ్రగాయాలయ్యాయి. ఎల్బీనగర్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని నలుగురు యువకులను అరెస్టుచేశారు. హత్యాయత్నం కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

EENADU CLASSIFIEDS

IRON & CEMENT, EYE CARE, COOKING,FLOORINGS, YOGA & MEDITATION, BEAUTY PARLOUR, DIABETIES, HOUSE KEEPING, COURIERS, DRIVING SCHOOLS, TAILORING, YOGA & MEDITATION, BEAUTY PARLOUR, DIABETIES, PAINTS, CELL PHONES, SCHOOL UNIFORMS, GENERATORS, ELECTRICAL, FURNITURE FOR SALE, SWEETS, MESSCELL PHONES, SCHOOL UNIFORMS, GENERATORS

BIRTHDAY GREETINGS

5వ జన్మదిన శుభాకాంక్షలు



చి|| కె. అభినితి
మా ముద్దుల పాప
కె. అబ్బినితి కి
ఐదవ జన్మదిన శుభాకాంక్షలు
ప్రేమతో...
అమ్మమ్మ : కుడలకంటి మంజుల
గ్రేటర్‌లోని 12 పౌరసరఫరాల శాఖ సర్కిళ్లలో 1200కుపైగా చౌకధరల దుకాణాలు ఉన్నాయి.. ప్రభుత్వం ప్రతి నెలా బియ్యం, కిరోసిన్, గోధుమల్ని అందజేస్తోంది. ఇతర జిల్లాల్లోనేమో 15 వరకే చౌకధరల దుకాణాలు తెరిచి ఉంటాయి. నగరంలో మాత్రం అలా కాదు.. ప్రతి నెలా 25 వరకు పంపిణీ చేస్తారు. ప్రతి శుక్రవారం సెలవు. 15వ తారీఖు వరకే 60 శాతం ప్రక్రియ పూర్తవుతుంది.. మిగిలిన లబ్ధిదారులు ఆ తర్వాత తీసుకునేవారు. దుకాణాల వద్ద బారులు తీరాల్సిన అవసరముండేది కాదు. మొదటి తేదీనే అన్ని సరకుల్ని అందుబాటులో ఉంచుతున్నట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. అయితే.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. బియ్యం, గోధుమలు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. కిరోసిన్ కావాలంటే 15వ తేదీ తర్వాతే వెళ్లాలి. ఇచ్చేది మూడు సరకులు.. రెండు, మూడు సార్లు తిరగాలంటూ కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరేమో మళ్లీ అంతదూరం ఎవరెళ్తారంటూ అసలు కిరోసినే తీసుకోవడం లేదు.

ఫిర్యాదులపై సమీక్ష

మొదటి తేదీనే వెళ్తే సరకులు అందుబాటులో ఉండటం లేదంటూ ఎప్పటి నుంచో ఫిర్యాదులు అందుతున్నాయి. తాజాగా పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు ఈ అంశంపై దృష్టి సారించారు. ఏం చేస్తే పరిస్థితిలో మార్పు వస్తుందంటూ కమిషనర్ సీవీ ఆనంద్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. గ్రేటర్‌లో పంపిణీ గడువును పది రోజుల పాటు కుదించాలని నిర్ణయించారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచే అన్ని సరకులు అందుబాటులో ఉండేలా పకడ్బందీ చర్యలు తీసుకోనున్నారు. 15లోపు పంపిణీని డీలర్లు పూర్తి చేయాల్సి ఉంటుంది.. 16 నుంచి 18వ తేదీలోపు మరుసటి నెల కోటాకు డీడీలు కట్టాలి. ఆ తర్వాత ఆర్వోలను సంబంధిత ఏసీఎస్‌వోలు వెంటనే గ్రేటర్‌లోని ఎంఎల్ఎస్ పాయింట్లకు పంపిస్తారు. ప్రభుత్వం నియమించిన స్టేజ్ 2 గుత్తేదారులు 30లోపు చేరవేస్తారు.

ఇబ్బందులు తప్పవు

'గతంలో దుకాణాలు కేటాయించినప్పుడు దుకాణం కొలతలు 10×10, 10×12 అడుగులు ఉండాలని ఉత్తర్వులు జారీ చేశారు. తాము కూడా ఆ మేరకే దుకాణాలను నిర్వహిస్తున్నాం. ఒకేసారి కాకుండా ఆ నెల కోటాను కొద్దిగా కొద్దిగా మూడు సార్లు లిఫ్ట్ చేస్తున్నారు. గడువును కుదించడంతో అంతా ఒకేసారి తెచ్చుకోవాల్సి వస్తుంది. ఆ కోటాను నిల్వ చేసేందుకు స్థలం సరిపోదు. ఎక్కడ పెట్టాలి మరి. ఇతర జిల్లాల్లోనేమో కార్డులు తక్కువగా ఉంటాయి. అందరూ ఒకేసారి వచ్చి రేషన్ తీసుకుంటారు. మన దగ్గర అలా కాదు.. కార్డులూ ఎక్కువే. ఎట్టి పరిస్థితుల్లోనూ 15లోపు పూర్తి కాదు. కార్డుదారులకు అన్యాయం జరుగుతుంది' అని హైదరాబాద్ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దాసరి మల్లేశం, కార్యనిర్వాహక అధ్యక్షుడు వీరేశం, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్ 'ఈనాడు'తో పేర్కొన్నారు. గ్రేటర్ వరకు మినహాయింపు ఇవ్వాలని.. గతంలో మాదిరిగానే 25వ తేదీ వరకు తెరిచి ఉంచేందుకు అనుమతి ఇవ్వాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆనంద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించినట్లుగా తెలిపారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని వివరించారు.

ఈనాడు-ఈటీవీ తెలంగాణ నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీ జనవరి, 3, 2018 విజేతలు

1. కె. శారద, హైదరాబాద్; 2. పరిణిత సాయి, ఖమ్మం; 3. తాళ్ల నర్మద, మంచిర్యాల; 4. ఎల్. మీనా, బిచ్కుంద; 5. డి. మల్లీశ్వరి, కొత్తగూడెం; 6. బి. లావణ్య, హైదరాబాద్; 7. ఈ. వాణి, మంచిర్యాల; 8. ఎన్. శారద, జన్నారం; 9. ఎ. హరిత, హైదరాబాద్; 10. అలేఖ్య, బెల్లంపల్లి, మంచిర్యాల. విజేతల వివరాలు ఈనాడు డాట్‌నెట్ చూడవచ్చు.

ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం

నగదుతో ఉడాయించిన మహిళ అరెస్టుకు బాధితుల డిమాండ్



అపర్ణారావు, ఆందోళన చేస్తున్న యువకులు

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: జర్మనీలో ఇంజినీరింగ్ ఉద్యోగాలు, మెడికల్ సీట్లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసి విదేశాలకు పారిపోయిన మహిళ అపర్ణారావును అరెస్టు చేయాలంటూ కొందరు యువకులు నేరేడ్‌మెట్ మధురానగర్‌లోని ఆమె సోదరుని ఇంటి ఎదుట గురువారం సాయంత్రం ఆందోళన చేశారు. ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగాల్లేక ఖాళీగా ఉంటున్న వారి వివరాలు సేకరించి వారికి జర్మనీ భాష నేర్పించి ఉద్యోగాలు ఇప్పిస్తానని అప్పట్లో ఆమె నమ్మించింది. అలా కొంతమంది నుంచి దాదాపు రూ.20 లక్షలకుపైగా వసూలు చేసింది. ఒకవేళ ఉద్యోగాలు రాకపోతే అనే సంశయాన్ని నిరుద్యోగులు వ్యక్తం చేయడంతో విదేశీ భాష శిక్షణకు అయ్యే రుసుమును మినహాయించి 80 శాతం డబ్బును తిరిగి ఇచ్చేస్తానని ఒప్పందం కుదుర్చుకుంది. అయితే ఉన్నట్లుండి ఆమె కనిపించకపోవడంతో ఆమెపై గత ఏడాది జులైలో బాధితుల ఫిర్యాదుతో నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. విదేశాల్లో ఉంటున్న ఆమె.. ఇటీవల నేరేడ్‌మెట్‌లోని తన సోదరుని ఇంటికి వచ్చిందన్న సమాచారంలో బాధిత యువకులు గురువారం మధురానగర్‌కు చేరకున్నారు. ఆమె తన వద్ద లేదని సోదరుడైన విశ్రాంత కల్నల్ అర్జున్ చెప్పడంతో బాధితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి వెళ్లిన పోలీసుల్ని సోదరుడు అర్జున్ లోనికి అనుమతించలేదు. సెర్చ్ వారెంటు లేకుండా ఇంట్లోకి అనుమతివ్వబోనని చెప్పడంతో పోలీసులు వెనుదిరిగారు. దీంతో యువకులు అక్కడే ఆందోళన చేశారు. ఆ మహిళను తప్పించి ఉంటారని యువకులు ఆరోపించారు. కాగా ఇన్ని రోజులు ఆమెను ఎందుకు అరెస్టు చేయలేదని సీఐ జగదీష్‌చందర్‌ను అడిగితే ఆమె విదేశాల్లో ఉంటున్నందున సాధ్యపడలేదని చెప్పారు.

అప్పు లేదనడంతో చెప్పుతో కొట్టాడు

వైసీపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిపై కేసు నమోదు

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: మద్యం దుకాణంలో ఉద్దెర అడిగితే లేదనటంతో కోపోద్రిక్తుడైన వైఎస్ఆర్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు వీరంగం సృష్టించి చెప్పుతో దాడికి పాల్పడిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై ఎస్.శ్రీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లికి గ్రామానికి చెందిన బెంబడి శ్రీనివాస్‌రెడ్డి మేడ్చల్ జిల్లా వైఎస్ఆర్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. బుధవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఆయన జీడిమెట్ల గ్రామ సమీపంలోని లిక్కర్‌మార్టు మద్యం దుకాణం వద్దకు మరో వ్యక్తితో కలిసి వెళ్లారు. అనంతరం మద్యం తీసుకురావాలని అదీ అప్పుగా ఇవ్వాలని కోరడంతో అందుకు యాజమాన్యం అంగీకరించదని చెప్పారు. తనకే మద్యం అప్పు ఇవ్వవా అంటూ కౌంటర్‌లో ఉన్న సంతోశ్‌పై దాడికి దిగారు. ఆగ్రహావేశంతో.. దుర్భాషలాడుతూ అతనిని చెప్పుతో కొట్టారు. పోలీసులు మద్యం దుకాణంలోని సీసీ పుటేజీలు పరిశీలించి బాధితుడి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌రెడ్డిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కౌంటర్‌లో ఉన్న సంతోష్‌పై చెప్పుతో దాడి చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి (సీసీ కెమెరా దృశ్యాలు)

మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసు

విదేశీ మహిళకు మూడేళ్ల జైలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: నిషేధిత మత్తు పదార్థాలను అక్రమ రవాణా చేస్తున్న విదేశీ మహిళకు న్యాయస్థానం మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.40వేల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది. దక్షిణ ఆఫ్రికాలోని జోహన్స్‌బర్గ్‌కు చెందిన రమాలిబి హంగ్వాని(32) 2015 జనవరి 20న భారత్ నుంచి దోహాకు ఖతార్ విమానంలో వెళ్లడానికి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంది. విశ్వసనీయ సమాచారంతో మాదక ద్రవ్యాల నియంత్రణ విభాగం(ఎన్సీబీ)కి చెందిన నిఘా అధికారులు ఆమెను తనిఖీ చేశారు. ఆమె వద్ద ఉన్న సంచిలో 10కిలోల మత్తు పదార్థం దొరికింది. కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. కేసు విచారించిన సైబరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సునీత కుంచల గురువారం తీర్పు వెల్లడించారు.

కారు లారీ ఢీకొని ఇద్దరి దుర్మరణం

మృతులు రంగారెడ్డి జిల్లావాసులు



పూర్ణచందర్‌రావు, మాధవరెడ్డి


లారీ కింద ఇరుక్కుపోయిన కారు

బాలానగర్, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై బాలానగర్ మండలం పెద్దాయపల్లి సమీపంలో గురువారం మధ్యాహ్నం కారు, లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. ఏఎస్ఐ గోపాల్ కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా షాబాద్ నుంచి జడ్చర్ల సమీపంలోని పోలేపల్లికి కారు వెళ్తుండగా పెద్దాయపల్లి సమీపంలో టైరు పగిలిపోయింది. కారు అదుపుతప్పి డివైడర్‌ను దాటి అవతలి వైపు రోడ్డుపై పడిపోయింది. అదే సమయంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ కారును ఢీకొంది. అదేవేగంతో కారును కొంతదూరం ఈడ్చుకువెళ్లింది. ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసం కాగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతిచెందారు. ప్రమాదంతో కొద్దిసేపు వాహనాల నిలిచిపోయాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వాహనాలను పక్కకు తొలగించి రాకపోకలను క్రమబద్ధీకరించారు. క్రేన్ సాయంతో కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీయించి ప్రాథమిక దర్యాప్తు చేశారు. మృతులు రంగారెడ్డివాసులని పోలీసులు గుర్తించారు. ఒకరు షాబాద్ మండలం సంకేటిపల్లికి చెందిన మాధవరెడ్డి కాగా, మరొకరు సర్దార్‌నగర్‌కు చెందిన పూర్ణచందర్‌రావు అని తెలిపారు. పూర్ణచందర్‌రావుకు భార్య చంద్రకళ, కుమారులు వినోద్, సంతోష్, కుమార్తె స్వప్న ఉన్నారు. మాధవరెడ్డికి భార్య సుమతమ్మ, కుమార్తెలు వీణ, దివ్య, కుమారుడు సంతోష్‌రెడ్డి ఉన్నారు. శవపరీక్ష కోసం మృతదేహాలను షాద్‌నగర్ ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్ఐ గోపాల్ తెలిపారు.

కంటైనర్ బోల్తా : ఇద్దరి మృతి


బోల్తా పడిన కంటైనర్

కీసర: నలభై చక్రాల కంటైనర్ టైరు పేలి బోల్తా పడిన సంఘటనలో ఇద్దరు మృతి చెందగా, ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి.. ఈ సంఘటన గురువారం కీసర అవుటర్ రింగు రోడ్డుపై జరిగింది. యూపీకి చెందిన చంద్రశేఖర్ పటేల్, సరోజ్, అఖిల్, రాజేశ్‌మిశ్రా, ప్రసాద్ మూడు రోజుల క్రితం కంటైనర్‌లో కాంక్రీటు దిమ్మెల లోడుతో నాగ్‌పూర్ నుంచి బయలుదేరారు. గురువారం మధ్యాహ్నం కీసర అవుటర్ రింగు రోడ్డు మీదుగా మేడ్చల్‌కు వెళ్తుండగా..యాద్గార్‌పల్లి సమీపంలో ముందు భాగంలో టైరు ఒక్కసారిగా పేలింది. దీంతో లారీ ఇంజన్ నుంచి కంటైనర్ విడిపోయి అదుపు తప్పి బోల్తా కొట్టింది. కాంక్రీటు దిమ్మెలు చెల్లాచెదురుగా పడిపోయాయి. రాజేశ్ మిశ్రా(40) ఛాతి భాగంలో దిమ్మెలు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో తలకు బలమైన గాయాలైన కాశీ ప్రసాద్(35)ను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మిగిలిన ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందిన వెంటనే సీఐ సురేందర్‌గౌడ్, ఎస్ఐ రవికుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించారు. కంటైనర్ బోల్తాతో అవుటర్ రింగు రోడ్డుపై వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. పోలీసులు కంటైనర్‌ను అతి కష్టం మీద తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

మరో ఘటనలో వ్యక్తి..

ఘట్‌కేసర్(బోడుప్పల్), న్యూస్‌టుడే: ఘట్‌కేసర్ అవుటర్ రింగ్‌రోడ్డుపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఘట్‌కేసర్ పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ భిక్షమయ్య తన కుమార్తె యశస్విని(27), మనవరాలు శాన్వి (7నెలలు)తో కారులో నగరానికి వచ్చారు. భిక్షమయ్య హయత్‌నగర్‌లో దిగిపోయారు. మిగతా ఇద్దరిని రెసిడెన్షియల్ పాఠశాల ఉద్యోగి కారులో జమాలుద్దీన్(40) అవుటర్ రింగ్‌రోడ్డుపై ఉప్పల్ వైపునకు వెళ్తుండగా ప్రమాదవశాత్తూ అదుపుతప్పి బోల్తా కొట్టింది. కారు నడుపుతున్న జమాలుద్దీన్ అక్కడికక్కడే మృతిచెందాడు. యశస్విని, శాన్వి లకు గాయాలుకావడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

‘రెక్కలు’ కట్టుకొని వాలుతారు

- శివారులో వైద్య సేవల్లో జాప్యానికి చెక్
- ఏఎన్ఎంలకు కిట్లతో కూడిన వాహనాలు
- ప్రాజెక్టు ‘రెక్కలు..’తో ప్రజలకు మరింత చేరువ

ఈనాడు–హైదరాబాద్

అతిసారం వ్యాపిస్తే వెంటనే వైద్య సేవలు మొదలు పెట్టాలి.. శివారు ప్రాంతాలకు వెళ్లి ఎప్పటికప్పుడు స్థానికుల ఆరోగ్య వివరాలు తెలుసుకోవాలి.. టీకాలు వేయడం లాంటి కార్యక్రమాలు క్రమం తప్పకుండా కొనసాగించాలి. ఇదంతా పక్కాగా జరగాలంటే వైద్య సిబ్బంది సకాలంలో ఆ ప్రాంతానికి చేరుకోవాలి. ఇలా సిబ్బంది వెళ్లేందుకు ‘ప్రాజెక్టు రెక్కలు’ పేరుతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఒక కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వైద్య ఆరోగ్య సిబ్బంది సకాలంలో వెళ్లేందుకు ఒక కిట్‌తో కూడిన వాహనాన్ని సమకూరుస్తున్నారు. వికారాబాద్ ప్రాంతంలో మొదట పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేసి మంచి ఫలితాలు రావడంతో ఇప్పుడు నగర శివారులు సహా రంగారెడ్డి జిల్లా మొత్తం అమలు చేస్తున్నారు.

రవాణా సదుపాయాలు లేక..

వైద్య ఆరోగ్య శాఖలో దాదాపు 400 మంది ఏఎన్ఎంలు పని చేస్తున్నారు. వీరంతా వివిధ కాలనీలు..శివారు గ్రామాలకు వెళ్లి టీకాలు వేయడం..గర్భిణుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీయడం.. పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించడం లాంటి కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుంది. అంటే ఆవాసాల్లో ప్రాథమికంగా ఆరోగ్య పరిస్థితులపై అవగాహన కలిగి ఉంటారు. వీరు కొన్నిసార్లు సకాలంలో స్పందించి వెళ్లకపోతే ప్రాణాపాయం కూడా ఉండే అవకాశం ఉంది. అయితే ఇప్పటివరకూ వీరు విధులకు వెళ్లడానికి వాహనాలు లేవు. ఎవరికైనా సొంత వాహనాలు ఉంటే తీసుకువెళ్లాలి. లేదంటే బస్సులు..ఆటోల్లో వెళ్లాలి. పైగా వైద్య కిట్‌లు వెంట తీసుకువెళ్లాలి. ఇలా వెళ్లడం ఇబ్బందికరంగా ఉండటంతో కొన్నిసార్లు వెళ్లకుండానే మిన్నకుంటున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. కొన్నిసార్లు విధులు నిర్వహించాల్సిన ప్రాంతాల్లో రెండు, మూడు గంటలు కూడా ఉండటం లేదు.



వాహనాన్ని పరిశీలిస్తున్న బాలాజి పవార్

‘ప్రాజెక్టు రెక్కలు’ ఇలా...

ఆవాసాల్లో వైద్య సిబ్బంది సేవలు మెరుగుపరిచేందుకు కేవలం వారిని తరచూ అప్రమత్తం చేయడంతోనే సరిపోదని అధికారులు భావిస్తున్నారు. వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలు కూడా కల్పిస్తే సేవలు మెరుగవుతాయనే నిర్ణయానికి వచ్చారు. ఇందుకోసం వారికి ప్రత్యేక ద్విచక్ర వాహనాలు ఇప్పిస్తున్నారు. ఈ వాహనాలకు రూ.2వేల వ్యయంతో ఒక ప్రత్యేక కిట్ కూడా అమరుస్తున్నారు. ఈ కిట్ కోసం అయ్యే వ్యయాన్ని ఎన్ఆర్‌హెచ్ఎం నిధుల నుంచి భరిస్తున్నారు. ఈ కిట్‌లో కొన్ని పరీక్షలు చేసేందుకు వాడే వైద్య పరికరాలు, మందులు, సిరంజులు, టీకాలు ఉంటాయి. ద్విచక్రవాహనాన్ని పొందేందుకు ఒక్కో ఏఎన్ఎంకి రూ.10వేలు చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈ సొమ్మును వాహనం కొనుగోలుకు అడ్వాన్స్‌గా ఇవ్వాల్సి ఉంటుంది. ఇక వాహనానికి చెల్లించాల్సిన మిగిలిన మొత్తాన్ని నెలకి కనీసం రూ.350 చొప్పున ఈఎంఐ రూపంలో చెల్లించే విధంగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం తొలివిడతలో 275మందికి ద్విచక్రవాహనాలు ఇప్పిస్తున్నారు. ఈ వాహనాలన్నీ ఒకే రంగుతో ఉంటాయి..వీటిని స్థానికులు కూడా గుర్తుపట్టేలా లోగో కూడా ఉంటుంది. ప్రస్తుతం సిబ్బంది నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అలాగే కొందరికి డ్రైవింగ్ లైసెన్సు కూడా లేకపోవడంతో ఆర్టీఏ అధికారులతో మాట్లాడి ప్రత్యేకంగా డ్రైవ్ ఏర్పాటు చేసి లైసెన్సులు ఇప్పించేందుకు కూడా ఏర్పాట్లు చేశారు. ఈ వాహనాల రాకతో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు త్వరితగతిన అందించడానికి వీలుంటుందని డీఎంహెచ్ఓ బాలాజి పవార్ అభిప్రాయపడ్డారు.



పనులు పరిశీలిస్తున్న మేయర్ రామ్మోహన్

అంతర్జాతీయ సొబగులతో దుర్గం చెరువుపై వేలాడే వంతెన

మార్చి 2019కల్లా పూర్తి ● మేయర్ బొంతు రామ్మోహన్

హైదరాబాద్, న్యూస్‌టుడే: మాదాపూర్ దుర్గం చెరువుపై వేలాడే వంతెన అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే పనుల వేగం పుంజుకుందని, మార్చి 2019నాటికి అందుబాటులోకి తీసుకురానున్నట్లు మేయర్ బొంతు రామ్మోహన్ చెప్పారు. వంతెన నిర్మాణ పనులను ఆయన గురువారం పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రూ.184కోట్ల వ్యయంతో అంతర్జాతీయ సొబగులు అద్ది నగరం గర్వించేస్థాయిలో ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. 425.85 మీటర్ల వేలాడే వంతెన ఉంటుందని, దీనిపై విహారం విదేశాల అనుభూతిని కలిగిస్తుందని తెలిపారు. 13 ఫౌండేషన్లు నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. త్వరగా పూర్తిచేసేందుకు అదనపు షిఫ్టులతో పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. చెరువు అందాలు కలుషితం మారకుండా రూ.90లక్షల వ్యయంతో ప్రత్యేకంగా గణేశ్ విగ్రహాల నిమజ్జన కోనేరును అందుబాటులో తెస్తున్నట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ రోడ్ నం.45 నుంచి దుర్గం చెరువు వరకు రూ.150కోట్ల వ్యయంతో నాలుగులేన్ల ఎలివేటెడ్ కారిడార్లను నిర్మిస్తామని చెప్పారు. మేయర్ వెంట బల్దియా ప్రాజెక్టు అధికారులు ఉన్నారు.

స్నాతకోత్సవానికి జేఎన్‌టీయూ సన్నాహాలు

పట్టాలు పొందేందుకు దరఖాస్తు గడువు ఫిబ్రవరి 10

ఈనాడు, హైదరాబాద్: ఫిబ్రవరి లేదా మార్చిలో 7వ స్నాతకోత్సవాన్ని జేఎన్‌టీయూహెచ్ నిర్వహించనుంది. బంగారు పతకాలు దక్కిన విద్యార్థులకు మాత్రమే వేదికపై పట్టాలు అందించాలని వర్సిటీ నిర్ణయించింది. గవర్నర్‌కు అనుకూలమైన తేదీని ప్రకటించేలోపు స్నాతకోత్సవానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తోంది. జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతిగా ఆచార్య ఎ.వేణుగోపాల్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత నుంచి ఏటా స్నాతకోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జనవరి 31వ తేదీలోపు యూజీ, పీజీ కోర్సులు పూర్తి చేసినవారు స్నాతకోత్సవంలో పట్టాలు పొందేందుకు అర్హులని వర్సిటీ ఓ ప్రకటనలో తెలిపింది. అర్హులైన అభ్యర్థులు పట్టాలు పొందేందుకు ఈనెల జవవరి 20నుంచి ఫిబ్రవరి 10వ తేదీలోపు వర్సిటీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రధాని అపాయింట్‌మెంట్ కోసం నిరసన దీక్షలు

లాలాపేట, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ కోసం ప్రధానమంత్రి అఖిల పక్షానికి అపాయింట్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8, 9, 10 తేదీల్లో తెలంగాణ మాదిగ ఐకాస ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేయనున్నట్లు ఐకాస గౌరవాధ్యక్షుడు డా.పిడమర్తి రవి తెలిపారు. తార్నాకలోని తన నివాసంలో గురువారం ఐకాస సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా 8న కలెక్టర్ కార్యాలయాల ఎదుట, 9న ఆర్డీవో కార్యాలయాల ముందు, 10న నియోజకవర్గాల్లో నిరసన దీక్షలు చేయనున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవ తీర్మానం చేసినందున కేంద్రం చొరవ తీసుకోవాలని వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్షలకు మాదిగలు హాజరై తమ ఆకాంక్షను తెలియజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐకాస నాయకులు గాదె వెంకట్, వడ్డె ఎల్లన్న, ఎర్రవెల్లి కృష్ణమాదిగ, సుధాకర్, వెంకటేష్, అంబేద్కర్, దుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి ప్రతీక!

మెట్రో నిర్మాణ పనుల్లో భాగంగా పంజాగుట్ట-అమీర్‌పేట రహదారిలో ఓ నిర్మాణాన్ని సగం తొలగించి ఇలా వదిలేశారు. ఈ గోడకు తాజాగా పగుళ్లు కూడా వచ్చాయి. ఎప్పుడు కూలుతుందో అర్థం కాని పరిస్థితి. అధికారుల నిర్లక్ష్యానికి ప్రతీకగా నిలుస్తోంది ఈ గోడ.





రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న అఖిల పక్ష నాయకులు

పాతబస్తీ తెలంగాణలో భాగమేనా?

- అక్కడికి మెట్రో వస్తేనే నిజమైన విశ్వనగరం

సోమాజిగూడ: పాతబస్తీ తెలంగాణలో భాగమేనా.. కేసీఆర్ పాతబస్తీతో కూడిన తెలంగాణకు ముఖ్యమంత్రా కాదా తేల్చాలని సీపీఐ జాతీయ నేత నారాయణ పేర్కొన్నారు. సమైక్య రాష్ట్రం నుంచి తెలంగాణకు విముక్తి లభించింది కాని ఎంఐఎం నుంచి పాతబస్తీకి విముక్తి లభించలేదని ఆయన అభిప్రాయపడ్డారు. పాతనగర మెట్రో రైల్ ఐకాస గురువారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ‘మెట్రో రైలు కోసం ఉద్యమిద్దాం.. పాత నగర అభివృద్ధికి బాటలు వేద్దాం’ అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. సీపీఐ నగర కార్యదర్శి ఇ.టి.నర్సింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నారాయణ మాట్లాడుతూ అక్కడికి మెట్రో వద్దని ఒవైసీ కుటుంబం మాత్రమే కోరుకుంటోందని విమర్శించారు. రాష్ట్రానికి సీఎం, ఉప ముఖ్యమంత్రి ఉన్నా.. పాతబస్తీకి అసదుద్దీన్ ఒవైసీ సీఎంగా, అక్బరుద్దీన్ ఒవైసీ ఉప ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ మెట్రో వస్తే రోడ్లు విస్తీర్ణమై ఎంఐఎం దుకాణం బంద్ అవుతుందని అందుకే అంగీకరించడం లేదన్నారు. ఇదంతా వదిలి సికింద్రాబాద్ బైసన్‌పోలో మైదానంలో కొత్త సచివాలయం కడతానంటున్నారు.. కొత్త సచివాలయం ఎందుకని ప్రశ్నించారు. పాత నగరంలో మెట్రో వచ్చినప్పుడే నిజమైన విశ్వనగరం అవుతుందని పేర్కొన్నారు. భాజపా ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ వద్దని చెప్పిన ఎంఐఎంకు ఉద్యమ పార్టీగా చెబుకునే తెరాస మద్దతు పలకడం హాస్యాస్పదమన్నారు. పాతనగరానికి మెట్రో వచ్చేందుకు ఐకాసగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాజపా నాయకులు ఆలె భాస్కర్, పాశం సురేందర్, తెరాస నేత రషీద్ షరీఫ్, కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, సీపీఎం నేత సోమయ్య, తెలంగాణ ఐకాస నగర కన్వీనర్ సత్యంగౌడ్, ప్రతినిధులు హరినాథ్‌గౌడ్, ఉస్మాల్‌అల్ హద్రీ, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

సౌదీ కష్టాల నుంచి విముక్తి

క్షేమంగా నగరానికి చేరుకున్న ఇద్దరు మహిళలు

చంచల్‌గూడ: నగరం నుంచి సౌదీకి ఉపాధి కోసం వెళ్లి అక్కడ అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న ఇద్దరు మహిళలు విదేశాంగ శాఖ చొరవతో ఎట్టకేలకు ఇక్కడకు చేరుకున్నారు. వివరాలను ఎంబీటీ అధికార ప్రతినిధి అమ్జదుల్లాఖాన్ తెలిపారు. టోలీచౌక్ హకీంపేట్‌కు చెందిన నసీం బేగం నగరంలోని ఓ ఏజెంట్ ద్వారా రెండున్నర ఏళ్ల క్రితం సౌదీకి ఉద్యోగానికి వెళ్లారు. అక్కడ ఉద్యోగం బదులు ఓ ఇంట్లో పని మనిషిగా చేర్చారు. వేతనం ఇవ్వకపోవడంతోపాటు అనేక కష్టాలు ఆమె ఎదుర్కొన్నారు. శామీర్‌పేటకు బాలాజీనగర్‌కు చెందిన నుజ్జత్‌బేగంది కూడా ఇదే వ్యథ. అక్కడి ఆసుపత్రిలో ఉద్యోగానికని ఏజెంట్ ఆమెను పంపించారు. తీరా ఓ ఇంట్లో పని మనిషిగా చేయాల్సి వచ్చింది. గతయేడాది ఆగస్టు నుంచి సౌదీలోని ఆభాలో బిక్కుబిక్కుమంటూ గడిపింది. ఈ ఇద్దరు మహిళల కష్టాలను కేంద్ర విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ దృష్టికి ఎంబీటీ నేత తీసుకువెళ్లారు. దీంతో విదేశాంగ శాఖ రియాద్‌లో ఉన్న అధికారులకు వివరాలను అందించి బాధితులు స్వదేశానికి వచ్చేలా సహాయపడింది. ఈ సందర్భంగా మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. తమలాంటి వారెందరో ఉద్యోగాల నిమిత్తం వెళ్లి ఇబ్బందుల్లో ఉన్నారని వాపోయారు. జవహర్‌నగర్ ఠాణాలో ఏజెంట్‌పై ఫిర్యాదు చేసినట్లు నుజ్జత్‌బేగం తెలిపారు.



కుటుంబ సభ్యులతో నసీంబేగం

చికెన్ ధరలు

	వెన్‌కాబ్	సుగుణ
ఫారెటు	86–00	86–00
రిటైల్	108–00	106–00
డ్రెస్డ్	157–00	154–00
స్కిన్‌లెస్	178–00	180–00

వెన్‌కాబ్: 9849219870
సుగుణ: 9346589121

ఐటీక్షేత్రంలో ట్రాఫిక్ చిక్కులు వీడేలా!

- భారీగా రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలు
- పైవంతెనల నిర్మాణానికి సైతం..
- కసరత్తు ప్రారంభించిన అధికారులు



గచ్చిబౌలి-కొత్తగూడ రహదారిలో రోడ్డు విస్తరణ పనులు

మాదాపూర్, న్యూస్‌టుడే

హైటెక్‌సిటీ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగిపోతోంది.. వందలాది ఐటీ కంపెనీలు, లక్షలాది మంది ఉద్యోగులు పనిచేసే ప్రాంతం కావడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో బంపర్ టు బంపర్ ట్రాఫిక్ ఉంటుంది.. మాదాపూర్, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంత రహదారుల్లో కేవలం రెండుకిలోమీటర్ల ప్రయాణానికి అరగంట సమయం పడుతుందంటే ఇక్కడ ట్రాఫిక్ కష్టాలు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడే ఇలాంటి పరిస్థితి ఉంటే భవిష్యతులో ఈ ప్రాంతంలో మరిన్ని ఐటీ కంపెనీలు ఏర్పాటుకానున్నాయి. దీంతో పెద్దసంఖ్యలో కొత్త ఉద్యోగులు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ కష్టాలు రెట్టింపవుతాయి. ఇప్పుడే ఇరుకైన రోడ్లు, చౌరస్తాలతో నిత్యం వాహనాలు బారులు తీరాల్సివస్తోంది. ఈ నేపథ్యంలో.. ఐటీ కారిడార్ ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు జీహెచ్ఎంసీ ప్రణాళిక సిద్ధంచేస్తోంది. ఇందులో భాగంగా ఆయా రహదారులను విస్తరించేందుకు కసరత్తు మొదలుపెట్టింది. 150అడుగులున్న రోడ్డును 215 అడుగులకు, 80అడుగులున్న రోడ్డును 120అడుగులకు విస్తరించి రహదారులను విశాలంగా మార్చేందుకు చర్యలు ఆరంభించారు. రహదారుల విస్తరణతో పాటు కొత్తగా పైవంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు.



రహేజా చౌరస్తాలో నిర్మిస్తున్న అండర్ పాస్‌వే

విస్తరణకు ప్రతిపాదించిన రహదారులు ఇవే..

- ఖాజాగూడ చౌరస్తానుంచి గచ్చిబౌలి ఔటర్‌రింగ్ రోడ్డు కూడలి వరకు రోడ్డును విస్తరించనున్నారు. ప్రస్తుతం 80అడుగులున్న ఈరోడ్డును 120 అడుగులకు విస్తరించాలని ప్రతిపాదించారు. 120 అడుగుల విస్తరణ సరిపోదని, దీన్ని 150 అడుగులకు చేయాలనే కొత్త ప్రతిపాదన తెరమీదకు వచ్చింది.
- గచ్చిబౌలి చౌరస్తానుంచి కొండాపూర్‌కు వెళ్లే మార్గంలో కొత్తగూడ చౌరస్తావరకు రోడ్డును విస్తరించాలని నిర్ణయించారు. ప్రస్తుతం 80అడుగులున్న ఈ రోడ్డును 200 అడుగులకు విస్తరించనున్నారు.
- మాదాపూర్-సైబర్‌టవర్స్ రోడ్డులో ఉన్న రత్నదీప్ సూపర్‌మార్కెట్ నుంచి రహేజా మైండ్‌స్పేస్‌లోని వెస్టిన్ హోటల్‌వరకు కొత్తరోడ్డు వేయనున్నారు. ప్రస్తుతం 50 అడుగులున్న ఈ రోడ్డును 80అడుగులు చేయనున్నారు.
- బొటానికల్‌గార్డెన్ నుంచి హెచ్‌సీయూ డిపో వరకు గతంలో ప్రతిపాదించిన 120అడుగుల రోడ్డు పనులు కొనసాగుతున్నాయి.
- పాత ముంబాయి రహదారిలో రాయదుర్గం సమీపంలోని నారాయణమ్మ కళాశాలనుంచి ఖాజాగూడ వరకు రోడ్డును విస్తరించనున్నారు. ప్రస్తుతం 150అడుగులున్న ఈ రోడ్డును 215 అడుగులకు విస్తరించనున్నారు.

కొత్త పై వంతెనలు ఇక్కడే...

- ఎస్ఆర్‌డీపీ పనుల్లో భాగంగా ప్రస్తుతం రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌నుంచి బయోడైవర్సిటీ కూడలి మీదుగా పైవంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.
- షేక్‌పేటలోని రియలన్స్ భవనంనుంచి రాయదుర్గం మల్కంచెరువు వరకు పైవంతెన నిర్మాణానికి అధికారులు నిర్ణయించారు. పైవంతెన నిర్మాణం కోసం భూపరీక్షలు చేస్తున్నారు.
- గచ్చిబౌలి రాడిసన్ హోటల్‌నుంచి కొత్తగూడ చౌరస్తా మీదుగా కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయం వరకు భారీ పైవంతెన నిర్మించేందుకు ప్రతిపాదించారు.
- దుర్గంచెరువు వద్ద చేపడుతున్న వేలాడే వంతెనకు లింక్ చేస్తూ ఇనార్బిట్ మాల్ నుంచి నేరుగా ఓఆర్ఆర్ జంక్షన్‌వరకు మరో పైవంతెన చేపట్టాలనే అంశం అధికారుల పరిశీలనలో ఉంది.

భారీగా స్థలసేకరణతో..

ఆయా మార్గాల్లో విస్తరణ కోసం అధికారులు భారీగా స్థలసేకరణ చేయాల్సివస్తోంది. రోడ్డుకిరువైపులా ఉన్న భారీ భవంతులను తొలగించాల్సిన పరిస్థితి. ముఖ్యంగా నారాయణమ్మ కళాశాల నుంచి ఖాజాగూడ వరకు జరిగే రోడ్డు విస్తరణలో దాదాపు 150భవనాలను తొలగించాల్సి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఖాజాగూడ-ఓఆర్ఆర్‌మార్గంలో 100, గచ్చిబౌలి-కొత్తగూడ రహదారిలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. విస్తరణలో భాగంగా ఇళ్లను, స్థలాలను కోల్పోనున్న వారితో అధికారులు సమావేశాలను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం అందించే పరిహారం అంశాలను వివరించే ప్రయత్నం చేస్తున్నారు.

పనులు ఆరంభం..

ఆయా మార్గాల్లో విస్తరణకు అనుకూలంగా ఉన్న ప్రాంతంల్లో రోడ్డు నిర్మాణ పనులను అధికారులు ప్రారంభించారు. ప్రైవేటుభవనాలు, స్థలాలు లేని చోట విస్తరణ పనులు సాగుతున్నాయి. ముఖ్యంగా గచ్చిబౌలి-కొత్తగూడ మార్గంలో పలుచోట్ల పనులను వేగవంతం చేశారు. మిగితా చోట్ల నిర్మాణాలను తొలగించిన తరువాత పనులు చేపడతామని అధికారులు చెబుతున్నారు.

తీరనున్న కష్టాలు..

హైటెక్‌సిటీలో కీలకమైన రహదారుల విస్తరణ పూర్తయితే చాలా వరకు ట్రాఫిక్ సమస్య తీరుతుందని అధికారులు భావిస్తున్నారు. రోడ్లతోపాటు కొత్తగా చేపట్టనున్న పైవంతెనలు అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ కష్టాలనుంచి విముక్తి పొందే అవకాశం ఉంటుంది. విస్తరణ పనుల పర్యవేక్షణ కోసం ఒక్కో రహదారి బాధ్యతను ఒక్కో అధికారికి అప్పగించి ఎప్పటికప్పుడు పురోగతిని ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నారు. వెరసి.. ఇరుకురోడ్ల విస్తరణ, పైవంతెనలు, అండర్‌పాస్‌లు అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ కష్టాలు దూరంకావడంతోపాటు ఐటీ కారిడార్ స్వరూపం మారిపోతుందనడంలో సందేహం లేదు.



మొయినాబాద్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

జీవో 111 ఎత్తేయకుంటే ఉద్యమం

నెలాఖరున బహిరంగ సభ నిర్వహణకు నిర్ణయం

మొయినాబాద్, న్యూస్‌టుడే: 'జీవో నం.111 దేశంలోనే అత్యంత హేయమైనది. సీఎం కేసీఆర్ కూడా దీన్ని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చేవెళ్లకు వచ్చినప్పుడు.. తెరాస సర్కారు అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే జీవోను ఎత్తేస్తామని మాటిచ్చారు. నేటికీ ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేకుండాపోయింది. ప్రభుత్వం వెంటనే స్పందించి జీవో తొలగించడం లేదా సవరించడం చేయకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తాం' అని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ బాధ్యుడు పి.కార్తీక్‌రెడ్డి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఛాంబర్స్ అసోసియేట్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి, భాజపా రాష్ట్ర నాయకుడు ప్రేంరాజ్ అన్నారు. జీవోనం.111 అంశం సుప్రీంకోర్టులో ఉందని చెప్పడం అబద్ధమన్నారు. ఈ నెలాఖరున భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. జీవోనం.111 ఉద్యమ కార్యాచరణపై గురువారం నగర శివారు మొయినాబాద్ మండల కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి కాంగ్రెస్, తెదేపా, భాజపా నాయకులతోపాటు జీవో పరిధిలోని గ్రామాల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఉద్యమాన్ని ఏ విధంగా ముందుకు తీసుకువెళ్లాలి. జీవో కారణంగా జరుగుతున్న నష్టాన్ని ప్రజల్లోకి ఎలా తీసుకుపోవాలి. ప్రభుత్వం స్పందించకుంటే ఎలాంటి కార్యాచరణ చేపట్టాలి తదితర అంశాలపై చర్చించారు. 111జీవో కారణంగా నగరానికి అత్యంత చేరువలో ఉన్న షాద్‌నగర్ నియోజకవర్గమూ అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అన్నారు. గ్రామ కంఠాలు దాటితేనే ఇంటిని నిర్మించుకొనే పరిస్థితి ఏర్పడిందని ఎవరైనా ఇల్లు కట్టుకోవడానికి వెళితే కూల్చివేతలకు పాల్పడుతున్నారని.. మానవ హక్కులను హరించే అధికారం ఎవరికీ లేదని కార్తీక్‌రెడ్డి మండిపడ్డారు. ఏడాదిన్నర క్రితం జీవోనం.111పై ప్రభుత్వం స్పందించకపోవడంతో హరిత ట్రైబ్యునల్‌ను ఆశ్రయిస్తే ప్రభుత్వం తమకు వ్యతిరేకంగా కోర్టులో వాదనలు విన్పించిన తీరును ఆయన తప్పుపట్టారు. వివిధ పార్టీల మండల అధ్యక్షులు కొత్త నర్సింహారెడ్డి, బూర్కుంట సతీష్, రవీందర్‌రెడ్డి, రమణారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు శేరి పెంటారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ బాధ్యుడు వెంకటస్వామి, టఫ్ బాధ్యుడు భీంభరత్, శంకర్‌పల్లి ఎంపీపీ నర్సింలు పాల్గొన్నారు.

వైద్య మండలి రద్దు నిర్ణయాన్ని విరమించుకోవాలి

తెలంగాణ వైద్యుల సంఘం డిమాండ్

ఉస్మానియా ఆసుపత్రి, న్యూస్‌టుడే: భారత వైద్య మండలి (ఎంసీఐ) రద్దు నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని తెలంగాణ వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బుక్యా శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం అఫ్జల్‌గంజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు డాక్టర్ మొహ్మద్ షేక్ షరీఫ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. భారత వైద్య మండలిని రద్దు చేసి, అదే స్థానంలో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ను ఏర్పాటు చేసేందుకు కేంద్రం యోచిస్తోందన్నారు. ఈ కమిషన్‌లో నామినేటెడ్ వ్యక్తులను నియమించడం వల్ల ప్రైవేటు వైద్య కళాశాలల దోపిడీకి ద్వారాలు బార్లా తెరిచినట్లు అవుతుందన్నారు. భారత వైద్య మండలిలో ఏవైనా లొసుగులుంటే సవరించాల్సిందిపోయి మండలిని రద్దు చేస్తామని పేర్కొనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తామని డాక్టర్ శంకర్ నాయక్ వెల్లడించారు.

హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో సాంస్కృతిక వేడుక 7న



మాట్లాడుతున్న పాశం యాదగిరి

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో స్పిరిట్ ఆఫ్ హైదరాబాద్ కల్చరల్ ఫెస్ట్ 2018 కళాప్రదర్శనలను ఈ నెల 7వ తేదీ సాయంత్రం 4 గంటలకు రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు పాశం యాదగిరి తెలిపారు. సుందరయ్య కళానిలయంలో గురువారం హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ సంస్థ పక్షాన వివిధ కళా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రధానంగా ఒగ్గుకథ నృత్యం, లంబాడీ, కవ్వాలి, బోనాలు, బతుకమ్మ, పీర్ల ప్రదర్శన, గంగిరెద్దుల విన్యాసాలు తదితర 16 రకాల కళాప్రదర్శనలు జరుగుతాయన్నారు. అలాగే శుక్రవారం సుందరయ్య కళానిలయంలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపాన్యాస, చిత్రప్రదర్శనల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు రవీంద్రభారతిలో జరిగే కళాప్రదర్శనల అనంతరం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు వి.విజయ్‌కుమార్, జేకే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



శస్త్రచికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న శ్రావణ్‌కుమార్

'గాంధీ'లో లిఫ్టు ఏర్పాటుకు రూ.కోటి మంజూరు

గాంధీ ఆసుపత్రి, న్యూస్‌టుడే: గాంధీ ఆసుపత్రిలో బెడ్‌లిఫ్టు ఏర్పాటుకు రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. కొత్త ఐసీయూ కేంద్రంలోకి రోగులను తరలించేందుకు లిఫ్టులేదు. మూడో అంతస్తుకు ర్యాంపుపై స్ట్రెచర్ మీద తీసుకెళ్తున్నారు. ఓపీలో ఉన్న లివర్‌కేర్ వార్డును కొత్తగా ఏర్పాటు చేయనున్న కాలయ మార్పిడి, ఆ పక్కనే వచ్చే పోస్టు ఆపరేటివ్ వార్డుకు తరలించనున్నారు. దీంతో అక్కడ ఖాళీగా ఏర్పడే గదిలోనే బెడ్‌లిఫ్టును ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేపట్టారు. ఈ లిఫ్టులో రోగితోపాటు 5 నుంచి 10 మంది సిబ్బంది లిఫ్టులో వెళ్లేలా నిర్మిస్తారు. ఏడో అంతస్తులో బీబ్రౌన్ డయాలసిస్ కేంద్రం స్థానంలో కాలయ శస్త్రచికిత్స థియేటర్లను ఏర్పాటు చేస్తారు. ఈ అంశాలను సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ గురువారం పరిశీలించారు. నెలలోగా అందుబాటులోకి తెస్తామన్నారు.

ఎక్కడ పడితే అక్కడేనా?



నగరంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. తవ్వకాల వ్యర్థాలను తీసుకొచ్చి ఇలా కూకట్‌పల్లి బస్టాండులో పడేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు

'హోం 2018' ప్రారంభం నేడు

ఉస్మానియా ఆసుపత్రి: 'హోం (హైదరాబాద్ ఆర్థోపెడిక్స్ మెడికల్ ఎడ్యుకేషన్) 2018' వార్షిక సదస్సు ఈ నెల 5వ తేదీన ప్రారంభిస్తున్నట్లు ఉస్మానియా ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ కోదండపాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడు రోజులపాటు కొనసాగే ఈ సదస్సును శుక్రవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, విద్యా సంచాలకులు డాక్టర్ రమేశ్‌రెడ్డి, ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణా రామయ్య, ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్, పలువురు విశ్రాంత వైద్యనిపుణులు హాజరవుతారని తెలిపారు.

ఏదీ పూర్తిస్థాయి రక్షణ వ్యవస్థ?



- ఇతర రాష్ట్రాల్లో పర్యాటక పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు
- ఇక్కడ మాత్రం అరకొరగా వసతులు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్

చారిత్రక కట్టడాలు, అలనాటి పాలకుల వైభవాన్ని తెలిపే కోటలు, ప్యాలెస్‌లు, అనేక దేవాలయాలు, దర్శనీయ ప్రదేశాలు, ఆహ్లాదపరిచే పార్కులు.. ఇలా చెప్పుకొంటూ పోతే ఇంకా ఎన్నో.. భాగ్యనగర వైభవాన్ని చాటి చెప్పే ప్రదేశాలు ఉన్నాయి. నిత్యం వేల సంఖ్యలో పర్యాటకులు నగరానికి వచ్చి వెళుతుంటారు. వీరి రక్షణ కోసం తీసుకునే చర్యలు మాత్రం కరవయ్యాయి. విదేశాల నుంచి, ఇతర రాష్ట్రాలనుంచి వచ్చే పర్యాటకులకు దిశానిర్దేశం చేసే యంత్రాంగం లేదు. వారి రక్షణ కోసం ఏర్పాటుచేసిన పర్యాటక పోలీసుల వ్యవస్థ కూడా అంతంత మాత్రంగానే ఉంది. దీంతో నగరానికి కొత్తగా వచ్చిన పర్యాటకులకు ఎటు వెళ్లాలో, ఎక్కడ ఉండాలో తెలియక బిక్కుబిక్కుమంటూ ఉండాల్సిన పరిస్థితులేర్పడ్డాయి. గతంలో ఉత్తరప్రదేశ్, గోవా, ముంబయి తదితర ప్రాంతాల్లో పర్యాటకులపై దాడులు జరిగాయి. ఈ నేపథ్యంలో నగరంలోకి వచ్చే పర్యాటకుల విషయంలో పటిష్ఠమైన రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దేశంలోనే పర్యాటక కేంద్రంగా హైదరాబాద్ పేరొందింది. కొన్ని వందల సంవత్సరాల చరిత్రాక ఆనవాళ్లతోపాటు దేశ విదేశాలవారిని ఆకర్షిస్తున్న రామోజీ ఫిలింసిటీ లాంటి చాలా పర్యాటక ప్రాంతాలతో రాజధాని అలరారుతోంది. ప్రతిరోజూ ఈ చారిత్రక ప్రాంతాలను చూడటానికి వేలాదిమంది వస్తుంటారు. ఇలా వస్తున్న వేలాదిమందికి రాష్ట్ర పర్యాటక శాఖ సరైన మార్గదర్శకత్వం చూపలేకపోతోంది. హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా వారికి పూర్తిగా అందించలేకపోతోంది. పర్యటన ప్రాంతాలను చూడటానికి వచ్చే వారందరి రక్షణ బాధ్యతను పర్యటన శాఖవారే చూసుకోవాల్సి ఉంది. ఇతర దేశాలు, ఇతర రాష్ట్రాల్లో ఈ బాధ్యతను చూడటానికి అక్కడి పర్యటన శాఖలకు ప్రత్యేకంగా రక్షణ వ్యవస్థ ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా చాలా చోట్ల ఇటీవల కాలంలో కొంత మంది పర్యాటకులపై దాడులు కూడా జరిగాయి. ఈ నేపథ్యంలో పర్యటన శాఖకు కూడా అరకొరగా కాకుండా పూర్తిస్థాయి రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని వేలాది మంది పర్యాటకులు కోరుతున్నారు. హైదరాబాద్‌లాంటి చోట్ల పూర్తిస్థాయి పర్యాటక పోలీసు స్టేషన్లను ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

కేరళలో పర్యాటక పోలీస్‌స్టేషన్

పర్యాటక రంగం సుస్థిరాభివృద్ధి సాధించాలంటే పర్యాటకుల రక్షణ విషయంలో పటిష్ఠమైన చర్యలు తీసుకోవాల్సిందే. ప్రయాణంలో, గమ్యస్థానాలకు చేరవేయడంలోనే కాకుండా వారిపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కొన్ని రాష్ట్రాలు పర్యాటకుల భద్రత కోసం పర్యాటక పోలీసులను నియమించుకున్నాయి. తొలిసారిగా కేరళ రాష్ట్రంలో ఓ టూరిస్ట్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుచేయగా రాజస్థాన్‌లో ఏకంగా మూడు నగరాల్లో వీటిని ఏర్పాటుచేశారు. తెలంగాణ ప్రభుత్వం సైతం హోంగార్డులకు శిక్షణ ఇచ్చి పర్యాటక పోలీసులుగా మార్చింది. వచ్చిన చిక్కల్లా.. ఈ వ్యవస్థ నిర్వహణను పర్యవేక్షించే యంత్రాంగం లేకపోవడం.

పర్యాటక పోలీసుల పనేంటి..?

- పర్యాటకుల భద్రతను ఎప్పటికప్పుడూ పర్యవేక్షించాలి. ఏదైనా అనుకోని సంఘటనలు జరిగితే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలి.
- మహిళలపై వేధింపులు జరగకుండా చర్యలు తీసుకోవాలి.
- ప్రయాణం, హోటల్, రైల్వేస్టేషన్, విమానాశ్రయం తదితర విషయాల సమాచారాన్ని అందించడంతోపాటు దర్శనీయ ప్రదేశాల వివరాలు తెలియజేయాలి.
- పర్యాటకులపై దాడులు జరిగితే కేసు నమోదు చేయించడంలో సహాయం అందించాలి. అత్యవసర సమయంలో ఆసన్నహస్తం అందించాలి.
- విలువైన వస్తువులు పోగొట్టుకున్నప్పుడు సహాయం చేయాలి.
- పర్యాటక ప్రదేశాల శుభ్రత విషయంలో జాగ్రత్త వహించాలి.

● **పర్యాటక పోలీసులు ఉన్న రాష్ట్రాలవీ:** పర్యాటకుల భద్రత విషయంలో ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు పర్యాటక పోలీసులను నియమించుకున్నాయి. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, పంజాబ్, ఒడిశా, మహారాష్ట్ర, కేరళ, కర్ణాటకా, జమ్మూ కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, గోవా రాష్ట్రాల్లో ఈ వ్యవస్థ పనిచేస్తోంది.

మిస్టర్ ఇండియా 2018 పోటీలకు జట్టు ఎంపిక నేడు

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: యాదాద్రి భువనగిరి జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్‌తో కలిసి ఈ నెల 5న మిస్టర్ తెలంగాణ ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీలతో పాటు మిస్టర్ ఇండియా-2018 పోటీలకు జట్టు ఎంపిక నిర్వహించనున్నట్లు తెలంగాణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి ఎస్.మోహన్ పేర్కొన్నారు. భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 5న పోటీలు జరుగుతాయి. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆయా పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల బరువు తూకం చేయడం జరుగుతుంది. పోటీల్లో విజేతలకు నగదు పురస్కారాలతో పాటు మిస్టర్ తెలంగాణ-2018 పురస్కారాలు ప్రదానం చేయడం జరుగుతుంది. పోటీల్లో భాగంగా విశేష ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను పుణెలో మార్చి నెలలో జరిగే మిస్టర్ ఇండియా-2018 పోటీల్లో పాల్గొనే జట్టుకు ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తిగలవారు పూర్తి వివరాలు, సమాచారం కోసం 98498 69860 నెంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

సమాచార వాహిని

మార్గదర్శి చిట్టి గ్రూపుల వివరాలివీ

హైదరాబాద్: మార్గదర్శి చిట్‌ఫండ్ అమీర్‌పేట్ బ్రాంచిలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న చిట్టి గ్రూపుల వివరాలు ఇలా ఉన్నాయి. అదనపు సమాచారం కోసం కె. శ్రీనివాసరావు, బ్రాంచి మేనేజరు, అమీర్‌పేట్‌ను సంప్రదించవచ్చు. ఫోన్ నెంబర్లు: 9618771330, 8008550389, ఆఫీసు నెంబర్లు: 040-23442180/81/82.

చిట్టి గ్రూపు	నెలలు	నెలసరి చిట్టి	చిట్టి విలువ
LT V A	50	1,00,000	50,00,000
LT D A	50	50,000	25,00,000
LT C A	50	30,000	15,00,000
LT X A	50	20,000	10,00,000
LT T A	50	10,000	5,00,000
LT S A	50	6,000	3,00,000
TT D A	30	50,000	15,00,000
TT X A	30	20,000	6,00,000
TT T A	30	10,000	3,00,000
TT B A	30	5,000	1,50,000
FT Z A	40	25,000	10,00,000
FT N A	40	12,500	5,00,000
FT U A	40	7,500	3,00,000
FT W A	40	2,500	1,00,000
ST P A	25	4,000	1,00,000
ST M A	25	2,000	50,000
ST G A	25	1,000	25,000

ఎస్సీ వర్గీకరణకు కేంద్రం నిర్ణయం తీసుకోవాలి: వీహెచ్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వీహెచ్

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని కేంద్రం త్వరగా తీసుకోవాలని, అరెస్టుచేసిన ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగను వదిలిపెట్టాలని కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు డిమాండ్‌చేశారు. గురువారం ఆయన చంచల్‌గూడ కారాగారంలో మందకృష్ణ మాదిగను పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ దీక్షకు పూనుకొంటున్న నాయకుడిని అరెస్టు చేయడం బాధాకరమన్నారు. చాలా కాలంగా ఆయన పోరాటం చేస్తున్న విషయం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలుసన్నారు. శాసనసభలో మద్దతు ప్రకటించి ఇప్పుడు ఉద్యమంపై సీఎం అణగదొక్కే ధోరణిలో వ్యవహరించడం తప్పన్నారు. తెలంగాణలో ఇటువంటి ఉద్యమాలు చాలా జరిగాయని, మిలియన్‌మార్చ్ సమయంలోనూ నేతలపై కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం కేసులు పెట్టలేదన్నారు. అప్పట్లో తామంతా కేసీఆర్‌కు అండగా నిలబడినందునే ఆయన తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు నడిపారని గుర్తుచేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రెండూ దళిత వ్యతిరేకతను కొనసాగిస్తున్నాయని ఆరోపించారు. మందకృష్ణ మాదిగ కారాగారంలో దీక్ష కొనసాగిస్తున్నారా? అని విలేకరులు ప్రశ్నించగా కొనసాగుతున్నట్లు తనకు తెలిపారని వీహెచ్ అన్నారు. అయితే దీనిని జైలు పర్యవేక్షణాధికారి ఎర్రంశెట్టి రాజేష్ ధ్రువీకరించలేదు. జైలులో ఎవరూ దీక్షలు పాటించడం లేదన్నారు.



ఐఐసీటీ ప్రతినిధులతో ప్రొ. హిరోషి

పట్టుదలతో అన్నీసాధ్యమే

నోబెల్ బహుమతి గ్రహీత ప్రొ.హిరోషిఅమానో

లాలాపేట, న్యూస్‌టుడే: సాధారణ విద్యార్థిగా ఉన్న నేను నేడు నీలిరంగు కాంతిని(బ్లూ ఎల్‌ఈడీ) ఆవిష్కరించి దాని నుంచి తెల్లరంగు కాంతిగా మార్చి నోబెల్ బహుమతిని అందుకున్నానని, పట్టుదలతో కృషి చేస్తే సాధ్యం కానిది లేదనే విషయాన్ని ప్రతి ఒక్క విద్యార్థి గమనించాలని జపాన్‌లోని నగోయా యూనివర్సిటీ ప్రొ.హిరోషిఅమానో అన్నారు. తార్నాకలోని ఐఐసీటీ ఆడిటోరియంలో ప్లాటినం ఉత్సవాల్లో భాగంగా గురువారం బ్లూఎల్‌ఈడీపై ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ...పాఠశాల స్థాయి నుంచి నేను అంతగా తెలివైన విద్యార్థిని కాదన్నారు. కానీ దేశానికి ఏదైనా చేయాలన్న లక్ష్యంతో ప్రపంచం నావైపు చూసే విధంగా బ్లూఎల్‌ఈడీనీ సృష్టించడమే కాదు దాని నుంచి వైట్ ఎల్‌ఈడీని ఆవిష్కరించడం జరిగిందన్నారు. మానవ రహిత విమానాల్లో తీగలు లేకుండా విద్యుత్ శక్తి ప్రసారం చేయటంపై పరిశోధనలు చేస్తున్నట్లు వివరించారు. సెమి కండక్టర్ విషన్లు తయారు చేయడానికి మాతో ఐఐసీటీ భాగస్వామ్యం కావాలని ఐఐసీటీ డైరెక్టర్ డా.చంద్రశేఖర్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించడంతో ఆడిటోరియం మొత్తం కరతాళ ధ్వనులు వినిపించాయి. అనంతరం ఐఐసీటీలోని పరిశోధక విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ వారిని ఉత్తేజపరిచారు.



పరిసరాలను పాడు చేయొద్దు!

బహిరంగ ప్రాంతాల్లో జనం మూత్ర విసర్జన చేయకుండా ఉండటానికి జీహెచ్‌ఎంసీ వారు ఇలా ఇద్దరు కార్మికులను కాపలాగా పెట్టారు. పాతనగరం లాల్‌దర్వాజ ఎక్స్‌రోడ్డునుంచి గౌలిపురా వెళ్లేదారిలో చేసిన ఏర్పాటు ఇది.

డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

బస్సు చక్రాలు ఊడే సమయంలో గమనించిన వైనం



చక్రం బయటకు వచ్చిన చిత్రం

ఆల్విన్‌కాలనీ, న్యూస్‌టుడే: నిర్ణీత వ్యవధి మేరకు ఆర్టీసీ బస్సుల కండిషన్ తనిఖీ చేయకపోవడంతో కొన్నిసార్లు రోడ్లపై ఒక్కసారిగా నిలిచిపోయే పరిస్థితి వస్తుండటం తెలిసిందే. ఇదే కోవలో.. కూకట్‌పల్లిలోని కేపీహెచ్‌బీ కాలనీ ప్రధానరహదారిపై గురువారం మధ్యాహ్నం 3గంటల సమయంలో హయత్‌నగర్ డిపో-2 కు చెందిన ఏపీ28జెడ్4411 బస్సు ప్రయాణికులతో రోడ్డుపై వెళుతుండగా వెనుక చక్రాలు ఊడిపోయే పరిస్థితి ఏర్పడింది. హౌసింగ్‌లో లాక్‌నట్టు ఊడిపోవడంతో యాక్సిల్‌తో పాటు రెండు కుడివైపుచక్రాలు బయటకు వచ్చాయి. పరిస్థితిని వెంటనే గమనించిన డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి వెంటనే రోడ్డుకు ఎడమభాగంలో బస్సును నిలిపివేశారు. మరి కొన్ని క్షణాలు అలాగే ముందుకు వెళ్లినా చక్రాలు ఊడిపోయి పెను ప్రమాదం సంభవించేదని ప్రయాణికులు చెప్పారు. మొత్తాన్ని డ్రైవర్ అప్రమత్తత కారణంగా ప్రమాదంనుంచి తప్పించుకున్నామంటూ ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం ప్రయాణికులను మరో బస్సులోకి తరలించారు.

రసరమ్యం.. రామచరిత మానసం





ప్రవచనం అందిస్తున్న రతన్‌బెన్.. భజన కార్యక్రమంలో యువతులు, మహిళలు

నాగోలు, న్యూస్‌టుడే: మనిషి జీవించే పద్ధతిని రాముని చరిత తెలుపుతుందని ప్రముఖ గుజరాతీ ప్రవచకులు రతన్‌బెన్ పేర్కొన్నారు. హైదరాబాద్ కచ్ కడ్వా పాటీదార్ సమాజ్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లోని శ్రీలక్ష్మీనారాయణ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన రామచరిత మానస్ జ్ఞాన యజ్ఞం గురువారం పూర్తయింది. గోస్వామి తులసీదాసు రచించిన 'రామచరిత మానస్'ను తొమ్మిదిరోజులపాటు ఆమె శ్రావ్యంగా వినిపించారు. రాముని జననం, సీతాకల్యాణం, రాముడు-భరతుని కలయిక, హనుమంతుని భక్తి, లంకలో రామరావణ సంగ్రామం, రావణుని వధ, అయోధ్యలో పట్టాభిషేకం తదితరాలను ఓవైపు రతన్‌బెన్ వర్ణిస్తుంటే.. కళాకారులు తమ నటనా కౌశల్యాన్ని ప్రదర్శిస్తూ ఆ సంఘటనలకు దృశ్యరూపాన్ని ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో రతన్‌బెన్ మాట్లాడుతూ నాటి కుటుంబవ్యవస్థను నేటి యువత తప్పకుండా తెలుసుకోవాలన్నారు. పాటీదార్ సమాజ్ ప్రతినిధులు మాట్లాడుతూ... సమాజంలోని ప్రతీ చిన్నారికి మన సంస్కృతి తెలిసేలా పదేళ్లకోసారి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సమాజ్ ఛైర్మన్ కర్సన్‌లద్దా పటేల్, అధ్యక్షులు జీవరాజ్ మనజీ పటేల్, ప్రతినిధులు దేవ్‌శ్రీ, శంకర్, కుషాల్, పురుషోత్తం, ప్రేమ్‌జీ, మావ్‌జీ, కిషోర్ పాల్గొన్నారు.

హాయ్! బుజ్జీ!!

నేర్చుకుందాం!

ఆంగ్లంలో చాలా పదాల్లో సైలెంట్ లెటర్స్ ఉంటాయి. తెలియక మనం వాటిని తప్పుగా పలికేస్తుంటాం. వాటి సరైన ఉచ్చారణ తెలుసుకుంటే సరి.

honest - ఆనెస్ట్
honor - ఆనర్





ఈ చెట్లకు సిగ్గెక్కువ!

నేలపై నెర్రలు ఏర్పడటం చూశాం కానీ ఇదేంటీ చెట్ల మధ్య పగుళ్లు కనిపిస్తున్నాయి' అనుకుంటారు ఈ ఫొటోల్ని చూసినవారెవరైనా. దీనికి కారణం చెట్లకున్న ఓ గమ్మత్తయిన తీరు. దీన్ని 'క్రౌన్ షైనెస్' అని పిలుస్తారు.

✦ ఈ స్వభావం వల్లే చెట్లు ఒకదాన్నొకటి 'అంటను ముట్టను' అన్నట్లు భలేగా పెరుగుతాయి. గుబుర్లు గుబుర్లుగా, చెట్ల కొమ్మలన్నీ దట్టమైన ఆకులతో ఉన్నా పక్క చెట్టుకు తగలకుండా ఉంటాయి. అందుకే ఈ వృక్షాల పందిర్లపైన చివర్లో సన్నని కాలువల్లా ఖాళీ స్థలం కనిపించేస్తుంది. చూడ్డానికి ఎవరో గీసిన చిత్రలేఖనంలా గమ్మత్తుగా అనిపిస్తుంది. అందుకే ఫొటోగ్రాఫర్లు కూడా కింది నుంచి వీటి అందాల్ని కెమెరాల్లో బంధించడానికి ఆసక్తి చూపిస్తుంటారు.


✦ ఎక్కువగా మలేషియా, ఇండోనేషియా దేశాల్లోని అడవుల్లో డ్రయోబలనొప్స్, యూకలిప్టస్ వంటి కొన్ని రకాల జాతి చెట్లలో చూడొచ్చు ఈ తీరు.

✦ మొదటిసారిగా 1920లో చెట్లలోని ఈ క్రౌన్ షైనెస్ గురించి ప్రపంచానికి తెలిసింది.

✦ టచ్ మి నాట్ అన్నట్టు చెట్లలో ఈ వింతేంటో అన్న దానిపై భిన్నమైన కారణాలున్నాయి అంటూ చెబుతున్నారు పరిశోధకులు. ఒకటేమో... ఆకులు తినే ఓ రకమైన పురుగులు ఒక చెట్టు నుంచి మరో చెట్టుపైకి చేరకుండా ఉండటానికే ఈ చెట్లు ఇలా ఖాళీ స్థలాల్ని వదులుతూ పెరుగుతాయని. రెండోదేమో ఒక చెట్టు ఆకులు మరో చెట్టుకు తగలకుండా, చెట్ల కిరణజన్యసంయోగ క్రియకు అడ్డు రాకుండా ఉండటానికేనని.

✦ కారణం కచ్చితంగా తెలియకపోయినా ఈ స్వభావంతో అందర్నీ ఆకట్టుకుంటున్నాయీ చెట్లు.

బింబా & బిబ్లూ — అండమాన్‌లో సాహసాలు 2



సబ్జెక్ట్ ల్యాబ్ — సోషల్

కనుక్కోండి!


ఒకే దేశం ఉన్న ఏకైక ఖండం ఆస్ట్రేలియా మాత్రమే అని మనకు తెలుసు. ఇక్కడున్న మ్యాప్‌ను సరిగ్గా చూడండి. మన దేశం కింద శ్రీలంక ఎలా ఉంటుందో, సరిగ్గా ఆస్ట్రేలియా కింద కూడా ఓ భూభాగం ఉంది. అయితే ఇది ప్రత్యేక దేశం కాదు. ఆస్ట్రేలియాలోని ఓ రాష్ట్రం. అయితే దాని పేరేంటో చెప్పుకోండి?



పూర్తి చేస్తారా?

గడుల సాయంతో మిగతా బొమ్మని పూర్తి చేసి రంగులేయండి





మన దేశం తయారు చేసిన మొదటి ఉపగ్రహం?

స్కూల్ సవాల్

1. హరిత విప్లవ పితామహుడెవరు?
2. ఆర్య సమాజాన్ని స్థాపించిందెవరు?
3. మన దేశం తయారు చేసిన మొదటి ఉపగ్రహం?



- ఆకల శ్రీధాత్రి, తొమ్మిదో తరగతి



- ఎంఎస్‌వీఐఆర్ ఉత్తేజ్, ఏడో తరగతి, కె.వి.ఎస్, విజయనగరం

జవాబులు: **స్కూల్ సవాల్:**
1. ఎంఎస్ స్వామినాథన్
2. స్వామి దయానంద సరస్వతి
3. ఆర్యభట్ట

సబ్జెక్ట్ ల్యాబ్ - సోషల్:
టాస్మేనియా

మా చిరునామా:
హాయ్‌బుజ్జీ విభాగం,
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501512
email: hb.eenadu@gmail.com


ఆణిముత్యం

మన సుగుణం మనల్ని రాజును చేస్తే,
మన మూర్ఖత్వం మనల్ని బానిసల్ని చేస్తుంది
– ఆస్కార్ వైల్డ్

అవునా!



● హిప్పోలు మనిషికంటే వేగంగా పరిగెడతాయి.



● కప్పలు నీరు తాగవు. వాటి చర్మం నుంచే దాన్ని లోపలికి గ్రహిస్తాయి.



● అంత శరీర ఆకారంతో ఉండే ఏనుగులకు చిన్న తేనెటీగల్ని చూస్తే చెప్పలేనంత భయమట.

● కొన్ని ఉడుతలు పిల్లల్ని వదిలి పెట్టేస్తుంటాయి. అలాంటప్పుడు వేరే ఉడుత వాటి బాధ్యత తల్లి తీసుకుంటుంది.





● సాలీళ్లు ఎగరలేవు, దూకుతాయంతే.

బాలికలకు 'పది'ంతల భరోసా!

- ఇక కస్తూర్బా విద్యాలయాల్లో ఇంటర్ విద్య
- పదో తరగతి తర్వాత డ్రాప్ అవుట్స్ నిరోధానికి చర్యలు
- సౌకర్యాల కల్పనపై దృష్టిసారిస్తే మేలు

న్యూస్‌టుడే, మొయినాబాద్

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఇంటర్ విద్యను ప్రవేశపెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇక్కడ కేవలం పదో తరగతి వరకు మాత్రమే ఉండటంతో సింహభాగం విద్యార్థినులు చదువులను మధ్యలోనే నిలిపేస్తున్నారు. ఇటీవల ప్రాథమిక విద్యను అభ్యసించే వారు ఎంతమంది ఉన్నారు.. ఇంటర్ ఎంతమంది చదువుతున్నారు.. తదితర అంశాలపై ప్రభుత్వం సర్వే నిర్వహించగా విస్తుగొలిపే విషయాలు వెలుగు చూశాయి. చాలా మంది బాలికలు పదో తరగతితోనే చదువును ఆపేస్తున్నట్లు తేలింది.



పదో తరగతి చదువుతున్న విద్యార్థినులు

బాలికలకు ఉన్నత విద్యను అందించేందుకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లోనూ ఇంటర్ విద్యను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కస్తూర్బా బడుల్లోనూ ఇంటర్ విద్యను ప్రవేశపెడితే మేలు జరుగుతుందన్న కేంద్ర ప్రభుత్వ ఆలోచనకు తెలంగాణ సర్కారు సైతం పచ్చజెండా ఊపింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదన పేద విద్యార్థుల జీవితాల్లో చదువుల 'జ్యోతి'ని వెలిగించినట్లయింది.



నజీబ్‌నగర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం

కొన్నాళ్ల క్రితమే సర్కారు ఈ పాఠశాలలను ఇంటర్ వరకు పొడిగించాలని నిర్ణయించగా.. కేంద్ర సర్కారు సైతం బాలికల విద్యను సంరక్షించాలనే ఆలోచన చేయడంతో ఆరు సంవత్సరాల క్రితం ప్రతి మండలానికి ఒకటి చొప్పున కస్తూర్బా బడులను ప్రారంభించింది. ఆర్థికంగా వెనుకబడిన. . తల్లిదండ్రులు లేని, నిరుపేద విద్యార్థులు, వివిధ సమస్యల కారణంగా చదువుకు దూరంగా ఉన్న విద్యార్థినులకు ఈ బడుల్లో ప్రవేశం కల్పించారు.

ప్రస్తుతం కస్తూర్బా విద్యాలయాల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యాభ్యాసం కొనసాగుతోంది. రంగారెడ్డి జిల్లాలో ఇప్పుడు 20 కస్తూర్బా విద్యాలయాలు కొనసాగుతుండగా.. వేయి మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఈ ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థినులు పదో తరగతి పూర్తి చేసిన వెంటనే ఇక్కడే ఇంటర్మీడియెట్ విద్యను అందించనున్నారు.

వసతులు అవసరం

కస్తూర్బా బాలికల విద్యాలయాలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. కొన్ని విద్యాలయాల్లో కనీసం మరుగుదొడ్లు అందుబాటులో లేవు. కొన్ని చోట్ల మరుగుదొడ్లు ఉన్నా.. నీటి ఎద్దడి తీవ్రంగా వేధిస్తోంది. ఇక కొన్ని విద్యాలయాల చుట్టూ ప్రహరీ లేకపోవడం అవస్థలుగా మారాయి. రాత్రి సమయంలో విద్యార్థినులకు భద్రత లేకుండాపోయింది. వసతి గృహాల్లో మంచాలు లేకపోగా.. ప్రస్తుతం చలికాలం కావడంతో కనీసం దుప్పట్లను పంపిణీ చేయలేదు. తాజాగా ప్రభుత్వం కాస్మోటిక్స్ ఛార్జీల స్థానంలో రూ.300 విలువైన కిట్ అందించేందుకు నిర్ణయించింది. ఇక భోజనంలోనూ నాణ్యత కొరవడింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థినులకు భోజనం వడ్డించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. నాసిరకం కూరలను వడ్డిస్తుండటంతో కొంతమంది విద్యార్థినులు అనారోగ్యానికి గురవుతున్నారు. గదులు సరిపోక దుస్తులు ఉతికే చోటే విద్యార్థినులు స్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం దృష్టిసారించి సౌకర్యాల మెరుగుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మోడల్ స్కూళ్లలో ఇంటర్ విద్యతో పాటు వృత్తి విద్యను బోధిస్తున్నారు. తాజాగా కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లోనూ ఇదే విధానాన్ని కొనసాగించాలని నిర్ణయించడంపై విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అయ్యప్ప మాల ధరించాడని అర్ధవార్షిక పరీక్షకు నిరాకరణ

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: అయప్పమాల ధరించి అర్ధవార్షిక పరీక్షకు హాజరైన విద్యార్థిని యాజమాన్యం పరీక్షకు అనుమతించని సంఘటన చిక్కడపల్లిలో చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళ్తే.. చిక్కడపల్లి బాపూనగర్‌కు చెందిన రాజేందర్, సరిత దంపతుల కుమారుడు ధవలేష్ నాలుగో తరగతి చదువుతున్నాడు. బాలుడు అయ్యప్పమాల ధరించాడనే నెపంతో చిక్కడపల్లి సెంట్‌ఆడమ్స్ పాఠశాల యాజమాన్యం డ్రెస్‌కోడ్, షూతో మాత్రమే పాఠశాలకు రావాలని ఆంక్షలు విధించి ఇబ్బందులకు గురిచేశారు. గురువారం అర్ధవార్షిక పరీక్షలకు సైతం అనుమతించలేదు. మాల ధరించాడనే నెపంతో పరీక్షలకు అనుమతించకపోవడమేంటని అయప్పస్వాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షలకు అనుమతి ఇవ్వాలని బాలుడి తల్లిదండ్రులు, పలువురు అయ్యప్ప స్వాములు పాఠశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. తమ పాఠశాల నియమనిబంధనల ప్రకారం డ్రెస్‌కోడ్, షూతోనే పాఠశాలకు హాజరుకావాలని యాజమాన్యం స్పష్టం చేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. స్వామి మాల దుస్తులు ధరించి పాఠశాలకు వస్తే నిబంధనలకు వ్యతిరేకమంటూ సదరు పాఠశాల నిర్వాహకులు స్పష్టం చేయడంతో అయ్యప్పస్వాములు పాఠశాలలో ఆందోళనకు దిగారు. చివరికి యాజమాన్యం బాలుడిని అర్ధవార్షిక పరీక్షలకు అనుమతించింది. ఈ సందర్భంగా అయ్యప్పస్వాములు శ్రీనివాసచారి, ప్రశాంత్ మాట్లాడుతూ.. పదిరోజుల క్రితం దవలేష్ అయ్యప్ప స్వామి మాల ధరించారని తెలిపారు. ఇలా వస్తే కుదరదని పాఠశాల డ్రెస్‌కోడ్‌తో రావాలని, షూ వేసుకుని వస్తేనే పరీక్షలకు అనుమతిస్తామని ఆంక్షలు విధించడం సరికాదన్నారు. ఈ ఘటనపై చిక్కడపల్లి సీఐ భీంరెడ్డిని చరవాణిలో సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్పష్టం చేశారు. చిక్కడపల్లి సెంట్ ఆడమ్స్ పాఠశాల కార్యాలయం చరవాణికి సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.



చెట్టు నీడ.. బతుకు జాడ

ఈ చిత్రంలో కనిపిస్తున్న వీరంతా మల్లేపల్లి క్రాస్ రోడ్సు వద్ద జీవనం సాగిస్తున్నారు. వీరికి చెట్టు నీడే ఆధారం. సొంతింటికి నోచుకోలేని నిరుపేదలు కావడంతో చెట్టు కిందే ఉంటూ జీవిస్తున్నారు.

కోదండరామిరెడ్డికి వెండి కిరీటం

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: నటభూషణ శోభన్‌బాబు జయంతి సందర్భంగా శృతిలయ ఆర్ట్స్ అకాడమి-సీల్‌వెల్ కార్పొరేషన్‌ల ఆధ్వర్యంలో గురువారం రవీంద్రభారతిలో ప్రముఖ సినీ దర్శకులు కోదండరామిరెడ్డిని శోభన్‌బాబు వెండి కిరీటం, జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శాసన మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ.. అందాల నటుడు శోభన్‌బాబు నేటితరానికి ఆదర్శం అన్నారు. ముఖ్యంగా మహిళల అభిమాన హీరోగా శోభన్‌బాబుకు పేరుందన్నారు. అనంతరం అతిథులు వివిధ రంగాల్లో ఉన్న ఎ.విజయకుమార్‌ను ఇండియా ప్రైడ్ పురస్కారంతో, హరినారాయణరెడ్డికి సేవా సమ్రాట్ పురస్కారాలతో సత్కరించారు. ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, జె.బి.రాజు ఫౌండేషన్ అధ్యక్షులు డా.జె.బి.రాజు, న్యాయవాది రాజశేఖర్, శృతిలయ అధ్యక్షులు ఆర్.ఎన్.సింగ్, శోభన్‌బాబు సేవా సమితి హైదరాబాద్ కమిటీ అధ్యక్షులు టి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి బి.లాల్ బహదూర్ శాస్త్రి, ఉపాధ్యక్షులు ఆర్.పద్మారావులు మాట్లాడారు.



టైగర్ జిందా హై: ఏషియన్ లక్ష్మీకళ: మూసాపేట్, 02:45, 09:50, కార్నివల్:అమీర్‌పేట్, 10:30, 01:00, 04:30, 07:15, ఏషియన్ జిపిఆర్: కూకట్‌పల్లి, 10:20, ఏషియన్:ఉప్పల్, 01:30, 07:40, 10:30, ఏషియన్ ఎమ్ క్యూబ్ మాల్:అత్తాపూర్, 10:30, 01:35, 07:40, 10:30, ఏషియన్ రాధిక: ఈసిఐఎల్,04:30, 10:30, ఏషియన్ శాహేన్షా: చింతల్, 09:45, ఏషియన్ స్వప్న 35:కాటేదాన్, 09:00, ఏషియన్ శివ: దిల్‌సుఖ్‌నగర్, 09:15, కార్నివల్:లియోనియా, శామీర్‌పేట్, 01:00, 04:30, 07:15, బివికె విజయలక్ష్మి: ఎల్‌బి నగర్, 07:30, సినీపోలిస్: మంత్ర మాల్, అత్తాపూర్, 10:00, 11:00, 01:15, 04:30, 07:45, 11:00, సినీ టౌన్:మియాపూర్, 11:15, 02:15, 09:15, సినీపోలిస్: సిసిపిఎల్ మాల్, 01:25, 07:00, 10:20, సినీప్లానెట్ :కొంపల్లి, 10:35, 04:25, 10:20, సినీపోలిస్:మంజీర మాల్, కూకట్‌పల్లి, 01:30, 07:15, 10:30, పివిఆర్:ఇనార్బిట్, 10:30, 01:15, 04:45, 07:25, 11:00, పివిఆర్:ఆర్‌కె, 10:05, 04:00, 11:05, ఐనాక్స్:జివికె వన్, బంజారాహిల్స్, 11:10, 01:10, 01:55, 04:00, 07:30, 10:00, ఐనాక్స్:మహేశ్వరి పరమేశ్వరి మాల్, కాచిగూడ, 10:10, 11:35, 12:55, 04:30, 07:15, 09:40, 10:00, మీరజ్: శాలిని శివానీ, 10:00, 04:45, 07:30, 11:00, ముక్త ఎ2 సినిమాస్:అబిడ్స్, 11:15, 02:30, 06:00, 09:15, ప్రసాద్స్:10:30, 01:35, 04:40, 07:45, 10:50, ప్రసాద్స్:లార్జ్ స్క్రీన్, 05:10, 08:15, ప్రియా:మల్లేపల్లి, 06:30, 09:30, పివిఆర్: పంజాగుట్ట, 11:00, 01:10, 07:35, 10:10, పివిఆర్ ఫోరమ్ సుజన మాల్: కూకట్‌పల్లి, 10:05, 11:15, 02:20, 04:45, 07:05, 10:30, టివోలి:02:00, 10:40, టివోలి : 04:30, 07:00.

అమెజాన్ ఓబిజాన్: మీరజ్:శాలిని శివానీ, 04:15, పివిఆర్:పంజాగుట్ట, 04:35, ఏషియన్ ఎమ్ క్యూబ్ మాల్:అత్తాపూర్, 10:25, సినీపోలిస్:మంత్ర మాల్, అత్తాపూర్, 02:05, ఏషియన్ రాధిక: ఈసిఐఎల్, 01:40, పివిఆర్ ఫోరమ్ సుజన మాల్: కూకట్‌పల్లి, 10:40, సినీ టౌన్:మియాపూర్, 02:30, సంతోష్:అబిడ్స్, 11:30, 02:30, 06:00, 09:15, సెన్సేషన్ ఇన్సోమ్నియ: ఖైరతాబాద్ 12:00, 03:00, 07:00, 10:00, శ్రీ సాయి రాజా:ముషీరాబాద్, 06:00, 09:00, మెట్రో:బహదూర్‌పుర, 11:30, 02:30, 06:00, 09:00, టివోలి: 11:00.

జ్యూమంజి: వెల్కమ్ టూ ది జంగల్ (3డీ): రామకృష్ణ 70 - ఇంద్ర సినిమాస్:అబిడ్స్, 11:30, 02:30, 06:00, 09:15.

హసీనా: ప్రియా:మల్లేపల్లి, 12:00, 03:00, శ్రీ సాయి రాజా:ముషీరాబాద్ 11:30, 02:30, యాదగిరి :సంతోష్ నగర్, 11:30, 02:30, 06:00, 09:00.

ఇంగ్లీష్

ఇన్సిడీయస్: ది లాస్ట్ కీ: ఏషియన్ లక్ష్మీకళ:మూసాపేట్, 11:30, 06:30, కార్నివల్:అమీర్‌పేట్, 12:20, 02:30, 10:40, ఏషియన్ జిపిఆర్: కూకట్‌పల్లి, 01:45, 07:40, ఏషియన్ సినీస్క్వేర్:ఉప్పల్, 10:45, 01:45, 07:40, ఏషియన్ ఎమ్ క్యూబ్ మాల్:అత్తాపూర్, 11:00, 04:50, 10:10, ఏషియన్ రాధిక: ఈసిఐఎల్,04:40, 10:15, బివికె మల్టీప్లెక్స్ విజయలక్ష్మి:ఎల్‌బి నగర్, 11:00, 07:45, సినీపోలిస్:మంత్ర మాల్, అత్తాపూర్, 11:25, 02:50, 05:10, 10:50, సినీ టౌన్:మియాపూర్ 11:30, 06:30, సినీపోలిస్:సిసిపిఎల్ మాల్, 11:50, 02:20, 04:40, 10:50, సినీప్లానెట్ :కొంపల్లి, 10:50, 04:35, 07:50, సినీపోలిస్:మంజీర మాల్, కూకట్‌పల్లి, 11:20, 02:15, 04:50, 10:50, పివిఆర్:ఇనార్బిట్, 10:50, 05:00, 10:10, పివిఆర్:ఆర్‌కె, 01:30, 10:55, ఐనాక్స్:జివికె వన్, బంజారాహిల్స్, 11:35, 02:15, 08:10, 11:00, ఐనాక్స్:మహేశ్వరి పరమేశ్వరి మాల్, కాచిగూడ, 10:40, 02:50, 07:25, 10:30, మీరజ్:శాలిని శివానీ, 11:15, 05:00, 10:00, ప్రసాద్స్:10:45, 03:45, 05:55, ప్రసాద్స్:లార్జ్ స్క్రీన్, 12:30, 11:15, పివిఆర్: పంజాగుట్ట, 10:40, 05:30, 08:00, పివిఆర్ ఫోరమ్ సుజన మాల్:కూకట్‌పల్లి, 11:50, 05:50, 08:20, 11:00, తారకరామా:కాచిగూడ 11:15, 02:15, 06:00, 09:00, టివోలి :ఎక్స్‌ట్రీమ్ 11:45, 05:15, టివోలి:10:15.

జ్యూమంజి: వెల్కమ్ టూ ది జంగల్ - 3డి: కార్నివల్:అమీర్‌పేట్, 12:00, 05:00, 07:40, 10:20, కార్నివల్:లియోనియా, శామీర్‌పేట్, 12:00, 05:15, బివికె విజయలక్ష్మి:ఎల్‌బి నగర్, 01:00, 10:00, సినీపోలిస్:మంత్ర మాల్, అత్తాపూర్, 11:30, 02:00, 05:05, 10:00, సినీపోలిస్: సిసిపిఎల్ మాల్, 11:10, 01:45, 04:35, 10:10, సినీపోలిస్:మంజీర మాల్, కూకట్‌పల్లి, 11:30, 02:10, 05:00, 10:10, పివిఆర్:ఇనార్బిట్, 11:10, 01:50, 04:55, 07:50, 10:30, పివిఆర్:ఆర్‌కె, 10:30, 04:25, 07:50, ఐనాక్స్:జివికె వన్, బంజారాహిల్స్, 10:40, 01:20, 04:50, 07:20, 10:50, ఐనాక్స్:మహేశ్వరి పరమేశ్వరి మాల్, కాచిగూడ, 11:20, 01:55, 07:45, 10:20, మీరజ్:శాలిని శివానీ, 11:00, 01:45, 07:15, 10:45, ప్రసాద్స్: 06:35, 11:05, ప్రసాద్స్:లార్జ్ స్క్రీన్, 10:00, 02:40, పివిఆర్:పంజాగుట్ట, 11:05, 01:45, 07:30, 11:00, పివిఆర్ ఫోరమ్ సుజన మాల్:కూకట్‌పల్లి, 11:15, 02:00, 02:40, 05:20, 08:00, 10:40, టివోలి : 11:30, 02:00, 07:45.

పిచ్ పర్ఫెక్ట్ 3: కార్నివల్:అమీర్‌పేట్, 05:30, ఏషియన్ సినీస్క్వేర్:ఉప్పల్, 10:55, 04:40, 10:30, ఏషియన్ ఎమ్ క్యూబ్ మాల్:అత్తాపూర్, 01:50, 07:30, కార్నివల్:లియోనియా, శామీర్‌పేట్, 07:50, సినీపోలిస్:మంత్ర మాల్, అత్తాపూర్, 12:00, 08:10, సినీ టౌన్:మియాపూర్, 02:45, 09:30, సినీపోలిస్:సిసిపిఎల్ మాల్, 12:05, 05:20, సినీప్లానెట్:కొంపల్లి, 01:45, 10:30, సినీపోలిస్:మంజీర మాల్, కూకట్‌పల్లి, 12:00, 04:50, పివిఆర్:ఇనార్బిట్, 01:55, 08:05, పివిఆర్:ఆర్‌కె, 04:40, ఐనాక్స్:జివికె వన్, బంజారాహిల్స్, 02:30, 08:30, ఐనాక్స్:మహేశ్వరి పరమేశ్వరి మాల్, కాచిగూడ, 11:05, 08:00, ప్రసాద్స్: 06:30, 09:00, పివిఆర్:పంజాగుట్ట, 02:30, 08:15, పివిఆర్ ఫోరమ్ సుజన మాల్: కూకట్‌పల్లి, 12:25, 02:00, 08:30, టివోలి: 01:50.

ఆల్ ది మనీ ఇన్ ది వరల్డ్: సినీపోలిస్:మంత్ర మాల్, అత్తాపూర్, 04:30, 10:20, సినీపోలిస్:మంజీర మాల్, కూకట్‌పల్లి, 04:40, 10:30, పివిఆర్:ఇనార్బిట్, 02:35, 07:10, 10:20, ఐనాక్స్:జివికె వన్, బంజారాహిల్స్, 10:20, 04:25, 10:40, పివిఆర్ ఫోరమ్ సుజన మాల్:కూకట్‌పల్లి, 11:10, 02:10, 07:40, 10:40.

కోకో - 3డి: ప్రసాద్స్: 04:00, పివిఆర్:ఇనార్బిట్, 02:10, పివిఆర్ ఫోరమ్ సుజన మాల్:కూకట్‌పల్లి, 05:05.

ఫెర్డినాండ్ - 3డి: పివిఆర్ ఫోరమ్ సుజన మాల్:కూకట్‌పల్లి, 02:40.

వాండర్: ఐనాక్స్: జివికె వన్, బంజారాహిల్స్, 02:40, పివిఆర్:ఇనార్బిట్, 04:40, పివిఆర్ ఫోరమ్ సుజన మాల్:కూకట్‌పల్లి, 05:10.

స్టార్ వార్స్:ది లాస్ట్ జేడీ - 3డి: ప్రసాద్స్: 01:00, ఐనాక్స్:జివికె వన్, బంజారాహిల్స్, 05:20, పివిఆర్ ఫోరమ్ సుజన మాల్:కూకట్‌పల్లి, 10:50.



మళ్లీ మొదటికి!

ముందుకుసాగని 'కేశవాపూర్' ● వడ్డీ రేటుపై ఎటూ తేలని వ్యవహారం

ఈనాడు, హైదరాబాద్

ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కేశవాపూర్ స్టోరేజీ రిజర్వాయర్ నిర్మాణం మళ్లీ మొదటికొచ్చినట్లైంది. టెండర్లు పిలిచి, గడువు దాటినా సరే ప్రక్రియ ముందుకు సాగక పోవడంతో తాజాగా ఈ వ్యవహారాన్ని జలమండలి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది.

మొత్తం ఈ ప్రాజెక్టు కోసం దాదాపు రూ. 4,396 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు డీపీఆర్‌లో పేర్కొన్న సంగతి తెలిసిందే. పూర్తిగా హైబ్రిడ్ యాన్యుటీ ఆధారంగా పనులు చేపట్టాలని నిర్ణయించి, టెండర్లు పిలిచారు. దీని ప్రకారం వ్యయంలో 20 శాతం ప్రభుత్వం బడ్జెట్ కింద చెల్లిస్తుంది. మిగతా వ్యయం మొత్తం పనులు దక్కించుకున్న గుత్తేదారు సంస్థ భరిస్తుంది. నిర్మాణ కాలం అనంతరం ఈ మొత్తం వ్యయాన్ని వడ్డీతో కలిపి జలమండలి వాయిదాల పద్ధతిలో గుత్తేదారు సంస్థకు చెల్లించాలి. వడ్డీ రేటు విషయంలో జలమండలికి గుత్తేదారు సంస్థలకు మధ్య వ్యవహారం ఎటూ తేలడం లేదని సమాచారం. మొత్తం వ్యయంపై 9 శాతం వడ్డీ చెల్లించేందుకు జలమండలి ముందుకు వచ్చింది. గుత్తేదారు సంస్థలు 13 శాతం పైనే కోరుతున్నట్లు తెలుస్తోంది. ప్రాజెక్టు వ్యయంపై 5 శాతానికి మించి ఎక్కువ రేటుకు కోట్ చేయడానికి నిబంధనలు వర్తించవు. ఈ ప్రాజెక్టు విషయంలో నిబంధనలు ఎత్తి వేయాలని కోరుతున్నట్లు చెబుతున్నారు. ఇవన్నీ గొంతెమ్మ కోర్కెలుగా ఉండటంతో అధికారులు ఎటూ తేల్చుకోలేక ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. సర్కారు నుంచి స్పష్టమైన సూచనలు వచ్చాకే ప్రాజెక్టుపై ముందుకు వెళ్లాలని భావిస్తున్నారు.

తాజాగా ప్రభుత్వానికి లేఖ రాసిన జలమండలి

జలమండలిపై పెనుభారం... గుత్తేదారు సంస్థల ఒత్తిడికి తలొగ్గితే జలమండలి పుట్టి మునిగినట్టేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే అవుటర్ రింగ్ రోడ్డు గ్రామాల తాగునీటి ప్రాజెక్టును యాన్యుటీ పద్ధతిలో చేపడుతున్నారు. దాదాపు రూ.650 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇటీవలే మరో 10 శాతం వరకు ప్రాజెక్టు వ్యయాన్ని పెంచడంతో బోర్డుపై మరో రూ. 65 కోట్లు వరకు అదనపు భారం పడింది. ఏటికేడాదీ పెరుగుతున్న గ్రేటర్ నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుంటే ఒక స్టోరేజీ రిజర్వాయర్ అవసరం. గోదావరి బేసిన్‌లో దీనిని చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. భారీగా నిధులు వ్యయం కానుండటంతో యాన్యుటీ పద్ధతిని జలమండలి ఎంచుకుంది. ప్రస్తుతం 9 శాతం కాకుండా గుత్తేదారు సంస్థలు కోరినట్లు వడ్డీ రేట్లు పెంచుతూ పోతే భవిష్యత్తులో జలమండలిపై ఆర్థికంగా పెనుభారం పడనుందని అంటున్నారు. తీరా ప్రాజెక్టు పూర్తి అయి... వడ్డీ, చెల్లింపులు పెరిగిన వ్యయాలు తీసుకుంటే మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.8 వేల కోట్ల వరకు అయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జలమండలి ఆదాయం, వ్యయానికి పొంతన కుదరడం లేదు. సరాసరి రూ.100 కోట్లు వరకు ఆదాయం వస్తుంటే... అందులో రూ.82 కోట్లు విద్యుత్తు బిల్లులకు వెచ్చించాల్సిన పరిస్థితి. ఇందులో రూ.40 కోట్లు వరకు చెల్లించి మిగతా బకాయి పెడుతున్నారు. ఇలా ఇప్పటికే విద్యుత్తు బిల్లుల బకాయిలు రూ.200 కోట్లు దాటాయి. గోదావరి, కృష్ణా, మల్కాజిగిరి, శివార్ల మున్సిపాలిటీ విస్తరణ పనులు, అవుటర్ రింగ్ రోడ్డు గ్రామాల యాన్యుటీ ప్రాజెక్టుల అప్పులు సరేసరి. దీంతో ప్రతి పైసా చాలా ప్రణాళికబద్ధంగా వెచ్చించాల్సిన అవసరం ఉంది. ఈ దశలో కేశవాపూర్ వ్యయంతో ఒక అడుగు ముందుకు రెండు అడుగుల వెనక్కి అన్న చందంగా మారింది. ఈ విషయంలో ప్రభుత్వమే చొరవ తీసుకుని పరిష్కార మార్గం చూపిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



బూట్లు లేక... అగచాట్లు!

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు పుస్తకాలు, ఏకరూప దుస్తులు, బూట్లను ఉచితంగా ఇస్తారు. బేగంపేట ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు బూట్లు ఇవ్వలేదు. వారు ఒట్టి కాళ్లతోనే బడికి వస్తూ చదువులు సాగిస్తున్నారు.

దివ్యాంగులకు దివ్యధామం

మలక్‌పేటలో జాతీయ ఉద్యానవనం ● నేడు మంత్రి కేటీఆర్ చేతులమీదుగా ప్రారంభం

అక్బర్‌బాగ్, న్యూస్‌టుడే; ఈనాడు డిజిటల్: దివ్యాంగులకు చికిత్స, చేయూత, మానసికోల్లాసం.. ఇలా అన్నీ ఒకే చోట అందితే ఎలా ఉంటుంది? ఇదే ఆలోచనతో మలక్‌పేట లూయి బ్రెయిలీ పైవంతెన సమీపంలో ఏర్పాటుచేసిందే జాతీయ దివ్యాంగుల ఉద్యానవనం.. సువిశాల ప్రాంగణంలో పచ్చిక బయళ్ల నడుమ అధునాతన హంగులతో దీనిని ఏర్పాటుచేశారు. ఇటువంటిది దేశంలోనే ప్రథమమని చెబుతున్నారు. దాదాపు రూ.2.13కోట్ల వ్యయంతో సుదీర్ఘకాలం పాటు దీని పనులు జరిగాయి. జీహెచ్ఎంసీ అధికారులు శుక్రవారం పార్కు ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు.



మంత్రి ప్రారంభించనున్న సెన్సరీ బ్లాక్

స్థలానికి మారుగా.. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రహదారుల అభివృద్ధిలో భాగంగా 2010లో ప్రభుత్వం మలక్‌పేట నల్గొండ చౌరస్తా వద్ద పైవంతెన నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇక్కడే ఉన్న రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమశాఖకు చెందిన కొంత స్థలాన్ని అప్పట్లో జీహెచ్ఎంసీ సేకరించింది. బహుళ ప్రయోజనాల ఉద్యానవనం నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చింది. వంతెన పూర్తయ్యాక 1.3 ఎకరాల స్థలంలో పనులు ప్రారంభించింది. ఇటీవల అవి పూర్తయ్యాయి. ఉద్యానవనంలో పచ్చిక బయళ్లు, నర్సరీ, దివ్యాంగుల కోసం కౌన్సెలింగ్ కేంద్రం, యాంపీ థియేటర్, థెరపీ బ్లాక్, ఆర్థో బ్లాక్, సెన్సరీ బ్లాక్ వంటి సౌకర్యాలు ఉంటాయి. ఆరోగ్య సమస్యలున్న వారికి సెన్సరీ బ్లాక్ ఉపయుక్తం. దివ్యాంగులకు దిశానిర్దేశం చేసే సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహిస్తారు. వారి నైపుణ్యాలను వెలికితీసేలా సాంస్కృతిక కార్యక్రమాలు, వేడుకలూ నిర్వహిస్తారు. అనుకూలమైన సీటింగ్ సౌకర్యం, ర్యాంపు ఏర్పాటుచేశారు. స్పీచ్ థెరపీ, బుద్ధిమాంద్యులకు ప్రత్యేక శిక్షణ ఉంటాయి. యశోదా ఆసుపత్రి, మలక్‌పేట్ రేస్ కోర్టు, ఎల్ అండ్ టీ సహకారంతో పార్కులో సీసీ కెమెరాలను అమర్చనున్నారు.



నగరంలో గురువారం జరిగిన 'నీతో ఏదో చెప్పాలని ఉంది' వీడియో పాట ఆవిష్కరణ కార్యక్రమంలో అనుదీప్, ఆర్.పి. పట్నాయక్, సత్య యామిని, కోటి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వరవరరావు, ప్రొ.హరగోపాల్, లక్ష్మణ్

వరంగల్ ప్రకటనకు 20 ఏళ్లు

21న హన్మకొండలో బహిరంగ సభ

సోమాజిగూడ: తెలంగాణ ఉద్యమానికి బీజం పడిన వరంగల్ డిక్లరేషన్ మూవ్‌మెంట్ జరిగి 20 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని 21న హన్మకొండ ఆర్ట్స్ కళాశాల మైదానంలో బహిరంగ సభ, భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) వెల్లడించింది. ప్రభుత్వం నిర్బంధాల పేరుతో అడ్డుకోవద్దని ప్రొఫెసర్ హరగోపాల్ విజ్ఞప్తి చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో విరసం నేత వరవరరావు, టీపీఎఫ్ అధ్యక్షులు నలమాస కృష్ణ, పౌర హక్కుల సంఘం అధ్యక్షులు ప్రొ. లక్ష్మణ్‌లతో కలిసి ఆయన సభ గోడపత్రికను, కరపత్రాన్ని ఆవిష్కరించారు.

25 శ్మశాన వాటికల అభివృద్ధి లక్ష్యం: మేయర్

బంజారాహిల్స్, ఫిలింనగర్: ఈ ఏడాదిలో 25 శ్మశాన వాటికలను అభివృద్ధి పరచడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు నగర మేయర్ బొంతు రామ్మోహన్ వెల్లడించారు. బంజారాహిల్స్‌లోని పంజాగుట్ట హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులను గురువారం మేయర్ తనిఖీ చేశారు. మహాప్రస్థానం నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట డీఎంసీ సత్యనారాయణ, కార్పొరేటర్ మన్నె కవితా రెడ్డి, మహాప్రస్థాన నిర్మాణంలో భాగం పంచుకుంటున్న ఫీనిక్స్ సంస్థ ఛైర్మన్ సురేష్ చుక్కపల్లి ఉన్నారు. తొలుత పంజాగుట్ట ధోబీఘాట్ ప్రాంతాన్ని సందర్శించి స్థానికులతో మాట్లాడారు. ధోబీఘాట్ నుంచి జలగం వెంగళరావు ఉద్యానం వైపు ఐదడుగుల దారిని పాదచారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ రమేష్, ఈఈ చిన్నారెడ్డి సహా పలువురు తెరాస నేతలు పాల్గొన్నారు.



ధోబీఘాట్‌ను పరిశీలిస్తున్న మేయర్ రామ్మోహన్

మందుబాబులను పట్టించిన మేయర్: బహిరంగంగా మద్యం తాగుతూ కనిపించిన ఇద్దరు యువకులను మేయర్ బొంతు రామ్మోహన్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బంజారాహిల్స్ ఠాణా పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పంజాగుట్ట హిందూ శ్మశానవాటికను గురువారం నగర మేయర్ బొంతు రామ్మోహన్, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ ప్రదేశంలో మందుబాబుల బెడద అధికంగా ఉందని, అసాంఘిక శక్తులు తమను బెదిరిస్తున్నాయని అధికారులు మేయర్‌తో మొరపెట్టుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కొద్ది నిమిషాలకే మేయర్ శ్మశానవాటికలో తిరుగుతూ తనిఖీ చేస్తుండగా దేవరకొండబస్తీకి చెందిన రిషి, వినయ్ అనే యువకులు అక్కడే మద్యం తాగుతూ కన్పించారు. వారిని మేయర్ పట్టుకుని బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు. పట్టుబడ్డ యువకులు వార్డు సభ్యురాలు జయలక్ష్మికి దగ్గరి వాళ్లుగా గుర్తించామని పోలీసులు తెలిపారు. వీరిద్దర్ని కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై పీడీ నాయుడు తెలిపారు.

అంబర్‌పేట

గోల్నాకలో కూరగాయల ధరలు

తిలక్‌నగర్, న్యూస్‌టుడే: (గురువారం నాటివి.. కిలో రూపాయలలో) టమాట-7, ఆలుగడ్డ-15, వంకాయ-30, క్యాబేజీ-30, బెండకాయ-35, దొండకాయ-25, కాకరకాయ-40, బీన్స్-35, దోసకాయ-25, సొరకాయ-15, బీరకాయ-35, క్యాప్సికం-30, చామగడ్డ-35, క్యారెట్-40, పచ్చిమిర్చి-30, ఉల్లిగడ్డ-35, వెల్లులి-50, అల్లం-40.

సమస్యల వలయంలో..

★ కాలిబాటల నిర్వహణ శూన్యం

★ తక్కువ ఎత్తు ప్రహరీతో ఇబ్బందులు

నల్లకుంట, న్యూస్‌టుడే:

డివిజన్ పరిధిలో వివిధ సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఆయా సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేసినా వాటిని పట్టించుకునే వారు కరవయ్యారు. ఏళ్లు గడుస్తున్నా అవి పరిష్కారమవడం లేవు. దీంతో స్థానికులకు ఇక్కట్లు తప్పడం లేదు. ప్రజాప్రతినిధుల పాదయాత్రల్లో అధికారులకు సమస్య తీవ్రతపై స్పష్టంగా వివరించినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని డివిజన్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా ఫుట్‌పాత్‌లు..

డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌ల నిర్వహణ అధ్వాన్నంగా మారింది. శంకరమఠం కూరగాయల మార్కెట్ సిగ్నల్, నల్లకుంట బస్టాపు, డెల్టా కళాశాల, భారత్ కళాశాల, ఫీవరాసుపత్రి చౌరస్తాల వద్ద ఫుట్‌పాత్‌ల పరిస్థితి దారుణంగా తయారైంది. ఏడాదిన్నర క్రితం ఓ ప్రైవేటు సంస్థ ఫుట్‌పాత్ టైల్స్ తొలగించి పనులు పూర్తి చేసుకొంది. కొత్తగా ఫుట్‌పాత్ పనులు చేపట్టాల్సిన జీహెచ్ఎంసీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

దీంతో ఆయా ప్రాంతాల్లో టైల్స్ పక్కకు జరగడం, రాళ్లు బయటపడటంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల అపరిశుభ్రత తాండవిస్తోంది.



మొరంక్వారీ లేన్‌లో ప్రహరీ నుంచి జారుతున్న మట్టి, చెత్త



నల్లకుంట మెయిన్ రోడ్డులో కాలిబాట

రెండు నెలల క్రితమే ఫుట్‌పాత్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని స్థానిక అధికారులు చెబుతున్నా ఇప్పటి వరకు ఎటువంటి నిధులు మంజూరు కాలేదు.

మట్టి జారుతోంది..

తిలక్‌నగర్ బ్రిడ్జి నుంచి మొరం క్వారీ మీదుగా న్యూనల్లకుంట వెళ్లే దారిలో రైల్వేట్రాక్ ప్రహరీ ఎత్తు తక్కువగా ఉండటంతో పైనుంచి మట్టికుప్పలు, చెత్తా చెదారం రహదారి మీదకు జారుతోంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు కల్గుతున్నాయి. కొన్ని చోట్ల ప్రహరీ లేకపోవడంతో రెండేళ్ల క్రితం కొంత వరకు ప్రహరీ నిర్మించారు. మిగతా పనులు పూర్తి చేయలేదు. రైల్వే, జీహెచ్ఎంసీ అధికారులు సమస్య పరిష్కరిస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా ఇప్పటి ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

తులసీనగర్ లంకలో తాగునీటి ఏటీఎం



తాగునీటి ఏటీఎంను ప్రారంభించిన కార్పొరేటర్

గోల్నాక, న్యూస్‌టుడే: జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ప్రజలకు తక్కువ ధరలో స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నట్లు గోల్నాక కార్పొరేటర్ కాలేరు పద్మ తెలిపారు. గురువారం తులసీనగర్ లంకలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీటి ఏటీఎంను ఆమె ప్రారంభించారు. ఒక రూపాయికి గ్లాసు, రూ.2కు లీటరు, రూ.5కు 10 లీటర్లు, రూ.10కు 20 లీటర్ల శుద్ధి చేసిన తాగునీటిని అందిస్తున్నామన్నారు. డివిజన్‌లోని ఐదు ప్రాంతాల్లో తాగునీటి ఏటీఎంలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. వాటర్ ఏటీఎం ప్రతినిధులు జయరాజ్‌రెడ్డి, మనోహర్, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ కాలేరు వెంకటేశ్, వార్డు సభ్యులు భరత్‌రాజ్, నరేశ్, నేతలు ఆర్‌కే బాబు, లింగంగౌడ్, బుచ్చిరెడ్డి, రాము, రామకృష్ణ, ఆశన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



సమావేశంలో బల్దియా ఉప కమిషనర్ బాలయ్య

గోల్నాక, న్యూస్‌టుడే: మున్సిపల్ అధికారులు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలని జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్-16 ఉప కమిషనర్ బాలయ్య పిలుపునిచ్చారు. గురువారం నెహ్రూనగర్ కార్యాలయంలో గోల్నాక డివిజన్ వార్డు కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రహదారుల నిర్మాణం, అసంపూర్తిగా ఉన్న సామాజిక భవనాలు, రాత్రిపూట వెలగని వీధి దీపాలు తదితర సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. వార్డు సభ్యులు శ్రీనివాస్‌ముదిరాజ్, భరత్‌రాజ్, నరేశ్, జనార్ధన్, ఉమాదేవి, ధనలక్ష్మి, రాజ్యలక్ష్మి, పల్లవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.19 లక్షలతో సామాజిక భవనం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి

నల్లకుంట, న్యూస్‌టుడే: డివిజన్ పరిధిలోని గాంధీనగర్(లంక) బస్తీలో రూ.19 లక్షలతో కొత్తగా చేపట్టనున్న సామాజిక భవనం నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ గరిగంటి శ్రీదేవి ప్రారంభించారు. స్థానిక తెరాస నాయకులు రమేష్, శ్యామ్, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణపై చిన్నారులకు అవగాహన

బర్కత్‌పుర, న్యూస్‌టుడే: తడి, పొడి చెత్తపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు విశేషంగా కృషి చేస్తున్నట్లు కాచిగూడ డివిజన్ కార్పొరేటర్ ఎక్కాల చైతన్య తెలిపారు. గురువారం డివిజన్ పరిధిలోని బర్కత్‌పుర, కాచిగూడలోని వివిధ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు తడి, పొడి చెత్త వేరు చేయడంతో కలిగే లాభాలను వివరించారు. అనంతరం మాట్లాడుతూ కార్టూన్ల ద్వారా పిల్లలు తొందరగా ఆకట్టుకొవచ్చునే అభిప్రాయంతో పాఠశాలల గోడలపై ఆకర్షణీయ సూచికలు ఏర్పాటు చేశామని తెలిపారు. సర్కిల్ సహాయ వైద్యాధికారి హేమలత, కాచిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ సుమన్‌నాయక్, తెరాస నేతలు ఎక్కాల కన్నా, శేషు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో కార్పొరేటర్ ఎక్కాల చైతన్య

తడిచెత్తతో సేంద్రియ ఎరువు తయారీ



వర్మీ కంపోస్ట్ తయారీ గుంతను ప్రారంభిస్తున్న ఏఎంఓహెచ్

గోల్నాక, న్యూస్‌టుడే: తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయవచ్చని జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్-16 ఏఎంఓహెచ్ డాక్టర్ హేమలత తెలిపారు. గురువారం కృష్ణానగర్‌లో తడి చెత్త వర్మీకంపోస్ట్ తయారీ గుంతను కార్పొరేటర్ కాలేరు పద్మతో కలిసి ప్రారంభించారు. ప్రజలు తమ ఇళ్లలోని తడి, పొడి చెత్తను వేర్వేరుగా జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బందికి ఇవ్వాలని కోరారు. జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ కాలేరు వెంకటేశ్, నేతలు ఆర్‌కేబాబు, రాము, రామకృష్ణ, రాజు, బుచ్చిరెడ్డి, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన కార్పొరేటర్



మేయర్ రామ్మోహన్‌కు వినతి పత్రం అందజేస్తున్న పులిజగన్

గోల్నాక, న్యూస్‌టుడే: డివిజన్ పరిధిలో పెండింగులో ఉన్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అంబర్‌పేట కార్పొరేటర్ పులిజగన్ కోరారు. గురువారం ఆయన జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని, ఆయా ప్రాంతాల్లో పాడైన రహదారుల స్థానంలో రోడ్ల నిర్మాణానికి ఆదేశాలను జారీ చేయాలని కోరారు.

త్యాగరాజస్వామి 171వ ఆరాధనోత్సవాలు

విద్యానగర్, న్యూస్‌టుడే: త్యాగరాజస్వామి 171వ ఆరాధనోత్సవాలు, శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం 62వ వార్షికోత్సవాలను అంబర్‌పేట డివిజన్ శివం రోడ్డులోని శ్రీ షిర్డి సాయి బాబా సంస్థాన్‌లో శనివారం సాయంత్రం నిర్వహిస్తున్నట్టు విద్యాలయ ప్రిన్సిపల్ పోపూరి శ్రీనివాస శర్మ గురువారం తెలిపారు. సంస్థాన్ ఆధ్యాత్మిక కేంద్రంలో నిర్వహించే ఈ ఉత్సవాలకు ప్రముఖ టి.వి దర్శక,నిర్మాత శోభాశంకర్ ముఖ్య అతిథిగా వస్తారని, ప్రముఖులు డాక్టర్ బోనాల ప్రకాష్, వివిఎల్ ఎన్.శర్మ, మల్లాది శాంతామూర్తి పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు. పలువురు యువ సంగీత కళాకారులు త్యాగరాజ స్వామి కీర్తలను ఆలపిస్తారని తెలిపారు. ప్రతిభ కనపర్చిన వారికి ప్రోత్సాహక బహుమతుల ప్రదానం చేస్తామన్నారు.

'దుర్గాబాయి సేవలు చిరస్మరణీయం'



విగ్రహ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

విద్యానగర్, న్యూస్‌టుడే : సమాజహితం కోరి ప్రముఖ సంఘసేవకురాలు దుర్గాబాయి దేశ్‌ముఖ్ చేసిన సేవలను రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక శాసనసభ్యుడు జి.కిషన్‌రెడ్డి కోరారు. బాగ్ అంబర్‌పేట డివిజన్ డీడీ కాలనీ జలమండలి కార్యాలయం చౌరస్తాలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ విగ్రహ నిర్మాణపనులను గురువారం ఆయన డివిజన్ కార్పొరేటర్ కె.పద్మావతితో కలసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దుర్గాబాయి బడుగు, బలహీన, పేద వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయురాలని కొనియాడారు. కార్పొరేటర్ కె.పద్మావతి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు సేవాభావంతో సమాజ అభివృద్ధికి తమ వంతు సేవలు అందించాలని పిలుపునిచ్చారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సలహాదారులు జీవీ.నారాయణ రాజు, తుమ్మల ఇంద్రారెడ్డి, అధ్యక్షుడు లక్ష్మికాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతం రావు, సంయక్త కార్యదర్శి పి.గోవర్ధన్ రెడ్డి, భాజపా డివిజన్ అధ్యక్షుడు చుక్క జగన్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు 8న

కవాడిగూడ: స్వామి వివేకానంద 156వ జన్మతిథి పురస్కరించుకుని ఈ నెల 8న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి జ్ఞానదానంద తెలిపారు. ధ్యానం, సుప్రభాతం, మంగళహారతి, భజన, రామకృష్ణ పరమహంస దేవాలయం ప్రదక్షిణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. స్వామి వివేకానంద జీవితం, సందేశం అంశంపైన ప్రసంగం ఉంటుందన్నారు.



అంబర్‌పేట మండల కార్యాలయం వద్ద గురువారం అయ్యప్ప స్వామి పడి పూజ ఘనంగా నిర్వహించారు. స్వాములు శ్రీనివాస్, రాజు, వరుణ్, శ్రీధర్, రమేశ్ బృందం ఆలపించిన అయ్యప్పస్వామి భక్తి గీతాలు అలరించాయి. అనంతరం స్వాములు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

- న్యూస్‌టుడే, గోల్నాక.

అంబర్‌పేట

'ఉచిత క్రైస్తవ వివాహ వేదికను సద్వినియోగం చేసుకోవాలి'

బాగ్‌లింగంపల్లి: క్రైస్తవ యువతీయువకుల వివాహ పరిచయ వేదిక ఈనెల 6న సికింద్రాబాద్‌లోని వైఎంసీఏ ఎగ్జిబిషన్ హాలులో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సీఈఓ అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. క్రైస్తవ యువతీ, యువకులు వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. తమ సంస్థకు చెందిన వెబ్‌సైట్‌లో పొందుపరిచిన ప్రకారం ఈవెంట్ ఎట్ ఇండియా క్రిస్టియన్ మ్యాట్రిమోనిడాట్‌కామ్‌కు పంపించాలని సూచించారు.

స్వచ్ఛసర్వేక్షణ్‌కు సంస్థల ఊతం

- ★ కాచిగూడలో ప్రయోగాత్మకంగా రెండుబుట్టల ఏర్పాటు
- ★ ఆర్థిక సహాయం అందించిన పలు వ్యాపార సంస్థలు
- ★ విజయవంతమైతే నగరంలో మరిన్నిచోట్ల..


ఏర్పాటుకు సిద్ధంగా రెండుబుట్టలు

కాచిగూడ, న్యూస్‌టుడే:

జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్-16 లో స్వచ్ఛ సర్వేక్షణ్ విజయవంతం చేయడానికి వాణిజ్య, వ్యాపార సంస్థలు తమ వంతు తోడ్పాటును అందిస్తున్నాయి. రహదారులను పరిశుభ్రంగా ఉంచడానికి జీహెచ్ఎంసీ నగరమంతటా రెండుబుట్టలు ఏర్పాటు చేయనుంది. అందుకు కోట్లాది రూపాయల వ్యయం కాగలదని అంచనా వేసిన జీహెచ్ఎంసీ అధికారులు వ్యాపార, వాణిజ్య సంస్థల సహకారం తీసుకుంటున్నారు. మొదటగా కాచిగూడలో ప్రయోగాత్మకంగా రెండుబుట్టల ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి అంబర్‌పేట సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య విభాగం అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

త్వరలో కేంద్ర బృందం

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ 2016 జనవరిలో స్వచ్ఛ సర్వేక్షన్ సర్వే చేపట్టింది. హైదరాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా 73 నగరాలలో రహదారులు, పారిశుద్ధ్యం, బహిరంగ మల, మూత్ర విసర్జన, వ్యక్తిగత మరుగుదొడ్ల తదితర అంశాలను పరిశీలించిన కేంద్ర బృందం స్వచ్ఛతా ర్యాంకులను ఇచ్చింది. 2018 లో కూడా స్వచ్ఛసర్వేక్షన్ సర్వేలో భాగంగా కొద్ది రోజుల్లో దిల్లీ నుంచి కేంద్ర బృందం నగరంలో పర్యటించనుంది. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ నగరంలో పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపట్టింది.

స్వచ్ఛందంగా ముందుకు...

డాక్టర్ హేమలత, ఏఎంఓహెచ్, అంబర్‌పేట సర్కిల్



కాచిగూడ డివిజన్లో ప్రయోగాత్మకంగా వ్యాపార, వాణిజ్య వర్గాల ఆర్థిక సహకారంతో రెండుబుట్టల ఏర్పాటు చేస్తున్నాం. అందుకు కాచిగూడ కార్పొరేటర్ ఎక్కాల చైతన్య సహకారాన్ని తీసుకున్నాం. ఆమె కృషి ఫలితంగా రెండుబుట్టల ఏర్పాటుకు ఆర్థికంగా సహాయం చేయడానికి పలువురు వ్యాపారులు ముందుకొచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నాం.

ప్రయోగాత్మకంగా కాచిగూడలో...

జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ పరిధిలోని కాచిగూడ డివిజన్‌లో ప్రయోగాత్మకంగా రెండుబుట్టల ఏర్పాటు చేస్తున్నారు. వీటి ఏర్పాటుకు అయ్యే ఖర్చు విషయంలో అధికారులు వ్యాపార, వాణిజ్య సంస్థల యజమానులతో మాట్లాడారు. కొన్ని సంస్థల వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. వారి ఆర్థిక సహాయంతో మొదటి దశలో 20 ట్విన్ బిన్స్‌ను సిద్ధం చేశారు. వాటిని స్కూల్ జోన్లు, ఆర్టీసీ బస్ స్టాపులు తదితర ప్రాంతాల్లో ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. వ్యాపార, వాణిజ్య సంస్థల సహకారంతో ఏర్పాటు చేయనున్న రెండుబుట్టలు ఏర్పాటు కార్యక్రమం విజయవంతమైతే దీన్ని మిగిలిన డివిజన్లకు విస్తరించనున్నారు.

టీఎమ్మార్పీఎస్ కరపత్రాల విడుదల


కరపత్రాలను విడుదల చేస్తున్న నేతలు

గోల్నాక, న్యూస్‌టుడే: జనవరి 6,7 తేదిల్లో నాగార్జున సాగర్‌లో జరగనున్న తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాజకీయ శిక్షణా తరగతులకు సంబంధించిన కరపత్రాలను గురువారం టీఎమ్మార్పీఎస్ నేతలు విడుదల చేశారు. టీఎమ్మార్పీఎస్ అంబర్‌పేట ఇన్‌ఛార్జీ నల్లగొండ నరేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బోయ వెంకటరమణ, తెరాస నేతలు లవంగం ఆంజనేయులు, సిద్ధార్థ ముదిరాజ్ తదితరులు హాజరై కరపత్రాలను ఆవిష్కరించారు. నేతలు లక్ష్మయ్య, మధు, రాంచందర్, రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలి


మాజీ మంత్రి కృష్ణాయాదవ్‌కు సన్మానం

గోల్నాక, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారాన్ని నిర్వహించాలని మాజీ మంత్రి, తెరాస రాష్ట్ర నేత సి.కృష్ణాయాదవ్ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి కృష్ణానగర్ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆయనను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెరాస నేతలు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ప్రచారం చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వంపై విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పేర్కొన్నారు. సంఘం నేతలు శ్రీకాంత్, భరత్, దినేశ్, సంజూ, రాజేశ్, అశ్విన్, సచిన్, సురేశ్, యోగి, సాయి, బాల్‌రాజ్, అఖిలేశ్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

శతక సాహిత్యం విశిష్టమైనది



కేతవరపు రాజశ్రీని సన్మానిస్తున్న కేవీ కష్ణకుమారి తదితరులు

వివేక్‌నగర్, న్యూస్‌టుడే: శతకసాహిత్యం విశిష్టమైనదని, శతకాలలో భగవంతుడి లీలలు తెలుపుతూ రాసినవి, ఆధ్యాత్మిక, వైరాగ్య లౌకిక, నీతి పరంగా రచించినవి ఉన్నాయని ప్రముఖ రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీ అన్నారు. దాశరథి, కృష్ణ, కాళహస్తీశ్వర, వేంకటేశ్వర తదితర శతకాలు మొదటి కోవకు చెందినవి కాగా సుమతి, వేమన మొదలైన శతకాలు రెండో రకానివని ఆమె వివరించారు. సినారె వంశీ విజ్ఞానపీఠం, కేతవరపు ఫౌండేషన్, త్యాగరాయ గానసభల ఆధ్వర్యంలో గురువారం కళాలలిత కళావేదికలో నిర్వహించిన సాహిత్య సమావేశంలో రాజ్యశ్రీ శతక పద్యాలు-పురాణాలతో సమన్వయం అనే అంశంపై సోదాహరణ ప్రసంగం చేశారు. ముఖ్యఅతిథి ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత్రి డా. కేవీ కృష్ణకుమారి ప్రధాన వక్త రాజ్యశ్రీని సత్కరించారు. వంశీ సంస్థల వ్యవస్థాపకులు రామరాజు అధ్యక్షత వహించారు. ప్రత్యేకాతిథిగా త్యాగరాయగానసభ అధ్యక్షులు కళాజనార్ధనమూర్తి విచ్చేశారు. తొలుత రాఘవాచారి, బాపిరాజు, రేవతి, సుజాతామూర్తిలు సినీ గీతాలను ఆలపించారు.

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలపై ఉద్యమించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

గోల్నాక, న్యూస్‌టుడే: ప్రజా వ్యతిరేక చర్యలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉద్యమించాలని భాజపా శాసనసభాపక్ష నేత జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు కావొస్తున్నా ఎన్నికల హామీలను అమలు చేయడంలో తెరాస ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గురువారం చెన్నారెడ్డినగర్‌లోని ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్లో భాజపా అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు నాగభూషణంచారి, ప్రధాన కార్యదర్శి ఆర్.కృష్ణముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ అనుబంధ విభాగాల పదవులకు సంబంధించి నేతలకు నియామక పత్రాలను అందజేశారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై పార్టీ నేతలు ఇంటింటి ప్రచారాన్ని చేపట్టాలని సూచించారు. నేతలు ఆనంద్‌గౌడ్, భిక్షపతి, యాదగిరి, గౌతమ్ రావు, సల్లా నరేందర్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా అచ్చిని రమేష్

విద్యానగర్ : నాయకులు, కార్యకర్తలు స్థానికులకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాల ఫలాలు వారికి చేరేలా కృషి చేయాలని శాసన సభ్యుడు జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అచ్చిని రమేష్ నియామకాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానికుల మన్ననలు పొంది ప్రజా నాయకుడుగా గుర్తింపు పొందాలని కోరారు. రమేష్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహాయ సహకారాలు అందించిన మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, గ్రేటర్ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. భాజపా నాయకులు వినోద్ యాదవ్, చుక్క జగన్, సల్ల నరేందర్, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు అందుబాటులో ఉండండి

విద్యానగర్, న్యూస్‌టుడే : స్థానికులకు అందుబాటులో ఉంటూ వారి విశ్వాసాన్ని పొంది పార్టీ అభివృద్ధిలో కీలకపాత్ర వహించాలని శాసనసభ్యుడు జి.కిషన్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. బాగ్ అంబర్‌పేట డివిజన్ భాజపా వివిధ అనుబంద సంస్థల కార్యవర్గ నియామకాలను పురస్కరించుకుని బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. భాజపా డివిజన్ యువ మోర్చా అధ్యక్షుడు ఎడెల్లి బాలకృష్ణ, మహిళా మోర్చా ఎస్. సుజాత, ఎస్‌సీ మోర్చా ఎల్. శ్రీనివాస్, బీసీ మోర్చా పి.కృష్ణగౌడ్, కిసాన్ మోర్చా వెంకటేష్ నియామకపత్రాలను అందుకున్న వారిలో ఉన్నారు. భాజపా గ్రేటర్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు, నాయకులు సల్లా నరేందర్, చుక్క జగన్, పి.గోవర్ధన్ రెడ్డి, కృష్ణగౌడ్, ఏ.అజయ్‌కుమార్, నీలకంఠం రాజు తదితరులు పాల్గొన్నారు.

కదలడు వదలడు చిత్రప్రదర్శన

వివేక్‌నగర్, న్యూస్‌టుడే: కళానిలయం సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభ సహకారంతో గురువారం కళాదీక్షితులు కళావేదికలో అలనాటి ప్రసిద్ధ జానపద చిత్రం కదలడు వదలడుని ప్రదర్శించారు. ఈ చిత్రకథానాయకుడు ఎన్టీరామారావు వర్ధంతిని, దర్శకుడు విఠలాచార్య జయంతిని పురస్కరించుకొని లక్ష్మీనారాయణ పిక్చర్స్ పతాకంపై నాగేశ్వర్‌రావు నిర్మించిన చిత్రప్రదర్శను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంలో జరిపిన సభా కార్యక్రమలో అతిథులుగా ప్రముఖులు సుంకర సత్యనారాయణ, కళాజనార్ధనమూర్తి, యాదగిరి, మల్లికార్జునలు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా రచయిత విద్యాధర్‌రావుకు ఆత్మీయ సత్కారం చేశారు. నిర్వహణ సంస్థ ముఖ్యులు సురేందర్, పుష్పలతలు పర్యవేక్షణ చేశారు.


విద్యాధర్‌రావును సన్మానిస్తున్న అతిథులు

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం


బాగ్‌లింగంపల్లి: సుందరయ్య కళానిలయంలో జస్టిస్ చల్లా కొండయ్య నాలెడ్జ్ కేంద్రంలోని నియో కర్సర్‌లో యువతీయువకులకు జీఎస్టీ అకౌంటెంట్ కోర్సుతోపాటు కొత్తగా మరో రెండు కోర్సుల్లో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ అడ్మిన్ మేనేజరు పీఎన్ మూర్తి, మేనేజరు రాణా ఒక ప్రకటనలో తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, పీల్డ్ టెక్నీషియన్ కంప్యూటరింగ్ పెరిఫెరల్ కంప్యూటర్ హార్డ్‌వేర్‌పై ఉచిత శిక్షణను ఈనెల మొదటి వారంలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు సుందరయ్య కళానిలయంలోని నియోకర్సర్ శిక్షణ కేంద్రంలో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.




బహదూర్‌పుర

బాలిక అదృశ్యం

జహనుమా: ఓ బాలిక తప్పిపోయిన సంఘటన భవానినగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై ఉయ్యాల రమేష్ కథనం ప్రకారం యాకుత్‌పురా సెగ్మెంట్ తలాబ్ కట్టా బస్తీలో నివసించే కోల్‌కతాకి చెందిన ఓ బాలిక తన అమ్మమ్మగారింట్లో ఉంటూ స్థానికంగా ఉన్న ఓ శిక్షణ కేంద్రంలో మెహిందీ డిజైనింగ్ కోర్సు చేస్తోంది. మంగళవారం ఇంటి నుంచి వెళ్లిన ఆ బాలిక ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబసభ్యులు భవానినగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


లాల్‌దర్వాజా క్రాస్ రోడ్డులో చీకట్లు


శాలిబండ అలియాబాద్‌లో..


బాలగంజ్‌లో రాత్రి వెలగకుండా..



పగలు వెలుగుతూ.. లాల్‌దర్వాజాలో!

రాత్రి వెలగవు..
పగలు వద్దన్నా వెలుగుతాయి!

ఫోకస్

పాతనగరంలోని రహదారుల పక్కన ఉండే విద్యుత్ దీపాలు ఇష్టానుసారం వెలుగుతున్నాయి. పగలు వెలుగులు పంచుతున్నాయి. రాత్రిళ్లు చీకట్లను అలాగే ఉంచుతున్నాయి. విద్యుత్ వృథా అవుతున్నా పట్టించుకోవల్సిన సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత విభాగం అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


అలియాబాద్ వెళ్లే రోడ్డులో 'పగలే వెన్నెల'

టీ మాస్ ఫోరం సదస్సు నేడు

కంచన్‌బాగ్, న్యూస్‌టుడే: కంచన్‌బాగ్ డీఆర్‌డీఓ టౌన్‌షిప్‌లోని ఆడిటోరియంలో తెలంగాణ ప్రజా సామాజిక సంఘాల ఐక్య వేదిక (టీ మాస్ ఫోరం) సదస్సు జరగనుంది. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే సదస్సుకు కంచ అయిలయ్య, తమ్మినేని వీరభద్రం, జాన్ వెస్లీతోపాటు భారత ప్రభుత్వం, రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన పరిశోధన, ఉత్పత్తి రంగ సంస్థలకు చెందిన పలు కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు హాజరు కానున్నారని ఈ మేరకు టీ-మాస్ కంచన్‌బాగ్ డివిజన్ కమిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి లక్ష్యంతో టీ-మాస్ ప్రజలను మేల్కొలుపుతుందని తెలిపింది. సదస్సును విజయవంతం చేయాల్సిందిగా టీ-మాస్ విజ్ఞప్తి చేసింది.

యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో
లూయిస్ బ్రెయిలీ జయంతి


విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేస్తున్న క్రాంతికుమార్

చాంద్రాయణగుట్ట: యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని గురువారం దారుషిఫా ప్రభుత్వ బాలుర అంధుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎస్.పి. క్రాంతికుమార్ పాల్గొని లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ.. లూయిస్ బ్రెయిలీ తాను రూపొందించిన లిపితో అంధుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బిస్కెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక యువజన కాంగ్రెస్ నాయకులు, పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

బండ్లగూడ ప్రభుత్వ అసుపత్రిలో ప్రసూతి సేవలు


శస్త్రచికిత్స గదిలో వైద్యులు, బిడ్డను ఎత్తుకున్న నర్సు

బార్కాస్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో బాలింతలకు మెరుగైన వైద్యసేవలు అందించడం జరుగుతోందని చాంద్రాయణగుట్ట సెగ్మెంట్ బార్కాస్ క్లస్టర్ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షణ అధికారిణి డాక్టర్ జ్యోతి అన్నారు. గురువారం ఆమె బార్కాస్ డివిజన్ బండ్లగూడ గౌస్‌నగర్ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రసూతి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బార్కాస్ క్లస్టర్‌లోని ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ కాన్పులు చేయడం ప్రారంభించామన్నారు. గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యనిపుణులు జైపాల్ రెడ్డి, స్త్రీవైద్య నిపుణురాలు డాక్టర్ ప్రియాంకతోపాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. తల్లి షకీలాబేగం, బిడ్డా క్షేమంగా ఉన్నారు.

కార్మికుల హక్కుల కోసం రాజీ లేని పోరాటం


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: కార్మికుల హక్కుల సాధన కోసం సీఐటీయూ రాజీ లేని పోరాటం సాగిస్తుందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ పేర్కొన్నారు. సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజన్నబావి సమీపంలో గురువారం ఏర్పాటు చేసిన మున్సిపల్ ఒప్పంద కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు నెలకు రూ.18 వేల కనీస వేతనం చెల్లించాలని వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఒప్పంద కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ నెల 6, 7 తేదీల్లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రెండో మహాసభలో మున్సిపల్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై చర్చించడంతోపాటు డిమాండ్ల సాధనకు ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు సీఐటీయూకు మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, డీవైఎఫ్ఐ నాయకుడు కృష్ణానాయక్, మున్సిపల్ కార్మికులు భారతి, లక్ష్మీ, బుజ్జి, జంగయ్య, స్థానిక సీఐటీయూ నాయకులు కిషన్, బలరాం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాదన్నపేట మండిలో పర్యటన

మాదన్నపేట: మాదన్నపేట కూరగాయల మండిలో హైదరాబాద్ మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు రవికుమార్ గురువారం పర్యటించారు. మండి అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు, పరిశుభ్రత, రైతులకు వసతులు, వినియోగదారులకు వసతుల కల్పన గురించి మార్కెట్‌లో పర్యటించినట్లు ఆయన తెలిపారు. మాదన్నపేట మండిని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తులు అందుతున్నాయని, ప్రభుత్వం కోరితే తగిన సూచనలు ఇవ్వడానికి తాను స్థానిక మార్కెటింగ్ అధికారులతో కలిసి మండిలో పర్యటించినట్లు ఆయన తెలిపారు. వీలైతే మండి స్థలాన్ని ప్రభుత్వం తీసుకుని ఈ ప్రాంతంలో మార్కెట్‌ను అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చే అవకాశాలను ఆయన పరిశీలించినట్లు తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం


మంద బుడ్డమ్మ (65)

కంచన్‌బాగ్, న్యూస్‌టుడే: ఆసరా పింఛన్ తీసుకునేందుకు వచ్చిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన కంచన్‌బాగ్ పోలీస్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం పరిధి మీర్‌పేటలోని ఎస్సీ-బీ కాలనీకి చెందిన మంద బుడ్డమ్మ (65) ఆసరా పింఛన్ తీసుకునేందుకు డీఎంఆర్ఎల్ కూడలి సమీపంలోని ఆంధ్రా బ్యాంక్ వద్దకు ఈనెల 2న వచ్చింది. పింఛన్ డబ్బులు తీసుకున్న ఆమె బ్యాంక్ లోపలి నుంచి బయటికి వచ్చింది. తిరిగి ఇంటికి చేరలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో ఆమె ఆచూకీ కోసం గాలించారు. సమాచారం అందకపోవడంతో గురువారం ఈ మేరకు ఠాణాలో ఆమె కుమారుడు మంద కృష్ణ ఫిర్యాదు చేశారు. ఎస్సై పి.ప్రమోద్‌కుమార్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ ఆజం షరీఫ్

చాంద్రాయణగుట్ట: ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని లలితబాగ్ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ అలీ ఆజం షరీఫ్ పేర్కొన్నారు. ఉప్పుగూడ జెండా సమీపంలోని వార్డు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆజం షరీఫ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూస్తామన్నారు. బస్తీల్లో సమస్యలను తన దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో 23 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బండ్లగూడ మండల స్పెషల్ ఆర్ఐ సాయికిరణ్, వార్డు కమిటీ సభ్యుడు అక్రం, ఏరియా కమిటీ సభ్యుడు కలీం, స్థానిక నాయకులు అడాల అశోక్‌కుమార్, తల్వార్ జంగయ్య, విక్రమ్, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాంద్రాయణగుట్ట




బాలిక అదృశ్యం

జహనుమా: ఓ బాలిక తప్పిపోయిన సంఘటన భవానినగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై ఉయ్యాల రమేష్ కథనం ప్రకారం యాకుత్‌పురా సెగ్మెంట్ తలాబ్ కట్టా బస్తీలో నివసించే కోల్‌కతాకి చెందిన ఓ బాలిక తన అమ్మమ్మగారింట్లో ఉంటూ స్థానికంగా ఉన్న ఓ శిక్షణ కేంద్రంలో మెహిందీ డిజైనింగ్ కోర్సు చేస్తోంది. మంగళవారం ఇంటి నుంచి వెళ్లిన ఆ బాలిక ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబసభ్యులు భవానినగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టీ మాస్ ఫోరం సదస్సు నేడు

కంచన్‌బాగ్, న్యూస్‌టుడే: కంచన్‌బాగ్ డీఆర్‌డీఓ టౌన్‌షిప్‌లోని ఆడిటోరియంలో తెలంగాణ ప్రజా సామాజిక సంఘాల ఐక్య వేదిక (టీ మాస్ ఫోరం) సదస్సు జరగనుంది. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే సదస్సుకు కంచ అయిలయ్య, తమ్మినేని వీరభద్రం, జాన్ వెస్లీతోపాటు భారత ప్రభుత్వం, రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన పరిశోధన, ఉత్పత్తి రంగ సంస్థలకు చెందిన పలు కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు హాజరు కానున్నారని ఈ మేరకు టీ-మాస్ కంచన్‌బాగ్ డివిజన్ కమిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి లక్ష్యంతో టీ-మాస్ ప్రజలను మేల్కొలుపుతుందని తెలిపింది. సదస్సును విజయవంతం చేయాల్సిందిగా టీ-మాస్ విజ్ఞప్తి చేసింది.


లాల్‌దర్వాజా క్రాస్ రోడ్డులో చీకట్లు


శాలిబండ అలియాబాద్‌లో..


బాలగంజ్‌లో రాత్రి వెలగకుండా..



పగలు వెలుగుతూ.. లాల్‌దర్వాజాలో!

రాత్రి వెలగవు..
పగలు వద్దన్నా వెలుగుతాయి!

ఫోకస్

పాతనగరంలోని రహదారుల పక్కన ఉండే విద్యుత్ దీపాలు ఇష్టానుసారం వెలుగుతున్నాయి. పగలు వెలుగులు పంచుతున్నాయి. రాత్రిళ్లు చీకట్లను అలాగే ఉంచుతున్నాయి. విద్యుత్ వృథా అవుతున్నా పట్టించుకోవల్సిన సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత విభాగం అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అలియాబాద్ వెళ్లే రోడ్డులో 'పగలే వెన్నెల'

యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో
లూయిస్ బ్రెయిలీ జయంతి


విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేస్తున్న క్రాంతికుమార్

చాంద్రాయణగుట్ట: యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని గురువారం దారుషిఫా ప్రభుత్వ బాలుర అంధుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎస్.పి. క్రాంతికుమార్ పాల్గొని లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ.. లూయిస్ బ్రెయిలీ తాను రూపొందించిన లిపితో అంధుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బిస్కెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక యువజన కాంగ్రెస్ నాయకులు, పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

బండ్లగూడ ప్రభుత్వ అసుపత్రిలో ప్రసూతి సేవలు


శస్త్రచికిత్స గదిలో వైద్యులు, బిడ్డను ఎత్తుకున్న నర్సు

బార్కాస్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో బాలింతలకు మెరుగైన వైద్యసేవలు అందించడం జరుగుతోందని చాంద్రాయణగుట్ట సెగ్మెంట్ బార్కాస్ క్లస్టర్ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షణ అధికారిణి డాక్టర్ జ్యోతి అన్నారు. గురువారం ఆమె బార్కాస్ డివిజన్ బండ్లగూడ గౌస్‌నగర్ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రసూతి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బార్కాస్ క్లస్టర్‌లోని ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ కాన్పులు చేయడం ప్రారంభించామన్నారు. గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యనిపుణులు జైపాల్ రెడ్డి, స్త్రీవైద్య నిపుణురాలు డాక్టర్ ప్రియాంకతోపాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. తల్లి షకీలాబేగం, బిడ్డా క్షేమంగా ఉన్నారు.

కార్మికుల హక్కుల కోసం రాజీ లేని పోరాటం

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: కార్మికుల హక్కుల సాధన కోసం సీఐటీయూ రాజీ లేని పోరాటం సాగిస్తుందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ పేర్కొన్నారు. సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజన్నబావి సమీపంలో గురువారం ఏర్పాటు చేసిన మున్సిపల్ ఒప్పంద కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు నెలకు రూ.18 వేల కనీస వేతనం చెల్లించాలని వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఒప్పంద కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ నెల 6, 7 తేదీల్లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రెండో మహాసభలో మున్సిపల్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై చర్చించడంతోపాటు డిమాండ్ల సాధనకు ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు సీఐటీయూకు మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, డీవైఎఫ్ఐ నాయకుడు కృష్ణానాయక్, మున్సిపల్ కార్మికులు భారతి, లక్ష్మీ, బుజ్జి, జంగయ్య, స్థానిక సీఐటీయూ నాయకులు కిషన్, బలరాం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ ఆజం షరీఫ్

చాంద్రాయణగుట్ట: ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని లలితబాగ్ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ అలీ ఆజం షరీఫ్ పేర్కొన్నారు. ఉప్పుగూడ జెండా సమీపంలోని వార్డు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కళ్యాణలక్ష్మీ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆజం షరీఫ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూస్తామన్నారు. బస్తీల్లో సమస్యలను తన దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో 23 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బండ్లగూడ మండల స్పెషల్ ఆర్ఐ సాయికిరణ్, వార్డు కమిటీ సభ్యుడు అక్రం, ఏరియా కమిటీ సభ్యుడు కలీం, స్థానిక నాయకులు అడాల అశోక్‌కుమార్, తల్వార్ జంగయ్య, విక్రమ్, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదన్నపేట మండిలో పర్యటన

మాదన్నపేట: మాదన్నపేట కూరగాయల మండిలో హైదరాబాద్ మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు రవికుమార్ గురువారం పర్యటించారు. మండి అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు, పరిశుభ్రత, రైతులకు వసతులు, వినియోగదారులకు వసతుల కల్పన గురించి మార్కెట్‌లో పర్యటించినట్లు ఆయన తెలిపారు. మాదన్నపేట మండిని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తులు అందుతున్నాయని, ప్రభుత్వం కోరితే తగిన సూచనలు ఇవ్వడానికి తాను స్థానిక మార్కెటింగ్ అధికారులతో కలిసి మండిలో పర్యటించినట్లు ఆయన తెలిపారు. వీలైతే మండి స్థలాన్ని ప్రభుత్వం తీసుకుని ఈ ప్రాంతంలో మార్కెట్‌ను అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చే అవకాశాలను ఆయన పరిశీలించినట్లు తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం


మంద బుడ్డమ్మ (65)

కంచన్‌బాగ్, న్యూస్‌టుడే: ఆసరా పింఛన్ తీసుకునేందుకు వచ్చిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన కంచన్‌బాగ్ పోలీస్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం పరిధి మీర్‌పేటలోని ఎస్సీ-బీ కాలనీకి చెందిన మంద బుడ్డమ్మ (65) ఆసరా పింఛన్ తీసుకునేందుకు డీఎంఆర్ఎల్ కూడలి సమీపంలోని ఆంధ్రా బ్యాంక్ వద్దకు ఈనెల 2న వచ్చింది. పింఛన్ డబ్బులు తీసుకున్న ఆమె బ్యాంక్ లోపలి నుంచి బయటికి వచ్చింది. తిరిగి ఇంటికి చేరలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో ఆమె ఆచూకీ కోసం గాలించారు. సమాచారం అందకపోవడంతో గురువారం ఈ మేరకు ఠాణాలో ఆమె కుమారుడు మంద కృష్ణ ఫిర్యాదు చేశారు. ఎస్సై పి.ప్రమోద్‌కుమార్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చార్మినార్

బాలిక అదృశ్యం

జహనుమా: ఓ బాలిక తప్పిపోయిన సంఘటన భవానినగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై ఉయ్యాల రమేష్ కథనం ప్రకారం యాకుత్‌పురా సెగ్మెంట్ తలాబ్ కట్టా బస్తీలో నివసించే కోల్‌కతాకి చెందిన ఓ బాలిక తన అమ్మమ్మగారింట్లో ఉంటూ స్థానికంగా ఉన్న ఓ శిక్షణ కేంద్రంలో మెహిందీ డిజైనింగ్ కోర్సు చేస్తోంది. మంగళవారం ఇంటి నుంచి వెళ్లిన ఆ బాలిక ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబసభ్యులు భవాని నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



లాల్‌దర్వాజా క్రాస్ రోడ్డులో చీకట్లు



శాలిబండ అలియాబాద్‌లో..



బాలగంజ్‌లో రాత్రి వెలగకుండా..



పగలు వెలుగుతూ.. లాల్‌దర్వాజాలో!

రాత్రి వెలగవు..
పగలు వద్దన్నా వెలుగుతాయి!

ఫోకస్

పాతనగరంలోని రహదారుల పక్కన ఉండే విద్యుత్ దీపాలు ఇష్టానుసారం వెలుగుతున్నాయి. పగలు వెలుగులు పంచుతున్నాయి. రాత్రిళ్లు చీకట్లను అలాగే ఉంచుతున్నాయి. విద్యుత్ వృథా అవుతున్నా పట్టించుకోవల్సిన సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత విభాగం అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అలియాబాద్ వెళ్లే రోడ్డులో 'పగలే వెన్నెల'

టీ మాస్ ఫోరం సదస్సు నేడు

కంచన్‌బాగ్, న్యూస్‌టుడే: కంచన్‌బాగ్ డీఆర్‌డీఓ టౌన్‌షిప్‌లోని ఆడిటోరియంలో తెలంగాణ ప్రజా సామాజిక సంఘాల ఐక్య వేదిక (టీ మాస్ ఫోరం) సదస్సు జరగనుంది. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే సదస్సుకు కంచ అయిలయ్య, తమ్మినేని వీరభద్రం, జాన్ వెస్లీతోపాటు భారత ప్రభుత్వం, రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన పరిశోధన, ఉత్పత్తి రంగ సంస్థలకు చెందిన పలు కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు హాజరు కానున్నారని ఈ మేరకు టీ-మాస్ కంచన్‌బాగ్ డివిజన్ కమిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి లక్ష్యంతో టీ-మాస్ ప్రజలను మేల్కొలుపుతుందని తెలిపింది. సదస్సును విజయవంతం చేయాల్సిందిగా టీ-మాస్ విజ్ఞప్తి చేసింది.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సుదర్శన్

జహనుమా, న్యూస్‌టుడే: నేటి బాలలే రేపటి పౌరులు.. అలాంటి వారికి చట్టాలపై కొంత అవగాహన కల్పించడం ఎంతైనా అవసరం. విద్యార్థి దశలో వారికి చట్టాలపై కల్పించే అవగాహన అటు వారికి, ఇటు సమాజానికి ఎంతగానో ఉపయోగపడుతుందని హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టు న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ జడ్జి గన్నరపు సుదర్శన్ అన్నారు. గురువారం ఆయన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల కోసం నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్యారాలీగల్ వాలంటరీ ఏజాజ్‌అలీఖురేషీతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బండ్లగూడ ప్రభుత్వ అసుపత్రిలో ప్రసూతి సేవలు



శస్త్రచికిత్స గదిలో వైద్యులు, బిడ్డను ఎత్తుకున్న నర్సు

బార్కాస్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో బాలింతలకు మెరుగైన వైద్యసేవలు అందించడం జరుగుతోందని చాంద్రాయణగుట్ట సెగ్మెంట్ బార్కాస్ క్లస్టర్ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షణ అధికారిణి డాక్టర్ జ్యోతి అన్నారు. గురువారం ఆమె బార్కాస్ డివిజన్ బండ్లగూడ గౌస్‌నగర్ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రసూతి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బార్కాస్ క్లస్టర్‌లోని ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ కాన్పులు చేయడం ప్రారంభించామన్నారు. గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యనిపుణులు జైపాల్‌రెడ్డి, స్త్రీవైద్య నిపుణురాలు డాక్టర్ ప్రియాంకతోపాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. తల్లి షకీలా బేగం, బిడ్డా క్షేమంగా ఉన్నారు.

కార్మికుల హక్కుల కోసం రాజీ లేని పోరాటం

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: కార్మికుల హక్కుల సాధన కోసం సీఐటీయూ రాజీ లేని పోరాటం సాగిస్తుందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ పేర్కొన్నారు. సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజన్నబావి సమీపంలో గురువారం ఏర్పాటు చేసిన మున్సిపల్ ఒప్పంద కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు నెలకు రూ.18 వేల కనీస వేతనం చెల్లించాలని వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఒప్పంద కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ నెల 6, 7 తేదీల్లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రెండో మహాసభలో మున్సిపల్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై చర్చించడంతోపాటు డిమాండ్ల సాధనకు ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు సీఐటీయూకు మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, డీవైఎఫ్ఐ నాయకుడు కృష్ణానాయక్, మున్సిపల్ కార్మికులు భారతి, లక్ష్మీ, బుజ్జి, జంగయ్య, స్థానిక సీఐటీయూ నాయకులు కిషన్, బలరాం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ ఆజం షరీఫ్

చాంద్రాయణగుట్ట: ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని లలితబాగ్ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ అలీ ఆజం షరీఫ్ పేర్కొన్నారు. ఉప్పుగూడ జెండా సమీపంలోని వార్డు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కళ్యాణలక్ష్మీ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆజం షరీఫ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూస్తామన్నారు. బస్తీల్లో సమస్యలను తన దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో 23 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బండ్లగూడ మండల స్పెషల్ ఆర్ఐ సాయికిరణ్, వార్డు కమిటీ సభ్యుడు అక్రం, ఏరియా కమిటీ సభ్యుడు కలీం, స్థానిక నాయకులు అడాల అశోక్‌కుమార్, తల్వార్ జంగయ్య, విక్రమ్, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదన్నపేట మండిలో పర్యటన

మాదన్నపేట: మాదన్నపేట కూరగాయల మండిలో హైదరాబాద్ మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు రవికుమార్ గురువారం పర్యటించారు. మండి అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు, పరిశుభ్రత, రైతులకు వసతులు, వినియోగదారులకు వసతుల కల్పన గురించి మార్కెట్‌లో పర్యటించినట్లు ఆయన తెలిపారు. మాదన్నపేట మండిని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తులు అందుతున్నాయని, ప్రభుత్వం కోరితే తగిన సూచనలు ఇవ్వడానికి తాను స్థానిక మార్కెటింగ్ అధికారులతో కలిసి మండిలో పర్యటించినట్లు ఆయన తెలిపారు. వీలైతే మండి స్థలాన్ని ప్రభుత్వం తీసుకుని ఈ ప్రాంతంలో మార్కెట్‌ను అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చే అవకాశాలను ఆయన పరిశీలించినట్లు తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం



మంద బుడ్డమ్మ (65)

కంచన్‌బాగ్, న్యూస్‌టుడే: ఆసరా పింఛన్ తీసుకునేందుకు వచ్చిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన కంచన్‌బాగ్ పోలీస్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం పరిధి మీర్‌పేటలోని ఎస్సీ-బీ కాలనీకి చెందిన మంద బుడ్డమ్మ (65) ఆసరా పింఛన్ తీసుకునేందుకు డీఎంఆర్‌ఎల్ కూడలి సమీపంలోని ఆంధ్రా బ్యాంక్ వద్దకు ఈనెల 2న వచ్చింది. పింఛన్ డబ్బులు తీసుకున్న ఆమె బ్యాంక్ లోపలి నుంచి బయటికి వచ్చింది. తిరిగి ఇంటికి చేరలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో ఆమె ఆచూకీ కోసం గాలించారు. సమాచారం అందకపోవడంతో గురువారం ఈ మేరకు ఠాణాలో ఆమె కుమారుడు మంద కృష్ణ ఫిర్యాదు చేశారు. ఎస్సై పి.ప్రమోద్‌కుమార్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కంటోన్మెంట్

అల్వాల్ రైతు బజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్, న్యూస్‌టుడే: (గురువారంనాటివి.. కిలో రూ.లలో) టమాటా 11, వంకాయలు 15, బెండకాయలు 31, పచ్చిమిర్చి 31, కాలీఫ్లవర్ 31, క్యాబేజీ 13, క్యారెట్ 46, దొండకాయలు 25, ఆలు 16, ఉల్లి 36, సొరకాయ 15, పొట్లకాయ 13, బీన్స్ 28, గోరుచిక్కుడు 31, చిక్కుడు 38, దోసకాయ 20, బీరకాయ 31, కాకరకాయ 31, చామగడ్డ 41, కీర 13, క్యాప్సికం 44, బీట్‌రూట్ 19, కందగడ్డ 25.



కంటోన్మెంట్ ఐదో వార్డు పరిధి కాకాగూడ, గృహలక్ష్మి కాలనీలో ఎమ్మెల్యే సాయన్నను గురువారం బోర్డు సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. బోర్డు ఉపాధ్యక్షుడు రామకృష్ణ నేతృత్వంలో బోర్డు సభ్యుడు లోకనాథం, మాజీ సభ్యుడు ప్రభాకర్ ఎమ్మెల్యేను కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులపై చర్చలు జరిపినట్లు సభ్యులు తెలిపారు. **-న్యూస్‌టుడే, కంటోన్మెంట్**

సంక్రాంతి రాకపోకలకు సర్వంసిద్ధం

❑ అదనపు బస్సులను సిద్ధం చేస్తున్న ఆర్టీసీ అధికారులు



జూబ్లీబస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ (పాతచిత్రం)

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: సంక్రాంతి పండుగ సమీపిస్తుండడం, పౌరులు పండుగను తమ స్వగ్రామాల్లో జరుపుకొనేందుకు వేలాది సంఖ్యలో తరలివెళ్లనుండడంతో ప్రయాణికుల సౌకర్యార్థం చేయాల్సిన ఏర్పాట్లకు సంబంధించిన పనుల్లో ఆర్టీసీ అధికారులు నిమజ్జమయ్యారు. ప్రయాణికులు తమ స్వగ్రామాలకు రాకపోకలు సాగించే క్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. జేబీఎస్ నుంచి ప్రయాణికులను ఎప్పటికప్పుడు తరలించేందుకు కావాల్సిన బస్సులు, అదనపు బస్సుల పార్కింగులు, ప్రయాణికులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించడం తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టిని సారించారు.

జిల్లాల నుంచి రానున్న అధికారులు...

సంక్రాంతి సందర్భంగా జేబీఎస్‌లో అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తూ పరిస్థితులకు అనుగుణంగా ఏర్పాట్లు చేసేందుకు ఈ నెల 9నుంచి 14వ తేదీవరకు వివిధ జిల్లాలకు చెందిన 14మంది అధికారులు విధులు నిర్వర్తించనున్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాలకు చెందిన అధికారులు ఆపరేషన్లు, కో-ఆర్డినేషన్, పార్కింగ్ తదితర పనులను పరిశీలించనుండగా, ఆయా పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఆదిలాబాద్ రీజనల్ మేనేజర్ ఇన్‌ఛార్జీగా వ్యవహరించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు మామూలు రోజుల్లో 1,053 బస్సులు ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరుస్తుండగా, పండుగ సందర్భంగా సుమారు 600 అదనపు బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.

ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా బుకింగ్‌లు

చాలామంది ప్రయాణికులు ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా బస్సుల్లో సీట్లను బుక్ చేసుకున్నట్లు సమాచారం. అయితే బస్సుల కోసం జేబీఎస్‌కు వచ్చే ప్రయాణికుల సందేహాలను తీర్చడానికి మెదక్ సెక్టార్ వద్ద ఇప్పటికే అందుబాటులో ఉన్న 'మే ఐ హెల్ప్ యు' కౌంటర్ తరహాలోనే ఈ నెల 9నుంచి 14వ తేదీవరకు ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ సెక్టార్లలో సైతం అదనంగా మూడు కౌంటర్లను ఏర్పాటు చేయనున్నారు. కాగా, ప్రయాణికుల సౌకర్యార్థం జేబీఎస్‌లో అందుబాటులో ఉండే అధికారుల వివరాలతో పాటు వారి ఫోన్ నెంబర్లతో కూడుకున్న పట్టికలను సైతం ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. మామూలు రోజుల్లో రాకపోకలు సాగించే సర్వీసులతో పాటు అదనంగా సుమారు 600ల సర్వీసులను అందుబాటులోకి తీసుకురానున్నామని, మరిన్ని బస్సులను సైతం తీసుకువచ్చే దిశగా ఏర్పాట్లు చేస్తున్నట్లు పికెట్ డిపో మేనేజర్ ప్రణీత్ పేర్కొన్నారు.





పేదల సంక్షేమానికి కృషి చేస్తానని ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. వెస్ట్‌మారేడుపల్లిలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి ఆయన అభినందనలు పొందారు. అలాగే తెలంగాణ ఉద్యమకారులు నర్సింహయాదవ్, శర్వేన్, పెంటాశ్రీహరి, నర్సింగ్, మహేష్, సుధాకర్, నరేందర్‌యాదవ్ తదితరులు ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. **-న్యూస్‌టుడే, మారేడుపల్లి**

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం: రూప



డ్రైనేజీ పనులను ప్రారంభించిన కార్పొరేటర్ రూప

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: రెజిమెంటల్‌బజార్ ప్రాంతంలో ఏళ్ల నుంచి బస్తీ ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దక్కిందని మోండా మార్కెట్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల రూప అన్నారు. గురువారం గురుద్వారా డ్రైనేజీ పనులను ప్రారంభించి మాట్లాడారు. రూ. 47.50లక్షలతో చేపడుతున్న డ్రైనేజీ పనులకు ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్యే సాయన్నలతో కలిసి శంకుస్థాపన చేశామన్నారు. బస్తీ ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తాని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆకుల హరికృష్ణ, అమర్, రాము, రాజు, వెకంట్, రఘు పాల్గొన్నారు.

☛ గురుద్వారా వద్ద నుంచి ప్రారంభమైన డ్రైనేజీ పనులను జీహెచ్ఎంసీ కోఆప్షన్ మెంబరు నర్సింహమదిరాజ్ గురువారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.

సైనిక సంక్షేమ కేంద్రం ప్రారంభం



మాజీ సైనికుద్యోగులతో లెఫ్టినెంట్ జనరల్ ఆర్‌కే ఆనంద్

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: కంటోన్మెంట్ ప్రాంతంలోని 1 ఈఎంఈ సెంటర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన 'సైనిక్ వెల్ఫేర్ సెంటర్'ను దక్షిణ భారత్ ఏరియా, జనరల్ ఆఫీసర్ కమాండింగ్, లెఫ్టినెంట్ జనరల్ ఆర్‌కే ఆనంద్ గురువారం ప్రారంభించినట్లు రక్షణ శాఖ పౌర సంబంధాలశాఖ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ఆంధ్రా సబేరియా, జనరల్ ఆఫీసర్ కమాండింగ్, మేజర్ జనరల్ ఎన్.శ్రీనివాస్‌రావు చొరవతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఈ సెంటర్‌లో మాజీ సైనికుద్యోగులు వివిధ కార్యక్రమాలు జరుపుకొనేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. తెలంగాణ ఆంధ్రా సబేరియా, డిప్యూటీ జీవోసీ బ్రిగేడియర్ మనీష్ ఉపాధ్యాయ్, 1 ఈఎంఈ సెంటర్ కమాండెంట్, బ్రిగేడియర్ అజయ్‌మాలిక్, సైనిక సంక్షేమ డైరెక్టర్ రిటైర్డ్ కల్నల్ పి.రమేశ్‌కుమార్, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



కంటోన్మెంట్ బోర్డు సీఈవో ఎస్‌వీఆర్ చంద్రశేఖర్‌ను గురువారం బోర్డు కార్యాలయ ఆవరణలో మాజీ ఉపాధ్యక్షురాలు బాణుక నర్మద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఈవోకు నూతన సంవత్సరం శుభాకాంక్షలను తెలియజేశారు. ఆరో వార్డు పరిధిలోని మహాత్మానగర్ చౌరస్తా నుంచి దుబాయ్‌గేట్ వైపునకు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని కోరారు. ఈ మేరకు సీఈవో సానుకూలంగా స్పందించినట్లు నర్మద పేర్కొన్నారు. **-న్యూస్‌టుడే, కంటోన్మెంట్**

రూ.64లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం



పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తలసాని

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సమస్యలను పరిష్కరిస్తూ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం మోండా మార్కెట్ డివిజన్ పరిధిలోని బోయిగూడ రైల్వే వంతెన సాయిబాబా ఆలయం వద్ద రూ.64లక్షలతో నిర్మాణం చేయనున్న బీటీరోడ్డు పనులకు కార్పొరేటర్ రూపతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకుని వస్తే పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. స్థానిక బస్తీవాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక నాయకులు హరికృష్ణ, నాగేందర్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి అయ్యప్పస్వామి ఉత్సవాలు

అల్వాల్, న్యూస్‌టుడే: బొల్లారంలోని ప్రసిద్ధ అయ్యప్పస్వామి ఆలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 24వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ప్రత్యేక పూజలతో పాటు, కేరళ సంప్రదాయ ఊరేగింపు ఉంటుందని దేవాదాయశాఖ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

మందకృష్ణమాదిగకు అండగా ఉంటాం

ఉస్మానియా యూనివర్సిటీ, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ కోసం జైలులో దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగకు అండగా ఉంటామని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ప్రకటించారు. గురువారం ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఓయూ ఐక్యవిద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడారు. కేసీఆర్, కడియం శ్రీహరి కుట్రలో భాగంగానే మందకృష్ణమాదిగను అరెస్టు చేశారని ఆరోపించారు. తక్షణమే ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం శుక్రవారం రాష్ట్ర బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు ప్రకటించారు. ఎంఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, టీవీవీ, టీవీయూవీ, డీఎస్‌యూ, బీఎస్ఎఫ్, టీఎస్‌యూ, ఎంఎస్ఎఫ్ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు



రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: విద్యుత్తు ఫీడర్ల మరమ్మతుల కారణంగా 33/11కె.వి పాటిగడ్డ, సంజీవయ్య పార్కు, జింఖానా, మారేడుపల్లి, నెహ్రూనగర్ ఫీడర్ల పరిధిలోని 11కె.వి ఫీడర్ల ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

● 11కె.వి రసూల్‌పురా ఫీడర్ పరిధిలోని రాయల్ ఇన్‌ఫ్లేట్, సాయిబాబా ఆలయం, ఆర్.యం మోటర్స్, గణేష్ నిమజ్జనం ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు.

● 11కె.వి ఐఐసీటి సబ్‌స్టేషన్ పరిధిలోని దాల్‌మీల్, గుడ్డిమేల విల్లా, నాగార్జున కమ్యూనిటీ హాల్, అప్పారావు పిటీ, విశాల్ అపార్టుమెంట్, బ్యాంకు బరోడా, షిర్డిసాయినగర్, సూర్యవంశీ అపార్టుమెంట్, తార్నాక మెయిన్ రోడ్డు, బిగ్‌బజార్, సోలెక్స్ కంప్యూటర్స్, స్ట్రీట్ నెంబర్-1 ప్రాంతాల్లో 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు.

● 11కె.వి పోలీసులైన్ ఫీడర్ పరిధిలోని అలీషా పర్నీచర్, హాకీ స్టేడియం, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, చంద్రనగర్, ఫిరోజ్‌నగర్, జగదీష్‌నగర్, రామాలయం, పోచమ్మ ఆలయం ప్రాంతాల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు.

● 11కె.వి బాలంరాయి ఫీడర్ పరిధిలోని బాలంరాయి, బాలంరాయి కమాన్, విమాన్‌నగర్, పేగా కాలనీ, మార్గదర్శి కాలనీ షాపర్స్‌లైన్, హ్యాపి ఎన్‌క్లేవ్, పిఅండ్‌టి కాలనీ ఫీడర్ పరిధిలోని మధ్యాహ్నం 12గంటల నుంచి ఒంటిగంట వరకు.

● 11కె.వి మహేంద్రాహిల్స్, రైల్వే కాలనీ ఫీడర్ పరిధిలోని గాంధీనగర్, వాల్మీకి నగర్, రెయింబో పిటీ, సంజీవయ్య హౌజింగ్ సొసైటి, అజాద్‌చంద్రశేఖర్‌నగర్, మహేంద్రాహిల్స్ రవి సొసైటి, ధనలక్ష్మి కాలనీ, అర్చన ఎన్‌క్లేవ్, సంజీవయ్యనగర్, సంజీవయ్య వార్క్స్ సెక్షన్, కృపాహోమ్, బోపుల్‌పార్కు, రాధిక కాలనీ, న్యూ ఎస్‌బీహెచ్ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 3.30గంటల వరకు.

● 11కె.వి టీచర్స్ కాలనీ ఫీడర్ పరిధిలోని ఈస్ట్‌మారేడుపల్లి మెయిన్‌రోడ్డు, హెచ్‌డీఎఫ్‌సి బ్యాంకు, సిండికేట్ బ్యాంకు, టీచర్ కాలనీ, రాంసర్ హోటల్ తదితర ప్రాంతాల్లో సాయంత్రం 3.30గంటల నుంచి 5గంటల వరకు.

కంటోన్మెంట్

పరేడ్ మైదానం మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ, రాష్ట్ర ప్రార్థన సభ కారణంగా ఈ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని నగర పోలీస్ కమిషనర్ వీవీ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే వాహనాల పార్కింగ్ స్థలాలను కూడా వెల్లడించారు. మధ్యాహ్నం 2గంటల నుంచి రాత్రి 9.30 గంటలకు అమలులో ఉంటాయని తెలిపారు.

- వైఎంసీఏ నుంచి బేగంపేటకు వచ్చే వాహనాలు క్లాక్‌టవర్, ప్యాట్నీ ప్యారడైజ్ మీదుగా ఎస్‌డీరోడ్డు, సీటీవో స్వీకార్ ఉప్కార్, టివోలీ, బాలంరాయి మీదుగా మళ్లించారు.
- సీటీవో క్రాస్‌రోడ్స్ నుంచి పరేడ్ మైదానం మార్గాల్లో వచ్చే వాహనాలు బాలంరాయి, తాడ్‌బండ్, మస్తాన్‌కేఫ్, బ్రూక్‌బాండ్ మీదుగా టివోలీ, స్వీకార్ ఉప్కార్, వైఎంసీఏ, ప్యారడైజ్, ఎస్‌డీ రోడ్, ప్యాట్నీ నుంచి వెళ్లాలి.
- టివోలి క్రాస్ రోడ్డు, ప్లాజా నుంచి వచ్చే వాహనాలు బ్రూక్ బాండ్, బాలంరాయి, సీటీవో, స్వీకార్ ఉప్కార్, వైఎంసీఏ మీదుగా మళ్లించారు.
- స్వీకార్ ఉప్కార్ క్రాస్‌రోడ్డు నుంచి వచ్చే వాహనాలు వైఎంసీఏ క్లాక్‌టవర్, ప్యారడైజ్, సీటీవో మీదుగా సాగాలివాహనాల పార్కింగ్ ఇక్కడే.
- కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల వారు మేడ్చల్, బొల్లారం, తిరుమలగిరి క్రాస్‌రోడ్డు మీదుగా చేరుకునే వాహానాలు బోయినపల్లి మార్కెట్, మస్తాన్ కేఫ్ వద్ద పార్కింగ్ చేయాలి.
- నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి ఉప్పల్ తార్నక, మెట్టుగూడ, సంగీత క్రాస్‌రోడ్డు మీదుగా చేరుకునే వాహానాలు ఆర్ఆర్‌సీ మైదానం, రైల్వే డిగ్రీ కళాశాల, తార్నాక రోడ్డు ఇరుపక్కలా, కీస్ హైస్కూల్, సీఎస్ఐ పీజీ కళాశాల, మహబూబ్ కళాశాలలో పార్కింగ్ చేయాలి.
- మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల నుంచి పంజాగుట్ట మీదుగా వచ్చే వాహానాలు బేగంపేటలోని కార్గో కార్యాలయ ఆవరణ, పీజీ కళాశాల ఆవరణ, వెస్లీ కళాశాల ఆవరణలో పార్కింగ్ చేయాలి
- రంగారెడ్డి, హైదరాబాద్ పలు ప్రాంతాల నుంచి వచ్చే వాహానాలు ట్యాంక్‌బండ్, ప్యారడైజ్ మీదుగా చేరుకునే వాహానాలు బాలంరాయి ఈద్గా ఆవరణలో పార్కింగ్ చేయాలి.

యాదవ సంఘం కాలమానిని ఆవిష్కరణ


కాలమానిని ఆవిష్కరిస్తున్న తలసాని, వేణుగోపాల్‌యాదవ్

మారేడుపల్లి, న్యూస్‌టుడే: ప్రజారంజకపాలనే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. వెస్ట్‌మారేడుపల్లిలో మంత్రి నివాసం వద్ద గురువారం జాతీయ యాదవ సంక్షేమ సంఘం కాలమానిని ఆవిష్కరణ సందడిగా జరిగింది. సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్ యాదవ్, మంత్రి సోదరులు తలసాని శంకర్‌యాదవ్, తలసాని ధర్మేందర్ యాదవ్, అల్లం అంజయ్య యాదవ్ తదితరులతో కలిసి మంత్రి కాలమానిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌యాదవ్ మాట్లాడుతూ 30ఏళ్ల నుంచి యాదవులకు సొంత భవనం కావాలని ప్రభుత్వాలకు విన్నవించినా ఫలితం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన అనంతరం రూ.కోటి నిధులు కేటాయించి, సొంత భవనం నిర్మాణానికి పది ఎకరాల స్థలం కేటాయించడం సంతోషదాయకమని సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉమాయాదవ్, స్వామి యాదవ్, గెజిటర్స్ ఆఫీసర్స్ సంఘం అధ్యక్షుడు కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

మోండా మార్కెట్‌లో కూరగాయలు ధరలు

రెజిమెంటల్‌బజార్: టమాట 8, వంకాయ 20, బెండ 40, పచ్చిమిర్చి 30, క్యాలీఫ్లవర్ 30, క్యాబేజి 20, క్యారెట్ 40, దొండ 30, ఆలు 15, ఉల్లి 40, సొరకాయ 15, బీన్స్ 30, చిక్కుడు 40, దోస 20, బీర 40, కాకరకాయ 30, బీట్‌రూట్ 40, చామగడ్డ 40, కందగడ్డ 40, కీరా 20, క్యాప్సికం 40, మునగకాయ 15, ఉల్లిపొరక 40, నిమ్మకాయ 10, అల్లం 60, వెల్లుల్లి 80.

కొత్త ఇంటి నెంబర్లతో సూచిక బోర్డుల ఏర్పాటు



బోర్డుల ఏర్పాటును ప్రారంభిస్తున్న రామకృష్ణ

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని ఇళ్ల చిరునామాలను తెలుసుకునే క్రమంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కొత్త ఇంటి నంబర్లతో కూడుకున్న సూచికలను ఏర్పాటు చేస్తున్నట్లు బోర్డు ఉపాధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. కొంతకాలం క్రితం అయిదో వార్డు పరిధిలోని నివాసాలు, వాణిజ్య సముదాయాలకు కొత్త ఇంటి నెంబర్లను కేటాయించారు. ఈ నేపథ్యంలో కొత్త నెంబర్లను తెలుసుకునే విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకుగాను బోర్డు అధికారులు గురువారం సూచికల ఏర్పాటు పనులను చేపట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణ సూచికల ఏర్పాటు పనులను ఓల్డ్ వాసవీనగర్‌లో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...చాలా సంవత్సరాల అనంతరం కొత్త ఇంటి నెంబర్లను కేటాయించామని, వాటికి అనుగుణంగా సూచికలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కాలనీ సంఘం అధ్యక్షుడు శంకర్, బోర్డు ఎన్నికల విభాగం అధికారి పరశురాంలతోపాటు సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ బార్ అసోసియేషన్‌కు నేడు ఎన్నికలు

సికింద్రాబాద్ కోర్టులు: ప్రతి సంవత్సరం సికింద్రాబాద్ బార్ అసోసియేషన్‌కు జరిగే ఎన్నికలు శుక్రవారం సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టులు ఆవరణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరగనున్నాయి. అధ్యక్ష పదవికి సీనియర్ న్యాయవాదులు ఎం.ఈ.చంద్రశేఖర్, జి.రాజశేఖర్ రెడ్డి, జి.వి.ఎస్.రామయ్య నాయుడు, ఎం.ఉమాదేవి, ఎన్.రామకృష్ణ పోటీపడుతున్నారు. ఉపాధ్యక్ష పదవికి కె.వాసుదేవ రాజు, ఎం.శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి పదవికి బి.యోగేశ్వర్ రావు, వి.నారాయణ, సంయుక్త కార్యదర్శి పదవికి సి.బాలమల్లేష్, ఎస్.చంద్రశేఖర్, ఎన్.రవి, మహిళా సంయుక్త కార్యదర్శి పదవికి జె.విమల, కె.లలిత రుక్మిణి పోటీపడుతున్నారు. ఇదిలా ఉండగా, కోశాధికారిగా ఏ.శ్రీనివాస్, గ్రంథాలయ కార్యదర్శిగా టి.ధర్మాన రావు, కమిటీ మెంబర్లుగా వి.పుష్పలత, బి.మహేందర్, జి.ఎస్.వెంకటేశ్వర్లు, పి.వి.పి. ఆర్.కామేశ్వర రావు, జె.రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



గోషామహల్

మెహిదీపట్నం రైతుబజార్‌లో కూరగాయల ధరలు

మెహిదీపట్నం: (గురువారం నాటి ధరలు) టమాట 11, వంకాయ 15, బెండకాయ321, పచ్చిమిర్చి 31, కాకరకాయ 31, బీరకాయ 31, క్యాబేజీ 13, బీన్స్ 28, క్యారెట్ 46, దొండ 13, చిక్కుడుకాయ 38,, గోకరకాయ 31,, బీట్‌రూట్ 19, క్యాప్సికం 34, ఆలుగడ్డ 16, ఉల్లిగడ్డ 40, దోసకాయ 20, సొరకాయ 15, పొట్లకాయి13, కంద 25.


తాళ్లగడ్డలో..


దరియాబాగ్‌లో..


అంబేడ్కర్‌నగర్‌లో..

కంచెలుండవు.. కీడు జరిగితే..?

రక్షణ లేని విద్యుత్ నియంత్రికలు, ఫ్యూజ్‌బాక్స్‌లతో ప్రమాదం

కార్వాన్, న్యూస్‌టుడే: రక్షణ కంచెలు లేని విద్యుత్ నియంత్రికలు, తక్కువ ఎత్తులో మూతల్లేకుండా ఉన్న ఫ్యూజ్‌బాక్సులు చెత్త కుండీలుగా మారి జనాన్ని ఆందోళనకు గురి చేస్తున్నాయి. హైటెన్షన్ విద్యుత్ ప్రవహించే నియంత్రికల వద్ద సైతం రక్షణ కోసం ఏర్పాటు చేసిన సిమెంట్ కంచెలు తెగి చింద రవందరగా ఉన్నాయి. గజిబిజిగా ఉన్న హైటెన్షన్ విద్యుత్ ప్రసరించే వైర్లు సైతం కిందికి వేలాడుతూ కార్వాన్ ప్రాంత వాసుల్ని భయపెడుతున్నాయి. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా సమస్య తీవ్రతను ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని తాళ్లగడ్డ, టప్పాచబుత్ర, దరియాబాగ్, ముస్తయిద్‌పురా, రాంసింగ్‌పురా, సబ్జిమండి, జాఫర్‌గూడ బస్తీల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దగా బడ్జెట్ కేటాయింపులు అవసరం లేని చిన్న పనులు చేయడానికి కూడా అధికారులు శ్రద్ధ చూపడం లేదని ఆరోపిస్తున్నారు. రక్షణ కంచెలను ఏర్పాటు చేయమని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బస్తీలు, యువజన, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు. విద్యుత్ నియంత్రికల వద్ద చెత్త పేరుకుపోతోందని జనం వివరిస్తున్నారు. నియంత్రికల నుంచి వేడి గాలులతోపాటు నిప్పురవ్వలు ఎగిసిపడి అనేకసార్లు ప్రమాదాలు చోటుచేసుకున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. దీనికితోడు తక్కువ ఎత్తులో మూతల్లేని ఫ్యూజ్‌బాక్సులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. గతంలో కార్వాన్ గ్రంథాలయం, కార్వాన్ జలమండలి కార్యాలయం, సబ్జిమండి, తాళ్లగడ్డ రాజలింగయ్య కబడ్డీ స్టేడియం, టప్పాచబుత్ర, అశోక్‌విహార్ కాలనీలలో విద్యుత్ నియంత్రికల వద్ద అగ్నిప్రమాదాలు జరిగిన సంఘటనల్ని జనం మరచిపోలేదు. ఆ సమయంలో వచ్చిన అధిక, అల్ప విద్యుత్ సరఫరాతో తమ విలువైన గృహోపకరణాలు బుగ్గిపాలయ్యాయని చెబుతున్నారు. నష్టపరిహారం ఇస్తామని అధికారులు చెప్పిన మాటలు ఇంత వరకూ ఆచరణకు నోచుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇలాంటి ప్రమాద సంఘటనలు తరచూ జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దుర్ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు విద్యుత్ నియంత్రికల వద్ద రక్షణ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు. నియంత్రికల వద్ద చెత్తను తొలగించి, వదులైె వేలాడుతున్న విద్యుత్ తీగల్ని తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తక్కువ ఎత్తులో మూతల్లేకుండా ఉన్న ఫ్యూజ్‌బాక్సుల్ని సవరించడంతోపాటు పిల్లలకు అందకుండా ఎత్తులో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కార్వాన్ బస్తీల వాసులు ట్రాన్స్‌కో, జీహెచ్ఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.


టప్పాచబుత్రలో..

నేడు విద్యుత్తు సరఫరా ఉండని ప్రాంతాలు

జాంబాగ్, న్యూస్‌టుడే: 11 కె.వి. ఆసిఫ్‌నగర్ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాంగార్‌బస్తీ, ఆసిఫ్‌నగర్, జెడ్ కేఫ్, మల్లేపల్లి, అఫ్జల్‌సాగర్, సీతారామ్‌పేట్, గంజాషాదర్గా తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదు.


విరాళం అందజేస్తున్న రాజేశ్వరరావు

అనాథ విద్యార్థులను ఆదుకోవాలి

బేగంబజార్, న్యూస్‌టుడే: అనాథ విద్యారులను ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ఆదుకోవాలని తెలంగాణ ఛాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ సభ్యులు, కురుమ సంఘం ట్రస్టు బోర్డు ఛైర్మన్ దేవర రాజేశ్వరరావు అన్నారు. గురువారం ఉస్మాన్‌గంజ్‌లోని అనాథ ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. అనాథ విద్యార్థులకు కావాల్సిన ఆహార పదార్థాలు, పప్పుధాన్యాలు, నూతన దుస్తుల కోసం ఆయన స్వచ్ఛందంగా రూ.50 వేలు ఆశ్రమ నిర్వాహకులు క్యాతం రాధాకృష్ణకు అందజేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఆటోడ్రైవర్ మృతి

బేగంబజార్, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ఢీకొని ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయాలపాలై మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి అఫ్జల్‌గంజ్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాదర్‌ఘాట్, మూసానగర్ ప్రాంతానికి చెందిన షేక్ రషీద్ (40) బుధవారం రాత్రి పని నిమిత్తం వెళ్లి చాదర్‌ఘాట్ సాయిబాబా ఆలయ సమీపంలోని ప్రధాన రోడ్డు దాటుతుండగా చాదర్‌ఘాట్ నుంచి గౌలిగూడ వైపు వేగంగా దూసుకువెళ్లిన ఉప్పల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో తీవ్రంగా గాయాలపాలైన రషీద్ పరిస్థితి విషమించడంతో సంఘటనా స్థలిలోనే మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవరు రవీందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు అఫ్జల్‌గంజ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉస్మానియా ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఉస్మానియా ఆసుపత్రి, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతూ ఓ గుర్తు తెలియని వ్యక్తి ఉస్మానియా ఆవరణలో మృతి చెందిన సంఘటన అఫ్జల్‌గంజ్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 40 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉందని గురువారం ఉస్మానియా సిబ్బంది అఫ్జల్‌గంజ్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలికి వెళ్లిన పోలీసులు శవ పంచనామా జరిపి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి ఒంటిపై గాయాలేమీ లేవనీ, అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని పోలీసులు చెప్పారు. మృతుడి ఒంటిపై ఎరుపు రంగు, నలుపు గళ్ల చొక్కా, నీలి రంగు ప్యాంటు ఉన్నాయని చెప్పారు. మృతదేహాన్ని ఉస్మానియా శవాగారంలో భద్రపర్చామనీ, సంబంధీకులెవరైనా ఉంటే సంప్రదించాలని తెలిపారు. ఈ మేరకు అఫ్జల్‌గంజ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దైనందిని ఆవిష్కరణ


దైనందిని ఆవిష్కరిస్తున్న కేఎస్‌ఆర్‌సీ మూర్తి, చిత్రంలో లక్ష్మయ్య తదితరులు

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదార్ల దైనందినిని గురువారం రాత్రి తెలంగాణ రాష్ట్ర ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ విభాగం డైరెక్టర్ కేఎస్‌ఆర్‌సీ మూర్తి ఆవిష్కరించారు. అబిడ్స్‌లోని సంస్థ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జేఏసీ ఛైర్మన్ కె.లక్ష్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన డైరీని ఆవిష్కరించి ప్రసంగించారు. పింఛనుదార్లకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తోన్న సదుపాయాలు సంతృప్తికరంగా ఉన్నాయని చెప్పారు. ఆరోగ్యశ్రీ సీఈఓ పద్మ, పింఛనుదార్ల సంఘం జేఏసీ ఛైర్మన్ పూర్ణచందర్, నారాయణరావు, శుభాకర్‌రావు, సూర్యనారాయణ, మాణయ్య, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.లక్ష్మయ్య మాట్లాడుతూ పింఛనుదార్ల సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టి ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించాలని కోరారు.

పీఎస్‌నగర్‌లో కనీస వసతులు కరవు

విజయనగర్ కాలనీ: విజయనగర్‌కాలనీలోని పీఎస్(పొట్టిశ్రీరాములు)నగర్, కోటమ్మబస్తీ వాసులు కనీస సౌకర్యాలు అందక ఇక్కట్లపాలవుతున్నారు. పేరుకు గ్రేటర్ పరిధిలో ఉన్నామే కానీ తమ ప్రాంతంలో కనీస సౌకర్యాలకు అల్లాడాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలు, రాళ్లకుప్పలతో నిండిన వీధులు, ఎక్కడ పడితే అక్కడ కనిపించే చెత్తతో జనం ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా చలి తీవ్రంగా ఉన్న ప్రస్తుత రోజుల్లో తక్కువ ఎత్తులో ఉన్న రేకుల ఇళ్లల్లో జనం వణికిపోతున్నారు. సాయంత్రం నుంచి తెల్లవార్లూ వీస్తున్న చలిగాలులకు, చల్లదనానికి గజగజలాడుతున్నారు. చలితోపాటు దోమలు పెరిగిపోవడంతో రాత్రుళ్లు నిద్ర కరవుతోందని వాపోతున్నారు. ఎగుడుదిగుడుగా గుంతలతో నిండిన గల్లీల్లో వీధి దీపాలు కూడా వెలగడం లేదని పేర్కొన్నారు. పేరుకు విద్యుత్ స్తంభాలున్నా అవి అలంకారప్రాయంగానే మారాయని పెదవి విరుస్తున్నారు. తమ బస్తీల్లో కనీస సదుపాయాలు కల్పిస్తామని నాయకులు, అధికారులు చెబుతున్న మాటలు క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదని బస్తీల జనం వాపోతున్నారు. రెండు పడక గదుల కల సాకారం కావాలని పలువురు ఆశిస్తున్నారు.

ఆకట్టుకున్న నృత్యాలు

నారాయణగూడ, న్యూస్‌టుడే: సృజన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళామందిరంలో నిర్వహిస్తున్న సృజన జాతీయ నృత్యోత్సవంలో భాగంగా గురువారం పలు శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శితమయ్యాయి. హరి మంగళంపలి బృందం భరతనాట్యం, నితీష్ బృందం గర్బా, మృదుల ధర్మపురి సింహనందిని, ఆరతి బృందం ప్రదర్శించిన లావణి, అచ్యుత మానస ప్రదర్శించిన కథక్ నృత్యం, దేబోశ్రీ ప్రదర్శించిన ఒడిస్సీ, సుష్మా మహంతి ప్రదర్శించిన గొల్ల కలాపం వంటి అంశాలు ఆకట్టుకున్నాయి.

గంజాయి వ్యాపారి అరెస్టు

పెద్ద మొత్తంలో సరకు స్వాధీనం


వినోద్ సింగ్

గోషామహల్: లోయర్ ధూల్‌పేటలోని గంజాయి వ్యాపారి వినోద్‌సింగ్‌ను షాయినాయత్‌గంజ్ పోలీసులు గురువారం రాత్రి అరెస్టు చేశారు. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. లోయర్ ధూల్‌పేటకు చెందిన వినోద్ సింగ్(38) గంజాయి స్మగ్లింగ్ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందడంతో.. గురువారం రాత్రి అతని స్థావరంపై దాడి చేసి అరెస్టు చేయడంతోపాటు పెద్ద మొత్తంలో గంజాయి నిల్వలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం నిందితుడిపై ఎన్‌డీపీఎస్ యాక్టు కింద కేసు నమోదు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా అతనికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. దీంతో నిందితుడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

జూబ్లీహిల్స్

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు


అమీర్‌పేట, న్యూస్‌టుడే: టమోటా 11, నల్ల వంకాయ 15, పొడుగు వంకాయ 23, బెండ 31, పచ్చిమిర్చి 31, బజ్జీ మిర్చి 25, క్యాప్సికం 44, పచ్చకాకర 31, తెల్లకాకర 19, పందిరి బీర 31, బీర 19, క్యాబేజి 13, క్యారెట్ 46, దొండ 25, గుండుబీన్స్ 28, గింజ చిక్కుడు 38, చిక్కుడు 19, గోకరకాయ 31, కీర: 11, దోస 20, బీట్‌రూట్ 19, ఉల్లి 40, ఆలు 16, చామ 41, మొరంగడ్డ 19, కంద 25, గోబీ 31, సొర 15, పొట్లకాయ 13, అరటి 9, మునగ 10, మామిడి 12, ముల్లంగి 6, ఉల్లిపొరక 31, వెరుశనగ 40, నిమ్మకాయలు(కేజీ) 20.(గురువారం ధరలు)

నేటితో అన్నదాన కార్యక్రమానికి ముగింపు

వెంగళ్‌రావునగర్: వెంగళ్‌రావునగర్ డివిజన్ పరిధి జీటీఎస్‌కాలనీలోని శ్రీవీరాంజనేయ భవానీ శంకర, అయ్యప్ప సహిత శ్రీషిర్డీసాయిబాబా దేవస్థానంలో అయ్యప్ప భక్తులకు నవంబరు 16వ తేదీ నుంచి నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం శుక్రవారం రాత్రి అల్పాహారంతో ముగుస్తుందని ఆలయ ఈఓ మహేందర్ రెడ్డి తెలిపారు. దాతలు, భక్తుల సహకారంతో ఏటా 51 రోజులు పాటు అయ్యప్ప భక్తులకు అన్నదానం, అల్పాహారం ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

'మాంటేజ్-18' లఘుచిత్రోత్సవం నేడు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద గల సెయింట్ మేరీస్ కళాశాలలో శుక్రవారం 'మాంటేజ్-18' పేరిట జాతీయ లఘుచిత్రోత్సవం నిర్వహించనున్నట్లు కార్యక్రమ ప్రతినిధులు తెలిపారు. జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో విద్యార్థులు రూపొందించిన చిత్రాలను ప్రదర్శిస్తామని, ఉత్తమ చిత్రానికి నగదు బహుమతి అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



హలో ఈనాడు

శ్రీనగర్‌కాలనీ, యూసుఫ్‌గూడ	: 8008573352
వెంగళరావునగర్	: 8008902813
రహ్మత్‌నగర్	: 8008902814
షేక్‌పేట	: 8008573413

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే:

సమస్య: లక్ష్మీనరసింహానగర్ వీధులలో సమయపాలన లేకుండా నీటిసరఫరా చేస్తున్నారు. ఈ సరఫరా తక్కువ సమయం చేస్తుండటంతో నీరు సరిపోవడం లేదు. అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోగలరు.

–సుదర్శన్, లక్ష్మీనరసింహానగర్

సమాధానం: సమస్య మా దృష్టికి రాలేదు. సమయపాలనకు అనుగుణంగా నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– రామేశ్వర్, జలమండలి వర్క్స్ ఇన్‌స్పెక్టర్

కొబ్బరి పీచుతో గృహోపకరణాలు

● ఉపాధి కల్పనకు ప్రత్యేక శిక్షణ

రహ్మత్‌నగర్, న్యూస్‌టుడే: కొబ్బరి అనుబంధ పరిశ్రమలపై ఔత్సాహికులకు శిక్షణ శిబిరాల నిర్వహణకు కాయర్ బోర్డు కార్యాచరణ చేపడుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొబ్బరి పరిశ్రమలను ప్రోత్సాహించేందుకు కేంద్ర ప్రభుత్వం రాజమండ్రిలో కాయర్‌బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేసి శిక్షణ నిర్వహించేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో ఉప ప్రాంతీయ కార్యాలయాన్ని 2016 మార్చిలో నిమ్స్‌మే ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. కొన్ని నెలలుగా రాష్ట్రంలోని యాదాద్రి భువనగిరి జిల్లా, కరీంనగర్, వనస్థలిపురం తదితర ప్రాంతాల్లో కొబ్బరి పీచుతో తయారు చేసే ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. ఆసక్తి గల వారు కార్యాలయాల్లో సంప్రదిస్తే వారిని ప్రాంతీయ కార్యాలయమైన రాజమండ్రి, కేరళలో శిక్షణకు పంపిస్తున్నారు. తెలంగాణలో కొబ్బరి తోటలు అధికంగా లేకపోవడంతో శిక్షణ కార్యక్రమాలకు పెద్దగా ఆసక్తి చూపడం లేదని కాయర్ బోర్డు సిబ్బంది వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలోని వివిధ జిల్లాల్లో ప్రముఖ ఆలయాలు, నగరాలకు భారీగా కొబ్బరి బొండాలు ఆంధ్రా నుంచి ఎగుమతి చేస్తున్నారని, వాటిపై ఔత్సాహికులు దృష్టి సారిస్తే కొబ్బరి పీచు పరిశ్రమల ఏర్పాటు చేసే వీలుందని వ్యక్తం చేశారు. నగరంలో పెద్ద సంఖ్యలో కొబ్బరి నీళ్ల కోసం వినియోగించే బొండాలను సేకరించి ముడిసరుకుగా మార్చి వ్యవసాయ అనుబంధమైన కూరగాయ నర్సరీలకు వినియోగించే పొడిని తయారు చేసే వీలుందని వెల్లడించారు.



పీచుతో తయారు చేసిన వస్తువులు

ఆసక్తి ఉంటే శిక్షణ ఇప్పిస్తాం:

కేశవమూర్తి, కాయర్ బోర్డు

కొబ్బరి పీచుతో తయారు చేసే ఉత్పత్తులపై ఆసక్తి చూపే వారికి శిక్షణ ఇప్పిస్తున్నాం. పీచు తయారు చేసే ఉత్పత్తులను నాంపల్లిలోని షోరూమ్‌లో ప్రదర్శిస్తూ అమ్మకాలు సాగిస్తున్నాం. సిబ్బంది నియామకం, నిధులు కేటాయింపు జరిగితే మరిన్ని కార్యక్రమాలు చేపట్టే వీలుంది.

దళిత, గిరిజన వర్గాలకు ప్రత్యేక శిక్షణ..

కాయర్ ఉద్యమి యోజన పేరిట ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు కాయర్ బోర్డు పథకాలను ప్రవేశపెట్టింది. రూ.10 లక్షల వరకు వ్యయం అయ్యే పథకంలో 40 శాతం ప్రభుత్వం రాయితీని కల్పిస్తుంది. కొబ్బరి పీచు ఉత్పత్తుల తయారీపై ఆసక్తి కనబర్చే వారికి అవగాహన శిక్షణ కార్యక్రమాలను నిర్వహించేందుకు రూ.2లక్షల వరకు వ్యయం చేస్తున్నారు. ఆసక్తిగల వారు వివరాలకు నిమ్స్‌మేలోని ఉప ప్రాంతీయ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబరు 040-23202279, 94911 98862లో తెలుసుకోవచ్చు.

కొనసాగుతున్న మెట్రో పనులు



చెక్‌పోస్ట్ వద్ద కొనసాగుతున్న నిర్మాణ పనులు

యూసుఫ్‌గూడ: మెట్రో కారిడార్-3 పరిధిలోని అమీర్‌పేట్ నుంచి మాదాపూర్ వైపునకు కొనసాగుతున్న మెట్రో పనులలో భాగంగా శ్రీకృష్ణానగర్ ప్రాంతంలో పిల్లర్ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఓ వైపు మెట్రో పనులు పాటు రహదారిలో సైతం రోడ్డుకు ఇరువైపుల గల ఫుట్‌పాత్ పనులను సిబ్బంది చేస్తున్నారు. ఇటీవలే యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద గల ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీని నిర్మించిన సిబ్బంది అదేచోట ఫుట్‌పాత్ పనులు వేగవంతంగా పూర్తిచేస్తున్నారు. ఫుట్‌పాత్ పనులు పూర్తయితే ఈ ప్రాంతంలో బస్టాప్‌ను నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఉద్యానాల సమస్యలు పరిష్కరించాలి

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: కాలనీల్లోని ఉద్యానాల్లో కాలిబాటలను అభివృద్ధి చేసి, అవసరమైన మరమ్మతులు చేయాలని కార్పొరేటర్ కిలారి మనోహర్ అధికారులకు చెప్పారు. వెంగళ్‌రావునగర్ డివిజన్ పరిధి మధురానగర్ డి-బ్లాక్, వెంగళ్‌రావునగర్ ఎ-బ్లాక్ పార్కుల్లో గురువారం కార్పొరేటర్ మనోహర్ అధికారులతో కలిసి సందర్శించారు. మధురానగర్ డి-బ్లాక్‌పార్కులో కాలిబాట దెబ్బతిందని దీంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కార్పొరేటర్‌కు వివరించారు. స్పందించిన కార్పొరేటర్ ఉద్యానాల్లో నెలకొన్న సమస్యలను వీలైనంత తొందరగా పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈఈ రఫూఫ్, ఏఈ జమీల్, వార్డుకమిటీ సభ్యులు శంకర్‌ముదిరాజ్, తెరాస నాయకులు యలమంచిలి రవి, మధురానగర్ ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు పాల్గొన్నారు.



సమస్యలను కార్పొరేటర్‌కు వివరిస్తున్న కాలనీ ప్రతినిధులు

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలో మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు శ్రీకృష్ణానగర్‌లోని విక్టరీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సంజయ్‌గౌడ్‌తో కలిసి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేదల సంక్షేమమే ధ్యేయంగా తెరాస ప్రభుత్వం పనిచేస్తుందని, సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో తెరాస డివిజన్ అధ్యక్షులు బస్వరాజ్, వార్డు కమిటీ సభ్యులు సత్యనారాయణ, పెరుకరవి, ఆదిలక్ష్మి, గీతాగౌడ్, నాయకులు నర్సింగ్‌దాస్, రత్నకుమారి, నాగమణి, రమాదేవి, మాధవి, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గోపీనాథ్, సంజయ్‌గౌడ్

క్రిస్టియన్ కౌన్సిల్‌కు హాజరుకావాలి..

జూబ్లీహిల్స్: సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ నెల 5న తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించే నేషనల్ డే ఆఫ్ ప్రేయర్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని క్రైస్తవులందరూ హాజరుకావాలని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సూచించారు. నియోజకవర్గంలోని పాస్టర్లతో గురువారం జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశానికి హాజరయ్యేందుకు నియోజకవర్గంలో 50 బస్సులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. క్రైస్తవుల కోసం ఏర్పాటు చేస్తున్న ఈ సభకు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో తరలివెళ్లాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు విద్యాసాగర్, ఏసురాజు, జార్జ్ బినేసర్, ప్రభుదాస్, పాల్ అజరయ్యా, కృపాసన్నిధి, సౌమ్యామోజెస్ తదితరులు పాల్గొన్నారు.

ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శిగా రూప



రూపను సత్కరించి నియామక పత్రం అందజేస్తున్న నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ ప్రతినిధులు

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: శ్రీ మహిళ మండలి అధ్యక్షురాలు, వెంగళ్‌రావునగర్ డివిజన్ తెరాస నాయకురాలు బి.రూప నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు జ్యోతిబాయి పూలే జయంతి సందర్భంగా సంఘం నేషనల్ ప్రెసిడెంట్ ఎన్.గురుదేవ్ ఆమెకు నియామక పత్రం అందజేశారు. గురువారం వెంగళ్‌రావునగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రూప మాట్లాడుతూ శ్రీ మహిళా మండలి అధ్యక్షురాలుగా, బీసీ చైతన్య వేదిక రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలుగా తన సేవలను గుర్తించే ఆ పదవిలో నియమించారని ఆమె పేర్కొన్నారు. మహిళల హక్కుల కోసం పోరాడుతానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వేదిక రాష్ట్ర అధ్యక్షులు యాదగిరిచారి, గౌరవ అధ్యక్షులు భీమలశంకర్, బీసీ చైతన్య వేదిక వ్యవస్థాపకులు వీరవల్లి శ్రీనివాస్, తెరాస నాయకులు ఇందర్‌కుమార్, లక్ష్మీ, సాయిగిరి పాల్గొన్నారు.

ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు

బోరబండ, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు నోబుల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్‌మెంట్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ విజయలక్ష్మి తెలిపారు. డాటాఎంట్రీ ఆపరేటర్, బెడ్‌సైడ్ పేషంట్ అసిస్టెంట్, ఎలక్ట్రికల్ హౌస్‌వైరింగ్ తదితర కోర్సుల్లో శిక్షణనిచ్చి కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామని ఒక ప్రకటనలో ఆమె పేర్కొన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులైన, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిలైన 18 నుంచి 27 ఏళ్లలోపు వయసున్న వారు ఈ శిక్షణకు అర్హులు. 80742 34349, 88863 02244 నెంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.



షేక్‌పేట ప్రభుత్వ పాఠశాల ఎదుట రోడ్డుపై పారుతున్న మురుగు

మురుగు సమస్యతో ఇబ్బందులు

షేక్‌పేట: షేక్‌పేట ప్రభుత్వ పాఠశాల ఎదుట నెల రోజులుగా రోడ్డుపై మురుగు పారుతోంది. దీంతో ఆ మార్గంలో విద్యార్థులు, ప్రజలు రాకపోకలు సాగించలేక అవస్థలు పడుతున్నారు. మురుగు నిల్వ ఉండటంతో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. పైపులైన్ తరచూ పూడికలతో నిండిపోతుండడంతో మ్యాన్‌హోల్ పొంగుతోంది. తక్కువ సామర్థ్యం పైపులైన్ కావడంతో ప్రతిసారి ఇదే సమస్య తలెత్తుతోంది. జలమండలి యంత్రాంగం పూడికలు తొలగించిన అనతి కాలంలోనే సమస్య తిరిగి మొదటికి వస్తోంది. సమస్య పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

జూబ్లీహిల్స్

దాడి చేసిన నిందితుల రిమాండ్

జూబ్లీహిల్స్: ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించి, ఇంట్లోకి చొరబడి దాడి చేసిన ఘటనకు సంబంధించి నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సెక్టారు ఎస్సై కురుమూర్తి కథనం ప్రకారం..యూసుఫ్‌గూడ కార్మికనగర్‌కు చెందిన యు.అంజమ్మ(35) ఈ నెల 2న రాత్రి 9 గంటల ప్రాంతంలో తన బాబాయి జి. మల్లేష్‌తో కలిసి కార్మికనగర్‌లో రోడ్డు దాటేందుకు చేయి అడ్డుపెట్టారు. అదే సమయంలో శ్రీరాంనగర్ వైపు నుంచి వచ్చిన ఓ కారు వారి ముందు వేగంగా వచ్చి ఆగింది. కారులో ప్రయాణిస్తున్న కార్మికనగర్‌కు చెందిన శంషు, కైసర్, కరీమ్, ఖుర్షిద్ తదితరులు కారులో నుంచి కిందకు దిగుతూనే వారిని తిట్టడం ప్రారంభించారు. అంతటితో ఆగకుండా వారిపై చేయి చేసుకున్నారు. సమీపంలో ఉన్న ఉపేంద్ర, లక్ష్మి అనే ఇద్దరు నిలువరించేందుకు ప్రయత్నించగా వారిని కూడా కొట్టారు. దీంతో భయపడిన అంజమ్మ..బాబాయితో కలిసి సమీపంలో ఉన్న తన తండ్రి ఉప్పలయ్య ఇంటికి వెళ్లింది. అది గమనించిన నిందితులు ఇంట్లోకి ప్రవేశించి వారిని చితకబాదారు. ఇంటి సమీపంలో నివసించే ఒమర్ తదితరులు సైతం దాడికి వచ్చిన వారితో కలిసి కొట్టడమే కాకుండా ఇంటి పైకప్పును ధ్వంసం చేశారు. అంజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులపై కేసులు నమోదు చేశారు. వారిని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్తు కార్మికుడి దుర్మరణం

ఫిలింనగర్: వనపర్తి జిల్లాకు చెందిన కిష్టయ్య (35) గురువారం యూసుఫ్‌గూడ ఎల్ఎన్‌నగర్‌లో ఓ విద్యుత్తు స్తంభం ఎక్కి విధులు నిర్వహిస్తుండగా విద్యుత్తు సరఫరా అయి అక్కడికక్కడే మృతి చెందాడు. అధికారుల తప్పిదం వల్లే మృతి చెందాడని కార్మికులు ఆరోపిస్తుండగా.. ఇన్వర్టర్ వల్లే అలా జరిగి ఉంటుందని అధికారులు తెలిపినట్లు ఎస్సై భరత్‌భూషణ్ చెప్పారు.

బస్తీల్లో వసతుల కల్పనే లక్ష్యం: ఉపమేయర్

బోరబండ, న్యూస్‌టుడే: పేద, మధ్యతరగతి ప్రజలు అధికంగా నివసించే బస్తీల్లో కనీస వసతులు కల్పించడమే తన లక్ష్యమని ఉపమేయర్ ఎం.డి.బాబా ఫసియుద్దీన్ అన్నారు. బోరబండ డివిజన్ భారత్‌నగర్‌లో రూ.3.45 లక్షల వ్యయంతో చేపట్టనున్న తాగునీరు, భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులను స్థానిక మహిళా భవన్ వద్ద గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సమస్యలు లేని డివిజన్‌గా బోరబండను తీర్చిద్దేందుకు పాటుపడతానని హామీ ఇచ్చారు. బస్తీల్లో చేపట్టిన పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆయన ఆదేశించారు. పనుల ప్రారంభం అనంతరం ఆయన బస్తీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని చెప్పారు. తెరాస బోరబండ డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, కార్యదర్శి జి.ముత్యాలు, నాయకులు ఎన్.విజయ్‌కుమార్, షర్మిలా జాదవ్, ఎం.డి.యూసుఫ్, ఇమ్రాన్, ఖలీల్ పాల్గొన్నారు.

● బోరబండ డివిజన్ భారత్‌నగర్‌లో అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించిన ఆయన బస్తీలోని పాఠశాలకు వాహనంలో తరలిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుభ్రమైన పాత్రల్లో వండిన ఆహారాన్ని నిర్దేశిత పాఠశాలలకు ఆరోగ్యకర పరిస్థితుల్లో తరలించాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు, తెరాస నాయకులు ఆయన వెంట ఉన్నారు.

● బోరబండ డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత నివ్వాలని ఉపమేయర్ ఎం.డి.బాబా ఫసియుద్దీన్ సూచించారు. బోరబండ సైట్-1లోని తన కార్యాలయంలో ఎస్ఎఫ్ఏలు, వార్డు కమిటీ సభ్యులతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. రోజూ ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించాలన్నారు. రహదారులు, కూడళ్లలో పేరుకుపోయే చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. సైట్-3 కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న చెత్తకుప్పను తొలగించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వచ్ఛ నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్న ఉద్యమంలో బోరబండకు ప్రత్యేకస్థానం దక్కేలా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు.



పారిశుద్ధ్యంపై ఎస్.ఎఫ్.ఎలు, వార్డుకమిటీ సభ్యులతో చర్చిస్తున్న ఉపమేయర్ బాబా ఫసియుద్దీన్

క్యాన్సర్ బాధితుడికి జాగృతి సాయం

యూసుఫ్‌గూడ: బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న 9 నెలల బాలుడి కుటుంబ సభ్యులకు తెలంగాణ జాగృతి సభ్యులు రూ.25 వేల ఆర్థిక సాయం చేసి చేయూతనిచ్చారు. చత్తీస్‌గఢ్‌లో నివసించే రాకేష్‌చావ్లా కుమారుడు తేజా (9నెలలు) బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. సోషల్ మీడియా(ఫేస్‌బుక్) ద్వారా విషయం తెలుసుకున్న తెలంగాణా జాగృతి నగర కో కన్వీనర్ నరేందర్‌యాదవ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం జాగృతి నాయకులతో కలిసి రూ.25 వేల రూపాయలను రాకేష్‌చావ్లా ఖాతాలో జమచేశారు. భారతి, పల్లవి, హైమావతి, సునీత, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు చూపుతున్న తెలంగాణ జాగృతి సభ్యులు

అభివృద్ధి పనులు పరిశీలించిన కార్పొరేటర్

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: బస్తీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని రహ్మత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ షఫీ అన్నారు. డివిజన్ పరిధిలోని హెచ్ఎఫ్ నగర్ ఫేజ్-2లో వరద నీటి కాలువపై చేపడుతున్న మెట్ల నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇక్బాల్, హబీబ్, సమద్, ముబీన్, పాషా, ముఖీమ్, తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ షఫీ



SAREES

పాతకంచిపట్టు గద్వాల్, ప్యూర్‌జరీచీరలు 500-25,000 వరకు కొనబడును డొర్‌డెలివరిసౌకర్యం@కలింగభవన్,రోడ్‌నెం12బంజారాహిల్స్ ✆ 9703141777/ 9849977972

PACKERS & MOVERS

Peacock Pac & Move Loc & All D2D. 24/7 DSNR: 24048555 KP: 9959789555 MADAPUR: 9000456555 AMPT: 64539555 'B' VJA, VSP, GNT, NEL, ONG, MUM, BNG, DEL

WATER PROOFING

శ్రీసాయిభవానివాటర్‌ప్రూఫింగ్, సీలింగ్, వాటర్‌ట్యాంక్స్ సైడ్‌వాల్స్, సంపు, బాత్‌రూమ్స్ కెమికల్స్‌తో అనుభవం గల టెక్నీషియన్స్‌తో 10 సం॥ల గ్యారెంట్‌తో చేయబడును✆ 9948270898

HEARING AIDS

ఫ్రీ వినికిడి పరీక్ష 10-20% డిస్కౌంట్ అతి చిన్న బయటకు కనబడని వినికిడి మిషన్లపై ఈ వారం మాత్రమే ఆరో హియరింగ్ క్లినిక్. ✆ 9989819189

TAILORING

ప్రజ్ఞశ్రీ ఇన్స్టిట్యూట్ ఫ్యాషన్‌డిజైనింగ్ బోటిక్ మేనేజ్‌మెంట్ టైలరింగ్, కిడ్స్‌వేర్, మగ్గంవర్క్స్, పెయింటింగ్ నేర్పబడును. మెట్రో బ్యాక్‌సైడ్, మూసాపేట్ ✆ 7306465277

EDUCATION

Free..డెమో CBSE/ ICSE/ స్టేట్‌సిలబస్ ప్లే..స్కూలైనా.. ఏస్కూలైనా మీఇంటి వద్దనే నెలకు రూ.100. మీఇంట్లోనే డిజిటల్ క్లాస్‌రూం సౌకర్యం కలదు. ✆ 7075270123/ 9848569337

HOME TUTIONS

B.S.Home Tutions VI-XII. All C.B.S.E/ I.C.S.E. All Boards. Inter, IIT, J.E.E, NEET, Chemistry, Phy, Maths, ✆ 9912639222/ 9848591739

CVR Mathematics Provides All Subjects in Classes I-X, Inter, Eamcet, IIT B.Tech. Welcome Tutors ✆ 7842227986 / 7842527986

Rushi HomeTuitions, Provide Exp Home Tutors for Lkg-X (SSC,CBSE,ICSE)inter(IPE,/IIT/EAMCET/ NEET) Maths, physics &che ✆ 9505533334

Home Tutor Available for Maths And Physics for IV to VIII Classes State CBSE Syllabus. Cont: 7306839333

AYURVEDIC

సంతాన లేమి, చర్మరోగములు, నడుము నొప్పి, క్యాన్సర్, మధుమేహము, అధికబరువు, ఆస్తమా, కామెర్లు, BP, HIV, మూర్ఛ మొ॥ దీర్ఘవ్యాధులకు 40 సం.గా ఆయుర్వేదానుభవమున్న ప్రొఫెసర్, డా॥ ఉప్పలపాటి సుధాకరరావు. MD (Ay); Ph.D, రిటైర్డ్ ప్రిన్స్‌పాల్ గారి ప్రత్యేక వైద్యముకై సంప్ర. ✆ 9866190200.

PHYSIOTHERAPY

సాయి రన్యత ఫిజియో థెరపి క్లినిక్ డా॥ L.V. Siva Reddy గారిచే బ్యాక్, నెక్, భుజాల నొప్పులు, Paralysis, TKR & ACL మొ॥ Laser థెరపి కలదు. ✆ 9700719727/ 48526777, 20% సీనియర్ సిటిజన్స్.

PEST CONTROL

OMKSR Pest Control white ants woodborers Treatment Guarantee Only Kitchen Cockroaches, Spray Gel: 499/-. ✆ 9550446581/ 9666566081.

Reddorkins Pest Control: కాక్రోచ్‌జెల్ రూ. 499/- చెదలు, ఫర్నీచర్ పౌడర్‌రాలుట, నల్లులు, బల్లులు, చీమలు, ఎలుకలు, తేనేటీగలు, దోమలు . ✆ 9989956152

ASTROLOGY

Sri Agasthiyar Bhrigunadi & Astrology Beside Bata Nizampet(V) www.agasthiyarbhrigunadi.com ✆ 9652007674 / 8008994154

త్రిముఖ దుర్గాజ్యోతిష్యం - సమ్మక్కపూజారి: ప్రేమ, పెళ్లి, సంతానం, విద్య, ఉద్యోగం, వ్యాపారం, కుటుంబం, కోర్టు సమస్యలు పరిష్కారం చేయును. సికింద్రాబాద్ స్వాతి హోటల్ ప్రక్క వీధిలో. Ph: 9542025298

OLD AGE HOME

Susheel Foundation Oldage Home. Homely Atmosphere Personal Medical Care. Veg Food. @ Madinaguda, Miyapur ✆ 9030008981, 9030217194

సుబ్బయ్య ఓల్డేజ్‌హోం & హోంకేర్ సర్వీస్: వృద్ధులకు, మంచానున్న వారికి 24 గం॥ సేవలు చేయుటకు అనుభవం గల ఆయా/అటెండర్లను మీ ఇంటికి పంపగలం ✆ 9603159955/ 9603369955/ 9603429955/ 9603829955

నాగబాబు ఓల్డేజ్‌హోం & హోంకేర్ సర్వీస్: వృద్ధులకు, మంచానున్న వారికి 24 గం॥ సేవలు చేయుటకు అనుభవం గల ఆయా/అటెండర్లను మీ ఇంటికి పంపగలం ✆ 9010368855/ 9010418855/ 9010478855/ 9133138855

శ్రీదేవి ఓల్డేజ్‌హోం & హోంకేర్ సర్వీస్: వృద్ధులకు, మంచానున్న వారికి 24 గం॥ సేవలు చేయుటకు అనుభవం గల ఆయా/అటెండర్లను మీ ఇంటికి పంపగలం ✆ 9640297766/ 9640017766/ 9603857766/ 9640327766

శ్రీధర్ ఓల్డేజ్ హోం & హోంకేర్ సర్వీస్: వృద్ధులకు, మంచానున్నవారికి 24 గం॥ సేవలు చేయుటకు అనుభవం గల ఆయా/ అటెండర్లను మీ ఇంటికి పంపగలం. ✆ 9505197788/ 9505317788/ 9553407788/ 9553287788.

అంజన్న హోమ్‌కేర్/నర్సింగ్ / బేబీకేర్ సర్వీసెస్. వృద్ధులు, మంచానున్నవారికి 24సం॥ మీఇంటివద్ద ఉండి సేవలు చేయుటకు నర్సులు / ఆయామ్మలు, వార్డ్‌బాయ్స్‌ను పంపగలము. కూకట్‌పల్లి. ✆ 9133833544 / 9000967963 / 9959933359 / 9704161063 / 9963489661 / 9966568882 www.anjannahomecare.in

అనుభవజ్ఞులైన డా॥రఘు & డా॥ నీలు రఘు గార్లచే మంచి ఇంటిలాంటి వాతావరణంలో 24గంటలు డాక్టర్, ఫిజియో, నర్స్, అటెండర్ మొ॥ సేవలతో సహాయ వృద్ధాశ్రమం. Sahaya Physio & Oldage Home ✆ 9966019930 / 9063124384

బ్రాహ్మణ వృద్ధాశ్రమం మనవృద్ధులు ఏదోఒకచోట చేరడంవల్ల సంస్కృతి ఆచారాలకు నష్టం బ్రాహ్మణత్వానికి ప్రమాదం. బ్రాహ్మణాశ్రమంలో చేర్పించి జాతిగౌరవం కాపాడండి ✆ 9348393485

భగవాన్ ఓల్డేజ్‌హోం & హోంకేర్ సర్వీస్: వృద్ధులకు, మంచానున్న వారికి 24 గం॥ సేవలు చేయుటకు అనుభవం గల ఆయా/అటెండర్లను మీ ఇంటికి పంపగలం ✆ 9133702211/ 9133652211/ 9133762211/ 9133742211

రమ్య హోంకేర్: మంచాన ఉన్న పేషెంట్లకు, వృద్ధులకు సేవచేయడానికి, వంటచేయడానికి, పిల్లలను చూసుకోవడానికి పనివారిని పంపగలం. ✆ 7093431444/ 7032747888

డాక్టర్లతో With మెడిసిన్స్"శ్రీసాయి అమృత ఓల్డేజ్ హోం & Rehabilitation Centre" ఆర్థో, ఫిజియో, సైకో, బ్రైన్ స్ట్రోక్స్ వారికి 24 గం॥ కేర్ హబ్సిగూడ, తార్నాక సంప్ర: 9949362765

TV REPAIR

LCD, LED T.V మీఇంటివద్దనే రిపేరు Samsung, LG, Sony, V.Con, Philips, Sansui Spl: Pannel Repairs ✆ 7893501636 / 8801121373

SOFA REPAIR

Famous: **మీఇంటి** వద్దనే అన్నిరకాల సోఫాలు, ఇటాలియన్ మలేషియన్ కుషన్స్ రిపేరు చేస్తాం. సిటిలో 12 బ్రాంచీలు ✆ 9652416732/ 9885062480

SECONDS SALE

A/c, **బ్యాటరీలు,** UPS, కంప్యూటర్ ఎలక్ట్రానిక్స్ ఉడెన్ హాస్టల్, హౌస్, హోటల్, గ్లాస్, ప్లైఉడ్, ఐరన్ స్క్రాప్, ఐరన్ అలమార, డోర్స్, 8686271616

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కార్వాన్

నేడు విద్యుత్తు సరఫరా ఉండని ప్రాంతాలు

జాంబాగ్, న్యూస్‌టుడే: 11 కె.వి. ఆసిఫ్‌నగర్ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టీఎస్‌పీడీసీఎల్ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాంగార్‌బస్తీ, ఆసిఫ్‌నగర్, జెడ్ కేఫ్, మల్లేపల్లి, అఫ్జల్‌సాగర్, సీతారామ్‌పేట్, గంజాషాదర్గా తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదు.

కంచెలుండవు.. కీడు జరిగితే..?

రక్షణ లేని విద్యుత్ నియంత్రికలు, ఫ్యూజ్‌బాక్స్‌లతో ప్రమాదం



తాళ్లగడ్డలో..

కార్వాన్, న్యూస్‌టుడే: రక్షణ కంచెలు లేని విద్యుత్ నియంత్రికలు, తక్కువ ఎత్తులో మూతల్లేకుండా ఉన్న ఫ్యూజ్‌బాక్సులు చెత్త కుండీలుగా మారి జనాన్ని ఆందోళనకు గురి చేస్తున్నాయి. హైటెన్షన్ విద్యుత్ ప్రవహించే నియంత్రికల వద్ద సైతం రక్షణ కోసం ఏర్పాటు చేసిన సిమెంట్ కంచెలు తెగి చిందరవందరగా ఉన్నాయి. గజిబిజిగా ఉన్న హైటెన్షన్ విద్యుత్ ప్రసరించే వైర్లు సైతం కిందికి వేలాడుతూ కార్వాన్ ప్రాంత వాసుల్ని భయపెడుతున్నాయి. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా సమస్య తీవ్రతను ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని తాళ్లగడ్డ, టప్పాచబుత్ర, దరియాబాగ్, ముస్తయిద్‌పురా, రాంసింగ్‌పురా, సబ్జిమండి, జాఫర్‌గూడ బస్తీల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దగా బడ్జెట్ కేటాయింపులు అవసరం లేని చిన్న పనులు చేయడానికి కూడా అధికారులు శ్రద్ధ చూపడం లేదని ఆరోపిస్తున్నారు. రక్షణ కంచెలను ఏర్పాటు చేయమని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బస్తీలు, యువజన, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు. విద్యుత్ నియంత్రికల వద్ద చెత్త పేరుకుపోతోందని జనం వివరిస్తున్నారు. నియంత్రికల నుంచి వేడి గాలులతోపాటు నిప్పురవ్వలు ఎగిసి పడి అనేకసార్లు ప్రమాదాలు చోటుచేసుకున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. దీనికితోడు తక్కువ ఎత్తులో మూతల్లేని ఫ్యూజ్‌బాక్సులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. గతంలో కార్వాన్ గ్రంథాలయం, కార్వాన్ జలమండలి కార్యాలయం, సబ్జిమండి, తాళ్లగడ్డ రాజలింగయ్య కబడ్డీ స్టేడియం, టప్పాచబుత్ర, అశోక్‌విహార్ కాలనీలలో విద్యుత్ నియంత్రికల వద్ద అగ్నిప్రమాదాలు జరిగిన సంఘటనల్ని జనం మరచిపోలేదు. ఆ సమయంలో వచ్చిన అధిక, అల్ప విద్యుత్ సరఫరాతో తమ విలువైన గృహోపకరణాలు బుగ్గిపాలయ్యాయని చెబుతున్నారు. నష్టపరిహారం ఇస్తామని అధికారులు చెప్పిన మాటలు ఇంత వరకూ ఆచరణకు నోచుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇలాంటి ప్రమాద సంఘటనలు తరచూ జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దుర్ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు విద్యుత్ నియంత్రికల వద్ద రక్షణ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు. నియంత్రికల వద్ద చెత్తను తొలగించి, వదులై వేలాడుతున్న విద్యుత్ తీగల్ని తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తక్కువ ఎత్తులో మూతల్లేకుండా ఉన్న ఫ్యూజ్‌బాక్సుల్ని సవరించడంతోపాటు పిల్లలకు అందకుండా ఎత్తులో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కార్వాన్ బస్తీల వాసులు ట్రాన్స్‌కో, జీహెచ్ఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



దరియాబాగ్‌లో..



టప్పాచబుత్రలో..



అంబేద్కర్‌నగర్‌లో..

శబ్దకాలుష్యాన్ని తగ్గించేందుకు సహకరించాలి



ఫంక్షన్‌హాళ్ల యజమానులతో సమావేశమైన సీఐ ఖలీల్‌పాషా

గోల్కొండ: రాత్రిళ్లు శబ్దకాలుష్యాన్ని తగ్గించేందుకు ఫంక్షన్‌హాళ్ల యజమానులు పోలీసులకు సహకరించాలని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఖలీల్‌పాషా అన్నారు. బుధవారం రాత్రి గోల్కొండ పోలీసు ఠాణాలో ఫంక్షన్‌హాళ్ల యజమానులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ రాత్రిళ్లు ఫంక్షన్‌హాళ్ల నుంచి వచ్చే శబ్దంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చుట్టుపక్కల నివాసం ఉండే వారి నుంచి అధిక సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఫంక్షన్‌హాళ్ల యజమానులు రాత్రిళ్లు డీజేలకు అనుమతి ఇవ్వవద్దన్నారు. ఈ మేరకు ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యజమానులు తమ ఫంక్షన్‌హాళ్లలో డీజేలకు అనుమతి లేదని సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. చుట్టూ నివాసం ఉండే స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మసలుకోవాలన్నారు. ఇతరులకు ఇబ్బందులు కలిగేలా వాహనాల పార్కింగ్ ఉండవద్దన్నారు. సమావేశంలో ఎస్ఐ కోటేశ్ పాల్గొన్నారు.

డైనందిని ఆవిష్కరణ

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదార్ల డైనందినిని గురువారం రాత్రి తెలంగాణ రాష్ట్ర ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ విభాగం డైరెక్టర్ కేఎస్ఆర్‌సీ మూర్తి ఆవిష్కరించారు. అబిడ్స్‌లోని సంస్థ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జేఏసీ ఛైర్మన్ కె. లక్ష్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన డైరీని ఆవిష్కరించి ప్రసంగించారు. పింఛనుదార్లకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తోన్న సదుపాయాలు సంతృప్తికరంగా ఉన్నాయని చెప్పారు. ఆరోగ్యశ్రీ సీఈఓ పద్మ, పింఛనుదార్ల సంఘం జేఏసీ ఛైర్మన్ పూర్ణచందర్, నారాయణరావు, శుభాకర్‌రావు, సూర్యనారాయణ, మాణయ్య, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె. లక్ష్మయ్య మాట్లాడుతూ పింఛనుదార్ల సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టి ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించాలని కోరారు.

అనాథ విద్యార్థులను ఆదుకోవాలి

బేగంబజార్, న్యూస్‌టుడే: అనాథ విద్యారులను ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ఆదుకోవాలని తెలంగాణ ఛాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ సభ్యులు, కురుమ సంఘం ట్రస్టు బోర్డు ఛైర్మన్ దేవర రాజేశ్వరరావు అన్నారు. గురువారం ఉస్మాన్‌గంజ్‌లోని అనాథ ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. అనాథ విద్యార్థులకు కావాల్సిన ఆహార పదార్థాలు, పప్పుధాన్యాలు, నూతన దుస్తుల కోసం ఆయన స్వచ్ఛందంగా రూ. 50 వేలు ఆశ్రమ నిర్వాహకులు క్యాతం రాధాకృష్ణకు అందజేశారు.

ఉస్మానియా ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఉస్మానియా ఆసుపత్రి: అనారోగ్యంతో బాధపడుతూ ఓ గుర్తు తెలియని వ్యక్తి ఉస్మానియా ఆవరణలో మృతి చెందిన సంఘటన అఫ్జల్‌గంజ్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 40 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉందని గురువారం ఉస్మానియా సిబ్బంది అఫ్జల్‌గంజ్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలికి వెళ్లిన పోలీసులు శవ పంచనామా జరిపి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి ఒంటిపై గాయాలేమీ లేవనీ, అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని పోలీసులు చెప్పారు. మృతుడి ఒంటిపై ఎరుపు రంగు, నలుపు గళ్ల చొక్కా, నీలి రంగు ప్యాంటు ఉన్నాయని చెప్పారు. మృతదేహాన్ని ఉస్మానియా శవాగారంలో భద్రపర్చామనీ, సంబంధీకులెవరైనా ఉంటే సంప్రదించాలని తెలిపారు. ఈ మేరకు అఫ్జల్‌గంజ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోవెల రంగనాయకస్వామి జాతర

సంక్రాంతికి మూడురోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు



ఆలయం

గోల్కొండ, న్యూస్‌టుడే: నానల్‌నగర్ డివిజన్‌లోని శ్రీ కోవెల రంగనాయకస్వామి ఉత్సవాలను మూడురోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అదనపు కమిటీ చర్యలు చేపట్టింది. శతాబ్దాల చరిత్ర గల ఈ ఆలయంలో ప్రతి సంక్రాంతికి మూడు రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేవారు. గతంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఎడ్లబండిపై ఇక్కడికి చేరుకుని మూడురోజుల పాటు జరిగే ఉత్సవాల్లో పాల్గొనేవారు. ఉత్సవాలకు సంబంధించి గత ఆదివారం దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి మహేందర్‌రెడ్డి అదనపు కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయం, గుండానికి రంగులు వేయనున్నారు. అదే విధంగా ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించడంతో పాటు మూడు రోజుల పాటు ఇక్కడికి వచ్చే భక్తులకు అన్నదానం చేయనున్నారు. అదే విధంగా భజన కార్యక్రమాలు చేపట్టనున్నారు. శ్రీ కోవెల రంగనాయకస్వామి ఆలయానికి ఘనమైన చరిత్ర ఉంది. చర్మవ్యాధులతో బాధపడే వారు ఇక్కడ ఉన్న గుండంలో స్నానం చేసి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తే వ్యాధుల నుంచి విముక్తి పొందుతారనే నమ్మకం ఉంది. ఇక్కడ ఉన్న గుండం వేసవిలోనూ నిండుకుండలా ఉంటుంది. ఇందులోని నీరు ఎప్పటికి ఎండదని కమిటీ వారు తెలిపారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న ఉత్సవాలను దేవాదాయశాఖ సహకారంతో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు: ప్రస్తుతం ఉన్న ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు మాజీ కమిటీ అధ్యక్షులు, ప్రస్తుత సలహాదారు నర్సింహ తెలిపారు. గతంలో ఆలయానికి 7 ఎకరాల 26 గుంటల స్థలం ఉండేదని అది కబ్జాకు గురైందన్నారు. ఆలయ పరిధిలో విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. సీసీ రోడ్లు మంజూరు చేయించామన్నారు. ఆలయ స్థలంలో ఉన్న దుకాణాల ద్వారా ఆలయానికి ప్రతి నెల అద్దె వస్తోందన్నారు. ఆలయం పేరుతో ఉన్న బ్యాంకు ఖాతాలో రూ. 3.5 లక్షలు ఫిక్స్ డిపాజిట్ ఉందని పేర్కొన్నారు. అదే విధంగా దేవాదాయశాఖ ట్రిబ్యునల్‌లో కూడా ఆలయం పేరుతో రూ. 5 లక్షల డిపాజిట్లు ఉన్నాయన్నారు.



రంగనాయకస్వామి

ఆర్టీసీ బస్సు ఢీకొని ఆటోడ్రైవర్ మృతి

బేగంబజార్, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ఢీకొని ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయాలపాలై మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి అఫ్జల్‌గంజ్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాదర్‌ఘాట్, మూసానగర్ ప్రాంతానికి చెందిన షేక్ రషీద్ (40) బుధవారం రాత్రి పని నిమిత్తం వెళ్లి చాదర్‌ఘాట్ సాయిబాబా ఆలయ సమీపంలోని ప్రధాన రోడ్డు దాటుతుండగా చాదర్‌ఘాట్ నుంచి గౌలిగూడ వైపు వేగంగా దూసుకువెళ్లిన ఉప్పల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో తీవ్రంగా గాయాలపాలైన రషీద్ పరిస్థితి విషమించడంతో సంఘటనా స్థలిలోనే మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవరు రవీందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు అఫ్జల్‌గంజ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూకట్‌పల్లి

కూకట్‌పల్లి రైతుబజారులో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: (కిలో రూపాయల్లో.. గురువారం ధరలు) టమాట- 11, వంకాయ- 23, బెండకాయ- 31, పచ్చిమిర్చి- 31, బజ్జీమిర్చి- 25, కాకర- 31, బీర- 31, క్యాబేజీ- 13, బీన్స్- 28, క్యారెట్- 36, గోబీ- 31, దొండ- 25, చిక్కుడు- 38, గోరుచిక్కుడు- 31, బీట్‌రూట్- 19, క్యాప్సికం- 35, ఆలుగడ్డ- 16, సోర- 15, పోట్ల- 13, కందగడ్డ- 25, ఉల్లిగడ్డ- 40, అరటి కాయ- 8, 9, గుమ్మడికాయ- 13, నిమ్మకాయ- 12, 16, మునగ- 10, 14, బఠాణీ- 44.

ఆరోగ్య కేంద్రాలకు భవనాలు కావలెను!

మంజూరైనా ఏర్పాటుకు నోచుకోని పరిస్థితి

● ఐదింటిలో ఒక్కదానికే ఉన్న భవనం ● కూకట్‌పల్లి, బాలానగర్ మండలాల్లో పరిస్థితిదీ

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే

జనాభా చూస్తే లక్షల్లో.. ప్రభుత్వ ప్రాథమిక వైద్యం మాత్రం అందేది కొందరికే. అందనిద్రాక్షలా మారిన వైద్యాన్ని అందించేందుకు ముందుకొచ్చినా కార్యాచరణకు నోచుకోని పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటివరకు ఉన్న ఒకేఒక్క ఆరోగ్య కేంద్రానికి మద్దతుగా మరికొన్ని మంజూరయ్యాయని సంతోషించినా.. ప్రయోజనం మాత్రం కనిపించడంలేదు. వాటి ఏర్పాటుకు భవనాలు దొరకడంలేదు.. నెలలు గడుస్తున్నా ఇదే పరిస్థితి.. అద్దె కూడా ఇస్తామని ప్రైవేటుగా ప్రయత్నిస్తున్నా ఫలితంలేకపోయింది. చివరికి సంబంధిత శాఖవారు జీహెచ్ఎంసీ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు ప్రారంభించారు. గ్రేటర్‌కు చెందిన భవనాలను చూపాలని వారిని కోరుతున్నారు. ఇందులో సాధ్యాసాధ్యాలపై అధికారులు సమీక్షిస్తున్నారు. అన్ని ప్రాంతాలకు ప్రాథమిక వైద్యం అందుబాటులోకి వస్తుందని ఆశించిన వారిని ఈ పరిస్థితి ఉసూరుమనిపిస్తోంది. కూకట్‌పల్లి, బాలానగర్ మండలాల పరిధిలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు భవనాల కోసం కొనసాగుతున్న అన్వేషణ ఇది.



బాలానగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం

కూకట్‌పల్లి, బాలానగర్ మండలాల పరిధిలో 2011జనాభా లెక్కల ప్రకారం 5,70,000మంది జనాభా ఉన్నారు. ఇక తాజా లెక్కల అంచనా 8లక్షలకు పైగానే ఉంది. దీని ప్రకారం.. రెండు మండలాల్లో కలిపి ప్రభుత్వ ప్రాథమికవైద్యం అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు పదికి పైగానే ఉండాలి. ప్రస్తుతం ఉన్నది మాత్రం ఒకే ఒక్కటి. మొత్తం 8లక్షల జనాభాకు ఇదొక్కటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. రెండు మండలాల్లో 11డివిజన్లలోని పేద, మధ్యతరగతి వారంతా ప్రాథమిక వైద్యం కావాలంటే బాలానగర్ వినాయకనగర్‌లోని ఈ కేంద్రానికి రావాల్సిందే. చాలామందికి ఇక్కడ ఈ కేంద్రం ఉందన్న విషయం కూడా సరిగా తెలియదు. దీంతో పేదలకోసం ఏర్పాటైన ప్రాథమికకేంద్రం నామమాత్రంగా వినియోగమవుతూ కొనసాగుతోంది. దీనికి అనుసంధానంగా ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నా అవి కేవలం టీకాలకు పరిమితయ్యాయి. కొన్ని దశాబ్దాలుగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పెంపు ప్రతిపాదన ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు.

ఐదు కేంద్రాలకు ఆమోదం.. మొత్తంమీద గతేడు ప్రభుత్వం కొత్తగా మరో ఐదు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు ఆమోదం ఇస్తూ ఉత్తర్వులు జారీచేసింది. వీటిని పేదలకు అందుబాటులో ఏర్పాటుచేసే ఆలోచనతో ఒక స్పష్టతకు వచ్చారు. జగద్గిరిగుట్ట, ఎల్లమ్మబండ, మూసాపేట, హస్మత్‌పేట, కూకట్‌పల్లిలో ఏర్పాటుకు నిర్ణయించారు. ఈ ప్రాంతాల్లో భవనాల కోసం కొన్ని నెలలుగా అధికారులు అన్వేషిస్తున్నారు. కూకట్‌పల్లికి సంబంధించి వివేక్‌నగర్‌లో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవనం ఉండటంతో దానిలోనే ఏర్పాటుచేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మిగిలిన నాలుగింటికి మాత్రం భవనాలు దొరకడంలేదు. మిగిలిన నాలుగు ప్రాంతాల్లో ఇవి అందుబాటులోకి వస్తే దాదాపుగా పేదప్రజలకు చాలా వరకు ప్రాథమిక వైద్యం సమీపంలోకి వస్తుందని చెప్పొచ్చు. అటు ప్రభుత్వం, ప్రైవేటుకు సంబంధించి భవనాలు లేక సిబ్బంది కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

ఇప్పటికే వైద్యుల నియామకం పూర్తి!

వాస్తవంగా ఇప్పటికే వైద్యుల నియామకం పూర్తయ్యిందని అధికారులు చెబుతున్నారు. ఇక కేంద్రాలు సిద్ధమైతే వైద్యులతో పాటు సిబ్బంది కూడా వచ్చేస్తారని అంటున్నారు. భవనాలు మాత్రం దొకరడంలేదు. ప్రైవేటుగా ఎవరైనా ఇస్తారని రూ.15వేల అద్దె ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఈ దిశగా కూడా ప్రయత్నాలు చేశారు. ఎవరూ అందుకు సుముఖత చూపడంలేదు. దీంతో తాజాగా సామాజిక భవనాల వైపు అధికారుల చూపు మళ్లింది. ఇందుకు ఇప్పటికే రెండుసర్కిళ్ల ఉప కమిషనర్లు దశరథ్, అలివేలుమంగతాయారును కలిశారు. వారితో చర్చించడంతో సామాజిక భవనాల సౌలభ్యంపైనా దృష్టి సారించారు. ఇప్పటికే సామాజిక భవనాలు అన్నీ ప్రజా సంక్షేమసంఘాలు, ఇతరత్రా సమావేశాలు, కార్యక్రమాలకు ఉపయోగపడుతున్న నేపథ్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఒక్కసారి ఇస్తే మళ్లీ తిరిగిరాదన్న ఆలోచనలో ఉన్నారు. ఈ విషయంలో తర్జనభర్జన పడుతున్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్లతో కూడా మాట్లాడుతున్నారు. భవనాలను చూపించాలని కోరుతున్నారు. ఈ పరిస్థితుల మధ్య అసలు భవనాలు దొరుకుతాయా.. లేదా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఎలాగైనా ఈ నెలాఖరులోగా భవనాలను చూడాలన్న ప్రయత్నాల్లో మాత్రం వైద్యాధికారులు ఉన్నారు.

శుద్ధ తాగునీరు అందించాలని వినతి

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: డివిజన్‌లోని కొన్ని రద్దీ ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం మినరల్ తాగునీటి సౌకర్యం ఏర్పాటుచేయాలని కార్పొరేటర్ పన్నాల కావ్యారెడ్డి మేయర్ బొంతు రామ్మోహన్‌ను కోరారు. గురువారం ఆయన్ని కలిసి వినతిపత్రం సమర్పించారు. అతిపెద్ద డివిజన్‌లో ఒకటైన బాలాజీనగర్‌లోని కేపీహెచ్‌బీకాలనీ టెంపుల్‌బస్టాపు, మూసాపేట తదితర రద్దీ ప్రాంతాల్లో ప్రజలు ఈ ఏర్పాట్లు చేస్తే ప్రజల దాహార్తిని తీర్చవచ్చున్నారు. రాబోయే వేసవికి ముందే ఈ ఏర్పాట్లు చేయాలని కోరారు. అవసరమైన చోట్ల ప్రజా మూత్రశాలలు కూడా ఏర్పాటుచేయాలన్నారు. డివిజన్‌లోని రోడ్డు నంబర్-3లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కొత్తలైన్లు ఏర్పాటుచేస్తామని గురువారం ఆమె స్థానికంగా పర్యటించి హామీ ఇచ్చారు. తెరాస నేతలు సాయినాథ్‌రెడ్డి, తుల్జారాం, తులసిరెడ్డి, రాజిరెడ్డి, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మేయర్‌కు వినతిపత్రమిస్తున్న కావ్యారెడ్డి

కూలిన సెంట్రింగ్.. తప్పిన ప్రమాదం

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: ఓ నిర్మాణంలో ఉన్న భవనంపైనుంచి సెంట్రింగ్ బాక్సులు పక్కింటి ఆవరణలో పడగా త్రుటిలో ప్రమాదం తప్పింది. కూకట్‌పల్లి దయార్‌గూడలో జీప్లస్ త్రీ అంతస్తుల్లో నిర్మాణమవుతున్న భవనంలో మూడో అంతస్తు శ్లాబు వేసేందుకు సెంట్రింగ్ బాక్సులు కడుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు బాక్సులు కొన్ని ఊడి పక్కనేఉన్న ఇంటి ఆవరణలో పడ్డాయి. అది ఖాళీ స్థలం కావడం, ఆ సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటనపై ఆ ఇంటి యజమాని ఫిర్యాదు చేయడంతో సర్కిల్ ఉప కమిషనర్ అలివేలుమంగతాయారు సహా పట్టణ ప్రణాళిక అధికారులు, సిబ్బంది వెంటనే అప్రమత్తమై అక్కడికి చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించి భవన యజమానిని హెచ్చరించారు. కనీస జాగ్రత్తలు పాటించకుండా నిర్మాణం చేయడంపై నోటీసు ఇవ్వాలని అధికారులను డీసీ ఆదేశించారు. అనుమతి పత్రాలను పరిశీలించారు. జాగ్రత్తలు తీసుకున్న తర్వాతే పనులు కొనసాగించాలని ఆమె సూచించారు.



నాలుగో అంతస్థు నుంచి కూలిన సెంట్రింగ్ బాక్సుల భాగం

'ప్రభుత్వ పథకాలను కార్మికుల్లోకి తీసుకెళ్లాలి'

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ పథకాలను కార్మికుల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని భాజపా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మాధవరం కాంతారావు, మజ్దూర్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. గురువారం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జరిగిన మజ్దూర్ మోర్చా కార్యవర్గ సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. మజ్దూర్ నేతలు ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక పథకాలను వివరించి చైతన్యం తీసుకురావాలన్నారు. వాటిని వినియోగించుకునేలా ప్రచారం చేయాలన్నారు. మజ్దూర్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, నేతలు శ్రీకర్ రావు, సురేందర్‌రెడ్డి, రవికుమార్, వేణుగోపాల్, శ్రీధర్, లక్ష్మణ్, మల్లేష్, రాజుగౌడ్, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిలిపిన కారు నుంచి రూ.5లక్షలు చోరీ

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: రహదారి పక్కన నిలిపిన కారులో నుంచి గుర్తుతెలియని వ్యక్తి నగదు చోరీ చేసిన సంఘటన కేపీహెచ్‌బీ ఠాణాకు కూతవేటు దూరంలో జరిగింది. డీఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట రోడ్డులో నివాసముంటున్న రామసుబ్బారెడ్డి స్థానికంగా కరూర్ వైశ్యబ్యాంకునుంచి గురువారంమధ్యాహ్నం రూ.5లక్షలు డ్రాచేశారు. తర్వాత తన మిత్రుడు చంద్రశేఖర్‌ని కలవడానికి సర్దార్‌పటేల్‌నగర్ వెళ్లారు. అక్కడినుంచి వసంతనగర్, ఆరోఫేజ్ గుండా జేఎన్‌టీయూ మార్గం వరకు వచ్చి రైతుబజారు ఎదురుగా సాయంత్రం 5గంటల సమయంలో తన కారుని నిలిపి సమీప ప్రాంతంలో మరో మిత్రుడిని కలవడానికి వెళ్లారు. రాత్రి 9.30గంటల సమయంలో తన కారు వద్దకి వచ్చి చూసేసరికి అద్దాలు పగిలి ఉన్నాయి. కారు లోపల ల్యాప్‌ట్యాప్ బ్యాగులో ఉంచిన రూ.5లక్షల నగదు చోరీకి గురైంది. ఈ మేరకు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామని డీఐ చెప్పారు.

ఘనంగా అయ్యప్పగుడి పూజా మహోత్సవం



అయ్యప్ప పూజకు హాజరైన మంత్రి నాయిని తదితరులు

బాలానగర్, న్యూస్‌టుడే: బాలానగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో గురువారం వార్షిక పూజా మహోత్సవం ఘనంగా జరిగింది. ఉదయంనుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అంబారీ ఊరేగింపు కార్యక్రమానికి హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక అలంకరణ, దీపకాంతుల మధ్య స్వామివారి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయకమిటీ నిర్వాహకులు ఎలిజాల యాదగిరి, జంగయ్య గురుస్వాముల పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఊరేగింపులో పాల్గొన్నారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగ్గా రాణించాలి'

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో మరింత మెరుగైన స్థానానికి చేరుకునేందుకు బాగా కష్టపడాలని కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల ఉప కమిషనర్లు టి.దశరథ్, అలివేలుమంగతాయరు పేర్కొన్నారు. గురువారం రెండు సర్కిళ్ల పారిశుద్ధ్య అధికారులు, స్వచ్ఛదూత్, ఎస్ఆర్‌పీ, ఎస్ఎఫ్ఏలతో వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో ఆయా సర్కిళ్ల ఉప కమిషనర్లు మాట్లాడారు. ప్రజలను చైతన్యవంతులను చేయడం ద్వారా తడి, పొడిచెత్త వేరు చేయించాలన్నారు. రోడ్లపై చెత్త లేకుండా చూసుకోవాలని సూచించారు.

ఇంకుడుగుంతలను సందర్శించిన ఇంజినీర్లు



ఇంకుడుగుంతల సందర్శనకు వచ్చిన జీహెచ్ఎంసీ ఇంజినీర్లతో గిరిధర్

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూలోని ఇంకుడు గుంతలను జీహెచ్ఎంసీ ఇంజినీర్లు పలువురు గురువారం సందర్శించారు. వర్సిటీ నీటివనరుల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఎంవీఎస్ఎస్.గిరిధర్ వాటిని చూపించి ప్రాధాన్యాన్ని వివరించారు. వాటి ఏర్పాటుకు ముందు భూగర్భజలాల పరిస్థితి, ఏర్పాటుతర్వాత పరిస్థితిని లెక్కలతో సహా చెప్పారు. ఇంకుడుగుంతల ఏర్పాటు విధానం బాగుందని ఇంజినీర్లు అభిప్రాయపడ్డారు.

అపరిశుభ్రత తొలగించాలని డిమాండ్



గ్రంథాలయ ఆవరణను పరిశీలిస్తున్న టీమాస్ నేతలు

బాలానగర్, న్యూస్‌టుడే: గ్రంథాలయంలో అపరిశుభ్రతను తొలగించాలని టీమాస్ బాలానగర్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం నేతలు బాలానగర్‌లోని గ్రంథాలయం, పశువుల ఆసుపత్రి, మహిళా మండలి భవనాల సముదాయాన్ని సందర్శించారు. కనీసం ఊడ్చేవారు లేక చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయని, కొందరు మూత్ర విసర్జన కూడా చేస్తున్నారని అన్నారు. దీంతో గ్రంథాలయానికి రావాలంటే కష్టమవుతోందన్నారు. అధికారులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీమాస్ నేతలు ఐ.రాజశేఖర్, చైతన్య, ప్రతాప్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి

సైబరాబాద్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ల బదిలీ

హైదరాబాద్: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మరో ఏడుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీచేస్తూ కమిషనర్ సందీప్ శాండిల్య గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వి.ఉమేందర్ పీడీసెల్‌కు బదిలీకాగా జి.సురేశ్ రాజేంద్రనగర్ పీఎస్, పి.బిక్షపతిరావు సైబర్ క్రైం పీఎస్, బి. కిషన్‌కుమార్ బాలానగర్ పీఎస్, ఎం.సోమనాథం సైబర్ క్రైం పీఎస్, ఎన్ వెంకటేశ్వర్లు సైబర్ క్రైం పీఎస్, వి. రవికుమార్‌ను గచ్చిబౌలి ట్రాఫిక్‌2పీఎస్‌కు బదిలీచేశారు.

భాజపా మహిళామోర్చా సమావేశం నేడు

కూకట్‌పల్లి: భాజపా మహిళామోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం కూకట్‌పల్లి భాగ్యనగర్‌కాలనీ వన్‌ప్లేస్ హోటల్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ విభాగం జిల్లా అధ్యక్షురాలు వడ్లమూడి సులోచన పేర్కొన్నారు. మహిళామోర్చా జాతీయ అధ్యక్షురాలు విజయరహత్కర్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, మాధవరం కాంతారావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.

'స్వచ్ఛత' ఉత్తమాటేనా!

పారిశుద్ధ్య కార్మికులను వేధిస్తున్న వాహనాల కొరత

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే

నగర అభివృద్ధిలో కీలకంగా మారిన పరిసరాల పరిశుభ్రత విషయంలో అధికారులు ప్రతిసారి చెబుతున్న మాటలు నీటి మూటలే అవుతున్నాయి. బహిరంగ ప్రదేశాల్లో చెత్తలేకుండా చేస్తాం.. సుందరీకరణకు పెద్దపీట వేస్తాం..అంటూ అధికారులు సభలు, సమావేశాల్లో గొంతెత్తి మాట్లాడటం తప్ప అచరణలో చూపడంతో మాత్రం వెనకే ఉండిపోతున్నారు. అభివృద్ధి చెందిన ప్రాంతంగా పేరున్న కేపీహెచ్‌బీలో పారిశుద్ధ్యం పరిస్థితి అందుకు నిదర్శనంగా నిలుస్తోంది.



జేఎన్‌టీయూ రోడ్డులో నిత్యం థర్మకోల్ పెట్టెలో వ్యర్థాల తరలింపు

కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలో ఆరు నెలలుగా పారిశుద్ధ్య పనితీరుపై కాలనీవాసులు అసంతృప్తిగా ఉన్నారు. బహిరంగప్రదేశాల్లో చెత్త పారబోత కొనసాగుతూనే ఉంది. పేరుకపోయిన వ్యర్థాల తరలింపు సైతం సక్రమంగా సాగడం లేదు. దీంతో ఎక్కడ వ్యర్థాలు అక్కడే పేరుకుపోయి చుట్టుపక్కల నివాసముంటున్న వారికి దుర్వాసన, దోమల బెడద తప్పడంలేదు. కాలనీ అంతర్గత వీధుల్లో నరికి పడేసిన చెట్లకొమ్మలు రోజులపాటు అలాగే ఉండిపోవడం పరిపాటిగా మారింది. డంపర్‌బిన్ల వద్ద వ్యర్థాలు రోడ్డుపైకి చేరుతున్నాయి. ఏ రోజు వ్యర్థాలను ఆ రోజే తరలించకుండా జాప్యం చేయడంతో డంపర్‌బిన్లు ఉన్న ప్రదేశాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. దీనికి ప్రధాన కారణం చెత్త, వ్యర్థాలను తరలించే వాహనాలు లేకపోవడమే. ఈ సమస్య ఏళ్లుగా ఉన్నా అధికారులు డివిజన్లకు వాహనాలను కేటాయించకుండా చోద్యం చూస్తున్నారు. వాహనాల కొరతతో కార్మికులు దాదాపుగా ఎక్కడ చెత్తకు అక్కడే నిప్పుపెడుతున్నారు. జేఎన్‌టీయూ రోడ్డులో కార్మికులు ఊడ్చి పోగుచేసిన చెత్తను థర్మకోల్ పెట్టెలో వేసి లాక్కుంటూ రాజీవ్‌సర్కిల్‌వద్ద ఉండే లారీలో వేస్తున్నారు. ఈ రోడ్డులో నిత్యం ఇదే పరిస్థితి కొనసాగుతోంది. దీంతో దుమ్మధూళి లేచి వాయుకాలుష్యం ఏర్పడుతోంది. స్థానికులతో పాటు కార్మికులు కూడా గాలి పీల్చుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు కార్మికులకు అవసరమైన సామగ్రిని ఏర్పాటుచేయకుండా వారి ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. ఇకనైనా వారితోపాటు ప్రాంత ప్రజాప్రతినిధులు స్పందించి ఇక్కడి పరిస్థితిని చక్కదిద్దాల్సిన అవసరముంది.

సుందరీకరణ పనులను వేగంగా పూర్తిచేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న సత్యనారాయణ

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: నల్లచెరువు సుందరీకరణ పనులు వేగంగా పూర్తిచేయాలని కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం ఆయన నల్లచెరువులో జరుగుతున్న పనులను పర్యవేక్షించి మాట్లాడారు. వాకింగ్ ట్రాక్‌తో పాటుతో మిగతా సివిల్ పనులన్నీ పూర్తిచేసి ఉద్యానవన విభాగం అధికారులకు అప్పగించాలన్నారు. తర్వాత వారు పచ్చదనం, మొక్కల ఏర్పాటుపనులు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఏఈ శివప్రకాష్, తెరాస నేతలు నర్సింగరావు, రమేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో రక్తదాన శిబిరం నేడు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ కార్యాలయం వద్ద శిబిరం ప్రారంభమవుతుందన్నారు. వర్సిటీ సిల్వర్‌జూబ్లీ వేడుకల్లో భాగంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కు అందజేత

ఫతేనగర్: డివిజన్ పరిధిలోని లబ్ధిదారులకు గురువారం కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ కల్యాణలక్ష్మి చెక్కులు అందించారు. శోభనకాలనీలోని ఆయన కార్యాలయంలో చెక్కుల పంపిణీ జరిగింది. పలువురు తెరాస నేతలు పాల్గొన్నారు.

'జనప్రియనగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి'



స్థానిక సమస్యలను కార్పొరేటర్‌కు వివరిస్తున్న బస్తీ మహిళలు

వెంగళ్‌రావునగర్ (అల్లాపూర్), న్యూస్‌టుడే: అల్లాపూర్ కార్పొరేటర్ సబిహాబేగం గురువారం జనప్రియానగర్‌లో పర్యటించి సమస్యలను పరిశీలించారు. బస్తీలో డ్రైనేజీ పైపులైన్ దెబ్బతినడంతో పెద్ద గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారిందని స్థానికులు తెలిపారు. జనప్రియనగర్ కూడలివద్ద రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బస్తీలో నిర్వహిస్తున్న యూజీడీ పైపులైన్ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. అధికారులతో మాట్లాడి జనప్రియనగర్‌లో సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జనప్రియనగర్ అధ్యక్షుడు కొండం శ్రీనివాసరెడ్డి, ఏరియాకమిటీ సభ్యుడు రవీందర్‌రెడ్డి, నేతలు లక్ష్మి, ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతుల పరిశీలన

బాలానగర్, న్యూస్‌టుడే: రోడ్లపై పడిన గుంతలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు నిర్వహించి రాకపోకలకు ఇబ్బంది లేకుండాచూడాలని కార్పొరేటర్ కాండూరి నరేందర్‌ఆచార్య సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన డివిజన్‌లోని ఫిరోజ్‌గూడలో గుంతల మరమ్మతులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో తెరాస నేతలు పాల్గొన్నారు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఎల్.బి.నగర్

సరూర్‌నగర్, మీర్‌పేట రైతుబజార్లలో కూరగాయల ధరలు

బాలాపూర్: సరూర్‌నగర్, మీర్‌పేట రైతుబజార్లలో గురువారం నాటి కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. కిలో టమాట రూ.11, వంకాయలు (23), బెండకాయలు (31), పచ్చిమిర్చి (31), కాకరకాయలు (31), బీరకాయలు (31), క్యాబేజి (13), బీన్స్ (28), క్యారెట్ (46), గోబీ (31), దొండకాయలు (25), చిక్కుడుకాయలు (38), గోకరకాయ (31), బీట్‌రూట్ (19), క్యాప్సికం (44), ఆలుగడ్డ (16), కీర (19), దోసకాయ (20) సొరకాయ (15).

విద్యార్థులు మంచి ప్రవర్తనతో ఉండాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ మదారు సాహెబ్

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: తెలిసీ తెలియక తప్పు చేసినా శిక్షార్హులవుతారని, శిక్షకు గురైతే భవిష్యత్తు అంధకారం అవుతోందని, విద్యార్థులు మంచి ప్రవర్తనతో ఉండాలని రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ మదారు సాహెబ్ అన్నారు. నాగోల్ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. శిక్ష అనుభవిస్తే విదేశాలకు వీసాలు రద్దు చేయడంతోపాటు ఉద్యోగాలకు అనర్హులవుతారన్నారు. చక్కటి నడవడికతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. బాల్యవివాహాలు నేరమన్నారు. పాఠశాల హెచ్‌ఎం ఉమాదేవి, న్యాయవాదులు సత్యనారాయణ, సుభాషిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివార్లలో తాగునీటికి నిధులిచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే

మాజీ శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: నగర శివారు ప్రాంతాల తాగునీటి అవసరాలకు జవహర్‌లాల్ నెహ్రూ అర్బన్ రెనువల్ మిషన్, హడ్కో నిధులు రూ.1765 కోట్లు మంజూరు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమని, దానిని తెరాస ప్రభుత్వం వక్రీకరించి మిషన్ భగీరథ పేరుతో తామే తెచ్చామని అవాస్తవాలు చెప్పడం ఎంత వరకు సమంజసమని మాజీ ఎమ్మెల్యే డి.సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు. ఎల్బీనగర్‌లోని ఓ హోటల్‌లో సుధీర్‌రెడ్డితో పాటు ముఖ్య నాయకులు గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించి కొన్ని క్లిప్పింగులను ప్రదర్శించారు. శివారు ప్రాంతాల భవిష్యత్తు తాగునీటి అవసరాలను ముందే గ్రహించిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళిక తయారు చేసిందన్నారు. అప్పటి ఎమ్మెల్యేలు తనతో పాటు భిక్షపతియాదవ్, సబితా ఇంద్రారెడ్డి, శ్రీశైలం, రాజిరెడ్డి తదితరులమంతా నాటి కేంద్రమంత్రులు జైపాల్‌రెడ్డి, సర్వే సత్యనారాయణ సహకారంతో 2014 ఫిబ్రవరి 28న నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఇందులో శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కాప్రా, రామచంద్రాపురం పఠాన్‌చెరు, ఉస్మాన్‌సాగర్‌తో పాటు ఎల్బీనగర్ నియోజకవర్గానికి రూ.365.17 కోట్లు మంజూరు చేయించామని, తదుపరి ఎన్నికలు రావడం కాంగ్రెస్ ఓటమి చెందడంతో నిధులు రద్దయ్యే పరిస్థితి నెలకొందన్నారు. దీంతో జలమండలి ఎండీ జగదీశ్వర్‌ను కలిసి నిధులు రద్దు కాకుండా చూడాలని వినతి అందించామన్నారు. కేవలం రూ.200 కోట్లు కలిపిన తెరాస ప్రభుత్వం భగీరథ అని చెప్పి ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. కార్యక్రమంలో బిచినేపల్లి వెంకటేశ్వరరావు, కొప్పుల నర్సింహారెడ్డి, ఆడాల రమేష్, సుమన్‌గౌడ్, అనంతుల రాజిరెడ్డి పాల్గొన్నారు.


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న శాసనసభ్యుడు కృష్ణయ్య, కార్పొరేటర్లు

ప్రజలకు ఎల్లవేళలా అంబులెన్స్ సేవలు

శాసనసభ్యుడు కృష్ణయ్య

వనస్థలిపురం, న్యూస్‌టుడే: ప్రజలకు అన్నివేళలా అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంటాయని ఎల్బీనగర్ శాసనసభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. గురువారం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో రూ.12.5 లక్షలతో నూతనంగా కొనుగోలు చేసిన అంబులెన్స్ సేవలను కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మీప్రసన్నలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ...ఇప్పటికే ఆసుపత్రిలో ప్రజలకు అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని, మరిన్ని వచ్చేలా కృషి చేస్తామన్నారు. రోగులు అత్యవసర సమయంలో అంబులెన్స్‌ను ఉపయోగించుకోవాలని, 040 24240755 నంబరులో సంప్రదించవచ్చన్నారు. ఆసుపత్రిలో అదనంగా అవసరమైన గదులను ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తామని, అవసరమైతే మరో అంబులెన్స్‌కు నిధులు కేటాయిస్తామన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నాగభూషణం, ఆర్‌ఎం డా.కమల, ఎన్‌జీఓస్‌కాలనీ అధ్యక్షులు చందర్‌రావు, నాయకులు గుజ్జ కృష్ణ, వెంకటేశ్వర్లు, సంజయ్, వార్డు కమిటీ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

ఎల్.బి.నగర్

7న వ్యాయామ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వనస్థలిపురం: ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాల(దోమల్‌గూడ) 1973-74 విద్యా సంవత్సరం బి.పి.ఇ.డి, యు.జి.డి శిక్షణ పొందిన విద్యార్థుల సమ్మేళనం ఈనెల 7న నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల ప్రతినిధి నరసింహం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10గంటలకు కళాశాల ప్రాంగణంలో కార్యక్రమం ఉంటుందని.. ఆ సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్టేదీ!

● బీఆర్ఎస్ పేరు చెప్పి కొందరు దందా

న్యూస్‌టుడే, ఎల్బీనగర్

భవనాల క్రమబద్ధీకరణ పథకం (బీఆర్ఎస్) వస్తుందిలే అంటూ చాలా మంది అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది పట్టణ ప్రణాళిక దిగువస్థాయి అధికారులు, సిబ్బందితో పాటు ప్రజాప్రతినిధులు కూడా ఈ పథకాన్ని నీరుగారుస్తున్నారు. ఆయా యజమానుల నుంచి ఆమ్యామ్యాలు తీసుకొని నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇదీ పరిస్థితి

అక్రమ భవనాలను క్రమబద్ధీకరించేందుకు 2015 నవంబరు నెలలో బీఆర్ఎస్ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పట్టణ ప్రణాళిక నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినవారు, అనుమతి తీసుకోకుండా చేపట్టిన ఇళ్లను క్రమబద్ధీకరించి, భవిష్యత్తులో అలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చేయడమే ఈ పథకం ఉద్దేశం. దీనిని ఆసరాగా చేసుకొని కొంతమంది దిగువస్థాయి అధికారులు, సిబ్బందితో పాటు చోటా, బడా నాయకులు పథకాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. 2015 అక్టోబర్ 28కి ముందు నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాలే బీఆర్ఎస్ కింద దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించారు. అయితే భవన యజమానులతో కుమ్మక్కయి ఆ తేదీకి ఎలాంటి నిర్మాణాలు లేకపోయినా ఉన్నట్టు చూపించి కొంతమంది దరఖాస్తులు చేయించారు. హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్ల పరిధిలోని 13 డివిజన్ల నుంచి ఈపథకానికి ఇప్పటి వరకూ 17,277 దరఖాస్తులు అందాయి. ఒక్కో దరఖాస్తు ద్వారా రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.17,27,70,000 జీహెచ్ఎంసీ ఖజానాకు చేరాయి. అయితే న్యాయస్థానం ఈ పథకాన్ని నిలుపు చేసి, అర్హతలేని దరఖాస్తులు తిరస్కరించాలని ఆదేశించింది. అటువంటి దరఖాస్తుల ఏరివేత అన్ని చోట్లా జరిగినప్పటికీ ఈ మూడు సర్కిళ్లలో ఆ ఊసేలేదు. భవనం నిర్మించే స్థలం, ఎత్తు, తదితర అంశాలను ప్రామాణికంగా తీసుకొని కొందరు పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది బీఆర్ఎస్‌లో క్రమబద్ధీకరణ అయిపోతుందని.. నిబంధనలు అవసరం లేదంటూ భరోసా ఇచ్చి ఒక్కో కట్టడం వద్ద రూ.80 వేలు నుంచి రూ.లక్ష మేరకు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. నిబంధనల ప్రకారం ఫైళ్లు కదిలి బీఆర్ఎస్ క్లియరెన్స్ అయితే మూడు సర్కిళ్లకు రూ.60 కోట్ల మేరకు ఆదాయం రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.



గ్రేటర్ మున్సిపల్ కార్యాలయం

గతంలో ...

బీఆర్ఎస్, ఎల్ఆర్ఎస్‌లకు అన్ని మార్గాల్లో నిఘా, పర్యవేక్షణ కొనసాగుతోంది. గతంలో వీటికి దరఖాస్తులు చేయాలంటే అన్నీ ఆటంకాలే ఎదురయ్యేవి. ఎన్నో అవకతవకలూ జరిగాయి. 2007-08లో ఒకరు, 2015 నవంబరులో ఒక అధికారి అనిశా వలకు చిక్కారు. అలాగే ఒక టీపీఎస్ కూడా లంచం తీసుకుంటూ అనిశాకు చిక్కాడు. అక్కడ్నుంచీ ఈకార్యాలయంపై అనిశా దాడులు వంటివి లేకపోవడంతో ఎవరికి వారే యమునా తీరే అన్నచందాన ఉన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినా లబ్ధిదారులకు ముప్పు తిప్పలు పెడుతున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఈ పద్ధతులు మార్చాలని పలువురు ఉన్నతాధికారులను కోరుతున్నారు. ఈవిషయాన్ని మూడు సర్కిళ్ల డీసీలు ముకుంద్‌రెడ్డి, విజయ్‌కృష్ణ, హరికృష్ణయ్య దృష్టికి తీసుకెళ్లగా బీఆర్ఎస్ పథకం అంశం న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉందన్నారు. అక్రమనిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు చేపట్టినా, ప్రోత్సహించినా చర్యలు తీసుకుంటామన్నారు.

నియామకం

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: ఫస్ట్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర ఛైర్మన్‌గా ఆ సంస్థ ఎల్బీనగర్ ప్రతినిధి ఎం. లక్ష్మీజగదీశ్వరిని నియమించారు. సంస్థ జాతీయ కమిటీ డైరక్టర్ రియాజ్‌షేక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీజగదీశ్వరిని పలువురు సన్మానించారు. అశోక్‌గౌడ్, వెంకటరెడ్డి, నాగలక్ష్మి, వేదకీర్తి పాల్గొన్నారు.

7న ఉచిత న్యాయ సలహా కేంద్రం

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: సాగర్‌రోడ్డు హస్తినాపురం డివిజన్ కేంద్రంలోని మేజర్ పద్మపాణి ఆచార్య భవనంలో ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని ఈ నెల 7న నిర్వహిస్తున్నామని రవిచంద్ర ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. కొన్ని అనివార్య కారణాల వల్ల శనివారం వాయిదా వేస్తున్నామని తెలిపారు. ఆదివారం జరిగే కార్యక్రమానికి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 89783 85151 నంబరులో సంప్రదించాలన్నారు.

ప్రతి కాలనీలోనూ డ్రైనేజీ నిర్మాణం

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: మురుగు సమస్య ఉన్న ప్రతి కాలనీలోనూ డ్రైనేజీ నిర్మాణం చేపడతామని హస్తినాపురం కార్పొరేటర్ రమావత్ పద్మానాయక్ అన్నారు. సాగర్‌రోడ్డు షిరిడీసాయినగర్ కాలనీలో రూ.3.50 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు కాలనీ ప్రతినిధులతో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... గతంలో ఉన్న నివాసాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన కాలువ వ్యవస్థ ప్రస్తుతం సరిపోవడం లేదన్నారు. ప్రస్తుతం అదనపు డ్రైనేజీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇది నిర్మాణం కాగానే రోడ్డు పనులకు నిధులు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, వార్డు సభ్యులు దినకర్‌రావు, నాగేష్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, రాంచందర్ పాల్గొన్నారు.



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ పద్మానాయక్

● డివిజన్ పరిధి బాలపూర్‌రోడ్డులోని ఖాద్రీకాలనీలో స్వచ్ఛ హస్తినాపురం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో పరిశుభ్రత పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పద్మానాయక్, కాలనీ ప్రతినిధులు అంజాద్‌ఖాన్, సయ్యిద్‌పాషా పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 38మందిపై కేసులు

నాగోలు, న్యూస్‌టుడే: గత వారంరోజుల్లో మద్యంతాగి వాహనం నడిపిన 38 మందిపై కేసులు నమోదుచేసినట్లు ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ తెలిపారు. నిందితులకు కోర్టులో రూ.2వేలు చొప్పున జరిమానా విధించారు. వీరిలో అతిగా మద్యం సేవించి వాహనం నడిపిన నలుగురికి జైలుశిక్ష విధించగా.. మరో నలుగురికి రెండ్రోజుల పాటు ట్రాఫిక్‌ను చక్కదిద్దే బాధ్యతలు అప్పగించారు. వీరు ఎల్బీనగర్ పరిసరాల్లోని కూడళ్లలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ వాహనచోదకులకు అవగాహన కల్పించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

నాగోలు: రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డ సంఘటన ఎల్బీనగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. నల్గొండ జిల్లా చందంపేటకు చెందిన నోముల కృష్ణయ్య(45) ఎల్బీనగర్ సమీపంలోని కేశవపురిలో ఉంటూ కూలిపని చేసుకుని జీవిస్తున్నాడు. బుధవారం రాత్రి హస్తినాపురంలోని బాలాజీవైన్స్ ముందు రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చిన ఓ వ్యాను(టీఎస్12 ఈఏ 2788) అతన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణయ్య తల, శరీరానికి గాయాలయ్యాయి. వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతున్నాడు. కృష్ణయ్య భార్య మల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెల్లని చెక్కు ఇచ్చిన కానిస్టేబుల్‌కు జైలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: తీసుకున్న అప్పు తీర్చడానికి చెల్లని చెక్కు ఇచ్చిన ఓ రిజర్వ్‌డ్ కానిస్టేబుల్‌కు న్యాయస్థానం ఆరునెలల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించింది. శిక్షతో పాటు ఫిర్యాదికి రూ.8.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని హస్తినాపురంలోని 6వ ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టు బుధవారం తీర్పునిచ్చింది. ఫిర్యాది కథనం ప్రకారం... ప్రస్తుతం విజయవాడలో రిజర్వ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.కిరణ్‌కుమార్ 2014లో బోడుప్పల్ నివాసి కె.కరుణాకర్‌రెడ్డి వద్ద రూ.8లక్షలు అప్పు తీసుకున్నాడు. గడువు ముగిశాక అప్పు తిరిగి చెల్లించడానికి కిరణ్‌కుమార్ ఇచ్చిన చెక్కు చెల్లలేదు. దీంతో కరుణాకర్‌రెడ్డి కోర్టును ఆశ్రయించాడు.

మలక్‌పేట

సరూర్‌నగర్, మీర్‌పేట రైతుబజార్లలో కూరగాయల ధరలు

బాలాపూర్, న్యూస్‌టుడే: సరూర్‌నగర్, మీర్‌పేట రైతుబజార్లలో గురువారం నాటి కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. కిలో టమాట రూ.11, వంకాయలు (23), బెండకాయలు (31), పచ్చిమిర్చి (31), కాకరకాయలు (31), బీరకాయలు (31), క్యాబేజి (13), బీన్స్ (28), క్యారెట్ (46), గోబీ (31), దొండకాయలు (25), చిక్కుడుకాయలు (38), గోకరకాయ (31), బీట్‌రూట్ (19), క్యాప్సికం (44), ఆలుగడ్డ (16), కీర (19), దోసకాయ (20) సొరకాయ (15), పొట్లకాయ (13), చామగడ్డ (41), కంద (25), ఉల్లిగడ్డ (35).

ఆలయ కమాన్ ప్రారంభం



కార్పొరేటర్ దంపతులను సన్మానిస్తున్న కాలనీ సంఘ సభ్యులు

మలక్‌పేట: మూసారాంబాగ్ డివిజన్ శాలివాహననగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ కమాన్‌ను గురువారం ధర్మాధికారి జయశంకర్ బాలగోపాల్, కార్పొరేటర్ సునరితా రెడ్డి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ ఆంజనేయస్వామి భక్తుల కోరికలను తీర్చే ఆపద్బాంధవుడిగా విరాజిల్లుతున్నారన్నారు. దైవానుగ్రహం ఉన్నవారు శుభ ఫలితాలు పొందుతారని వివరించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు దొంతు మాణిక్‌రెడ్డి ఆధ్వర్యంలో హోమాన్ని వేద పండితులు కాటూరి శ్రీనివాసచార్య జరిపించారు. అనంతరం కార్పొరేటర్ దంపతులను సన్మానించారు. అన్నప్రసాదాన్ని భక్తులకు అందించారు. మాజీ కార్పొరేటర్ అస్లాం, ఆలయ కమిటీ కార్యదర్శి జంగయ్య, ధార అశోక్ పాల్గొన్నారు.

ఆ మార్గంలో ప్రయాణం బిక్కుబిక్కు!

చాదర్‌ఘాట్, మలక్‌పేట రోడ్లపై దృష్టిసారించాలి ☆ ఏడాదిలో సగటున 50 రోడ్డు ప్రమాదాలు

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: చాదర్‌ఘాట్, మలక్‌పేట రహదారులపై ప్రయాణించాలంటేనే ప్రాణాలు అరచేత పట్టుకొని వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ఏటా సగటున 50కంటే అధికంగానే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు చాదర్‌ఘాట్ ఠాణా రికార్డులే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. మెట్రోప్రాజెక్టు పనులు మొదలైనప్పటి నుంచి రోడ్డు ప్రమాదాలకు గురై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నవారు, లేదా మృత్యువాతపడిన వారి సంఖ్య రాను రాను పెరుగుతోంది. 2016లో ప్రయివేటు కళాశాలలో విధులు నిర్వహిస్తున్న మూసారాంబాగ్ నివాసి నల్లకుంట నుంచి మలక్‌పేటకు ద్విచక్రవాహనంపై వస్తుండగా నీళ్లట్యాంకర్ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఈనెల 3న చాదర్‌ఘాట్ వంతెన వద్ద రషీద్ అనే ఆటో డ్రైవర్‌ను బస్సు ఢీకొనడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. ఇలాంటి సంఘటనలు ప్రతి నెలా జరుగుతున్నాయి. కోఠి, ఎంజీబీఎస్ వైపు రాకపోకలు సాగించే వాహనాలకు మలక్‌పేట రహదారులే కీలకం. అలానే శంషాబాద్ విమానాశ్రయం, నల్గొండ, విజయవాడ నుంచి వచ్చే వాహనాలు నగరంలోకి మలక్‌పేట రహదారి పైనుంచే ప్రవేశిస్తుంటాయి. 9వ జాతీయ రహదారిగా పేరున్న ఈ మార్గం రక్తమోడుతుంది. మలక్‌పేటలో మెట్రోపనులు ప్రారంభమైన తరువాత ఈ రహదారిపై ప్రయాణించాలంటేనే ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంగా ఉందంటున్నారు వాహనదారులు. తరచూ ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యతో ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తోంది.

సర్వీసు రహదారులపై భారీ వాహనాలు

మెట్రోపనుల వల్ల ప్రధాన రహదారిపై ప్రయణాలు ఇబ్బందులుగా ఉండడంతో భారీ వాహనాలు నడిపేవారు అత్యధికంగా సర్వీసు రోడ్లను వినియోగించుకొంటున్నారు. నివాసాల ముందు, కాలనీల్లో ఉన్న సర్వీసు రోడ్లపై తిరిగే



బుధవారం చాదర్‌ఘాట్ వంతెన వద్ద ప్రమాదం జరిగిన ప్రాంతం



చాదర్‌ఘాట్‌లో నిత్యం ట్రాఫిక్ ఇలా..

వాహనాల సంఖ్య రోజురోజుకు అధికం కావడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. వాహనాల వేగాన్ని నియంత్రించే చర్యలు కొరవడ్డాయి. ట్రాఫిక్, ఎంసిహెచ్, రవాణా శాఖల మధ్య సమన్వయం కొరవడింది. మరమ్మతులు సరిగా లేని రోడ్లు, అడ్డుగా ఉంటున్న మెట్రో పరికరాలు, రహదారులపైనే ఏర్పాటుచేసిన భారీ అడ్డంకులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మెట్రో పనుల వల్ల మలక్‌పేట రైల్వే వంతెన వద్ద భారీవాహనాలపై ఆంక్షలు ఉన్నాయి. అయినా అవి రాకపోకలు సాగిస్తున్నాయి. భారీ వాహనాలు వంతెన భద్రతకోసం నిర్మించిన కమాన్‌ను ఢీ కొడుతున్నాయి.

ఎన్నెన్నో సంఘటనలు

☆ 2015 మే 2న ఓల్డ్ మలక్‌పేట ప్రాంతంలో రోడ్డు దాటడానికి ప్రయత్నించిన చిన్నారిని ఓ వాహనం చిదిమేసింది. అదే రోజు మలక్‌పేట రైల్వే స్టేషన్ చాదర్‌ఘాట్ కాజ్‌వే వద్ద ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఒక కుటుంబం మెట్రో వారు ఏర్పాటు చేసిన సూచికను ఢీకొని ప్రమాదానికి గురయ్యారు.

☆ 2016 ఫిబ్రవరిలో నీటి ట్యాంకర్ ఢీకొని ద్విచక్రవాహనం నడుపుతున్న నల్లకుంట వాసి దుర్మరణం చెందాడు.

☆ చాదర్‌ఘాట్ పోలీసుల వివరాల ప్రకారం 2012లో 59.. 2013లో 68.. 2014లో 55, 2015లో 50, 2016లో 35, 2017లో 20 రోడ్డు ప్రమాదాలు జరిగాయి.

ఏంచేయాలంటే

9వ నంబరు జాతీయ రహదారిపై సుమారు 5శాఖలు సమన్వయంతో పని చేయాల్సి ఉంది.. మెట్రో ప్రాజెక్టు నిర్వహిస్తున్న అధికారులు, బల్దియా, ట్రాఫిక్, శాంతిభద్రతల పోలీసులు, జాతీయ రహదారి అధికారులు, ఆర్‌టీసీ అధికారులు కీలకం. మెట్రో పనులు జరుగుతున్న రీత్యా రహదారి భద్రతపై కీలకంగా వ్యవహరించాల్సి ఉంది. అలానే రోడ్ల మరమ్మతులు చేపట్టడంతోపాటు చిన్న చిన్న గుంతలను పూడ్చాలి. మలక్‌పేట రైల్వేస్టేషన్ వద్ద ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న వాహనాల రాకపోకలను నియంత్రించాలి. మలక్‌పేట ట్రాఫిక్ సీఐ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎప్పటికపుడు ట్రాఫిక్ నియంత్రణ కోసం ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్నామన్నారు. భారీ వాహనాలు ఇటు వైపు రాకుండా ప్రయత్నిస్తున్నామని, వచ్చిన ఆర్‌టీసీ వాహనాలపైనా జరిమానా విధిస్తున్నామన్నారు.

ప్రతి కాలనీలోనూ డ్రైనేజీ నిర్మాణం



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ పద్మానాయక్

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: మురుగు సమస్య ఉన్న ప్రతి కాలనీలోనూ డ్రైనేజీ నిర్మాణం చేపడతామని హస్తినాపురం కార్పొరేటర్ రమావత్ పద్మానాయక్ అన్నారు. సాగర్‌రోడ్డు షిరిడీసాయినగర్ కాలనీలో రూ.3.50 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు కాలనీ ప్రతినిధులతో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... గతంలో ఉన్న నివాసాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన కాలువ వ్యవస్థ ప్రస్తుతం సరిపోవడం లేదన్నారు. ప్రస్తుతం అదనపు డ్రైనేజీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇది నిర్మాణం కాగానే రోడ్డు పనులకు నిధులు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, వార్డు సభ్యులు దినకర్‌రావు, నాగేష్‌గౌడ్, రవీందర్ రెడ్డి, నాగేశ్వర్‌రావు, రాంచందర్ పాల్గొన్నారు. ● బాలపూర్‌రోడ్డులోని ఖాద్రీకాలనీలో స్వచ్ఛ హస్తినాపురం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వీధుల్లో పరిశుభ్రత పనులు చేపట్టారు. కార్పొరేటర్ పద్మానాయక్, కాలనీ ప్రతినిధులు అంజాద్‌ఖాన్, సయ్యద్‌పాషా పాల్గొన్నారు.

బాబా బంగారు కిరీటానికి విరాళం



ఆలయ కమిటీకి చెక్కును అందజేస్తున్న చైర్మన్ రమేశ్‌రెడ్డి

మలక్‌పేట, న్యూస్‌టుడే: మూసారాంబాగ్ సలీంనగర్ షిరిడీ సాయిబాబా ఆలయంలోని బాబా బంగారు కిరీటం కోసం ఆలయ కమిటీ ఛైర్మన్ రమేశ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి విరాళాలు అందించారు. బంగారం కొనుగోలుకు రమేశ్‌రెడ్డి రూ.3లక్షలు, కృష్ణారెడ్డి రూ.30వేలు కమిటీకి అందజేశారు. రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ కిలో బంగారంతో కిరీటాన్ని సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు సైతం నగదు, బంగారు రూపంలో అందజేసినట్లు తెలిపారు. కమిటీ కార్యదర్శి దుబాయ్ శ్రీను, కాలనీవాసి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

‘నేర రహిత సమాజానికి కృషిచేయాలి’



పోలీసు అధికారులను సన్మానించిన శాంతి కమిటీ సభ్యులు

అక్బర్‌బాగ్: శాంతి భద్రతలు పరిరక్షించడంలో శాంతి కమిటీ సభ్యుల పాత్ర మరువలేనిదని ఈస్ట్‌జోన్ డీసీపీ శశిధర్‌రాజు అన్నారు. అక్బర్‌బాగ్‌లోని దిల్‌ఖుషా ఫంక్షన్‌హాలులో సెంట్రల్ పీస్ కమిటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల బదిలీపై వచ్చిన పోలీసు అధికారులు, పదోన్నతులు సాధించిన సిబ్బందికి సత్కారం జరిగింది. అదే విధంగా ఇటీవల జరిగిన ప్రపంచ మహిళా పారిశ్రామికవేత్తల సదస్సు, తెలుగు మహాసభలను విజయవంతం చేసినందుకుగాను పోలీసులను సన్మానించి వారి సేవలను పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ...నేర రహిత సమాజంకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అదనపు డీసీపీ గోవింద్‌రెడ్డి, సుల్తాన్‌బజార్ ఏసీపీ చక్రవర్తి, మలక్‌పేట ఏసీపీ శివ భాస్కర్, కాచిగూడ ఏసీపీ నర్సయ్య, చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ సత్తయ్య, సెంట్రల్ పీస్ కమిటీ ప్రధాన కార్యదర్శి గులాం సాదిక్‌ఉద్దీన్, శాంతి కమిటీ సభ్యులు విజయ్‌కుమార్, శరత్‌శ్యాం, సుధాకర్, రమేష్‌నాయుడు, మజర్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు

అక్బర్‌బాగ్: ప్రభుత్వ ఆశయమైన గుడంబా రహిత సమాజం కోసం ఎక్సైజ్ సిబ్బంది సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ అన్నారు. గుడంబా నివారణ కోసం విధి నిర్వహణలో చొరవచూపిన మలక్‌పేట ఎక్సైజ్ ఎస్సై దుబ్బాక శంకర్, కానిస్టేబుల్ బి.రాజుకు గురువారం ప్రశంసా పత్రాలు అందజేశారు. నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. వీరిని డిప్యూటీ కమిషనర్ వివేకానందరెడ్డి, సూపరింటెండెంట్ నందరాజ్ గౌడ్‌లు అభినందించారు.



ప్రశంసా పత్రాలు అందుకున్న శంకర్, రాజుతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్

సైదాబాద్‌లో కొవ్వొత్తులతో ‘టీ-మాస్’ ప్రదర్శన

సైదాబాద్, న్యూస్‌టుడే: సావిత్రిభాయి పూలే జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలని, జనవరి 3ను మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా ప్రకటించి సెలవు దినంగా పాటించాలని టీ-మాస్ (తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్య వేదిక) హైదరాబాద్ సౌత్ కమిటీ డిమాండ్ చేసింది. న్యూసైదాబాద్ కాలనీ రహదారిపై ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి ఆస్మాన్‌గఢ్ వరకు బుధవారం రాత్రి టీ-మాస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన జరిగింది. అనంతరం సావిత్రిభాయి పూలేకు నివాళులర్పించారు. టీ-మాస్ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు రఘు, కో-కన్వీనర్ ఎం.బాలునాయక్, జిల్లా కమిటీ సభ్యుడు మదన్‌బాబు, ప్రతినిధులు జంగయ్య, రమేష్, కృష్ణ, వెంకటస్వామి, ప్రమీల, లక్ష్మమ్మ, బుచ్చమ్మ, యాదమ్మ, సత్తిబాబు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

నాగోలు: రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో గాయపడ్డ సంఘటన ఎల్బీనగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. నల్గొండ జిల్లా చందంపేటకు చెందిన నోముల కృష్ణయ్య(45)బుధవారం రాత్రి హస్తినాపురంలోని బాలాజీ వైన్స్ ముందు రోడ్డు దాటుతుండగా ఓ వ్యాను(టీఎస్12 ఈఏ 2788) అతన్ని ఢీకొంది. కృష్ణయ్య తల, శరీరానికి గాయాలయ్యాయి. సమీపంలోని ఆస్పత్రికి తరలించారు.

మలక్‌పేట

మద్యం తాగి వాహనాలు నడిపిన 38మందిపై కేసులు

నాగోలు, న్యూస్‌టుడే: గత వారంరోజుల్లో మద్యంతాగి వాహనం నడిపిన 38మందిపై కేసులు నమోదుచేసినట్లు ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ తెలిపారు. నిందితులకు కోర్టులో రూ.2వేలు చొప్పున జరిమానా విధించారు. వీరిలో అతిగా మద్యం సేవించి వాహనం నడిపిన నలుగురికి జైలుశిక్ష విధించగా.. మరో నలుగురికి రెండ్రోజుల పాటు ట్రాఫిక్‌ను చక్కదిద్దే బాధ్యతలు అప్పగించారు.

'అంధుల స్ఫూర్తి ప్రదాత బ్రెయిలీ'

సైదాబాద్, న్యూస్‌టుడే: అంధుల అక్షర ప్రదాత డాక్టర్ లూయిస్ బ్రెయిలీ జయంత్యుత్సవాలు మలక్‌పేట ప్రభుత్వ అంధ బాలికల ఉన్నత, ప్రాథమిక పాఠశాల, మూసారాంబాగ్ ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఘనంగా జరిగాయి. మూసారాంబాగ్ కూడలి సమీపంలోని బీకే ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మూసారాంబాగ్, సైదాబాద్ కార్పొరేటర్లు తీగల సునరితరెడ్డి, సింగిరెడ్డి స్వర్ణలతతోపాటు సైదాబాద్ మండల తహసీల్దార్ కౌకుంట్ల జానకి హాజరై కేక్ కట్ చేశారు. రచయిత డాక్టర్ తిరునగిరి, వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు డి.సుదర్శన్, జయంత్యుత్సవాల కమిటీ అధ్యక్షుడు ఎ.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బి.పాండు, కోశాధికారి ఎం.ధర్మరాజు పాల్గొన్నారు.



మలక్‌పేట సూపర్‌బజార్‌లోని ఉద్యానవనంలో బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసిన ఫెడ్ సభ్యులు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మలక్‌పేట ప్రభుత్వ అంధ బాలికల ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఉత్సవాలకు సైదాబాద్ మండల ఉప విద్యాశాఖాధికారి తిరునగిరి రాధాకృష్ణ, కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలత, తహసీల్దార్ కౌకుంట్ల జానకి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు డి.సుదర్శన్, అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గడ్డిఅన్నారం), మలక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు రేళ్ల సత్యనారాయణరెడ్డి, విజయలక్ష్మి హాజరయ్యారు. బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పద్మావతి దేవి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సుమతి, వసతి గృహం పర్యవేక్షకురాలు కె.శైలజ తదితరులు పాల్గొన్నారు.



కేకు కట్ చేస్తున్న కార్పొరేటర్లు సునరిత, స్వర్ణలత

బ్రెయిలీ విగ్రహానికి నివాళి

అక్బర్‌బాగ్: అంధుల స్ఫూర్తి ప్రదాత బ్రెయిలీ జయంతి వేడుకలను ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమని దివ్యాంగుల సంక్షేమశాఖ సంచాలకులు శైలజ అన్నారు. గురువారం మలక్‌పేట సూపర్‌బజార్‌లోని లూయిస్ బ్రెయిలీ ఉద్యానవనంలో ఆమె వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా బ్రెయిలీ కూర్చొని పుస్తక పఠనం చేస్తున్న విగ్రహాన్ని ఫెడ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించడం గర్వకారణమన్నారు. జనవరి 29 వరకు మాసోత్సవాలు నిర్వహిస్తామని ఫెడ్ ఛైర్మన్ ఎం.గంగారం తెలిపారు. ఎ.డి. సుదర్శన్, ఫెడ్ ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం, ఉపాధ్యక్షులు గోపాల్, సభ్యులు నర్సింహారెడ్డి, రామ్‌చందర్, సాగర్‌రెడ్డి, కొమురయ్య నాయక్ పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకొని నడక

సైదాబాద్: ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం సందర్భంగా నేత్ర విద్యాలయం సైదాబాద్‌లో వాక్‌థాన్‌ను గురువారం నిర్వహించింది. వీరికి మద్దతుగా పలు కళాశాలల నుంచి విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చారు. సైదాబాద్ కాలనీలో ఉన్న రామాలయం నుంచి ప్రారంభమైన వాక్‌థాన్ ప్రధాన రహదారి మీదుగా ఎస్బీహెచ్ పంచ (ఏ, బీ, సీ, జీఏ-1, జీఏ-2) కాలనీల్లో కొనసాగింది. 'జబర్దస్త్' ఫేం రచ్చ రవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కళ్లకు గంతలు కట్టుకుని వారితో పాటు నడక కొనసాగించారు. జీయర్ ఇంటిగ్రేటెడ్ వేదిక్ అకాడమి (జీవ)లోని నేత్ర, వేద విద్యాలయాల విద్యార్థులు, దిల్‌సుఖ్‌నగర్, కర్మన్‌ఘాట్‌లోని శ్రీవెంకటేశ్వర కామర్స్ జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు, బద్రుకా కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మల్కాజిగిరి

ఆలయాల్లో హోమం.. అభిషేకం నేడు

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని దుర్గా భవానీ దేవాలయలోని గణపతి ఆలయంలో సంకట హర చతుర్థిని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 6 గంటలకు గణపతి హోమాన్ని నిర్వహిస్తున్నారు. సాయంత్రం స్వామి విగ్రహానికి అభిషేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

చెత్త వేస్తే జరిమానా!

- వెస్ట్ కాకతీయనగర్‌లో నిఘా నేత్రాల ఏర్పాటు
- పరిశుభ్రతకు పెద్ద పీట వేస్తున్న కాలనీ సంఘం



చెత్త వేస్తే జరిమానా విధిస్తామని గోడపై ఏర్పాటు చేసిన హెచ్చరిక

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: నేరాలకు పాల్పడే వారిని గుర్తించి పట్టుకోవడంలో కీలక పాత్ర పోషిస్తున్న సీసీ కెమెరాలు దొంగచాటుగా చెత్తను రోడ్లపై వేసే వారిని సైతం గుర్తించి హడలెత్తిస్తున్నాయి. ఈవినూత్న ప్రయత్నానికి నేరేడ్‌మెట్ వెస్ట్‌కాకతీయనగర్ సంక్షేమ సంఘం నాంది పలికింది. కాలనీలో చెత్త వేసే ప్రాంతాన్ని గుర్తించి అక్కడ సీసీ కెమెరాలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయినా వినకుండా చెత్త వేస్తున్న వారిని కెమెరాల్లో గుర్తించి జరిమానా వేయడానికి సన్నద్ధమయ్యారు. ఎన్నిసార్లు మందలించినా వినకపోవడంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కాలనీ పరిశుభ్రతకు పెద్దపీట వేయాలంటే అందరి సహకారం అవసరమని చాటి చెబుతున్నారు సంక్షేమ సంఘం ప్రతినిధులు.

మార్పు కోసమే కెమెరాలు..

ఈ కాలనీలోని సిద్ధార్థ స్కూల్ వద్ద కొన్నేళ్ల క్రితం మున్సిపల్ అధికారులు చెత్త సేకరణ కేంద్రం ఏర్పాటు చేసుకున్నారు. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను ఇక్కడ వేసి తిరిగి పెద్ద వాహనాల్లో అక్కడి నుంచి తరలించేవారు. ఇదిలా ఉంటే కాలనీ వాసులు కొందరు ఈప్రాంతంలో ఇష్టానుసారంగా చెత్తను వేస్తూ అపరిశుభ్రత వాతావరణం సృష్టించేవారు. ఎన్నిసార్లు చెప్పినా వినేవారు కాదు. దీనికితోడు ఈదారిలో వెళ్లేవారు ఇతర కాలనీల నుంచి వచ్చి పోయే వాహనదారులు ఇక్కడే చెత్త మూటలను వేసేవారు. దీంతో అక్కడ తీవ్రమైన దుర్వాసన వ్యాపించి స్థానికుల్ని ఉక్కిరిబిక్కిరి చేసేది. అంతేకాకుండా పక్కనే ఉన్న మ్యాన్‌హోలు పొంగి మురుగు ఈచెత్తలో చేరడంతో పరిస్థితి ఘోరంగా ఉండేది. ఈసమస్యపై కాలనీ సంక్షేమ సంఘం నేతలు పలుమార్లు స్థానికులను వచ్చి పోయే వారిని హెచ్చరించారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. దీంతో వారు ముందుగా మున్సిపల్ అధికారులతో మాట్లాడి చెత్త సేకరణ కేంద్రాన్ని అక్కడి నుంచి శాశ్వతంగా తరలించారు. తాజాగా 15 రోజుల క్రితం ఇక్కడ రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఎవరెవరు చెత్త వేస్తున్నారో గుర్తించి ముందుగా వారిని హెచ్చరించి తరువాత జరిమానా వేయాలని నిర్ణయించారు.

చెత్త వేస్తే రూ.1000 జరిమానా

కాలనీకి చెందిన ఎవరైనా ఇక్కడ చెత్త వేస్తే రూ.1000 జరిమానా విధిస్తామని సంక్షేమ సంఘం వారు అక్కడ గోడకు హెచ్చరిక పత్రాన్ని అంటించారు. సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేశామని అందులో వివరించారు. దీంతో కాలనీ వాసులు అక్కడ చెత్త వేయడం మానేశారు. ఒకరిద్దరు వేస్తే వారిని మందలించారు. రెండసారి పునరావృతమైతే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈదారిలో వెళ్లే ఇతర కాలనీ వాసులు రాత్రుల్లో చెత్తను వేస్తున్నట్లు సీసీ కెమెరాల్లో గుర్తించారు. వారిని సైతం హెచ్చరించామని ఇలా పునరావృతమైతే జరిమానా వేయడం లేదా మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.


స్తంభానికి అమర్చిన సీసీ కెమెరా



చెత్త పడవేస్తున్న ఓ వ్యక్తి సీసీ కెమెరాకు చిక్కాడిలా..

సత్ఫలితాన్నిస్తుంది



మా కాలనీని పరిశుభ్రతకు చిరునామాగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో కృషి చేస్తున్నాం. ఇంటింటికి చెత్త రిక్షా వస్తుంది. అయితే కొందరు రాత్రుల్లో చెత్తను రోడ్లపై వేసి వెళ్తున్నారు. దీంతో అక్కడ అధ్వాన పరిస్థితి నెలకొంటుంది. ఎవరు వేస్తున్నారో అర్థం కావడలేదు. దీనిపై తీవ్రంగా ఆలోచించాం. సీసీ కెమెరాలే ఉత్తమమని ఆలోచించి రూ.20 వేలు వెచ్చించి రెండు కెమెరాలు కొన్నాం. ఇవి మంచి ఫలితాన్నిస్తున్నాయి. కేవలం చెత్త వేసే వారిని గుర్తించి వారికి జరిమానా విధిస్తే పరిస్థితిలో మార్పు వస్తుందని ఆశిస్తున్నాం. అంతే కాకుండా ఈనిఘా నేత్రాలతో కాలనీలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా గుర్తుపట్టేలా మరిన్ని కెమెరాల ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నాం.

బాబురావ్‌గౌడ్, కాలనీ అధ్యక్షుడు

వైభవంగా అయ్యప్ప పడిపూజ


పూజలో పాల్గొన్న నేతలు

అల్వాల్, న్యూస్‌టుడే: సుభాష్‌నగర్‌లోని అశోక్‌నగర్‌లో అయ్యప్ప స్వామి పడిపూజ గురువారం వైభవంగా నిర్వహించారు. గురుస్వామి నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి భజన, గీతాలు ఆకట్టుకొన్నాయి. కార్పొరేటర్ సబిత దీక్షలో ఉన్న స్వాములకు అన్నదానం చేశారు.

హోమ శిక్షణ శిబిరం ప్రారంభం

యాజ్ఞిక పీఠం ఆధ్వర్యంలో ఓల్డ్‌అల్వాల్‌లోని రామాలయంలో హోమ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. శ్రీరామానుజ సహస్రాబ్ది సందర్భంగా పీఠాధిపతి పీటీజీఎస్‌కిశోర్ నాయకత్వంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఏడు రోజుల పాటు జరిగే తరగతుల్లో హోమం నిర్వహణకు సంబంధించిన పూజాక్రతువులో శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగుతుంది. ఆసక్తి ఉన్న వైష్ణవులు శిక్షణకు హాజరుకావచ్చని నిర్వాహకురాలు రోహిని దేవి తెలిపారు.


హోమ శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అభ్యర్థులు

మురుగు.. పరుగో పరుగు


నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి యాప్రాల్ శైలీ గార్డెన్ కూడలి సమీపంలో మ్యాన్‌హోల్ నుంచి మూడు రోజులుగా మురుగు నీరు రోడ్డు మీద పరుగులు పెడుతుంది. దీంతో అక్కడ అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో అక్కడి వారు తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. – డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని కార్పొరేటర్ జితేంద్రనాథ్ అన్నారు. గురువారం కౌకూర్‌లో జీహెచ్‌ఎంసీ అల్వాల్ సర్కిల్ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్తను నిర్దేశిత ప్రాంతాల్లోనే వేయాలని సూచించారు. హైదరాబాద్ నగరాన్ని స్వచ్ఛతలో ఇతర నగరాలకు ఆదర్శంగా నిలపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పి.డి.వో రత్నరాణి, ఏ.ఎం.హెచ్.ఓ హెలెన్ నిర్మల, డివిజన్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, సబిత తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ జితేంద్రనాథ్

లిటిల్ బర్డ్స్‌లో సంక్రాంతి ఫెస్ట్

మౌలాలి, న్యూస్‌టుడే: మౌలాలి డివిజన్ పరిధి సంతోషిమాతనగర్ కాలనీలోని లిటిల్ బర్డ్స్ పాఠశాలలో గురువారం సంక్రాంతి ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. పాఠశాల చిన్నారులు పాఠశాల ఆవరణలో ముగ్గులు వేసి గాలిపటాలను ఎగురవేస్తూ ఉల్లాసంగా గడిపారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన పలురకాల వస్తువులను ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. ముఖాలకు రంగులు పులుముకుని పాఠశాలలో సందడి చేశారు. సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేసేందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ అనిత తెలిపారు. అనంతరం బహుమతుల ప్రదానం చేశారు.



సంక్రాంతి ముగ్గులు వేస్తున్న చిన్నారులు


వస్తువులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు


ఉపాధ్యాయులతో సందడి

మల్కాజిగిరి

దళితులపై దాడిని మానుకోవాలి

నేరేడ్‌మెట్: భాజపా ఆర్ఎస్ఎస్‌లు దళితులపై చేస్తున్న దాడిని మానుకోవాలని నేరేడ్‌మెట్ షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి డిమాండ్ చేసింది. ఈమేరకు సంఘ నేతలు ఓల్డ్ నేరేడ్‌మెట్‌లోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలో దళిత యువకుడిపై దాడి చేసి హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమితి అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

పనులు ఇలా ఎలా చేపడతారు?



తూర్పు ఆనంద్‌బాగ్ డివిజన్ వెంకటాద్రినగర్ ప్రవేశమార్గంలో ఏళ్ల తరబడి ఉన్న రహదారి గుంతను తూతూమంత్రంగా పూడ్చారు. మరమ్మతులు చేసేముందు ఆ గుంతలోని మట్టిని తొలగించి శుభ్రం చేసి తరువాత తారు మిశ్రమాన్ని వేసి చదును చేయాలి. అలా కాకుండా ఒక ట్రాలీలో తారు మిశ్రమానికి తెచ్చి గుంతలో పోసి వెళ్లిపోతున్నారు. వాహనాల రాకపోకలతో ఎగుడు దిగుడుగా తయారవుతోంది. ఈ పనులతో గుత్తేదారులకు లాభం కలుగుతోంది. రోడ్డు బాగుపడటం లేదు. – మల్కాజిగిరి, న్యూస్‌టుడే

ఘనంగా బ్రెయిలీ జయంతి



బ్రెయిలీ జయంతిని నిర్వహిస్తున్న దివ్యాంగులు

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయి బ్రెయిలీ జయంతిని మల్కాజిగిరి పట్టణ దివ్యాంగుల సమాఖ్య అధ్వర్యంలో గురువారం చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గణేష్.. బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మెయిస్, ఉపాధ్యక్షుడు జ్ఞానేశ్వర్, కోశాధికారి రాజ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల ఆశలను వమ్ము చేసిన తెరాస'

మల్కాజిగిరి: నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేస్తారని ఇక్కడి ప్రజాప్రతినిధులపై పెట్టుకున్న ఆశలను వారు నీరుగార్చారని టీపీసీసీ కార్యదర్శి సురేష్ యాదవ్ ఆరోపించారు. గురువారం గీతానగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎంపీ నుంచి కార్పొరేటర్ వరకు ప్రజా సమస్యలను పరిష్కరించటంలో చొరవ తీసుకోవటం లేదన్నారు.

ఎమ్మెల్సీతో తెరాస నేతల భేటీ

మౌలాలి: ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులకు చేరే విధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్సీ మైనంపల్లి హనుమంతరావు తెరాస నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గురువారం మౌలాలి డివిజన్‌కు చెందిన పలువురు తెరాస నాయకులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. పథకాలను అర్హులైన ప్రతిఒక్కరు వినియోగించుకునే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. డివిజన్ అధ్యక్షుడు భాగ్యనందరావు పాల్గొన్నారు.

సర్కిల్ ఏసీపీపై కరపత్రం.. పోలీసులకు ఫిర్యాదు

మల్కాజిగిరి: తన పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా కరపత్రాలు ప్రచురించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మల్కాజిగిరి సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారి నర్సింగ్‌రావు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అవాస్తవాలను ప్రచురించి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారని, పోలీసులు దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ముషీరాబాద్

'ఉచిత క్రైస్తవ వివాహ వేదికను సద్వినియోగం చేసుకోవాలి'

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: క్రైస్తవ యువతీయువకుల వివాహ పరిచయ వేదిక ఈనెల 6న సికింద్రాబాద్‌లోని వైఎంసీఏ ఎగ్జిబిషన్ హాలులో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సీఈఓ అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. క్రైస్తవ యువతీ, యువకులు వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. తమ సంస్థకు చెందిన వెబ్‌సైట్‌లో పొందుపరిచిన ప్రకారం ఈవెంట్ ఎట్ ఇండియా క్రిస్టియన్ మ్యాట్రీమోనిడాట్‌కామ్‌కు పంపించాలని సూచించారు.

ఈ-పోస్ యంత్రాల మొరాయింపు

✦ తరచూ సర్వర్ డౌన్.. ✦ కార్డుదారులు.. డీలర్లకు ఇక్కట్లు



అచ్చయ్యనగర్ బస్తీలోని 663 రేషన్ దుకాణం

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: ఇటీవల ఆరో సర్కిల్ సహాయ పౌర సరసరఫరాల శాఖ.. చౌక ధరల దుఖాణాల్లో ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్ (ఈ-పోస్) వేలి ముద్ర యంత్రాలను ప్రవేశపెట్టింది. ఈ యంత్రాన్ని సీఆర్వో కార్యాలయానికి అనుసంధానం చేశారు. దీంతో కార్డుదారులకు తప్పకుండా సరకులు అందడంతోపాటు వారు ఎన్ని సరకులు పొందుతున్నారో సంబంధిత వివరాలు సీఆర్వో కార్యాలయానికి సమాచారం పంపుతుంది.

రేషన్ డీలర్లు.. బోగస్ కార్డుదారుల పేరిట సరకును పక్కదారి పట్టించకుండా ఈ యంత్రం పూర్తిగా కళ్లెం వేసింది. ఈ క్రమంలో వాటి పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన ఆరో సర్కిల్ పౌరసరఫరాల శాఖ ఇన్స్‌పెక్టర్లు వాటి నిర్వహణను సరిగా పట్టించుకోకపోవడంతో తరచూ మొరాయిస్తున్నాయి. సర్కిల్ పరిధిలోని పలు రేషన్ దుకాణాల్లో ఈ-పోస్ యంత్రాల్లో సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. తరచూ సర్వర్ డౌన్.. సర్వర్ డౌన్ అంటూ.. దయచేసి జీపీఆర్ఎస్‌ను కనెక్టు చేయండి? సర్వర్ రెస్పాన్స్ టైమ్ అవుట్? అయిందంటూ చూపుతున్నాయి. ఫలితంగా నెలనెలా సరకులు పొందేందుకు చౌక ధరల దుకాణాలకు వచ్చే కార్డుదారులకు యంత్రం పనిచేయకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు.



ఈ-పోస్ యంత్రంలో సాంకేతిక సమస్య

దీనికితోడు పోర్టబులిటీ విధానం సైతం ప్రవేశపెట్టారు. ఆ విధానంతో నగరంలో ఎక్కడైనా సరకులు పొందొచ్చు. కానీ అంతటా ఇదే మొరాయింపు ఎదురవుతుండటంతో కార్డుదారులు, రేషన్ డీలర్లు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఈ-పోస్ యంత్రాలు సక్రమంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కార్డుదారులు కోరుతున్నారు.

సర్కిల్ కార్యాలయంలో..

ఇక్కడి సర్కిల్ కార్యాలయం పరిధిలో ముషీరాబాద్, అంబర్‌పేట్, కొంత ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ప్రాంతాలకు చెందిన మొత్తం 72 మంది రేషన్ డీలర్లు ఉన్నారు. రాంనగర్, విద్యానగర్, నల్లకుంట, గోల్నాక, బాగ్‌అంబర్‌పేట్, గాంధీనగర్, దోమలగూడ, చిక్కడపల్లి, బర్కత్‌పుర, నారాయణగూడ, అడిక్‌మెట్ తదితర బస్తీలు, కాలనీలకు చెందిన కార్డుదారులు నిత్యం ఆయా రేషన్ దుకాణాలకు సరకుల కోసం వచ్చి ఇక్కట్లకు గురవుతున్నారు.

ఎన్ని కార్డులు.. ఎంత పంపిణీ

సర్కిల్ పరిధిలో ఒక్కో అంత్యోదయ కార్డుదారుకు నెలకు 35 కిలోల బియ్యం పంపిణీ చేస్తారు. మొత్తం అంత్యోదయ కార్డులు 1,917 వీటికిగాను 670.95 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున కుటుంబంలో ఎంతమంది ఉంటే అందరికి బియ్యం పంపిణీ చేస్తున్నారు. మొత్తం ఆహార భద్రతకార్డులు - 50,297 కార్డులకుగాను 10765.80 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇక అన్నపూర్ణ కార్డులు 19 వరకు ఉన్నాయి. ఒక్కో కార్డుకు ఉచితంగా నెలకు ఒక్కో కార్డుకు పదికిలోల చొప్పున 190 కిలోలు బియ్యం అందజేస్తారు. అలాగే నెలకు 56,900 లీటర్ల కిరోసిన్ పంపిణీ చేస్తున్నారు. చక్కర 1,917 కిలోలు(అంత్యోదయ కార్డుదారులకు మాత్రమే) పంపిణీ చేస్తున్నారు. ఒక్కో కార్డుదారుకు కిలో చొప్పున అందజేస్తున్నారు. ఈ విషయమై ఆరో సర్కిల్ సహాయ అధికారిని 'న్యూస్‌టుడే' చరవాణిలో సంప్రదించగా స్పందించలేదు. సీఆర్వో కార్యాలయంలో ఈ-పోస్ పర్యవేక్షణను పరిశీలించే హరినాథ్‌ను సంప్రదించగా.. తాము కూడా ఉన్నతాధికారులకు సమస్యను నివేదించామని తెలిపారు. ఈ-పోస్ యంత్రాలకు సాంకేతిక, సర్వర్ డౌన్ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రాంనగర్: ముషీరాబాద్ నియోజకవర్గంలో దశాబ్దాల కాలం నుంచి ఉన్న పాత డ్రైనేజీ వ్యవస్థను తొలగించి కొత్త పైపులు వేసి నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్య లేకుండా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యే డా. కె. లక్ష్మణ్ తెలిపారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్ గుల్షన్‌నగర్‌లో రూ. 9.30లక్షలతో డ్రైనేజీ పైపులైన్ పనులను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో కోట్ల రూపాయలతో డ్రైనేజీ, మంచినీటి పనులను ప్రణాళికా బద్ధంగా చేపట్టకపోవడంతో సమస్యలు మళ్లీ వస్తున్నాయన్నారు. మురుగు నీటి సమస్య పరిష్కారానికి గోశాల వద్ద ప్రత్యేక పైపులైన్ నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర మంత్రి కేటీఆర్‌కు సూచించామని ఆయన సానుకూలంగా స్పందించి రూ. 21కోట్లు మంజూరు చేశారని తెలిపారు. భోలక్‌పూర్‌లో భూగర్భ జలాలు కలుషితంగా మారుతున్నాయని ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జలమండలి ఎండీకి సూచించామన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం చంద్రశేఖర్, మేనేజర్ ప్రసాద్‌బాబు, భాజపా నాయకులు విశ్వం, మహేశ్, కనకేశ్, చంద్రమోహన్, నర్సింహ, అక్లక్ హుస్సేన్, కృష్ణ, నిత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న స్థానికులు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: నూతన సంవత్సరంలో తొలి గురువారం కావడంతో బాగ్‌లింగంపల్లిలోని సాయిబాబా ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వైస్ ఛైర్మన్ పెద్దోళ్ల గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ధర్మరాజ్‌గౌడ్, కోశాధికారి, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, స్థానిక కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ, అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాబా ఆలయం ఎదుట ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది స్థానిక ప్రజలకు కంటి పరీక్షలు చేశారు. వైద్య సలహాలు, సూచనలు అందజేశారు.

'ట్రాఫిక్ నియమాలు పాటించాలి'



ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తున్న పోలీసు అధికారి

కవాడిగూడ, న్యూస్‌టుడే: ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించినపుడే ప్రమాదాలు నివారించగలుగుతామని భారత్ స్కౌట్స్, గైడ్స్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. దోమలగూడలోని ప్రధాన కార్యాలయంలో గురువారం ట్రాఫిక్ నియమాలపై బాలలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏటా స్కౌట్స్, గైడ్స్ బాలబాలికలకు ప్రకృతి విపత్తులపై శిబిరం నిర్వహిస్తుంటామని వివరించారు. విపత్తులు సంభవించినపుడు చేపట్టాల్సిన చర్యలను వివరిస్తామన్నారు. శిబిరంలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు, రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా రక్తదానం, రక్తనిధి నిర్వహణ, బాంబుస్క్వాడ్ పనితీరు, ఫిల్మ్ డివిజన్ లాంటి అంశాలలో శిక్షణ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నగర ట్రాఫిక్ విభాగం నుంచి వచ్చిన అధికారి ఆదిల్ అక్తర్ ప్రత్యేక వాహనంలో ఏర్పాటు చేసిన టీవీ తెరపైన వివిధ రకాల ప్రమాదాలను చూపించి నివారణ ఉపాయాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను బాలలకు వివరించారు. కార్యక్రమంలో స్కౌట్స్, గైడ్స్ తెలంగాణ కమిటీ సహాయ ప్రధాన కార్యదర్శి జాన్‌శామ్యూల్, శిబిరం ఇన్‌ఛార్జి పరమేశ్వర్, సుగుణ రాజేంద్రం, అనంతలక్ష్మి, ఇ. లింగం తదితరులు పాల్గొన్నారు. మరో మూడురోజుల పాటు శిబిరం జరుగుతుందని తెలిపారు.

కదలడు వదలడు చిత్రప్రదర్శన



విద్యాధర్‌రావును సన్మానిస్తున్న అతిథులు

వివేక్‌నగర్, న్యూస్‌టుడే:కళానిలయం సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభ సహకారంతో గురువారం కళాదీక్షితులు కళావేదికలో అలనాటి ప్రసిద్ధ జానపద చిత్రం కదలడు వదలడుని ప్రదర్శించారు. ఈ చిత్రకథానాయకుడు ఎన్టీరామారావు వర్ధంతిని, దర్శకుడు విఠలాచార్య జయంతిని పురస్కరించుకొని లక్ష్మీ నారాయణ పిక్చర్స్ పతాకంపై నాగేశ్వర్‌రావు నిర్మించిన చిత్రప్రదర్శను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంలో జరిపిన సభా కార్యక్రమలో అతిథులుగా ప్రముఖులు సుంకరసత్యనారాయణ, కళా జనార్ధనమూర్తి, యాదగిరి, మల్లికార్జునలు పాల్గొన్నారు. రచయిత విద్యాధర్‌రావుకు ఆత్మీయ సత్కారం చేశారు. నిర్వహణ సంస్థ ముఖ్యులు సురేందర్, పుష్పలతలు పర్యవేక్షణ చేశారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: సుందరయ్య కళానిలయంలో జస్టిస్ చల్లా కొండయ్య నాలెడ్జ్ కేంద్రంలోని నియోకర్సర్‌లో యువతీయువకులకు జీఎస్టీ అకౌంటెంట్ కోర్సుతో పాటు కొత్తగా మరో రెండు కోర్సుల్లో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ అడ్మిన్ మేనేజరు పీఎన్ మూర్తి, మేనేజరు రాణా ఒక ప్రకటనలో తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటరింగ్ పెరిఫెరల్ కంప్యూటర్ హార్డ్‌వేర్‌పై ఉచిత శిక్షణను ఈనెల మొదటి వారంలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం కింద ఈ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఉచిత శిక్షణలో ప్రవేశం పొందాలనే అభ్యర్థులు సుందరయ్య కళానిలయంలోని నియోకర్సర్ శిక్షణ కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

నిధులు రాబట్టి పనులు చేపట్టలేరా: ఎమ్మెల్యే డా.లక్ష్మణ్

కవాడిగూడ, న్యూస్‌టుడే: శాసనసభ్యుడిగా అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధులను తెప్పించుకుని పనులు చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, ముషీరాబాద్ శాసనసభ్యుడు డా. లక్ష్మణ్ అన్నారు. కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ లాస్యనందిత, వివిధ శాఖల అధికారులతో కలిసి గురువారం రోటరీకాలనీని సందర్శించారు. కాలనీ పెద్దలు యాదగిరి, మోహన్, రమేశ్, కల్పన తదితరులు కాలనీలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం ఆరు మాసాల కిందట రూ. 10 లక్షలు కేటాయించి కలెక్టర్‌కు రాతపూర్వకంగా తెలిచేశానని శాసనసభ్యుడు వివరించారు. అయితే సంబంధిత జీహెచ్ఎంసీ 15వ సర్కిల్ ఇంజినీరింగ్ అధికారులు ఫైలును కదలించి నిధులు రాబట్టాలని అన్నారు. టెండరు పిలిచి, గుత్తేదారును నియమించి, పనులు కొనసాగించాల్సిన బాధ్యత వారిపై ఉంటుందన్నారు. వెంటనే రోటరీకాలనీ కమ్యూనిటీహాలు మొదటి అంతస్తు నిర్మాణం కోసం మంజూరు చేయించిన నిధులతో పనులు మొదలుపెట్టాలని సూచించారు. మంచినీటి సరఫరాను క్రమబద్ధీకరించాలని పేర్కొన్నారు. నీటి కాలుష్యంపై ఫిర్యాదు చేసేందుకు జలమండలి కార్యాలయానికి వెళితే కవాడిగూడ మేనేజరు దూషించారని పలువురు మహిళలు ఫిర్యాదు చేయడంతో శాసనసభ్యుడు అధికారిని మందలించారు. ఏఎంఓహెచ్ డా. భార్గవనారాయణ హాజరైన కాలనీవాసులతో స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. పర్యటనలో ముషీరాబాద్ ఉపతహసీల్దార్ శ్రీనివాస్, జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మీనారాయణ, జలమండలి డీజీఎం చంద్రశేఖర్, భాజపా నాయకులు రమేశ్‌రాం, వెంకటేశ్, పరిమల్‌కుమార్, మహేందర్ బాబు, అనిల్‌కుమార్, తెరాస నాయకులు వల్లాల శ్యాంయాదవ్, హరిబాబు, శివ, వల్లాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



రోటరీకాలనీలో సమస్యలు తెలుసుకొంటున్న లక్ష్మణ్



డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మణ్

స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు 8న

కవాడిగూడ, న్యూస్‌టుడే: స్వామి వివేకానంద 156వ జన్మతిథి పురస్కరించుకుని ఈ నెల 8న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి జ్ఞానదానంద తెలిపారు. ధ్యానం, సుప్రభాతం, మంగళహారతి, భజన, రామకృష్ణ పరమహంస దేవాలయం ప్రదక్షిణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. స్వామి వివేకానంద జీవితం, సందేశం అంశంపైన ప్రసంగం ఉంటుందన్నారు. అదే విధంగా జన్మ తేది ప్రకారం ఈనెల 12న జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ట్యాంక్‌బండ్‌పై ఉన్న వివేకానంద విగ్రహం నుంచి ఇందిరా పార్కు మీదుగా మఠం వరకు యువజనుల ఊరేగింపు నిర్వహిస్తామని వివరించారు. అనంతరం రామకృష్ణమఠంలో జరిగే కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

ముషీరాబాద్

గోల్నాకలో కూరగాయల ధరలు

తిలక్‌నగర్, న్యూస్‌టుడే: (గురువారం నాటివి.. కిలో రూపాయలలో) టమాట-7, ఆలుగడ్డ-15, వంకాయ-30, క్యాబేజీ-30, బెండకాయ-35, దొండకాయ-25, కాకరకాయ-40, బీన్స్-35, దోసకాయ-25, సొరకాయ-15, బీరకాయ-35, క్యాప్సికం-30, చామగడ్డ-35, క్యారెట్-40, పచ్చిమిర్చి-30, ఉల్లిగడ్డ-35, వెల్లులి-50, అల్లం-40.

కాలమేదైనా.. అక్కడ దోమల రాజ్యమే

కృష్ణానగర్‌లో దోమల స్వైరవిహారం.. ప్రజలు బెంబేలు


బాకారంలో దోమలకు ఆవాసంగా చెత్తాచెదారంతో ఖాళీ స్థలం

రాంనగర్, న్యూస్‌టుడే: అధికారుల నిర్లక్ష్యంతో కృష్ణానగర్ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఎస్సార్టీ పార్కు ఎదురుగా ఉన్న వీధిలో ఏడున్నర ఎకరాల స్థలం దశాబ్దాల నుంచి కోర్టు వివాదంలో ఉంది. ఈ స్థలంలో నివాసాల పక్కనే పెద్ద గుంత ఉండటంతో పాటు ఏపుగా పిచ్చి మొక్కలు పెరగటం, చెత్తా, చెదారంతో పెద్ద ఎత్తున పేరుకుపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని నెలలుగా డ్రైనేజీ నీరు సైతం గుంతలోకి వెళ్తుండటంతో దుర్వాసన, దోమల స్వైరవిహారంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దోమలతో మలేరియా, డెంగీ లాంటి ప్రమాదకర వ్యాధులు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మలేరియా డిపార్టుమెంట్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అప్పుడప్పుడు దోమలు రాకుండా ఫాగింగ్ చేస్తుంటే బాగుంటుందని అంటున్నారు. ఆరు నెలలు దాటినా ఇప్పటికి ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ నీళ్లు గుంతలోకి పోకుండా చూడాలని, వర్షాకాలంలో సైతం గుంతల్లో నీరు చేరి దోమలు, బొంత పురుగులు ఇంట్లోకి వస్తుంటాయని మట్టిపోసి గుంతను పూర్తిగా పూడ్చివేయాలని కోరుతున్నారు.


ఎస్సార్టీ కాలనీలో ఏపుగా పెరిగిన చెట్లు

చలి తీవ్రత పెరిగినా...

చలి తీవ్రత పెరిగినా దోమల బెడద మాత్రం తగ్గలేదు. బస్తీలు, కాలనీలు అనే తేడా లేకుండా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రధానంగా మూసీ పరివాహక ప్రాంతమైన అడిక్‌మెట్, నాగమయ్యకుంట, జాంబవినగర్, రాంనగర్, ముషీరాబాద్‌లలో దోమల బెడద తీవ్రంగా ఉంది. ముఖ్యంగా అంబేడ్కర్‌నగర్, కృష్ణానగర్ ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. బాకారం పోచమ్మదేవాలయం వెనుకనున్న మూడు ఎకరాల స్థలంలో ఐదేళ్లక్రితం అపార్టుమెంట్ నిర్మాణం కోసం గోతులు తవ్వి అనంతరం నిర్మాణం పనులను అలాగే వదిలేయడంతో గుంతలోకి నీరు చేరి దోమల బెడద తీవ్రంగా ఉంది. అదేవిధంగా రెడ్‌కాన్వెంట్ పాఠశాల పక్కన, బాకారం పద్మశాలి మిత్ర సమితి పక్కన ఖాళీ స్థలంలో డబ్బాలు, పెంకులు, పనికిరాని చెత్తా చెదారం వేయడంతో ఇక్కడి ప్రాంత ప్రజలు దోమలతో ప్రతీయేడు డెంగీ వ్యాధితో ఆస్పత్రిల్లో చేరి వేల రూపాయలు ఆస్పత్రికి చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పత్తాలేని అధికారులు..

దోమలు విజృంభిస్తున్నా జీహెచ్ఎంసీ మలేరియా విభాగం అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. రోజూ ఆయా ప్రాంతాలను మలేరియా సిబ్బంది సందర్శించి దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు ఈ ప్రాంతాల్లో మచ్చుకు కూడా కానరావడంలేదు. దోమల బారిన పడి ప్రజలు ఆస్పత్రిపాలైనా అధికారులు పట్టించుకోవడం లేరని మండిపడుతున్నారు. ఇప్పటికైనా మలేరియా విభాగం అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

వెంటనే చర్యలు తీసుకుంటాం

– అరుణ్, ఏఈ (మలేరియా విభాగం)

దోమల నిర్మూలనకు గట్టి చర్యలు తీసుకుంటున్నాం. త్వరలో అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ చేయిస్తాం. పాత టైర్లు, పగిలిపోయిన పెంకులు, తాగి పడవేసిన కొబ్బరి బోండం, పూల తొట్లు వంటి వాటిల్లో కొంత నీరు నిలువడం వల్లే దోమలు వృద్ధి చెందుతాయి. ప్రజల్లో దోమల నివారణపై అవగాహన కల్పిస్తాం. ఫాగింగ్ కూడా చేయిస్తున్నాం. ఏవరైనా సిబ్బంది రాకుంటే మాకు తెలియజేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

తడిచెత్తతో సేంద్రియ ఎరువు తయారీ


వర్మీకంపోస్ట్ తయారీ గుంతను ప్రారంభిస్తున్న ఏఎంఓహెచ్

గోల్నాక, న్యూస్‌టుడే: తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయవచ్చని జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్-16 ఏఎంఓహెచ్ డాక్టర్ హేమలత తెలిపారు. గురువారం కృష్ణానగర్‌లో తడి చెత్త వర్మీకంపోస్ట్ తయారీ గుంతను కార్పొరేటర్ కాలేరు పద్మతో కలిసి ప్రారంభించారు. ప్రజలు తమ ఇళ్లలోని తడి, పొడి చెత్తను వేర్వేరుగా జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బందికి ఇవ్వాలని కోరారు. జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ కాలేరు వెంకటేశ్, నేతలు ఆర్‌కేబాబు, రాము, రామకృష్ణ, రాజు, బుచ్చిరెడ్డి, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలపై ఉద్యమించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

గోల్నాక, న్యూస్‌టుడే: ప్రజా వ్యతిరేక చర్యలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉద్యమించాలని భాజపా శాసనసభాపక్ష నేత జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు కావొస్తున్నా ఎన్నికల హామీలను అమలు చేయడంలో తెరాస ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గురువారం చెన్నారెడ్డినగర్‌లోని ఎస్వీఆర్ ఫంక్షన్‌హాల్లో భాజపా అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు నాగభూషణంచారి, ప్రధాన కార్యదర్శి ఆర్.కృష్ణముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ అనుబంధ విభాగాల పదవులకు సంబంధించి నేతలకు నియామక పత్రాలను అందజేశారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై పార్టీ నేతలు ఇంటింటి ప్రచారాన్ని చేపట్టాలని సూచించారు. నేతలు ఆనంద్‌గౌడ్, భిక్షపతి, యాదగిరి, గౌతమ్‌రావు, సల్లా నరేందర్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా అచ్చిని రమేష్

విద్యానగర్ : నాయకులు, కార్యకర్తలు స్థానికులకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాల ఫలాలు వారికి చేరేలా కృషి చేయాలని శాసన సభ్యుడు జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అచ్చిని రమేష్ నియామకాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానికుల మన్ననలు పొంది ప్రజా నాయకుడుగా గుర్తింపు పొందాలని కోరారు. రమేష్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహాయ సహకారాలు అందించిన మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, గ్రేటర్ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. భాజపా నాయకులు వినోద్ యాదవ్, చుక్క జగన్, సల్ల నరేందర్, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజస్వామి 171వ ఆరాధనోత్సవాలు

విద్యానగర్: త్యాగరాజస్వామి 171వ ఆరాధనోత్సవాలు, శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం 62వ వార్షికోత్సవాలను అంబర్‌పేట డివిజన్ శివం రోడ్డులోని శ్రీ షిర్డి సాయిబాబా సంస్థాన్‌లో శనివారం సాయంత్రం నిర్వహిస్తున్నట్టు విద్యాలయ ప్రిన్సిపల్ పోపూరి శ్రీనివాస శర్మ గురువారం తెలిపారు. సంస్థాన్ ఆధ్యాత్మిక కేంద్రంలో నిర్వహించే ఈ ఉత్సవాలకు ప్రముఖ టి.వి దర్శక,నిర్మాత శోభాశంకర్ ముఖ్య అతిథిగా వస్తారని, ప్రముఖులు డాక్టర్ బోనాల ప్రకాష్, వివిఎల్ఎన్.శర్మ, మల్లాది శాంతామూర్తి పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు.

డా.ఎన్.గోపికి రాగరాగిణి విశిష్ట సాహితీ పురస్కారం


ఎన్.గోపిని సన్మానిస్తున్న పొత్తూరి వెంకటేశ్వరరావు

వివేక్‌నగర్, న్యూస్‌టుడే: ఆచార్య ఎన్.గోపి ఆధునిక తెలుగుకవిత్వం ప్రతిష్ఠను విస్తృత స్థాయిలో పెంపొందించిన గొప్ప కవులలో గణనీయుడని ఆయన జాతీయకవితా మన్ననలందుకున్న ప్రజ్ఞాశాలి అని పూర్వ ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి అధ్యక్షులు డా.పి.వెంకటేశ్వర్‌రావు ప్రశంసించారు. డా.గోపి విశిష్టమైన వచనకవితా ప్రక్రియ నానీలను సృజించి ప్రతిభావంతులైన ఎందరో యువ, నవ కవులను ఆకర్షించి ఈ కవితారూపానికి ప్రాచుర్యాన్ని, ఔన్నత్యాన్ని చేకూర్చిన విశిష్ట వ్యక్తి అన్నారు. తెలుగువిశ్వవిద్యాలయం ఉపకులపతి డా.ఎన్.గోపి చేపట్టిన పలు సంస్కరణలు పరిపాలనాదక్షుడిగా ఆయన కీర్తిని పెంపొందించాయన్నారు. సర్వతోముఖ ప్రతిభాశాలి, సినీకవికోవిదుడు వీటూరి జయంతి సందర్భంగా ప్రముఖ సాంస్కృతిక సంస్థ రాగరాగిణి ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డా.ఎన్.గోపికి రాగరాగిణి విశిష్ట సాహితీపురస్కారాన్ని ప్రదానం చేసిన సభలో డా.పి.వెంకటేశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డా.గోపికి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందజేయడం పట్ల హర్షం వెలిబుచ్చారు. పురస్కార ప్రదానోత్సవం త్యాగరాయగానసభ కళాసుబ్బారావు కళావేదికలో జరిగింది. ప్రసిద్ధ కవయిత్రి డా.సి.భవానిదేవి అధ్యక్షత వహించారు. అతిథులుగా గానసభ అధ్యక్షులు కళాజనార్ధనమూర్తి, కళాభిమాని శైలజలు హాజరయ్యారు. ఆనంద్ వ్యాఖ్యానం చెప్పారు. నిర్వహణ సంస్థ ప్రధాన కార్యదర్శి సుబ్బలక్ష్మి పర్యవేక్షణ చేశారు.

శతక సాహిత్యం విశిష్టమైనది



కేతవరపు రాజశ్రీని సన్మానిస్తున్న అతిథులు

వివేక్‌నగర్, న్యూస్‌టుడే: శతకసాహిత్యం విశిష్టమైనదని, శతకాలలో భగవంతుడి లీలలు తెలుపుతూ రాసినవి, ఆధ్యాత్మిక, వైరాగ్య లౌకిక, నీతి పరంగా రచించినవి ఉన్నాయని ప్రముఖ రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీ అన్నారు. దాశరథి, కృష్ణ, కాళహస్తీశ్వర, వేంకటేశ్వర తదితర శతకాలు మొదటి కోవకు చెందినవి కాగా సుమతి, వేమన మొదలైన శతకాలు రెండో రకానివని ఆమె వివరించారు. సినారె వంశీ విజ్ఞానపీఠం, కేతవరపు ఫౌండేషన్, త్యాగరాయ గానసభల ఆధ్వర్యంలో గురువారం కళాలలిత కళావేదికలో నిర్వహించిన సాహిత్య సమావేశంలో రాజ్యశ్రీ శతక పద్యాలు-పురాణాలతో సమన్వయం అనే అంశంపై సోదాహరణ ప్రసంగం చేశారు. ఆమె కృష్ణ, వేమన, సుమతి, దాశరథి, వేంకటేశ్వర శతకాలలోని కొన్ని పద్యాలను ఉదహరించి వాటికి పురాణకథలను సమన్వయపరచి ఉపన్యసించారు. ముఖ్యఅతిథి ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత్రి డా.కేవీ కృష్ణకుమారి ప్రధాన వక్త రాజ్యశ్రీని సత్కరించారు. వంశీ సంస్థల వ్యవస్థాపకులు రామరాజు అధ్యక్షత వహించారు. ప్రత్యేకాతిథిగా త్యాగరాయగానసభ అధ్యక్షులు కళాజనార్దనమూర్తి విచ్చేశారు. తొలుత రాఘవాచారి, బాపిరాజు, రేవతి, సుజాతామూర్తిలు సినీ గీతాలను ఆలపించారు.

వికలాంగులకు రిజర్వేషన్లు కచ్చితంగా అమలయ్యేలా చర్యలు


బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేస్తున్న రాములు

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: విద్య, ఉద్యోగాల్లో అంధులతోసహా వికలాంగులకు మూడు శాతం రిజర్వేషన్లు కచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ బీఎస్.రాములు పేర్కొన్నారు. లూయిస్ బ్రెయిలీ 209వ జయంతిని పురస్కరించుకుని దారుషిఫా ప్రభుత్వ అంధుల పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాములు ప్రసంగిస్తూ.. బ్రెయిలీ రూపొందించిన లిపితో అంధులు విద్యావంతులై అన్ని రంగాల్లో రాణించగలుగుతున్నారన్నారు. అంధులు మనోనేత్రంతో ప్రపంచాన్ని చూస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంధ విద్యార్థులను గుర్తించి ఇక్కడి పాఠశాలల్లో చేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. దారుషిఫా అంధుల పాఠశాలలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని రాములు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సంక్షేమ సంస్థ ఛైర్మన్ వాసుదేవరెడ్డి, హైదరాబాద్ జిల్లా జాయింట్ కలెక్టర్ కె.నిఖిల, రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు సురేఖ, బహదూర్‌పురా మండల డిప్యూటీ ఐఓఎస్ సత్యనారాయణ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సంఘం కార్యదర్శి ఎంపిక

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: కుత్బుల్లాపూర్‌కు చెందిన నల్ల ప్రసాద్‌గౌడ్ రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల తల్లిదండ్రుల సంఘం కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేటి నారాయణరావు నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఇప్పటి వరకు మేడ్చల్ జిల్లా తల్లిదండ్రుల సంఘం అధ్యక్షుడిగా కొనసాగారు.

మూడున్నర ఏళ్లకు మోక్షం

● రిజర్వుడు భూముల మీదుగా రహదారి నిర్మాణానికి మార్గం సుగమం ● అటవీశాఖకు పరిహారం చెల్లించిన జీహెచ్‌ఎంసీ

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: సూరారం విశ్వకర్మకాలనీ నుంచి రిజర్వుడు ఫారెస్టు మీదుగా భౌరంపేట ప్రధాన రహదారి వరకు ప్రతిపాదించిన రహదారి నిర్మాణానికి ఎట్టకేలకు మార్గం సుగమమైంది. ఈ రహదారి విస్తరణకు అటవీశాఖ నుంచి సేకరించిన భూమికి రూ.13.41 లక్షలు పరిహారం జీహెచ్‌ఎంసీ చెల్లించడంతో మూడున్నర సంవత్సరాలుగా దస్త్రాలకే పరిమితమైన రహదారి పనులకు మోక్షం లభించింది. ఇన్నాళ్లుగా నిరీక్షించిన స్థానిక ప్రజల కల నెలవేరనుంది. జీహెచ్‌ఎంసీ, అటవీశాఖ అధికారుల చర్చలు సఫలీకృతమవడంతో త్వరలోనే ఈ మార్గంలో రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నారు.



ప్రమాదకరంగా విశ్వకర్మకాలనీ నుంచి భౌరంపేట వెళ్లే రహదారి

రూ.1.43కోట్లతో అంచనా..

విశ్వకర్మ కాలనీ నుంచి గాజులరామారం రిజర్వుడు ఫారెస్టు మీదుగా భౌరంపేట ప్రధాన రహదారి వరకు సుమారు 30 అడుగుల వెడల్పుతో 1435 మీటర్ల తారు రోడ్డు విస్తరించి ఉంది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ రహదారిపై పలు చోట్ల తారు లేచిపోయి గోతులు ఏర్పడ్డాయి. రహదారి అంచులు కూడా సుమారు ఒకటి నుంచి రెండు అడుగుల మేరకు కిందకు కుంగిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీనికి తోడు తరచూ ప్రమాదాలు సంభవిస్తుండటంతో స్థానిక ప్రజలు రహదారిని విస్తరించాలని అధికారులను కోరారు. వారి అభ్యర్థన మేరకు మూడున్నర సంవత్సరాల క్రితం ఈ రహదారి విస్తరణకు జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు రూ.1.43 కోట్లతో అంచనాలు రూపొందించి పరిపాలన అనుమతికోసం ఉన్నతాధికారులకు నివేదించగా వారు వెంటనే నిధులు మంజూరు చేశారు. తీరా విషయం తెలుసుకున్న రిజర్వుడు ఫారెస్టు అధికారులు తమ భూముల గుండా రహదారిని విస్తరించనివ్వమంటూ అభ్యంతరం చెప్పారు. దీంతో చేసేదేమీ లేక జీహెచ్‌ఎంసీ వారు సంబంధిత రహదారి విస్తరణ ప్రతిపాదనలను దస్త్రాలకే పరిమితం చేశారు.

యుద్ధప్రాతిపదికన విస్తరణ చేపడతాం..

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

విశ్వకర్మ కాలనీ నుంచి భౌరంపేట ప్రధాన రహదారి వరకు రూ. 1.43 కోట్లతో ప్రతిపాదించిన రహదారి విస్తరణ పనులకు స్వల్ప వ్యవధిలో టెండర్లు పిలిచి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తిచేయిస్తాం. గత పాలకులు ఏనాడు ఈ రహదారి విస్తరణ ప్రాధాన్యతను గుర్తించలేదు. స్థానిక ప్రజలకిచ్చిన హామీ మేరకు రిజర్వ్‌డ్ ఫారెస్టు అధికారులతో చర్చించి రహదారి నిర్మాణానికి మార్గం సుగమం చేయించా.

మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు..

ఈ విషయమై పలు సార్లు 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలకు స్పందించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సంబంధితశాఖ అధికారులతో చర్చించినా ఫలితం లేకపోయింది. తమ అటవీ భూముల్ని రహదారి విస్తరణకు ఇచ్చేదే లేదంటూ చెప్పడంతో సమస్య తీవ్రతను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. చివరకు పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే, అటవీశాఖ ఉన్నతాధికారులతో పలు సార్లు చర్చలు జరిపారు. రహదారి విస్తరణలో కోల్పోయే భూమికి ఎంత పరిహారమైనా ఇచ్చేందుకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్ధన్ రెడ్డిని ఒప్పించడంతో అటవీశాఖ అధికారులు సమ్మతించారు. స్థానిక ఇంజినీరింగ్ అధికారులు సంబంధిత రహదారికి ఇరువైపులా సర్వే నిర్వహించి విస్తరణకు సుమారు 0.9 ఎకరాల భూమి అవసరం ఉంటుందని గుర్తించారు. దీనికి ప్రస్తుత మార్కెట్ విలువ ఆధారంగా రూ. 13.41 లక్షలు పరిహారమవుతుందని నిర్ధారించారు. సంబంధిత చెక్కులను గురువారం అటవీశాఖ అధికారులకు అందజేయడంతో ఇన్నాళ్ల రహదారి విస్తరణకు ఉన్న అడ్డంకులు పూర్తిగా తొలగిపోయినట్లయింది. త్వరలో రహదారి విస్తరణకు టెండర్లు నిర్వహించి పనులు మొదలుపెట్టనున్నారు.



ప్రారంభోత్సవానికి ఎదురు చూస్తున్న మార్కెట్

మార్కెట్‌కు ముహూర్తం ఎప్పుడు ?

పేట్ బషీరాబాద్, న్యూస్‌టుడే: జీడిమెట్ల డివిజన్ పరిధి గాయత్రినగర్‌లోని మోడల్ మార్కెట్ నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి ఎదురు చూస్తోంది. జీహెచ్‌ఎంసీ అధికారులు స్థానికుల అవసరాల నిమిత్తం రూ.65లక్షలు కేటాయించి దీన్ని నిర్మించారు. మార్కెట్ నిర్మాణం పూర్తయి ఐదారు నెలలు గడుస్తున్నా ప్రారంభోత్సవానికి అధికారులు చొరవచూపడం లేదు. ఇందులో 11 దుకాణాల సముదాయాలు ఏర్పాటు చేశారు. మార్కెట్ ప్రారంభోత్సవం జరిగితే 11 కుటుంబాలకు ఉపాధి లభించే అవకాశాలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్కెట్‌ను ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎక్సైజ్ ఎస్సై సంజీవరెడ్డికి అవార్డు



అవార్డు అందుకుంటున్న సంజీవరెడ్డి

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: నగర శివారు ప్రాంతాల్లో నాటుసారా అరికట్టినందుకుగాను ఈ ఏడాది కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ ఎస్సై పి.సంజీవరెడ్డికి జిల్లా తరుపున అవార్డు దక్కింది. నగరంలోని కమిషన్ కార్యాలయంలో రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ అకున్‌సబర్వాల్ ఆయనకు అవార్డు అందజేసినట్లు మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గణేశ్ తెలిపారు. ఆయనతోపాటు బాలానగర్ ఎక్సైజ్ కార్యాలయ పరిధి కానిస్టేబుల్ శివ అవార్డు అందుకున్నారు.

మూడురోజుల్లో పూర్తి చేయాలి

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: ముసాయిదా ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, కొత్తగా ఓటు నమోదుకోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన మూడు రోజుల్లో పూర్తిచేయాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎస్.సుధాంష్ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఇటీవల చేపట్టిన సమగ్ర ఓటరు జాబితా సవరణపై బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో గురువారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వేను ఆషామాషీగా తీసుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. సంబంధిత దరఖాస్తుల ఆధారంగా ప్రతి ఒక్కరు ఇంటింటికి వెళ్లి పరిశీలన చేయాలన్నారు. ఇటీవల మార్పులు, చేర్పుల కోసం సుమారు 16వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని, వాటన్నింటిపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టి, పరిష్కరించాలని సూచించారు. కుత్బుల్లాపూర్, గాజుల రామారం సర్కిళ్ల సహాయ కమిషనర్లు కృష్ణ, అలీలు పాల్గొన్నారు.

'దిక్కులేని వారికి పెద్దదిక్కుగా ఉంటాం'

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: దిక్కులేని వారికి పెద్ద దిక్కుగా ఉంటానని అనాథబంధు సేవసేన ప్రతినిధి సాయికిరణ్ అన్నారు. సుష్మాదేవి, ఆమె కూతురు జ్యోతి కిరణ్(17) బిహార్ నుంచి నగరానికి వలస వచ్చి సూరారం డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో నివాసముంటున్నారు. అనారోగ్యంతో ఆమె కుమార్తె ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అంత్యక్రియలు చేయడానికి డబ్బులు లేక గాంధీ శవాగారం వద్దే మృతదేహాన్ని దహనం చేయడానికి సిద్ధపడింది. ఈ విషయం తెలుసుకున్న సాయికిరణ్ అక్కడికి చేరుకుని దగ్గరుండి అంత్యక్రియలు జరిపించారు. ఎవరైనా అంత్యక్రియలు చేయలేని దుస్థితిలో ఉన్నా, అనాథ శవాలు కనిపించినా అనాథ బంధు సేవసేనకు సమాచారం ఇవ్వాలని కోరారు.



ఎంపికైన విద్యార్థులతో పద్మజ

కేపటీ రెండో దశకు ఎంపిక

చింతల్, న్యూస్‌టుడే: లక్ష్య సాధన దిశగా ప్రతి విద్యార్థి విద్యాభ్యాసం సాగినప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయని శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ పద్మజ అన్నారు. గత ఏడాది నవంబర్ 19న దేశ వ్యాప్తంగా నిర్వహించిన నాలెడ్జ్ యాటిట్యూడ్ టెస్ట్‌లో చింతల్‌కు చెందిన శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు రెండో దశకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ పద్మజ, డీన్ చంద్రశేఖర్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి శ్రీనివాస్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రసాద విక్రయాలకు వేలం

జగద్గిరిగుట్ట, న్యూస్‌టుడే: జగద్గిరిగుట్ట కొండపై ఉన్న వేంకటేశ్వరాలయ వార్షికోత్సవాలకు కార్యాచరణ ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా వేడుకల్లో ప్రసాద విక్రయాలకు గురువారం ఆలయంలో వేలం నిర్వహించారు. కొబ్బరికాయల విక్రయానికి రూ.27600కు అంజిరెడ్డి దక్కించుకున్నారు. పులిహోర, లడ్డూ ప్రసాదాలు రూ. 54వేలకు శుభాష్ తీసుకున్నారు. కార్యక్రమంలో ఈవో ఆంజనేయులు, సుధాకర్, కృష్ణగౌడ్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈనెల 21నుంచి 23వరకు వార్షికోత్సవాలు జరగనున్నాయి.

ఘనంగా ఎమ్మెల్సీ జన్మదినోత్సవం

దుండిగల్, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు జన్మదినోత్సవాన్ని గురువారం ఆయన అభిమానులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. శంభీపూర్‌లోని ఆయన నివాసంలో ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారి సమక్షంలో ఆయన కేక్ కోసి పంచిపెట్టారు. ఎమ్మెల్యే కేపీ వివేక్, ఎమ్మెల్సీ మైనంపల్లి హనుమంతరావు, ఎంపీపీ ఎస్.కవిత, దుండిగల్ సర్పంచి కె.గణేశ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ

జన్మదినాన్ని పురస్కరించుకుని పురపాలక, ఐటీ మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు కలిశారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



మంత్రి కేటీఆర్‌ను కలిసిన శంభీపూర్‌రాజు

పరిశ్రమల స్థాపన వైపు దృష్టిసారించాలి



ప్రసంగిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి

దుండిగల్, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థికస్వావలంబన దిశగా అడుగులు వేయాలని, స్వయం ఉపాధి పొందడంతోపాటు పరిశ్రమల స్థాపన వైపు దృష్టి సారించాలని డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రగతినగర్‌లోని ఎలీప్‌ను గురువారం ఆమె ఆధ్వర్యంలో మెదక్ పురపాలకసంఘం ప్రజాప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటులో మహిళలకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఎలీప్ ప్రారంభమై 25 సంవత్సరాలు పూర్తి చేసుకుందని, ఇప్పటివరకు 45వేలమంది మహిళలకు పరిశ్రమల స్థాపన, స్వయం ఉపాధి రంగాలలో శిక్షణ ఇచ్చామని ఎలీప్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఎలీప్ అధ్యక్షురాలు రమాదేవి, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి, మెదక్ పురపాలకసంఘం ఛైర్మన్ మల్లిఖార్జున్‌గౌడ్, వైస్‌ఛైర్మన్ అశోక్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్

ప్రాంగణ నియామకాల్లో విద్యార్థుల ప్రతిభ

దుండిగల్, న్యూస్‌టుడే: బాచుపల్లిలోని వీఎన్‌ఆర్‌విజ్ఞాన్‌జ్యోతి కళాశాలలో ఇటీవల నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో విద్యార్థులు సత్తా చాటారని కళాశాల ప్లేస్‌మెంట్ విభాగాధిపతి డా.పార్థసారథి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న రెండు నెలల్లో 25కు పైగా కార్పొరేట్ సంస్థలు ప్రాంగణ నియామకాలు చేపడుతాయన్నారు.



గాజులరామారం రోడ్డు దుస్థితిదీ

దుమ్ములేచి పోతోంది..



షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గాజులరామారం రోడ్డులో నిరంతరం జరుగుతున్న పైపులైన్ల పనుల కారణంగా విపరీతంగా దుమ్ములేస్తోంది. ఈ రహదారిలో వెళుతున్న వాహనదారులకు ప్రయాణం నరకప్రాయంగా ఉంటోంది. గత ఆరు నెలలుగా ఈ రోడ్డులో మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. దీంతో ఒకవైపు నుంచే రాకపోకలు సాగుతున్నాయి. దీనికి తోడు ఎప్పటికప్పుడు తవ్విన రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతో నిరంతరం దుమ్ముమయంగా మారుతోంది. పనులు పూర్తయిన ప్రాంతంలో ఎప్పటికప్పుడు పాచ్‌వర్క్ పూర్తిచేస్తే ఈ సమస్య ఉండేది కాదని స్థానికులు వాపోతున్నారు. పనులు పూర్తయి నెలలు కావస్తున్నా గుత్తేదారు పాచ్‌వర్క్ పూర్తిచేయడంలో జాప్యం చేస్తుండటంతో వాహనదారులకు సమస్య తప్పడం లేదు. ఇప్పటికైనా పైప్‌లైన్ నిర్మాణం పూర్తయిన ప్రాంతాల్లో పాచ్‌వర్క్ పూర్తిచేసి రోడ్డుపై దుమ్ము లేవకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

మత్తు దిగాక సైతం ముఖం చాటేస్తున్నారు

- తనిఖీల్లో దొరికిన వాహనాలు తీసుకెళ్లేందుకు విముఖత
- ఏళ్ల తరబడి కాపు కాస్తున్న పోలీసులు

జీడిమెట్ల, న్యూస్‌టుడే: మందుబాబులు మద్యం సేవించి ఆ మత్తులో వాహనాలు నడుతూ పోలీసులకు పట్టుబడుతున్నా మద్యం దిగగానే వాహనాలు తీసుకెళ్లడానికి మాత్రం ముఖం చాటేస్తున్నారు. పరువుపోతుందని కొందరు..కోర్టు మెట్లు ఎక్కాల్సి వస్తుందని భయంతో మరికొందరు.. ఇలా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుపడుతున్న వాహనాదారులు వాటిని తిరిగి తీసుకోవడానికి మాత్రం ముందుకురావడంలేదు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పేరుకుపోయిన వాహనాలు. ప్రస్తుతం ఇక్కడి పోలీసుస్టేషన్ ఆవరణలో సుమారు 200 వాహనాలు ఉండగా ఇందులో 90శాతం వాహనాలు మద్యంసేవించి పట్టుబడిన వారివే కావడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పోలీసులు నోటీసులు పంపించినప్పటికీ 2015 సంవత్సరం నుంచి ఇప్పటివరకూ వాహనాలు తీసుకెళ్లడానికి వాహనాల యజమానులు రావడం లేదు. దీంతో ఎక్కడికక్కడ వాహనాలు దుమ్ముపట్టుకుపోతున్నాయి. నిబంధనల ప్రకారం నిర్ణీత కాలం తర్వాత వాటిని వేలం ద్వారా అమ్మకానికి పెట్టాలి. వీటికి ఉన్నతాధికారులైన సీపీ, డీసీపీలు అదేశాలు జారీచేయాల్సి ఉంటుంది. వారి అదేశాల కోసం పోలీసులు ఎదురుచూస్తున్నారు.



ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న వాహనాలు

బండి విలువ కంటే చలానా ఎక్కువ..

మొదటిసారి అత్యధికంగా మద్యం తాగి వాహనాలు నడిపి చిక్కినవారు, రెండవసారి దొరికితే కచ్చితంగా న్యాయస్థానం జైలు శిక్ష విధిస్తుంది. ఆ శిక్షకు భయపడిన వ్యక్తులు వాహనాలు తిరిగి తీసుకెళ్లడానికి ముఖం చాటేస్తున్నారు. ఇక వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఈ-చలానాలు వస్తాయి. వీటిని చెల్లించకపోవడంతో అవి కుప్పలుగా పేరుకుపోతాయి. కొన్ని సందర్భాల్లో వాహనం విలువ కంటే చలానా రుసుములే ఎక్కువగా ఉంటున్నాయి. దీంతో చేసేదేమీ లేక వాహనచోదకులు తమ ద్విచక్రవాహనాలను అక్కడే వదిలేస్తున్నారు. ఒక వ్యక్తికి ఏకంగా రూ.64 వేల ట్రాఫిక్ చలానాలు ఉండడంతో తన వాహనాన్నే వదిలించుకున్నారు. వాహనాల విలువను, చలానాలను బేరీజు వేసుకుని వాటిని అక్కడే వదిలేసి వెళుతున్నారన్న కారణాలున్నాయి.

కాపాడటం కష్టమవుతోంది..

మందుబాబులు తమ వాహనాలను రకరకాల కారణాలతో వదిలేసి వెళ్లడంతో పోలీసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను రక్షించాల్సిన బాధ్యత వారిదే కావడంతో జాగ్రత్తగా సంరక్షించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. స్టేషన్‌కు ప్రహరీలేని ప్రాంతంలో ఏకంగా ఓ వ్యక్తి కాపలా కాయాల్సి వస్తోంది. వాహనాలను నిబంధనల ప్రకారమే విడుదల చేయడం, ఇతర ప్రాంతాలకు తరలించాల్సి రావడంతో సంవత్సరాల తరబడి వాహనాలను కంటికిరెప్పలా కాపాడాల్సి వస్తోంది.

వినూత్న ఆలోచనలతో రావాలి



బహుమతులు అందజేస్తున్న జన్య ప్రతినిధులు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: విద్యార్థులు వినూత్న ఆలోచనలతో, విభిన్న ఆవిష్కరణలు చేపట్టేలా కృషి చేయాలని జన్య ఫౌండేషన్ డైరెక్టర్ కుష్ శ్రీవాస్తవ అన్నారు. గురువారం షాపూర్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 'వాటర్ అండ్ సాయిల్ కన్జర్వేషన్' అంశంపై ప్రతిభ పోటీలను నిర్వహించారు. గణితం, సామాన్యశాస్త్ర విభాగాల్లో జరిగిన పోటీల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అర్చన, జన్య ప్రతినిధులు సురేంద్రకుమార్, అంకారావు, ఏరోనాటికల్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



వ్యర్థాలను కాల్చడంతో చెలరేగిన మంటలు, పొగ

వ్యర్థాలకు నిప్పు.. స్థానికులకు ముప్పు

జీడిమెట్ల, న్యూస్‌టుడే: పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను ఇష్టానుసారం కాలుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సూరారం శ్రీకృష్ణనగర్‌కు వెళ్లేదారిలో గురువారం గుర్తుతెలియని వ్యక్తులు వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో మంటలు లేచాయి. దట్టమైన పొగలు కన్పించడంతో స్థానికులు ఆందోళన చెందారు. తరచూ ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఇటువంటి ఘటనలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.